సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 336

బుధవారం 26-2-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'



జగమై.. జంగమమై..

శివరాత్రి సందర్భంగా ప్రముఖ కవి గోరటి వెంకన్న వ్యాసం

జనన.. మరణం లేని, ఆది అంతం లేని అనాది ఉనికి శివుడు.. ముడుపులు, కానుకలకు మురవని వాడు.. అభిషేకానికి, బిల్వపత్రానికి పరవశించే పసివాడు శివుడు.. నిజమైన సమతా తత్వానికి పాదు శివుడే.. ఆయన 'హ్యూమనిస్టు'..

15లో



అస్సాంలో నూతన శకం

ఈశాన్య ప్రాంతంలోని పవిత్ర భూమి అస్సాంలో నూతన శకం ఆరంభమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸



సజ్జన్‌కుమార్‌కు జీవిత ఖైదు

సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో దోషిగా తేలిన కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్‌కు కోర్టు జీవితఖైదు విధించింది.

వివరాలు 6లో ▸



పుతిన్ నియంత కాదు : ట్రంప్

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను 'నియంత' అని పిలవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిరాకరించారు.

వివరాలు 6లో ▸

నేడే ఆఖరి అమృత స్నానం

'మహా కుంభమేళా' తుది ఘట్టానికి చేరుకుంది. మహాశివరాత్రి వేళ త్రివేణి సంగమం జనసంద్రం కానుంది.

వివరాలు 6లో ▸



5 లక్షల కొత్త కొలువులు

బయో ఆసియా 2025 సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

లైఫ్ సైన్సెస్‌లో పెట్టుబడుల సాధన ద్వారా ఉద్యోగాల సృష్టి	గత ఏడాది రూ.40 వేల కోట్ల పెట్టుబడులు సాధించాం	ఔటర్, ట్రిపుల్ ఆర్ నడుమ ఫార్మా గ్రామాల అభివృద్ధి	ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుల్లో భాగంగా గ్రీన్ ఫార్మాసిటీ	ఇప్పటికే దిగ్గజ ఫార్మాస్యూటికల్ కంపెనీలతో ఒప్పందాలు

హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఫార్మా, లైఫ్ సైన్స్, బయోటెక్ కంపెనీలు

రెండురోజుల సదస్సు ప్రారంభించిన సీఎం • రాష్ట్రంలో కొత్తగా లైఫ్ సైన్సెస్ వర్సిటీ: మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్

లైఫ్ సైన్సెస్ రంగంలో పెట్టుబడుల సాధన ద్వారా రాష్ట్రంలో 5 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలను సృష్టించాలని తమ ప్రభుత్వం భావిస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ఔటర్ రింగు రోడ్డుతో పాటు కొత్తగా నిర్మితమయ్యే రీజినల్ రింగు రోడ్డు నడుమ ఫార్మా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా తెలంగాణ రూ.1.8 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించిందని వెల్లడించారు. తద్వారా విభిన్న రంగాల్లో సుమారు 50 వేల ఉద్యోగాల కల్పన జరుగుతుందన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో గత ఏడాది 150కి పైగా ప్రాజెక్టుల్లో రూ.40 వేల కోట్ల పెట్టుబడులు సాధించామని వివరించారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం ప్రారంభమైన

మిగతా 2వ పేజీలో ▶



బయోఆసియా సదస్సులో సింగపూర్‌కు చెందిన ప్రముఖ కేన్సర్ పరిశోధకుడు డాక్టర్ ప్యాట్రిక్ టాన్‌కు జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డు-2025ను అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, క్వీన్స్‌లాండ్ గవర్నర్ డాక్టర్ జీనెట్

అమెరికా సుంకాలపై స్పష్టత లేదు




→బయో ఆసియా సదస్సు సందర్భంగా మీడియాతో డాక్టర్ రెడ్డీస్ కో-ఫౌండర్, చైర్మన్, జీ.వి.ప్రసాద్

- ఒకవేళ సుంకాలు విధిస్తే ఆ దేశానికే అధిక నష్టం
- కేన్సర్ మందుల తయారీలో ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నాం
- చైనా మార్కెట్, అక్కడి ప్రభుత్వం సృజనాత్మకతను ప్రోత్సహిస్తున్నాయి

2లో

ఏఐతో అందరికీ సమాన వైద్యం నా కల



→బయోఆసియా-2025 సదస్సులో ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ కె. నాగేశ్వర్‌రెడ్డి

- పేగు కేన్సర్ల నిర్ధారణకు ఏఐజీలో 'జీఐ జీనియస్' ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నట్లు వెల్లడి
- వైద్య రంగంలో కృత్రిమ మేధ వాడకంపై ప్రసంగం
- ఏఐ వల్ల వ్యాధి నిర్ధారణలో కచ్చితత్వంతోపాటు ఖర్చు, సమయం ఆదా అవుతాయన్న వక్తలు

2లో



సొరంగం వద్ద సహాయక చర్యలపై సమీక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు జూపల్లి, ఉత్తమ్, కోమటిరెడ్డి. చిత్రంలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ తదితరులు

ఆశలు ఆవిరి




ర్యాట్ హోల్ మైనర్స్ చేరుకున్న సొరంగం చివరి భాగం

ఎస్‌ఎల్‌బీసీ సొరంగం చివరి వరకు వెళ్లగలిగిన ఆరో రెస్క్యూ బృందం

అక్కడ పెద్ద మొత్తంలో పేరుకు పోయిన బురద, బండరాళ్లు, కంకర, యంత్రాల తుక్కు..	కానరాని కార్మికుల జాడ.. శిథిలాల కింద నలిగిపోయినట్టుగా బలపడిన అనుమానాలు

- అధికారికంగా ఇంకా ఎలాంటి ప్రకటన చేయని ప్రభుత్వం
- ప్రమాద స్థలంలో 140 మీటర్ల మేర పేరుకుపోయిన శిథిలాలు
- నేడు ఏడో ప్రయత్నంగా వెళ్లి బండరాళ్లు, తుక్కు తొలగించాలని నిర్ణయం
- ఎన్డీఆర్ఎఫ్, ర్యాట్ హోల్ మైనర్ల బృందాలతోనే తవ్వకాలు
- రంగంలో దిగనున్న ఎన్ఆర్ఎస్ఏ నిపుణులు, మరో జీఎస్ఐ బృందం
- సొరంగం కూలిన ఘటనపై నివేదిక కోరిన ఎన్డీఎస్ఏ దక్షిణాది విభాగం
- తమవారి క్షేమ సమాచారం కోసం కుటుంబసభ్యుల నిరీక్షణ
- నేడు ప్రభుత్వం ప్రకటన చేసే అవకాశం..సర్వత్రా ఉత్కంఠ

3లో



కాలేయంపై పని భారం

కాలేయం.. పని భారంతో తల్లడిల్లుతోంది. క్రమం తప్పిన జీవన విధానాన్ని సమన్వయం చేయలేక సతమతం అవుతోంది. అవసరానికి మించిన తిండి.. అవసరమైన శ్రమ ఏమాత్రం చేయని దినచర్య కాలేయంపై పెను భారం మోపుతున్నాయని అధ్యయనంలో వెల్లడైంది. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ శాస్త్రవేత్తలు ఇటీవల జీవన విధానంలోని మార్పులు కాలేయంపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయో తెలుసుకునేందుకు ఓ అధ్యయనం చేశారు.

3లో

మహిళల చేతికి స్టీరింగ్..

స్వయం సహాయక సంఘాల మహిళలు స్టీరింగ్ పట్టనున్నారు. హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో క్యాబ్‌లు నడపనున్నారు. ఇందుకోసం సంగారెడ్డి జిల్లాలోని 35 మంది మహిళలను గుర్తించారు. ఇప్పటికే కారు నడపడంలో శిక్షణ పొందిన వీరికి డ్రైవింగ్ లైసెన్స్‌లు కూడా జారీ అయ్యాయి. క్యాబ్‌ల కొనుగోలుకు రూ. 5 లక్షల చొప్పున బ్యాంకు రుణం అందచేస్తారు. ఆ వాహనాలను హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీలతో అనుసంధానం చేస్తారు.

18లో



'భవిష్యత్' భయాలు

అరకొర ఆదాయాలు.. తడిసిమోపెడవుతున్న ఖర్చులు.. నానాటికీ భారంగా మారుతున్న విద్య, వైద్యం.. ఇక నిత్యావసరాల ధరలు సరేసరి.. సంపాదనలోనే ఎంతో కొంత భవిష్యత్ కోసం పొదుపు చేస్తున్నా.. ఏమూలకూ సరిపోని పరిస్థితి.. ఇదీ నేడు సగం మంది భారతీయుల ఆవేదన. భారతీయుల పొదుపు, ఖర్చులపై ఓ సంస్థ నిర్వహించిన అధ్యయనంలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. సర్వేలో పాల్గొన్న వారిలో కొందరు భవిష్యత్ కోసం మోస్తరు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు తెలపగా, ఇంకొందరు తమ పొదుపు భవిష్యత్ అవసరాలకు సరిపోదని చెప్పారు.

14లో





ఏపీపై కృష్ణా బోర్డు ఆంక్షలు



సాగర్ నుంచి తీసుకుంటున్న నీటిని 7వేల క్యూసెక్కులకు తగ్గించాలి

- శ్రీశైలం నుంచి కూడా తాగునీటి అవసరాలకే తీసుకోవాలి
- తెలంగాణ ఫిర్యాదు నేపథ్యంలో కేఆర్ఎంబీ స్పష్టీకరణ
- తాగునీటి అవసరాలకు నిల్వలను సంరక్షించాలని ఆదేశం
- ఈ తరహా ఆంక్షలు ఇదే తొలిసారి అంటున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ కుడి ప్రధాన కాల్వ ద్వారా ఏపీ తీసుకుంటున్న జలాలను తక్షణమే 7 వేల క్యూసెక్కులకు తగ్గించాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆదేశించింది. అలాగే శ్రీశైలం జలాశయం నుంచి తీసుకుంటున్న జలాలను కూడా ఆ రాష్ట్రం తక్షణమే తగ్గించాలని, కేవలం తాగు నీటికి అవసరమైన కనీస జలాలను మాత్రమే తీసుకోవాలని స్పష్టం చేసింది. ప్రస్తుత సంవత్సరంలో ఏపీ తన వాటాకు మించి కృష్ణా జలాలు వాడుకుందని, ఇకపై శ్రీశైలం, సాగర్ నుంచి ఆ రాష్ట్రం నీళ్లు తీసుకోకుండా నిలువరించాలని తెలంగాణ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో.. బోర్డు ఈ మేరకు ఆంక్షలు విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. తెలుగు రాష్ట్రాల ఉమ్మడి

మిగతా 14వ పేజీలో ▶



హైపర్ లూప్ టెస్ట్ ట్రాక్ సిద్ధం

422 మీటర్ల ట్రాక్‌ను ఆవిష్కరించిన ఐఐటీ-మద్రాసు

- సహకారం అందించిన రైల్వేశాఖ, ప్రైవేట్ సంస్థలు
- కొత్త టెక్నాలజీతో గంటకు వెయ్యి కిలోమీటర్ల వేగంతో ప్రయాణం

6లో

నేడు ప్రధానితో సీఎం రేవంత్ భేటీ

- బీసీ రిజర్వేషన్లపై చట్టం తెస్తే అమలుకు సహకరించాలని కోరనున్న సీఎం!

14లో

రేవంత్‌కు నిద్రలోనూ కేసీఆర్ గుర్తుకొస్తున్నారు

సీఎం అవుతానని రేవంత్ కలలో కూడా ఊహించుకోలేదు: కేటీఆర్



కాంగ్రెస్ నాయకుల చేరికల కార్యక్రమంలో మాట్లాడుతున్న కేటీఆర్

- ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై జ్యుడీషియల్ కమిషన్ నియమించాలి.. సుంకిశాల, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలినా బీజేపీ మాట్లాడటం లేదు
- రేవంత్ ప్రభుత్వానికి రక్షణ కవచంలా మోదీ పనిచేస్తున్నారని ధ్వజం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నిద్రలో కూడా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గుర్తుకొస్తున్నారని, ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అవుతానని ఆయన కలలో కూడా ఊహించుకోలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఎద్దేవా చేశారు. 36 పర్యాయాలు ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్.. కనీసం మంత్రివర్గ విస్తరణ చేసుకోలేకపోతున్నాడని, కీలక శాఖలకు మంత్రులను కూడా నియమించుకోలేని అసమర్థుడిగా మిగిలిపోయాడని అన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య ఆధ్వర్యంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి చెందిన మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకుడు మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డితోపాటు

మిగతా 14వ పేజీలో ▶


ఎఫ్‌టీఎల్ సమీప సర్వే నంబర్లివ్వండి

ఎఫ్‌టీఎల్‌కు 200 మీటర్ల పరిధిలోని సర్వే నంబర్ల వివరాలు కోరిన సర్కారు

ప్రభుత్వ భూములను ఆనుకొని ఉన్న సర్వే నంబర్లు కూడా

మున్సిపల్, హెచ్ఎండీఏ, డీటీసీపీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలకు ఆదేశం

ఎల్ఆర్ఎస్ పోర్టల్‌తో రిజిస్ట్రేషన్ల శాఖను అనుసంధానం చేస్తున్న సీజీజీ



సాక్షి, హైదరాబాద్: చెరువులు, కుంటల పూర్తి నీటిమట్టం స్థాయి (ఎఫ్‌టీఎల్) నుంచి 200 మీటర్ల లోపు ఉన్న భూముల సర్వే నంబర్ల వివరాలతోపాటు ప్రభుత్వ భూములకు సమీపంలో ఉన్న సర్వే నంబర్లను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌కు పంపాలని వివిధ శాఖలు, సంస్థల అధిపతులను ప్రభుత్వం ఆదేశించింది. మున్సిపల్ కమిషనర్లు, పట్టణాభివృద్ధి సంస్థల వీసీలు, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ కమిషనర్లు, డీటీసీపీలు తమ పరిధిలోని నీటి వనరుల ఎఫ్‌టీఎల్ నుంచి 200 మీటర్ల లోపు ఉన్న సర్వే నంబర్లను పంపించాల్సి ఉంటుందని పేర్కొంది. ప్రభుత్వ భూములకు సమీపంలో ఉన్న భూముల సర్వే నంబర్లలో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను నీటిపారుదల, రెవెన్యూ శాఖల పరిశీలన, క్షేత్రస్థాయి తనిఖీకి పంపుతారు. డీటీసీపీ ఈ ప్రక్రియను సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా ముసాయిదా మార్గదర్శకాలను విడుదల చేసింది.

ఇదీ ప్రక్రియ..

➤ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన అనంతరం రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ఫీజుల చెల్లింపు ప్రక్రియ జరపాలని నిర్ణయించిన ప్రభుత్వం, ఎల్ఆర్ఎస్ పోర్టల్‌తో రిజిస్ట్రేషన్ల శాఖ సర్వర్‌ను అనుసంధానం చేస్తోంది. ఈ అనుసంధాన ప్రక్రియను పర్యవేక్షిస్తున్న సీజీజీకి సర్వే నంబర్ల వివరాలను అందిస్తే, ఆన్‌లైన్‌లో వాటిని అందుబాటులో ఉంచనుంది. తదనుగుణంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మున్సిపల్ లేదా పంచాయతీ రాజ్ , నీటిపారుదల, రెవెన్యూ శాఖలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటాయి.

➤ఆ తర్వాత ఆన్‌లైన్‌లోనే ఎల్ఆర్ఎస్ ఫీజు నిర్ణయించబడుతుంది.

➤ఒకవేళ దరఖాస్తు తిరస్కరణకు

మిగతా 14వ పేజీలో ▶

మాది భారత్.. కాంగ్రెస్‌ది పాక్ టీం

- కేంద్రమంత్రి బండి సంజయ్
- ఇండియా గెలవాలంటే బీజేపీకి ఓటేయాలని పిలుపు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'బీజేపీ భారత జట్టు.. ఎంఐఎంతో అంటకాగే కాంగ్రెస్ పాకిస్తాన్ జట్టు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇండియా గెలవాలనుకుంటే బీజేపీకి ఓటెయ్యాలి. పాకిస్తాన్ గెలవాలనుకుంటే కాంగ్రెస్‌కు ఓటెయ్యాలి. బీసీ కులగణనకు మేం వ్యతిరేకం కాదు. కానీ అందులో ముస్లింలను చేర్చడాన్ని అంగీకరించం. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకటే. అందుకే ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ కొనుగోళ్లు, ఫార్ములా-ఈ రేసు కేసుల్లో అవినీతి జరిగిందని చెబుతున్నా.. సీఎం కనీసం వారికి నోటీసులైనా ఇచ్చే సాహసం

మిగతా 14వ పేజీలో ▶

భారత్, పాక్ మ్యాచ్‌తో ఏం సంబంధం?

- ఎమ్మెల్సీ ఎన్నికలపై సంజయ్‌ది దిగజారుడు రాజకీయం
- పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఫైర్



కరీంనగర్ కార్పొరేషన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు, దుబాయిలో జరిగిన భారత్, పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌కు సంబంధం ఏమిటని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ దిగజారుడు రాజకీయం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్తాన్‌పై భారత్ విజయం సాధిస్తే ప్రతి భారతీయుడు సంతోషపడ్డాడని, కానీ అదేదో బీజేపీయే మ్యాచ్‌ను గెలిపించినట్లు దానికీ, ఎమ్మెల్సీ ఎన్నికలకు ముడిపెట్టడం సిగ్గుచేటన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో

మిగతా 14వ పేజీలో ▶

నిర్మల్ కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాలు జప్తు



కలెక్టర్ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకున్నట్టు నోటీసులు అంటిస్తున్న కోర్టు సిబ్బంది

నిర్మల్ చైన్‌గేట్: భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించకపోవడంతో నిర్మల్ జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలను నిర్మల్ కోర్టు జప్తు చేసింది. 1999లో గడ్డెన్న, శ్రీరాం సాగర్ జలాశయాల కింద భూములు కోల్పోయిన బాధితు లకు ప్రభుత్వం పరిహారం చెల్లించలేదు. బాధి తులకు కలెక్టరేట్ నుంచి రూ.6,79,63,102, ఆర్డీవో నుంచి రూ.1,45,46,927 పరిహారం రావాల్సి ఉంది. వీటిని రైతులకు చెల్లించడంలో జాప్యం జరిగింది. దీంతో బాధితులు కోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్.. కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలు స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కోర్టు అధికారులు కార్యాలయాలను మంగళవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు నోటీసులు అంటించారు.

అప్పు తీర్చాలని బ్యాంకర్ల ఒత్తిడి

గడ్డిమందు తాగిన రైతు.. పరిస్థితి విషమం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతు జవహర్‌లాల్

గుర్రంపోడు: అప్పు కిస్తీలు చెల్లించాలని బ్యాంకు అధికారులు ఇంటికొచ్చి ఒత్తిడి చేయడంతో.. మనస్తాపానికి గురైన రైతు గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం తేనెపల్లి తండాకు చెందిన రైతు వడిత్య జవహర్‌లాల్.. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు గుర్రంపోడు బ్రాంచిలో తన పేరుతోపాటు, భార్య అనిత పేరుతో రూ.15 లక్షల మేర అప్పును నాలుగేళ్ల క్రితం తీసుకున్నాడు. ఆరు నెలలకోసారి కిస్తీ చెల్లించకపోవడంతో.. మంగళవారం రైతు ఇంటికి బ్యాంకు డివిజనల్ అధికారి, మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్‌లు వెళ్లారు. ఈ సందర్భంగా అప్పు చెల్లించాలని తీవ్ర ఒత్తిడి తెచ్చారని రైతు కుటుంబ సభ్యులు చెప్పారు. మనోవేదనకు గురైన రైతు బ్యాంకు సిబ్బంది ముందే గడ్డిమందు తాగాడు. వెంటనే బ్యాంకు సిబ్బంది 108కు ఫోన్ చేయగా.. కుటుంబ సభ్యులు నల్లగొండ ఆసుపత్రికి తరలించారు. జవహర్ లాల్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పినట్లు కుటుంబ సభ్యులు వెల్ల డించారు. ఈ విషయమై బ్యాంకు అధికారులు స్పందిస్తూ.. రుణ వాయిదాల బకాయి మొత్తం రూ.4 లక్షలు చెల్లించాలని కోరాం తప్ప ఎలాంటి ఒత్తిడి చేయలేదని స్పష్టం చేశారు.

కొడుకు మృతిని తట్టుకోలేక తల్లి ఆత్మహత్య

ఆన్‌లైన్ గేమ్‌తో అప్పులపాలై గతేడాది కుమారుని ఆత్మహత్య



కొడుకు, భార్య మృతితో ఏకాకిగా మిగిలిన మైసయ్య

దేవరుప్పుల: సులువుగా డబ్బు సంపాదించవచ్చన్న అత్యాశతో ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడి అప్పుల పాలై ఓ యువకుడు తనువు చాలించి కుటుంబానికి తీరని శోకం మిగిల్చాడు. ఈ క్రమంలో చెట్టంత కొడుకు మృతిని తట్టుకోలేక మనస్తాపంతో తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలోని కొత్తకాలనీలో మంగళవారం జరిగింది. కొత్తకాలనీకి చెందిన జోగు మైసయ్య–జయమ్మ (50)కు కొడుకు శ్రీకాంత్ (24)తోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు కుమార్తెల వివాహాలు జరిపించారు. కుమారుడి వివాహం కూడా నిశ్చయించారు. అయితే శ్రీకాంత్ ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి సుమారు రూ.లక్ష డబ్బు పోగొట్టుకు న్నాడు. తండ్రి తిడతాడన్న భయంతో గత ఏడాది సెప్టెంబర్ 5వ తేదీన ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పటి నుంచి తల్లి జయమ్మ దిగాలుగా ఉంటోంది. కొడుకుపై ప్రేమతో దుఃఖాన్ని తట్టుకోలేక మనస్తాపం చెంది సోమవారం రాత్రి ఇంట్లో గడ్డి మందు తాగింది. గమనించిన భర్త చికిత్స నిమిత్తం వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో వరంగల్‌కు తరలించారు. మంగళవారం ఎంజీఎంలో చికిత్స పొందుతూ జయమ్మ మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు.



ఏఐతో అందరికీ సమాన వైద్యం నా కల

బయోఆసియా–2025 సదస్సులో ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ కె. నాగేశ్వర్‌రెడ్డి

- పేగు కేన్సర్ల నిర్ధారణకు ఏఐజీలో 'జీఐ జీనియస్' ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నట్లు వెల్లడి
- వైద్య రంగంలో కృత్రిమ మేధ వాడకంపై చర్చా కార్యక్రమంలో ప్రసంగం
- ఏఐ వల్ల వ్యాధి నిర్ధారణలో కచ్చితత్వంతోపాటు ఖర్చు, సమయం ఆదా అవుతోందన్న వక్తలు

సాక్షి, హైదరాబాద్: 'ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా అందరికీ సమాన రీతిలో చికిత్స అందించే అవకాశం రావాలన్నది నా కల. రోగి పల్లెలో ఉన్నాడా లేక పట్టణంలో ఉన్నాడా? ధనిక, పేద తారతమ్యం లేకుండా వైద్యం అందాలి. ఆస్పత్రుల్లో ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా లేదా? అన్నది కూడా అడ్డంకి కాకూడదు. ఈ కల త్వరలోనే తీరుతుందని ఆశిస్తున్నా' అని ఏఐజీ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ కె.నాగేశ్వర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం బయోఆసియా–2025 సదస్సులో భాగంగా ఏఐ ఇన్ హెల్త్‌కేర్ అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో డాక్టర్ కె.నాగేశ్వర్‌రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏఐజీ ఆస్పత్రిలో వాడుతున్న ఏఐ టెక్నాలజీ గురించి వివరించారు.

ఏఐతో మెరుగ్గా కేన్సర్ల గుర్తింపు..

పేగులను పరిశీలించే పద్ధతిలో జీఐ జీనియస్ అనే ఏఐ సాంకేతికతను చేర్చామని డాక్టర్ కె. నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. పేగుల్లో తాము గుర్తించని అతిచిన్న కణితులను 'జీఐ జీనియస్' చూపడమే కాకుండా వాటిని తొలగించాలా వద్దా అనే విషయాన్ని సైతం స్పష్టం చేస్తోందని చెప్పారు. దీనివల్ల పేగు కేన్సర్ల గుర్తింపు 50 శాతం వరకు పెరిగిందన్నారు. అలాగే క్లోమగ్రంధి కేన్సర్లను కూడా ఎక్స్‌రేల ద్వారా వైద్యులు నిర్ధారించే దానికన్నా మెరుగ్గా ఏఐ సాంకేతికత గుర్తించగలుగుతోందని తెలిపారు. అందుకే ఏఐజీ ఆస్పత్రిలోని అన్ని ఆపరేషన్ థియేటర్లను ఏఐ సాంకేతికతతో అనుసంధానించామని.. దీనివల్ల ప్రమాదకర పరిస్థితులను నివారించే వీలు ఏర్పడుతోందని డాక్టర్ కె. నాగేశ్వర్‌రెడ్డి వివరించారు. వ్యాధి, నిర్ధారణ, చికిత్సలతోపాటు ఆసుపత్రిని మరింత సమర్థంగా నిర్వహించడంలోనూ ఏఐ ఎంతో సమర్థంగా ఉపయోగపడుతున్నట్లు ఆయన ఉదాహరణలతో వివరించారు. ఆసుపత్రిలోని రోగుల వివరాలను నిశితంగా పరిశీలిస్తూ వారికి గుండెపోటు వంటివి వచ్చే అవకాశాలను కొన్ని సందర్భాల్లో గంటల ముందుగానే గుర్తించి కాపాడగలుగుతున్నామని ఆయన వివరించారు. దీనివల్ల ఇప్పుడు తమ ఆస్పత్రిలో ఆకస్మిక మరణాలు గణనీయంగా తగ్గాయన్నారు. అలాగే రోగులు చెప్పే విషయాలను వైద్యులు స్వయంగా నమోదు చేయాల్సిన అవసరం లేకుండా వారి మాటలను రికార్డు చేసి వైద్యులకు సరైన రీతిలో అందించేందుకు సైతం తాము ఒక ఏఐ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నట్లు డాక్టర్ కె. నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు.

వైద్య రంగంలో ఏఐ పెను విప్లవం: వక్తలు

మిగిలిన రంగాల మాదిరిగానే వైద్య రంగంలోనూ కృత్రిమ మేధ (ఏఐ) పెను విప్లవం సృష్టిస్తోందని బయోఆసియా–2025 సదస్సులో వైద్య నిపుణులు వెల్లడించారు. వ్యాధి నిర్ధారణతోపాటు చికిత్స, కొత్త మందుల ఆవిష్కరణలను ఏఐ వేగవంతం చేస్తోందన్నారు. వైద్యులు గుర్తించలేని ఎన్నో విషయాలను ఏఐ గుర్తించగలుగుతోందని చెప్పారు. ఏఐ ప్రవేశంతో మందుల తయారీ ఖర్చు, సమయం సగానికిపైగా తగ్గుతోందని వక్తలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. స్విట్జర్లాండ్ కంపెనీ ఇన్‌సిలికో మెడిసిన్ డైరెక్టర్ డాక్టర్ రికార్డో గామినా పచెకో మాట్లాడుతూ తాము ఏఐని కొత్త మందుల ఆవిష్కరణకు వాడుతున్నట్లు చెప్పారు. మొత్తమ్మీద 25 వరకు ఏఐ మోడళ్లను ఉపయోగిస్తున్నామన్నారు. ఫైబ్రోసిస్, లంగ్ ఫైబ్రోసిస్‌ల విషయంలో కొంత పురోగతి సాధించామని.. చైనా, అమెరికాలో వాటిపై ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ చర్చా కార్యక్రమంలో వైద్య పరికరాల సంస్థ మెడ్‌ట్రానిక్స్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ కెన్ వాషింగ్టన్, వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఆరోగ్యరంగ విభాగం అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్ బిషెన్, యూకేకు చెందిన ఇమేజ్ అనాలసిస్ గ్రూప్ అధ్యక్షురాలు ఓల్గా కుబస్సోవా ఆరోగ్య రంగంలో ఏఐ పాత్రపై చర్చించారు.

అమెరికా సుంకాలపై స్పష్టత లేదు



బయో ఆసియా సదస్సు సందర్భంగా మీడియాతో డాక్టర్ రెడ్డీస్ కో-ఫౌండర్, చైర్మన్ జీ.వీ.ప్రసాద్

ఒకవేళ సుంకాలు విధిస్తే ఆ దేశానికే అధిక నష్టం

- కేన్సర్ మందుల తయారీలో ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నాం
- చైనా మార్కెట్, అక్కడి ప్రభుత్వం సృజనాత్మకతను ప్రోత్సహిస్తోంది

సాక్షి హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై సుంకాలు విధిస్తే వాటి ప్రభావం ఫార్మా రంగంపై ఎంత మేరకు ఉంటుందన్నది ఇప్పుడే చెప్పలేమని అంతర్జాతీయ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ కో–చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జీ.వీ.ప్రసాద్ వ్యాఖ్యానించారు. సుంకాలు ఎంత మేరకు ఉంటాయన్నది తెలియకపోయినా.. వాటి వల్ల అమెరికాకే నష్టమని భావిస్తున్నామన్నారు. ఫార్మా రంగంలో భారత్ ఇతరులను అనుకరించడం కాకుండా.. సొంతంగా ఉత్పత్తులను ఆవిష్కరించాల్సిన సమయం ఇదేనన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైన బయో ఆసియా సదస్సు సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పలు అంశాలపై విలేకరుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

ప్రశ్న:భారత్‌లో ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించాలని మీరు బయో ఆసియా వేదికగా ప్రకటించారు. మరి ఈ అంశంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం ఆశిస్తున్నారు?

జవాబు: ప్రభుత్వం నుంచి సహకారం ఆశించట్లేదు. మాకు బెంగళూరులో కేన్సర్‌పై పరిశోధనల కోసం ఆరిజిన్ పేరుతో ప్రత్యేక కేంద్రం ఉంది. అక్కడ కేన్సర్ చికిత్స కోసం సొంతంగా మందులను అభివృద్ధి చేస్తున్నాం. అలాగే కణ, జన్యుస్థాయిలో పరిశోధనలకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశాం.వాటిలో కేన్సర్ చికిత్సపై పరిశోధనలు జరుగుతున్నాయి.

ప్ర: ప్రపంచవ్యాప్తంగా కేన్సర్‌పై విస్తృత పరిశోధనలు జరుగుతున్న నేపథ్యంలో త్వరలోనే ఈ వ్యాధికి పూర్తిస్థాయి చికిత్స లభిస్తుందనుకోవచ్చా?

జ: కేన్సర్‌కు పూర్తిస్థాయిలో చికిత్స లభించేందుకు ఇంకా కొంత సమయం పడుతుంది. ఇంకా చాలా సవాళ్లను అధిగమించాల్సి ఉంది. ప్రస్తుతం కణ, జన్యుస్థాయిలో కొంత ముందడుగు సాధించాం. రకరకాల మోనోక్లోనల్ యాంటీబాడీస్ (రోగనిరోధక శక్తి కణాల మాదిరిగా పనిచేసే కణాలు. కేన్సర్ కణాలపై దాడి చేసి నాశనం చేస్తాయి), సహజసిద్ధ యాంటీబాడీలకు మందులను జోడించి వాడటం (ఏడీసీలు అంటారు) వంటి అనేక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ఇమ్యూనోథెరపీలో భాగంగా వాటిని కేన్సర్ చికిత్సలో ఉపయోగిస్తారు. మోనోక్లోనల్ యాంటీబాడీస్‌ను బెంగళూరులోని సెల్ అండ్ జీన్ థెరపీ సెంటర్‌లో తయారు చేస్తున్నాం. అయినప్పటికీ అన్ని రకాల కేన్సర్ల చికిత్సకు ఇంకా సమయం పడుతుంది.

ప్ర: చైనా ఫార్మా రంగంలో సృజనకు ఎంతమేర ప్రాధాన్యత ఉంటోంది?

జ: చైనా ఒక పెద్ద మార్కెట్. సృజనాత్మక ఆవిష్కరణలకు అక్కడి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. అధిక లాభాలు తీసుకోవడానికి కంపెనీలకు మోనోపలి హక్కులు కల్పిస్తోంది. స్థానికంగా మంచి మార్కెట్ కూడా ఉండటంతో అక్కడ ఇన్నోవేషన్ బాగా జరుగుతోంది. పైగా ఫార్మా ఉత్పత్తుల విషయంలో పరిశోధనలు కూడా బాగా చేస్తున్నారు. పలు భారతీయ కంపెనీలు కూడా చైనా కంపెనీలతో కలిసి పనిచేస్తున్నాయి.

ప్ర: భారత్‌పై 25% సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్న నేపథ్యంలో దీని ప్రభావం ఫార్మా రంగంపై ఎంత మేరకు ఉంటుంది?

జ: దీనిపై మాతోపాటు ఇతర ఫార్మా కంపెనీలకు స్పష్టత లేదు. సుంకాలు ఎంత మేరకు ఉంటాయన్నది కూడా తెలియదు. సుంకాలు విధిస్తే అమెరికాలోని వినియోగదారులు, ఇంటర్మీడియరీస్‌లపైనే ఆ భారం పడుతుంది. సుంకాల నుంచి తప్పించుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తయారీ కేంద్రాలను అమెరికాకు తరలించడం ఆచరణ సాధ్యం కాదు. అంత సామర్థ్యం అక్కడ లేదు. పైగా అక్కడ తయారీ ఖర్చులు చాలా ఎక్కువ. సుంకాలు విధించినప్పటికీ భారత్, చైనా కంపెనీలు ఇతర దేశాలతో పోటీపడగలవు. మొత్తమ్మీద చూస్తే సుంకాల విషయమై ప్రస్తుతం మేము వేచి చూస్తున్నాం. ఒక స్పష్టత వచ్చే వరకు ఏం చేయాలన్నది నిర్ణయించలేం. ఈ విషయమై ప్రభుత్వంతోనూ ఇప్పటివరకూ సంప్రదింపులు జరపలేదు.

ప్ర: కృత్రిమ మేధ అన్ని రంగాల్లోకి ప్రవేశిస్తోంది. మీరు ఎంత వరకు దీన్ని వాడుకుంటున్నారు?

జ: కొత్త మందుల ఆవిష్కరణకు మేము కృత్రిమ మేధను వాడుకుంటున్నాం. కానీ పరిమిత స్థాయిలోనే... బెంగళూరులోని ఆరిజిన్ కేంద్రంలో వాడుతున్నాం.

5 లక్షల కొత్త కొలువులు!

▶ మొదటి పేజీ తరువాయి

రెండురోజుల 'బయో ఆసియా 2025' సదస్సును సీఎం ప్రారంభించి మాట్లాడారు.

లైఫ్ సైన్సెస్ రాజధానిగా హైదరాబాద్

'ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో భాగంగా గ్రీన్ ఫార్మాసిటీ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే దిగ్గజ ఫార్మాస్యూటికల్ కంపెనీలు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. జర్మన్ కంపెనీ మిల్టెనీ బయోటెక్ జీనోమ్ వ్యాలీలో సెల్, జీన్ థెరపీని ప్రారంభించింది. కొత్తగా 4 బహుళ జాతి లైఫ్ సైన్సెస్ కంపెనీలు కూడా తెలంగాణలో అడుగు పెడుతున్నాయి. గడిచిన 25 ఏళ్లలో ఫార్మా, తయారీ, ఐటీ, డిజిటల్ హెల్త్ రంగాల్లో పవర్‌హౌస్‌గా హైదరాబాద్ ప్రసిద్ధి చెందింది. ప్రపంచంలో పేరొందిన అనేక ఫార్మా, హెల్త్‌కేర్, లైఫ్ సైన్స్, బయోటెక్ కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయి. పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలపై కృషి చేసే సంస్థలను ప్రోత్సహిస్తూ శాస్త్ర, సాంకేతిక నిపుణులను తయారు చేయడంతో పాటు జీనోమ్ వ్యాలీ ఏర్పాటు చేసుకున్నాం. ఏటా జరిగే బయో ఆసియా సదస్సులు హైదరాబాద్‌ను ప్రపంచ లైఫ్‌సైన్సెస్ రాజధానిగా నిలబెట్టాయి. ఆరోగ్య రక్షణ రంగం భవిష్యత్తును నిర్దేశించటంతో పాటు ప్రపంచానికి మార్గదర్శనం చేసే కార్యక్రమంగా 'బయో ఆసియా' దేశ విదేశాలను ఆకర్షిస్తోంది..' అని ముఖ్యమంత్రి చెప్పారు.



సదస్సులో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఫ్యూచర్, ఏఐ సిటీల్లో భారీ ప్రాజెక్టులు

'రాబోయే పదేళ్లలో తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నాం. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో సేవల రంగాన్ని ప్రోత్సహిస్తూ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీలో అనేక భారీ ప్రాజెక్టులు చేపడుతున్నాం. దేశంలోనే ఎక్కువ ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకంతో హైదరాబాద్ ఈవీ రాజధానిగా అవతరించింది. ఆర్టీసీలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశ పెడుతున్నాం. ఔటర్, ట్రిపుల్ ఆర్‌ను రేడియల్ రోడ్లతో అనుసంధానం చేసి ప్రపంచంలోనే అతిపెద్ద మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. 'చైనా ప్లస్ వన్' అవసరాలు తీర్చే కేంద్రంగా అభివృద్ధి చేసి ప్రపంచం నలుమూలల నుంచి పెట్టుబడులు ఆహ్వానిస్తాం. తెలంగాణలో మెగా డ్రైపోర్టును అభివృద్ధి చేసి ఏపీలోని 'సీ పోర్టు'తో రైలు, రోడ్డు మార్గాల ద్వారా అనుసంధానిస్తాం. తెలంగాణను బయో సైన్సెస్, బయోటెక్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ పర్యావరణ వ్యవస్థకు చిరునామాగా అభివృద్ధి చేస్తాం..' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

హార్ట్ ఆఫ్ ది లైఫ్ సైన్సెస్‌గా జీనోమ్ వ్యాలీ: మంత్రి శ్రీధర్‌బాబు

రాష్ట్రంలో కొత్తగా లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సంబంధిత పరిశ్రమల భాగస్వామ్యంతో సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రపంచ స్థాయి నిపుణులను తయారు చేసేలా స్కిల్ యూనివర్సిటీ ద్వారా కోర్సులకు రూపకల్పన చేస్తామని చెప్పారు. 'లైఫ్ సైన్సెస్ రంగంలో రెండు దశాబ్దాల క్రితం మొదలైన తెలంగాణ ప్రస్థానాన్ని విశ్వవ్యాప్తం చేస్తాం. రాబోయే రోజుల్లో జీనోమ్ వ్యాలీని "హార్ట్ ఆఫ్ ది లైఫ్ సైన్సెస్"గా అభివృద్ధి చేస్తాం. రాష్ట్రంలో లైఫ్ సైన్సెస్ రంగం ద్వారా 51 వేల మంది ప్రత్యక్షంగా, 1.5 లక్షల మంది పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా తయా రయ్యే జనరిక్ మందుల్లో 20 శాతం, వాక్సిన్ల ఉత్పత్తిలో 40 శాతం వాటా తెలంగాణ కలిగి ఉంది. 200కు పైగా దేశాలకు ఏటా 5 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఏఐ, క్వాంటం, రోబోటిక్స్ తదితర నూతన టెక్నాలజీల సాయంతో రోగుల అవసరాలకు అనుగుణంగా, వారికి త్వరగా స్వాంతన చేకూరేలా ఔషధాల సామర్థ్యాన్ని పెంచే పరిశోధనలపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి వ్యయంతో మౌలిక సదుపాయాల పరంగా హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చి దిద్దుతాం. అసోసియేషన్ ఆఫ్ కాంట్రాక్టు రీసెర్చ్, డెవలప్మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఆర్గనైజేషన్స్ (సీఆర్డీఎంవో) తన ప్రధాన కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తుంది..' అని మంత్రి చెప్పారు. ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ గవర్నర్ జానెట్ యంగ్, వివిధ ఫార్మా, లైఫ్ సైన్సెస్ సంస్థల ప్రతినిధులు రాజీవ్‌శెట్టి, డాక్టర్ సాధన జోగ్లేకర్, జీవీ ప్రసాద్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు ప్రసంగించారు.



గ్రీన్ ఫార్మాసిటీలో పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధత తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూలు కుదుర్చుకున్న 11 కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, జయేశ్‌రంజన్ తదితరులు

రూ.5,445 కోట్ల పెట్టుబడులు.. 9,800 ఉద్యోగాలు

గ్రీన్ ఫార్మాసిటీలో ఏర్పాటుకు ముందుకొచ్చిన 11 కంపెనీలు

- సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కుదిరిన అవగాహన ఒప్పందాలు
- ప్రముఖ కేన్సర్ పరిశోధకుడు డాక్టర్ పాట్రిక్ టాన్‌కు జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డు–2025 ప్రదానం

సాక్షి, హైదరాబాద్: బయో ఆసియా–2025 సదస్సులో భాగంగా తొలిరోజు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పెట్టుబడులకు సంబంధించిన కీలక ప్రకటనలు వెలువడ్డాయి. గ్రీన్ ఫార్మాసిటీలో తమ యూనిట్ల ఏర్పాటుకు ఇప్పటికే ఆరు సంస్థలు ముందుకురాగా తాజాగా మరో 11 కంపెనీలు ముందుకొచ్చాయి. రూ. 5,445 కోట్ల పెట్టుబడితో కొత్తగా 9,800 ఉద్యోగాలను కల్పిస్తామని ప్రకటించాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో గ్రాన్యూల్స్, ఆర్బిక్యులార్, ఐజాంట్, బయోలాజికల్–ఈ, విర్కో, విరూపాక్ష, జూబిలియెంట్, విమ్టా, ఆరగెన్, భారత్ బయోటెక్, సాయి లైఫ్‌సైన్సెస్ ఎంవోయూ కుదుర్చుకున్నాయి. తాజా ఒప్పందాలతో గ్రీన్ ఫార్మాసిటీలో మొత్తం పెట్టుబడుల విలువ రూ. 11 వేల కోట్లకు చేరింది. అలాగే మొత్తంగా 22,300 మందికి ఉపాధి లభించనుంది.

ప్రతిభకు పట్టం..: బయో ఆసియా సదస్సులో భాగంగా ప్రముఖ కేన్సర్ పరిశోధకుడు, సింగపూర్‌లోని జీనోమ్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్, 'ప్రిసైజ్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పాట్రిక్ టాన్‌కు ఈ ఏడాదికిగాను జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారు. వైద్య రంగానికి ఆయన అందిస్తున్న అసాధారణ సేవలకుగాను ప్రత్యేకించి కేన్సర్ జీనోమిక్స్, ప్రజారోగ్యంపై పరిశోధనలకుగాను ఆయన్ను 'బయోఆసియా' ఈ అవార్డుకు గత నెలలో ఎంపిక చేసింది. మంగళవారం బయోఆసియా 2025 సదస్సు ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు అవార్డు ప్రదానం చేశారు.

క్వీన్స్‌లాండ్ వర్సిటీతో జట్టుకట్టిన రాష్ట్ర ప్రభుత్వ విభాగం

అత్యాధునిక పరిశోధనలు, డిజిటల్ హెల్త్‌కేర్, ఏఐ ఆధారిత ఆవిష్కరణల కోసం యూనివర్సిటీ ఆఫ్ క్వీన్స్‌లాండ్, తెలంగాణ లైఫ్‌సైన్సెస్ విభాగం నడుమ 'లెటర్ ఆఫ్ ఇంటెంట్' కుదిరింది. డిజిటల్ హెల్త్ రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు సహకారాన్ని వేగవంతం చేసేందుకు ప్రపంచ ఆర్థిక వేదికతోడ్పాటుతో ఇండియన్ డిజిటల్ హెల్త్ యాక్టివేటర్ ఏర్పాటుపై వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదిరింది. ఈ మేరకు యూనివర్సిటీ ఆఫ్ క్వీన్స్‌లాండ్ డైరెక్టర్ అలన్ రొవాన్ మీడియా సమావేశంలో వెల్లడించారు.

తెలంగాణలోకి మరికొన్ని సంస్థలు

అమెరికాకు చెందిన ఎంఎస్‌డీ తెలంగాణలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఆసక్తి కనబరిచింది. లాస్ఏంజెలెస్ కేంద్రంగా పనిచేస్తున్న 'అగిలిసియం' హైదరాబాద్‌లో లైఫ్ సైన్సెస్, ఇన్నోవేషన్, డెవలప్‌మెంట్ కార్యకలాపాల కోసం కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. జీనోమ్ వ్యాలీలో సీజీఎంపీ టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నట్లు 'ఏఎల్ఎస్' ప్రకటించింది. హైదరాబాద్‌లో రెండో ఆర్అండ్‌డీ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు 'మీషి ఫార్మా' వెల్లడించింది.

రాబోయే రోగాలను ముందే గుర్తిస్తున్నాం

ఏఐ, మెషీన్ లెర్నింగ్ ద్వారా సింగపూర్ ప్రజల జన్యు సమాచారాన్ని విశ్లేషిస్తున్నాం

జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్సీ అవార్డు గ్రహీత ప్యాట్రిక్ టాన్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: సింగపూర్‌లో ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు జరుగుతున్న ప్రయత్నం గురించి ప్రతిష్టాత్మక బయో ఆసియా జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డుగ్రహీత డాక్టర్ ప్యాట్రిక్ టాన్ సభికులతో పంచుకున్నారు. 'సింగపూర్‌లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండటంతో ఆసుపత్రులపై ఒత్తిడి ఎక్కువవుతోంది. చికిత్సలకు అయ్యే ఖర్చు కూడా బాగా పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూనే ఆరోగ్య రంగంలో ఖర్చులు తగ్గించుకోవడం ఎలా? అనే దానిపై ప్రభుత్వం ఆలోచించింది. అందులో భాగంగానే ఇప్పుడు మేము భవిష్యత్తులో ఎవరు జబ్బు పడవచ్చో.. ఆ జబ్బులు ఎలాంటివో గుర్తించేందుకు.. అందుకు తగ్గట్లుగా చర్యలు తీసుకొనేందుకు ఓ బృహత్తర కార్యక్రమం చేపట్టాం. ప్రిసైస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ 'నేషనల్ ప్రిసిషన్ మెడిసిన్ ప్రోగ్రామ్'కు నేను నేతృత్వం వహిస్తున్నా. ఇందులో భాగంగా ప్రజల జన్యు సమాచారంతోపాటు వారి ఆహార అలవాట్లు, వైద్య వివరాలు సేకరించాం. మెషీన్ లెర్నింగ్, కృత్రిమ మేధ సాయంతో భవిష్యత్తులో ఎవరు జబ్బు పడతారో.. ఎలాంటి జబ్బులు వచ్చే అవకాశం ఉందో, వాటికి చవకైన వైద్యం ఎలా అందుతుందో గుర్తించాం. ఈ రెండు అంశాలకు తగ్గట్లు ప్రభుత్వం బీమా, న్యాయపరమైన రక్షణ వంటి విధానాలను రూపొందించింది. సుమారు లక్ష మంది సింగపూరియన్ల వివరాలు సేకరించాలన్నది లక్ష్యం కాగా ఇప్పటివరకూ 97 వేల మంది ఈ కార్యక్రమంలో చేరారు. దేశ ప్రజలందరినీ గుర్తించేందుకు ఉన్న పద్ధతి (ఆధార్ వంటిది) ద్వారా వారిలో ఎవరు ఎక్కడ జబ్బు పడ్డా ఆ వివరాలు ఎలక్ట్రానిక్ రిజిస్టర్‌లో నమోదవుతాయి. ఏ జబ్బు వచ్చింది? ఏం మందులిచ్చారు? ఇతర వివరాలు ఏమిటన్నది తెలిసిపోతుంది. వాటిని విశ్లేషించడం ద్వారా భవిష్యత్తులో రాగల జబ్బులను గుర్తిస్తున్నాం. రోగులకు ఎలాంటి చికిత్స అందించాలనే అంశంపైనా పనిచేస్తున్నాం. చివరి దశలో భాగంగా మొత్తం సింగపూర్ జనాభాలో 10 శాతం మంది నుంచి వివరాలు సేకరిస్తాం. అయితే వారు ఇప్పటికే ఏదో ఒక జబ్బు బారినపడి చికిత్స తీసుకుంటున్న వారై ఉంటారు. వీరి నుంచి సేకరించే సమాచారం వ్యాధి ఎలా ముదురుతోంది? దుష్ప్రభావాలు ఏమిటి వంటివి తెలుస్తాయి.మొత్తమ్మీద ఇంకో ఐదేళ్లలో ఈ ప్రాజెక్టు ద్వారా గణనీయమైన పురోగతి సాధించగలమని ఆశిస్తున్నాం' అని ప్యాట్రిక్ టాన్ వివరించారు.

గొర్రె ఊలుతో మందుల ప్యాకింగ్!

బయో ఆసియా సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా 'వూల్‌ప్యాక్' స్టాల్

వివిధ ఉత్పత్తులను ప్రదర్శించిన 50కిపైగా సంస్థలు




ప్లానెట్ ప్రొటెక్టర్ అనే సంస్థ గొర్రె ఊలుతో రూపొందించిన వూల్‌ప్యాక్

మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మంగళవారం ప్రారంభమైన బయో ఆసియా–2025 సదస్సులో భాగంగా 50కిపైగా కంపెనీలు ఏర్పాటు చేసిన ఉత్పత్తుల స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రత్యేకించి ప్లానెట్ ప్రొటెక్టర్ అనే సంస్థ గొర్రె ఊలుతో రూపొందించిన వూల్‌ప్యాక్ అనే ప్యాకింగ్ ఉత్పత్తి సందర్శకుల్లో అమితాసక్తి రేపింది. దీన్ని వాడటం ద్వారా అన్ని కాలాల్లోనూ మందులు పాడవకుండా వాటిని సరైన ఉష్ణోగ్రతలో ఉంచేందుకు ఉపయోపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం ఔషధాల ప్యాకింగ్‌కు ఉపయోగిస్తున్న పాలిస్టీన్ అనే సింథటిక్ పాలిమర్‌తో పోలిస్తే ఫార్మా రంగానికి 'వూల్‌ప్యాక్' మెరుగైన ప్రత్యామ్నాయం కాగలదని పేర్కొన్నారు. కాగా, ప్రయోగశాలలకు అవసరమైన వాటర్ బాత్ షేకర్, ఆటో క్లేవ్, ఎల్‌సీడీ మైక్రోస్కోప్, ప్లేట్ సీలర్, మైక్రోటోమ్, విస్కో మీటర్, పీహెచ్ మీటర్, పవర్ సప్లై, బ్యాగ్ మిక్సర్, స్లైడ్ డ్రయర్, సీఓ2 ఇంక్యుబేటర్, అల్ట్రా లో ఫ్రీజర్, జెల్ డాక్యుమెంటేషన్ సిస్టమ్, ఆర్టీ–పీసీఆర్ మెషీన్ తదితర ఆధునిక వైద్య పరికరాలను స్టాల్స్‌లో ప్రదర్శించారు.

టీజీ ఎప్‌సెట్ దరఖాస్తు ప్రక్రియ మార్చి 1కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఇంజనీరింగ్, ఫార్మా, అగ్రికల్చర్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీ ఎప్‌సెట్)ను తెలంగాణ ఉన్నత విద్యా మండలి, జేఎన్‌టీయూ వాయిదా వేశాయి. ఇదివరకు ప్రకటించిన ప్రకారం మంగళవారం నుంచి విద్యార్థులు ఆన్‌లైన్‌లో టీజీ ఎప్‌సెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి నోటిఫికేషన్ జారీ చేస్తారని కన్వీనర్ బి.డీన్‌కుమార్ పేర్కొన్నారు. అయితే వాయిదాకు ఎలాంటి కారణాలు వివరించకుండానే.. మార్చి 1వ తేదీన నోటి ఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు. అందులో పూర్తి వివరాలుంటాయని, ఆరోజు నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

కాలేయంపై 'పని'భారం



ఎక్కువ పని గంటలతో లివర్‌కు తీవ్ర ముప్పు

- ఐటీ ఉద్యోగుల్లో ఎక్కువగా కనిపిస్తున్న ప్రభావం
- ఎక్కువ కేలరీల ఫుడ్, శారీరక శ్రమ లేకపోవటమే కారణం
- యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ అధ్యయనంలో వెల్లడి
- ఫ్యాటీ లివర్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందంటున్న శాస్త్రవేత్తలు

మానవ శరీరంలోనే అతిపెద్ద గ్రంథి అయిన కాలేయం.. పని భారంతో తల్లడి ల్లుతోంది. క్రమం తప్పిన జీవన విధానాన్ని సమన్వయం చేయలేక సతమతం అవుతోంది. అవసరానికి మించిన తిండి.. అవసరమైన శ్రమ ఏమాత్రం చేయని దినచర్య కాలేయంపై పెను భారం మోపుతున్నాయని తాజా అధ్యయనంలో వెల్లడైంది. జీవన విధానంలోని మార్పులు కాలేయంపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయో తెలుసుకునేందుకు యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ శాస్త్రవేత్తలు ఇటీవల అధ్యయనం చేశారు. ఈ పరిశోధనలో ఏఐజీ సీనియర్ హెపటాలజిస్ట్ పీఎస్ రావు, యూఓహెచ్‌ప్రొఫెసర్లు కల్యాణ్‌కర్ మహదేవ్, సీటీ అనిత, రీసెర్చ్ స్కాలర్లు భార్గవ, నందిత ప్రమోద్ పాల్గొన్నారు. వీరి పరిశోధనలో ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ రంగంలోని వారి ఆరోగ్యాలను పరిశీలించారు.

- సాక్షి, హైదరాబాద్

» ఎక్కువ పని గంటలు, తీవ్ర పని ఒత్తిడి, వేళాపాళా లేని తిండి, నిద్రలేమితో కాలేయంపై తీవ్ర ప్రభావం పడుతోందని గుర్తించారు.

» ఎక్కువ సేపు ఒకేచోట కూర్చుని పనిచేయడం, ఎక్కువ గంటల పని, ఒత్తిడి వల్ల జీవక్రియలో ఇబ్బందులు తలెత్తి, ఫ్యాటీలివర్ సమస్య (ఎంఏఎఫ్ఎల్డీ) వచ్చే ప్రమాదం పెరుగుతోంది.

84% మంది

» ఐటీ ఉద్యోగుల్లో ప్రస్తుతం దాదాపు 84 శాతం మంది ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్నారని అధ్యయనంలో తేలింది.

71% మంది


» అధిక బరువు (ఊబకాయం)తో 71 శాతం మంది బాధపడుతున్నారు. 34 శాతం మందిలో జీవక్రియల సమస్యలు ఉన్నాయి.

పరిశోధనలో తేలిన అంశాలు

జీవ క్రియల్లో సమస్యలు ఉన్న వారిలో ఫ్యాటీ లివర్, ఊబకాయం, డయాబెటిస్, అధిక రక్తపోటు వంటి సమస్యలు పెరిగే అవకాశం ఉంది.కాలేయంలో 5 శాతం కన్నా ఎక్కువ కొవ్వు పేరుకుపోతే దాన్ని ఫ్యాటీ లివర్ అంటారని డాక్టర్ పీఎస్ రావు తెలిపారు. సరైన చికిత్స తీసుకోకపోతే కాలేయం వాపు, క్యాన్సర్‌కు కూడా దారితీసే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. అందుకే ఐటీ ఉద్యోగులు జీవన శైలిని మార్చుకోవాల్సిన తక్షణ అవసరం ఉందని సూచించారు. వ్యాయామంతోపాటు తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, వర్క్-లైఫ్ బ్యాలెన్స్ చేసుకోవాలని పేర్కొన్నారు.

- శ్రీశైల మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజు మంగళవారం భ్రమరాంబా సమేత మల్లన్న గజవాహనంపై విహరించాడు. స్వామి, అమ్మవార్లను భక్తులు కనులారా దర్శించి కర్పూర నీరాజనాలు సమర్పించారు.

ప్రమాదం అనంతరం సొరంగంలో నెలకొన్న పరిస్థితులు, సహాయక బృందాలు చేరుకోగలిగిన ప్రాంతాలను తెలియజేసే ఊహాచిత్రం. ఎన్‌డీఆర్‌ఎఫ్ నిపుణులు గీసిన డయాగ్రం ఆధారంగా రూపొందించిన చిత్రం.



ఆశలు ఆవిరి!

కానరాని కార్మికుల జాడ



టన్నెల్ బోరింగ్ మెషీన్ కింద గల్లంతైన కార్మికులను వెతుకుతున్న దృశ్యం



సొరంగం చివరి భాగానికి చేరుకున్న వారు వీరే..

సాక్షి, హైదరాబాద్/నాగర్‌కర్నూల్: శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎల్‌ఎల్‌బీసీ) సొరంగం పైకప్పు కూలిన ఘటనలో గల్లంతైన 8 మంది కార్మికులు, ఉద్యోగుల క్షేమంపై ఆశలు ఆవిరవుతున్నాయి. ఆరో ప్రయత్నంలో భాగంగా మంగళవారం సొరంగంలోకి వెళ్లిన ఎన్డీఆర్ఎఫ్, ర్యాట్ హోల్ మైనర్లతో కూడిన రెస్క్యూ బృందం ఎట్టకేలకు సొరంగం చివరివరకు చేరుకుని ప్రమాద స్థలంలో విస్తృతంగా గాలించింది. పైకప్పు కూలడంతో పెద్ద మొత్తంలో కిందపడిన బండ రాళ్లు, కంకరతో నిండిపోయిన ఆ ప్రాంతంలో ఎక్కడా కార్మికుల ఉనికి కనిపించలేదు. ఈ బృందం పూర్తిగా ప్రమాద స్థలానికి చేరుకుని లోపలి నుంచి ల్యాండ్‌లైన్ ఫోన్ ద్వారా బయటకి ఈ సమాచారం అందించగానే కార్మికుల క్షేమంపై అధికారులందరూ దాదాపుగా ఆశలు వదులుకున్నారు. టన్నుల కొద్దీ బండరాళ్లు, కంకర, మట్టి, యంత్రాల తుక్కు కిందే కార్మికులు నలిగిపోయి ఉంటారనే అనుమానాలు మరింతగా బలపడ్డాయి. అయితే కార్మికుల క్షేమంపై మంగళవారం రాత్రి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. ఉన్నత స్థాయిలో నిర్ణయం తీసుకున్నాక బుధవారం ప్రకటన చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

చివరి వరకు వెళ్లిన తొలి బృందం ఇదే..: మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఆరో రెస్క్యూ బృందం సొరంగంలో ప్రవేశించింది. ర్యాట్ హోల్ మైనింగ్ టీం ప్రత్యేకంగా తమకు కావాల్సిన వస్తువులను సేకరించి, వెల్డింగ్ చేయించుకుని టన్నెల్‌లోకి తీసుకెళ్లింది. టన్నెల్‌లో బురద దాటేందుకు వీలుగా, టన్నెల్ సైడ్ గోడలకు రాడ్లు కొడుతూ ప్రత్యేక దారి నిర్మాణానికి కావాల్సిన సామగ్రిని వెంటబెట్టుకుని వెళ్లింది. గంటన్నర ప్రయాణించి మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో సొరంగం చివరి అంచువరకు వెళ్లిన ఆరో బృందం గాలింపులు నిర్వహించింది. సొరంగం చివరన ప్రమాద స్థలానికి చేరుకున్న తొలి రెస్క్యూ బృందం ఇదే కావడం గమనార్హం. ఎన్డీఆర్ఎఫ్, ర్యాట్ హోల్ మైనర్లు, స్నైఫర్ డాగ్స్, డ్రోన్ ఆపరేటర్లు, జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) నిపుణులతో సహా మొత్తం 35 మంది బృందంలో ఉండగా, సొరంగం చివరికి 11 మంది ర్యాట్ హోల్ మైనర్లతో పాటు నలుగురు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది మాత్రమే చేరుకుని గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. ప్రమాద స్థలంలో 15-18 మీటర్ల ఎత్తులో 140 మీటర్ల మేర శిథిలాలు పేరుకుపోయాయి.

'కూలిపోయే ప్రమాదం ఉంది..' : అక్కడి పరిస్థితిని రెస్క్యూ టీం సభ్యులు వీడియో తీశారు. 'ఇక్కడ చాలా ప్రమాదకరంగా ఉంది.. పైకప్పునకు క్రాక్ వచ్చింది. కూలిపోయే ప్రమాదం ఉంది. ఇక్కడి నుంచి వెంటనే వెనక్కి వెళ్దాం పదండి..' అంటూ రెస్క్యూ టీం సభ్యులు వీడియోలో మాట్లాడారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఈ బృందం తిరిగి బయటకు వచ్చింది. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సొరంగంలోకి వెళ్లిన ఐదో రెస్క్యూ బృందం ప్రమాద స్థలానికి 40 మీటర్ల సమీపం వరకే వెళ్లగలిగింది.

నేడు ఏడో ప్రయత్నం.. : ఏడో ప్రయత్నంలో భాగంగా బుధవారం ఉదయం మళ్లీ ఎన్డీఆర్ఎఫ్, ర్యాట్ హోల్ మైనర్లతో కూడిన బృందం సొరంగంలోకి వెళ్లనుంది. ప్రమాద స్థలంలో పెద్ద మొత్తంలో పేరుకుపోయిన తుక్కును గ్యాస్ కట్టర్లతో కట్ చేయడంతో పాటు కంకర, బండ రాళ్లు, మట్టిని తొలగించే ఆపరేషన్‌ను ప్రారంభించనుంది. సహాయక బృందాల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతానికి జేసీబీ యంత్రాలు వినియోగించకుండా ఎన్డీఆర్ఎఫ్, ర్యాట్ హోల్ మైనర్ల బృందాలతో తవ్వకాలు చేపట్టాలని నిర్ణయించారు. దీనికి ఎన్నిరోజుల సమయం పడుతుందో చెప్పలేమని ర్యాట్ హోల్ మైనర్ ఫిరోజ్ ఖురేషీ 'సాక్షి'తో అన్నారు.

కన్పించిన టీబీఎం ఉపరితల భాగం: మంగళవారం సొరంగంలోకి వెళ్లిన రెస్క్యూ బృందానికి టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) ఉపరితల భాగం కనిపించింది. బండ రాళ్లు, కాంక్రీట్ పడడంతో ఈ భాగం పూర్తిగా ధ్వంసమై కనిపించగా, మిగిలిన భాగం మట్టి, కంకర, శిథిలాల్లో కూరుకుపోయింది. శిథిలాలను తొలగించి పరిశీలించిన తర్వాతే టీబీఎం మళ్లీ పనిచేయగలుగుతుందో లేదో తేలనుంది. సొరంగం పైకప్పునకు రక్షణగా ఉన్న కాంక్రీట్ సెగ్మెంట్లు కూడా కొంతవరకు కూలిపోయి, మరికొన్ని వంగిపోయి కనిపిస్తున్నాయి. కిందనుంచి శిథిలాలను తొలగించే క్రమంలో కాంక్రీట్ సెగ్మెంట్లు, శిథిలాలు ఊడిపోయి రెస్క్యూ టీంకు కూడా ప్రమాదకర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని అంటున్నారు. టీబీఎం మిషన్‌పై పడిన మట్టి, బురదను తొలగించేందుకు మెష్ ఫ్రేమ్‌ను ఏర్పాటు చేసి దాని ద్వారా బురద నుంచి నీటిని వేరుచేసి డీ వాటరింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు వీలు ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం నిమిషానికి సుమారు 5 వేల లీటర్ల వరక నీరు సీపేజీ రూపంలో వస్తోంది. ఈ నీటిని బయటకు తోడేందుకు ఐదు మోటార్లతో డీ వాటరింగ్ చేపడుతున్నారు. బుధవారం సాయంత్రానికి మొత్తం నీటిని డీవాటరింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇన్ని రోజులైనా తమ వారి జాడ తెలియకపోవడంతో, ఏ క్షణంలో ఎలాంటి సమాచారం వినాల్సి వస్తుందోనని వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

వారిని కాపాడేందుకు సర్వశక్తులూ ఒడ్డుతాం

- రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- డిప్యూటీ సీఎం భట్టి ఆధ్వర్యంలో టన్నెల్ ఇన్‌లెట్ పరిశీలన
- మంత్రులు జూపల్లి, కోమటిరెడ్డితో కలిసి సహాయక చర్యల పర్యవేక్షణ

సాక్షి, నాగర్‌కర్నూల్/ అచ్చంపేట: శ్రీశైల ఎడమ కా ల్వ సొరంగంలో చిక్కుకున్న 8 మంది కార్మికులను కాపాడేందుకు సర్వశక్తులూ ఒడ్డుతామని, ఇందు కోసం అందుబాటులో ఉన్న అత్యున్నత పరిజ్ఞా నాన్ని ఉపయోగించుకుంటామని రాష్ట్ర నీటిపారు దల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. మంగళవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు దోమలపెంట వద్ద ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఇన్‌లెట్‌ను పరిశీలించారు. సహాయక చర్యలను పర్యవేక్షించారు. అనంతరం ఎస్ఎల్‌బీసీ సొరంగం, జేపీ కార్యాలయంలో రెండుసార్లు ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి సహాయక చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ సహా ఆయా శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ, సహాయ చర్యల్లో పాల్గొంటున్న వివిధ ఏజెన్సీల ప్రతినిధులు వివరించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ విలేకరులతో మాట్లాడారు.

బురదను తొలగించడమే సమస్య

'ఎస్ఎల్‌బీసీ సొరంగంలోకి అకస్మాత్తుగా వచ్చిన నీటి ఊటతో 40 నుంచి 50 మీటర్ల మేర బురద పేరుకుంది. టన్నెల్‌లో 11 కి.మీ తర్వాత ప్రాంతం నీటితో నిండి ఉంది. 13.50 కి.మీ వద్ద టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) ఉంది. ఎయిర్ సప్లయ్ పైప్‌లైన్ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైంది. ప్రస్తుతం టన్నెల్‌లో 10 వేల క్యూబిక్ మీటర్ల బురద ఉందని ప్రాథమికంగా అంచనా వేశాం. దీనిని తొలగించడమే ప్రధాన సమస్య' అని మంత్రి ఉత్తమ్ చెప్పా రు. సమావేశంలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, స్పెషల్ ఆఫీసర్ ఇ.శ్రీధర్, కలెక్టర్ బదావత్ సంతోష్, వివిధ కంపెనీల ప్రతినిధులు, నిపుణులు పాల్గొన్నారు.

మా వాళ్లను క్షేమంగా అప్పగించండి

జార్ఖండ్ కార్మికుల కుటుంబ సభ్యుల ఆవేదన

అచ్చంపేట: బతుకుదెరువు కోసం మా పిల్లలు ఇక్కడికి వచ్చారు.. వారు క్షేమంగా బయటికి తిరిగి వస్తారు కదా.. అంటూ దోమలపెంట ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంలో చిక్కుకున్న కార్మికుల తల్లిదండ్రులు, బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. 'సొరంగంలో వాళ్లు ఎలా ఉన్నారో తలుచుకుంటేనే భయమేస్తోంది. మా పిల్లలను మాకు క్షేమంగా అప్పగిస్తే చాలు..' అని వేడుకున్నారు. జార్ఖండ్ రాష్ట్రం గుమ్లా జిల్లాకు చెందిన నలుగురు కార్మికుల కుటుంబ సభ్యులు మంగళవారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్దకు వచ్చారు. స్థానిక అధికారులు వారితో మాట్లాడి భరోసా కల్పించారు. తమవారు క్షేమంగా బయటికి రావాలని సొరంగంలో చిక్కుకున్న జగ్తాక్షేస్ అన్న జల్లామ్‌క్షేస్ చెప్పాడు. 'నా పెద్ద కొడుకైన సందీప్ సాహు ఆరేళ్ల క్రితం కంపెనీలో పనిచేసేందుకు వచ్చి ఇప్పుడు ప్రమాదంలో చిక్కుకున్నాడు. నా కొడుకు క్షేమంగా వస్తే మా ఊరికి తీసుకెళ్లిపోతా..' అని సందీప్ తండ్రి జీత్‌రామ్ సాహు అన్నాడు.

గ్రౌటింగ్ విఫలం కావడంతోనేనా..?

సొరంగం కూలిన ప్రాంతంలో కొన్నిరోజుల కింద నిర్మాణ సంస్థ పీయూ గ్రౌటింగ్ చేసింది. జీఎస్ఐ నుంచి జియాలజిస్టు వచ్చి పరిశీలించి, పనులు కొనసాగించవచ్చని చెప్పాకే టన్నెల్ పనులు పునః ప్రారంభించారు. అయితే సొరంగం కూలిన ప్రాంతంలో మొత్తం పీయూ గ్రౌటింగ్ కోసం వినియోగించిన రసాయన అవశేషాలు పెద్ద మొత్తంలో పేరుకుపోయి కనిపించాయి. దీంతో గ్రౌటింగ్ విఫలం కావడంతోనే సొరంగం కూలిందనే అనుమానాలు బలపడుతున్నాయి.

ఫాల్ట్ లైన్ గుర్తించేందుకు జీఎస్ఐ అధ్యయనం

సొరంగం కూలడానికి కారణమైన ఫాల్ట్ లైన్‌ను గుర్తించడానికి జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిపుణులు అధ్యయనం చేస్తున్నారు. సొరంగం ఉపరితలం నుంచి వారు సర్వే చేసి ఏ ప్రాంతంలో మట్టి వదులుగా, బలహీనంగా ఉందో గుర్తించి నివేదిక ఇవ్వనున్నట్టు తెలిసింది. బుధవారం మరో జీఎస్ఐ బృందం రాబోతోంది. నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్ఆర్ఎస్ఏ) నిపుణుల బృందం సైతం బుధవారం సొరంగం వద్దకు రానున్నారని అధికారవర్గాలు తెలిపాయి.

తక్షణమే నివేదిక ఇవ్వండి : ఎస్ఎల్‌బీసీ సొరంగం కుప్పకూలిన ఘటనపై తక్షణమే నివేదిక సమర్పించాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) దక్షిణాది విభాగం.. రాష్ట్ర నీటిపారుదల శాఖను కోరింది. శ్రీశైలం జలాశయంతో సొరంగం అనుసంధానం కానుండడంతో ఈ ప్రమాదంతో జలాశయంపై ఉండనున్న ప్రభావంపై అధ్యయనం చేసేందుకు ఈ నివేదిక కోరినట్టు తెలుస్తోంది.



తామరాకు మీద నీటిలా, సూది మొన మీద నువ్వుగింజలా కామ సుఖాలకు ఎవడు అంటకుండా ఉంటాడో, అతనిని నేను బ్రాహ్మణుడంటాను!

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 26 ఫిబ్రవరి 2025

కష్టాల జర్మనీకి కొత్త సారథ్యం

బహుముఖ సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతున్న జర్మనీ ఆదివారం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో మితవాదపక్షాల వైపు మొగ్గింది. 1990లో జర్మనీ ఏకీకరణ తర్వాత కనీవినీ ఎరుగని రీతిలో 83.5 శాతం పోలింగ్ నమోదు కాగా మధ్యేవాద మితవాదులైన క్రిస్టియన్ డెమాక్రాటిక్ యూనియన్ (సీడీయూ), క్రిస్టియన్ సోషల్ యూనియన్ (సీఎస్‌యూ) పార్టీలు రెండింటికీ కలిపి 208 స్థానాలు వచ్చాయి. పోలైన వోట్లలో ఆ రెండు పార్టీలూ 28.6 శాతం గెల్చుకోగా, తీవ్ర మితవాద పక్షం ఆల్టర్నే టివ్ ఫర్ జర్మనీ (ఏఎఫ్‌డీ) 20.8 శాతంతో రెండో స్థానానికి చేరుకోవటం అందరినీ కలవర పరుస్తోంది. ఆ పార్టీకి 132 స్థానాలు లభించాయి. 2021తో పోలిస్తే దాని వోటింగ్ శాతం రెట్టింప యింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అనుచరగణం అత్యుత్సాహం ప్రదర్శించి జర్మనీ ఎన్ని కల్లో జోక్యం చేసుకోనట్టయితే ఏఎఫ్‌డీ వైపు మరింత శాతం మంది మొగ్గుచూపేవారన్నది ఎన్నికల నిపుణుల అంచనా. ఇంతవరకూ పాలించిన కూటమికి నేతృత్వం వహించిన సోషల్ డెమాక్రాటిక్ పార్టీ (ఎస్‌పీడీ) 16.4 శాతం వోట్లతో, 120 సీట్లతో మూడో స్థానానికి పరిమితమైంది. కానీ పార్ల మెంటులోని 630 స్థానాల్లో ప్రభుత్వం ఏర్పర్చటానికి కావాల్సిన 316 స్థానాలు సీడీయూ, సీఎస్ యూలకు లేవు గనుక అనివార్యంగా ఎస్‌పీడీతో చేతులు కలపాల్సి వుంటుంది. తమకు ప్రభుత్వం లో కొనసాగే ఉద్దేశం లేదని ఎస్‌పీడీ చెబుతున్నా అంతకుమించి దానికి వేరే ప్రత్యామ్నాయం లేదు.

ఇప్పటికీ ప్రధాన స్రవంతి పక్షాల వైపే వోటర్లు మొగ్గుచూపుతున్నట్టు తేలినా వాటి బలం గణనీ యంగా పడిపోయిందని ఫలితాలు వెల్లడిస్తున్నాయి. యువత, మహిళలు ప్రధానంగా ఎస్‌పీడీ, గ్రీన్ పార్టీ, వామపక్షాల వైపు మొగ్గటం గమనించదగ్గ అంశం. యువతలో ఏఎఫ్‌డీ ప్రభావం కూడా పెరిగింది. ప్రాంతాలవారీగా చూస్తే గతంలో కమ్యూనిస్టుల ప్రాబల్యంవున్న తూర్పు జర్మనీ ప్రాంత రాష్ట్రాల్లో ఏఎఫ్‌డీ బలమైన శక్తిగా ఎదిగినట్టు కనబడుతోంది. పశ్చిమ ప్రాంతంలో సీడీయూ, సీఎస్ యూలు ఆధిక్యత సాధించాయి. తూర్పు, పశ్చిమ ప్రాంతాల మిశ్రమంగావున్న బెర్లిన్ ఒక్కటే ఇం దుకు మినహాయింపు. అక్కడ వామపక్ష పార్టీకి అత్యధిక వోట్లు వచ్చాయి. ఈ ఫలితాలు వెల్లడిస్తున్న మరో కీలకాంశం దేశం ప్రాంతాలవారీగా విడిపోయిందన్నదే. తమను దేశంలో ద్వితీయ శ్రేణి పౌరు లుగా చూస్తున్నారని, వలసలను ప్రోత్సహిస్తూ తమ అవకాశాలను దెబ్బతీస్తున్నారని చాన్నాళ్లుగా పూర్వపు తూర్పు జర్మనీ వాసులు ఆగ్రహంతో ఉన్నారు. ఏఎఫ్‌డీ ఆ అసంతృప్తిని తనకు అనుకూ లంగా మల్చుకున్నదని ఫలితాలు చెబుతున్నాయి.

రెండో ప్రపంచ యుద్ధానంతరం చకచకా కోలుకుని సుస్థిర ఆర్థిక వ్యవస్థతో యూరప్ ఖండా నికే చుక్కానిగా నిలిచిన జర్మనీని గత కొన్నేళ్లుగా సమస్యలు చుట్టుముట్టాయి. ఇవి చాల్లేదన్నట్టు ట్రంప్ చేస్తున్న ప్రకటనలు ప్రజల్లో గుబులు పుట్టిస్తున్నాయి. ప్రభుత్వం మైనారిటీలో పడటంతో గడువుకు ముందే ఎన్నికలకు పోవాలని చాన్స్‌లర్ ఓలోఫ్ షోల్జ్ గత ఏడాది నిర్ణయించారు. ట్రంప్‌నూ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌నూ ఎదిరించే సామర్థ్యం షోల్జ్‌కు లేదని 65 శాతంమంది వోటర్లు అభిప్రాయపడ్డారు. తన మాట వినని దేశాలపై భారీగా సుంకాలు విధించటం, నాటో కూటమికి చరమగీతం పాడటం తప్పదని బెదిరిస్తున్న ట్రంప్ వ్యవహారశైలితో వోటర్లు అసహ నంతో ఉన్నారు. దానికి తోడు మ్యూనిక్ భద్రతా సదస్సుకొచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తీవ్ర మితవాద పక్షాలను దూరం పెడుతున్న యూరప్ దేశాలపై విరుచుకుపడటంతో అంతవరకూ మందకొడిగా సాగుతున్న ఎన్నికల ప్రచారానికి ఒక్కసారిగా జవసత్వాలొచ్చాయి. ఒకప్పుడు తమ దేశం సర్వనాశనం కావటానికి కారణమైన తీవ్ర మితవాద పక్షాలను వెనకేసుకురావటం ఎటూ మొగ్గని వోటర్లను ప్రభావితం చేసింది.

పూర్వాశ్రమంలో సీడీయూ నాయకుడే అయినా సైద్ధాంతికంగా విభేదించి పార్టీకి దూరమైన ఫ్రెడరిక్ మెర్జ్ రెండేళ్లక్రితం అదే పార్టీ సారథ్యం స్వీకరించి సీడీయూని విజయతీరాలకు చేర్చారు. ఆయన ముందున్న సవాళ్లు తక్కువేమీ కాదు. రష్యా నుంచి తమకు ఎప్పటికైనా ముప్పు తప్పదని జర్మనీ భావిస్తోంది. ట్రంప్ వైఖరి చూస్తుంటే నాటో కూటమి అంతరించటం ఖాయమన్న సంకే తాలు కనబడుతున్నాయి. కనుకనే 'సాధ్యమైనంత త్వరగా' యూరప్ రక్షణకు ఏర్పాట్లు చేసుకోవా లని షుల్జ్ పిలుపునిచ్చారు. అందుకు దండిగా నిధులు కావాల్సివుంటుంది. ప్రస్తుతం నాటోకు యూరప్ దేశాలు చెల్లిస్తున్న మొత్తం 29వేలకోట్ల డాలర్లు. కానీ భారీయెత్తున బలగాలు, ఆయుధాలు సమీకరించాలంటే అదనంగా మరో 26 వేల కోట్ల డాలర్లు ఖర్చు చేస్తే తప్ప రష్యాను యూరప్ దేశాలు సొంతంగా ఎదుర్కొనటం సాధ్యంకాదని నిపుణులు అంచనా వేశారు. యూరప్‌లో ఆర్థికం గా అగ్రస్థానంలోవున్న జర్మనీ ఇందులో అధిక మొత్తాన్ని భరించాల్సి వుంటుంది. ఇప్పుడున్న పరిస్థి తుల్లో అది సాధ్యమేనా? ఎందుకంటే ఎగుమతులపై ఆధారపడిన జర్మనీ ఆర్థిక వ్యవస్థకు ప్రపంచ బహిరంగ మార్కెట్ వ్యవస్థలు ఇన్నాళ్లూ దన్నుగా నిలిచాయి. అమెరికా వైఖరితో ఆ శకం అంత రిస్తున్న సూచనలు కనబడుతున్నాయి. కనుక మారిన పరిస్థి తుల్లో రష్యాతో తాత్కాలి కంగానైనా అవగాహనకు రావటం ఎంతో ఉత్తమం. ఇన్నాళ్లూ అమెరికా అభీష్టానికి అనుగుణంగా ఉక్రెయిన్‌లో నైనా, మరోచోటైనా యూరప్ దేశాలు పావులు కదిపినందు వల్లే రష్యాతో శత్రుత్వం వచ్చింది. ఇకపై ఆ దేశాలు స్వతంత్రంగా వ్యవహరిస్తాయన్న అభిప్రాయం రష్యాలో కలిగించగలిగితే చాలా వరకూ సమస్యలు సమసిపోతాయి. ఈ విషయంలో యూరప్ దేశాలు వివేకంతో ఆలోచించాలి.

ఏఐపై నియంత్రణ ఎలా?

అభిప్రాయం



దినేశ్ సి. శర్మ

కృత్రిమ మేధ అభివృద్ధి వడివడిగా సాగుతోంది. రెండు మూడేళ్ల క్రితం మొదలైన ఛాట్ జీపీటీ వంటి లార్జ్ లాంగ్వేజ్ మోడళ్లకు డీప్‌సీక్ రూపంలో చైనా కంపెనీ సవాలు విసిరింది. ఇదే సమయంలో ఏఐ టెక్నాలజీలపై నియంత్రణ ఎలా అన్న చర్చ కూడా జోరుగా సాగుతోంది. ప్యారిస్‌లో ఇటీవలే ముగిసిన ఏఐ శిఖరాగ్ర సమావేశంలోనూ ఈ అంశం ప్రబలంగా వినిపించింది. దౌత్య వేత్తలు, రాజకీయనేతలు, టెక్ కంపెనీ సీఈవోలు పాల్గొన్న ఈ సమా వేశానికి భారత్, ఫ్రాన్స్ ఉమ్మడిగా అధ్యక్ష స్థానాన్ని వహించాయి. అయితే ఏఐ టెక్నాలజీల నియంత్రణ విషయంలో ఈ సమావేశం ఏకాభిప్రాయానికి రాకపోయింది సరికదా... అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ ఎన్నికైన తరువాత మారిన రాజకీయ పరిస్థితులకు అద్దంపట్టేలా బోలెడన్ని విభేదాలు బయటపడ్డాయి.

ప్రభావరీత్యా చూస్తే గతంలో మనం సాధించిన టెక్నాలజీ ఘనతల కంటే ఏఐ భిన్నమైనది. అందుకే ప్రధాని మోదీ ఏఐ నియం త్రణకు అంతర్జాతీయ స్థాయిలో సమష్టి ప్రయత్నం జరగాలనీ, ప్రమాణాల నిర్ధారణతో పాటు, మానవీయ విలువల పతనం జర క్కుండా, ప్రమాదాలను నివారించేలా, నమ్మకం పెంచేలా చూడాలనీ పిలుపునిచ్చారు.

పొంచివున్న ప్రమాదాలు

ఈ సమష్టి బాధ్యత కార్యాచరణలో తొలి అడుగుగా ఈ సమా వేశం 'ఇన్‌క్లూజివ్ అండ్ సస్టెయినబుల్ ఏఐ' అనే దౌత్యపరమైన ప్రక టనను చేర్చింది. అయితే ఏఐ రంగంలో అగ్రగాములుగా ఉన్న రెండు దేశాలు యూఎస్, యూకే ఈ డిక్లరేషన్‌పై సంతకాలకు నిరాకరిం చాయి. ఏఐలో వినూత్న, సృజనాత్మక ఆవిష్కరణలకు సాయం చేసే అంతర్జాతీయ నియంత్రణ వ్యవస్థ అవసరమనీ, ఏఐని గొంతు నొక్కేది కాదనీ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించడం గమనార్హం. మరోవైపు ఆ ప్రకటన జాతీయ భద్రతపై ఏఐ ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోలేదని యూకే భావిం చింది. శిఖరాగ్ర సమావేశం ముగిసే సమయానికి ఏఐ భద్రత, నియంత్రణ విషయంలో ప్రపంచం రెండుగా విడిపోయింది!

కృత్రిమ మేధ చాలా ఏళ్ల నుంచే మనకు పరిచయం. అయితే ఇటీవలి కాలంలో వచ్చిన మార్పులు జనరల్ పర్పస్ ఏఐ అందు బాటులోకి వచ్చేలా చేసింది. ఈ జనరల్ పర్పస్ ఏఐ టూల్స్ రక రకాల పనులు చేయగలవు. ఏఐ ఏజెంట్లు స్వతంత్రంగా కంప్యూ టర్లను ఉపయోగించుకుని ప్రాజెక్టులు పూర్తి చేయగలవని ప్యారిస్ లోనే విడుదలైన ఒక నిపుణుల నివేదిక స్పష్టం చేయడం గమనిం చాల్సిన అంశం. ఈ సామర్థ్యం ఒకరకంగా వరం, ఇంకో రకంగా శాపం. భారత్, ఇతర దేశాలకు చెందిన స్వతంత్ర టెక్నాలజీ నిపు ణులు ఈ నివేదికను సిద్ధం చేశారు.

ఏఐతో వచ్చే ప్రమాదాలు కొన్నింటి గురించి మనకు ఇప్పటికే తెలుసు. స్కాములకు ఉపయోగపడటం వీటిల్లో ఒకటి. అనుమతు ల్లేకుండా సున్నితమైన విషయాల ఫొటోలు తీయడం, కొంతమంది ప్రజలు, లేదా అభిప్రాయాలకు వ్యతిరేకంగా వివక్ష, వ్యక్తిగత గోప్య తకు భంగం, విశ్వసనీయత వంటివి ఏఐ తీసుకొచ్చే ప్రమాదాల్లో



ఏఐ టెక్నాలజీలపై నియంత్రణ మీద ఇటీవల జరిగిన ప్యారిస్ శిఖరాగ్ర సమావేశం దృష్టి పెట్టింది

కొన్ని మాత్రమే. ఉద్యోగాల కోత, ఏఐ ఆధారిత హ్యాకింగ్, బయలా జికల్ దాడులు కూడా సాధ్యమని ప్యారిస్‌లో విడుదలైన 'ఏఐ సేఫ్టీ రిపోర్టు' స్పష్టం చేసింది. కొన్ని ఏఐ మోడళ్లను పరీక్షించే క్రమంలో అవి జీవ, రసాయన ఆయుధాలను పునరుత్పత్తి చేయగలవనీ, సరికొత్త విష పదార్థాలను డిజైన్ చేసేందుకు సాయపడగలవనీ తెలిసింది.

ఏఐ టెక్నాలజీలపై నియంత్రణ కావాలంటే... ముందుగా వాటితో వచ్చే ప్రమాదాలపై స్పష్టమైన అంచనా ఉండాలి. అలాగే ఆ ప్రమాదాలను అధిగమించేందుకు, పరిశీలించేందుకు ఉన్న మార్గాలూ తెలిసి ఉండాలి. ఇది చాలా పెద్ద పనే. ఈ వ్యవస్థలను అటు వైద్య పరికరాల్లో, ఇటు సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో, ఇంకోవైపు ఛాయాచిత్రాలను సృష్టించడంలో వాడే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి ఏఐ డెవలపర్లకు గానీ, వినియోగదారులకు గానీ ఈ ఏఐ వ్యవస్థలను పూర్తిస్థాయిలో ఎలా వాడుకోవచ్చో తెలిసే అవకాశాలు తక్కువ. ఫలితంగా ఏఐ టెక్నాలజీల నియంత్రణ ఒక సవాలుగా మారుతుంది. జనరల్ పర్పస్ ఏఐలో మార్పులు ఊహించలేనంత వేగంగా జరిగిపోతున్న నేపథ్యంలో విధాన రూపకర్తలు, నియంత్రణ చేసేవారికి కూడా ఏఐ ప్రమాదాలకు సంబంధించిన సాక్ష్యాలు వెతుక్కోవడమూ కష్టమవుతుందని ఏఐ సేఫ్టీ రిపోర్టు తెలిపింది. ఏతావతా, ఏఐ నియంత్రణను ముందుకు తీసుకెళ్లే పరిస్థితులు ప్రస్తుతానికైతే లేవు.

నియంత్రణా? సృజనా?

ఏఐ ఇప్పుడు ఓ పాత చర్చను మళ్లీ లేవనెత్తింది. సృజన, నియం త్రణలో ఏది అవసరమన్న చర్చపై ప్యారిస్ సమావేశంలోనే అమెరికా తన వైఖరిని స్పష్టం చేసింది. సృజనను అడ్డుకుంటుందంటే ఏ టెక్నా లజీ నియంత్రణనూ తాము అనుమతించబోమని తెలిపింది. ఏఐ విషయంలో పోటీ పడుతున్న టెక్ కంపెనీల వైఖరి కూడా ఇదే. భారత్ కూడా చిన్న మార్పుతో విషయాన్ని అంగీకరించింది. ప్రధాని మోదీ 'పాలన అంటే కేవలం ప్రమాదాలను మేనేజ్ చేయడం కాదు. సృజనాత్మకతను ప్రోత్సహించడం, దాన్ని విస్తృత ప్రయోజనాల కోసం ఉపయోగించడం' అని అనడంలో ఈ తేడా స్పష్టమవుతోంది. ట్రంప్ అధ్యక్షతన మళ్లీ శిలాజ ఇంధనాల వైపు మళ్లే ఆలోచన చేస్తున్న అమెరికా... ప్యారిస్ సమావేశం సిద్ధం చేసిన సస్టెయినబిలిటీ స్టేట్ మెంట్‌పై సంతకం చేయలేదు. ఎందుకంటే ఏఐ అభివృద్ధికి చాలా విద్యుత్తు అవసరమవుతుంది. ఏఐ వ్యవస్థలను పెద్ద స్థాయిలో ఉపయోగించడం మొదలుపెడితే శిలాజ ఇంధనాలకు దూరంగా వెళ్లేందుకు ప్రపంచ దేశాలు చేస్తున్న ప్రయత్నాలకు గండిపడినట్లే! వాతావరణ మార్పులకూ, ఏఐకీ మధ్య సంబంధం ఏమిటంటే... ఇదేనని చెప్పాలి.

టెక్నాలజీకీ, నియంత్రణకూ మధ్య ఉన్న సంబంధం కూడా చాలా పాతదే. గతంలో చాలా టెక్నాలజీల విషయంలో నియంత్రణ అవసరమైంది. స్టెమ్ సెల్ పరిశోధన, క్లోనింగ్, జీనో ట్రాన్స్‌ప్లాంటేషన్ (జంతు అవయవాలను మనుషులకు అమర్చడం), ఇంటర్నెట్, సోషల్ మీడియా వంటి అనేక టెక్నాలజీలకు నియంత్రణ అవస రమైంది. అయితే ఏఐ వీటన్నింటి కంటే భిన్నమైంది. ఇది ఒక టెక్నా లజీ కాదు. వేర్వేరు టెక్నాలజీలు, అప్లికేషన్ల సమ్మేళనం. కాబట్టి వీటిల్లో దేన్ని నియంత్రించాలన్నది ముందుగా నిర్ణయించుకోవాలి. రెండో కీలకమైన ప్రశ్న ఎవరిని నియంత్రించాలి అన్నది! టెక్నాలజీని అభివృద్ధి చేసే సంస్థనా? టెక్నాలజీ సాయంతో అప్లికేషన్లు అభివృద్ధి చేసేవారినా? వాటిని వాడే వారినా? ఇవన్నీ అస్పష్టమైన అంశాలు. ఇంటర్నెట్ ఆధారిత కంటెంట్‌కు సంబంధించి ప్రస్తుతం ఎదుర్కొం టున్న ప్రశ్నలే ఏఐ విషయంలోనూ వస్తున్నాయి.

మూడు సూత్రాలు

1942లో ప్రసిద్ధ సైన్స్‌ఫిక్షన్ రచయిత ఐజాక్ అసిమోవ్ రోబోటిక్స్‌కు సంబంధించి మూడు సూత్రాలను ప్రతిపాదించారు. 'మనిషిని రోబో గాయపరచకూడదు' అన్నది తొలిసూత్రం. మనిషి ఇచ్చే ఆదేశాలను పాటించాల్సిందిగా రోబోలకు చెబుతూనే, తొలి సూత్రా నికి విరుద్ధంగా ఉండే ఆదేశాలను పాటించవద్దని రెండో సూత్రం స్పష్టం చేస్తుంది. చివరిదైన మూడో సూత్రం ప్రకారం, ఒక రోబో తన అస్తిత్వాన్ని కాపాడుకోవాలి; ఎప్పటివరకూ అంటే, తొలి రెండు సూత్రాలకూ విరుద్ధం కానంత వరకు!

ఈ మార్గదర్శక సూత్రాల ఆధారంగా ఏఐ టెక్నాలజీలకు వర్తించే కొన్ని విస్తృత సూత్రాలను నిర్ణయించడం, ఎప్పటికప్పుడు ఈ టెక్నా లజీ ద్వారా వచ్చే లాభాలు, ప్రమాదాలను బేరీజు వేస్తూండటం ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసరం.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

- ఏఐ ఏజెంట్లు స్వతంత్రంగా కంప్యూటర్లను ఉపయోగించుకుని ప్రాజెక్టులు పూర్తి చేయగలవు. ఈ సామర్థ్యం ఒక రకంగా వరం, ఇంకో రకంగా శాపం.
- కొన్ని ఏఐ మోడళ్లు జీవ, రసాయన ఆయుధాలను పునరుత్పత్తి చేయగలవనీ, సరికొత్త విష పదార్థాలను డిజైన్ చేసేందుకు సాయపడగలవనీ తెలిసింది.
- ఏఐ అనేది ఒక టెక్నాలజీ కాదు. వేర్వేరు టెక్నాలజీలు, అప్లికేషన్ల సమ్మేళనం. కాబట్టి వీటిల్లో దేన్ని నియంత్రించాలన్నది ముందుగా నిర్ణయించుకోవాలి.

సోషల్ మీడియా

భారతీయ విలువ



కుంభమేళాకు వెళ్లడం అద్భుతమైన అనుభవం. పాశ్చాత్య భావన ప్రకృతి కంటే మనుషులు అధికులు అంటుంది. మనం జంతువులను చంపొచ్చు, అడవులను ఇష్టారాజ్యంగా నాశనం చేయొచ్చు. కానీ భారతీయ భావన మనుషులను ప్రకృతిలో భాగంగా చూస్తుంది. గంగలో మునకవేయడం కూడా ఒక దైవిక చర్య. ప్రకృతిని అర్థం చేసుకోవాలంటే, భారతీయ ప్రాచీన వివేకాన్ని అర్థం చేసుకోవాలి.

– ఎరిక్ సోల్‌హెయిమ్, నార్వే మాజీ దౌత్యవేత్త

గర్వకారణం



ఐక్యరాజ్యసమితిలో ఉక్రెయిన్‌కు మద్దతుగా మాల్దీవులు నిలిచినందుకు గర్విస్తున్నాను. రష్యా, ఉత్తర కొరియాతో అమెరికా జట్టుకట్టడం ఆసక్తికరం. ఐరోపా దేశాలతో నిలిచే ధైర్యం, ముందుచూపు మాల్దీవులకు కలిగినందుకు సంతోషం. (ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా చర్యలను ఖండిస్తూ చేసిన ఈ తీర్మానంలో ఇండియా, చైనా ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి.)

– మహమ్మద్ నశీద్, మాల్దీవుల మాజీ అధ్యక్షుడు

తినొచ్చు కానీ...



తెల్లన్నానికి అనవసరంగా చెడ్డపేరు వచ్చింది. తెల్లన్నం ఆరోగ్యానికి హానికరం కాదు. పరిమాణంతోనే సమస్య! మధుమేహం ఉన్నవాళ్లు కూడా తక్కువ పరిమాణంలో తెల్లన్నం తినొచ్చు.

– జోయితా, ఫిజీషియన్

కఠిన సత్యం



అసౌకర్యం కలిగించే సత్యం మీద... విశ్వాసం కలిగించే భ్రమే ఎల్లవేళలా గెలుస్తుంది. ఆ పాత అబద్ధం చెదరకుండా ఉండటానికే మూక జనం ఇష్టపడుతుంది.

– పాట్రిక్ బ్రొక్‌మాన్, సోషల్ మీడియా పర్సనాలిటీ

తినేస్తుంది!



కేవలం గుర్తింపు కారణంగా ఆ యా మొత్తం బృందాలను ద్వేషించడం అనేది జనాల మెదళ్లను తింటున్న వైరస్. అది వారిని ఇంక ఏమీ మిగల్చదు.

– ఎమీ దార్, ఇజ్రాయెల్ యాక్టివిస్ట్

తిరునాళ్లలో అశ్లీలతను నివారిద్దాం!

ప్రతి ఏటా జనవరిలో గ్రామాలలో సంక్రాంతి పర్వదినానికల్లా రైతుల జేబులు డబ్బులతో నిండి ఉంటాయి. ఆ వెంటనే ఫిబ్రవరి లేదా మార్చిలో శివరాత్రి పర్వదినం పేరున పలు జిల్లాలలో ముఖ్యంగా గుంటూరు – ప్రకాశం జిల్లాలలో ఊరూరా తిరునాళ్లు (జాతర్లు) ప్రారంభమవు తాయి. ఈ సందర్భంగా అనవసరపు ఆర్భాటపు దుర్వ్యయాలకు, వికృత సినీ విష సంస్కృతికీ గ్రామీణుల సంపాదనలో విశేష భాగం కొల్లగొట్ట బడుతున్నది. ఈ దుబారా ఖర్చులకు తోడు, నీతి బాహ్య అశ్లీల, అసభ్య నృత్యాల ప్రదర్శనల వల్ల, ధూమ పానం – మద్య పానాల వల్ల సామాజిక నైతిక విలువల వటవృక్షంపై గండ్ర గొడ్డలి వేట్లు పడుతున్నాయి. తెలుగు నాట ఈ విష సంస్కృతీ విలయంపై ఒక నిరసనోద్యమం 1986–87లో ప్రారంభమై, ఇంతింతై



వటుడింతయై అన్నట్లు రెండున్నర దశాబ్దాల పాటు అప్రతిహతంగా సాగింది. చెప్పుకోదగ్గ ఫలితాలను సాధించింది.

ఉమ్మడి గుంటూరు జిల్లా కోటప్పకొండ వద్ద జరిగే తిరునాళ్లలో 'దేవుని ఎదుట దిగంబర నాట్యాలా? సిగ్గు సిగ్గు' అని ప్రశ్నిస్తూ, 'వాటిని నిషేధించండి' అని నరసరావుపేటలోని ప్రజా సంఘాలు అప్పట్లో నిరసన వ్యక్తం చేశాయి. 1987లో అప్పటి కోటప్పకొండ ఈవోకు విజ్ఞాపన చేయడంతో ఆయన తిరునాళ్లలో అశ్లీల నృత్యాలను నిషేధిస్తూ ఉత్తర్వు ఇచ్చారు. ఆ తరువాత జిల్లా కలెక్టర్‌ను కలసి విజ్ఞప్తి చేయడంతో ఆయన తిరు నాళ్ల నిర్వహణలో రెండు సూత్రాలను ప్రవేశ పెట్టారు. అవి 1. అశ్లీల నృత్యాలను నిషేధించడం, 2. సాంప్రదాయిక కళలను ప్రదర్శించే ప్రభలకు పోటీ నిర్వహించి, విజేతలను సత్కరించడం. ఫలి తంగా ప్రభల మధ్య పోటీ చరిత్రలో మొదటి సారిగా 1987లో నిర్వహించగా, పురుషోత్తమ పట్నానికి చెందిన 'గుమ్మా సోమయ్య బృందం' తమ ప్రభపై 'సత్య హరిశ్చంద్ర' నాటకాన్ని ప్రద ర్శించి ప్రథమ బహుమతిని అందుకుంది. ఈ పోటీలు తరువాతా కొనసాగాయి.

అయితే డ్యాన్స్ కళాకారుల సంఘం 1996లో డ్యాన్స్‌ల నిషేధం వల్ల తమ జీవన భృతి పోతున్న దని హైకోర్టుకు వెళ్లారు. దానికి విరుగుడుగా 'అశ్లీలతా ప్రతిఘటన వేదిక' 1998లో హైకోర్టులో రిట్ వేసింది. దీంతో గుంటూరు, ప్రకాశం జిల్లాల ఎస్పీలు అశ్లీల డ్యాన్సులపై ఉక్కు పాదం మోపి, నిషే ధాన్ని పకడ్బందీగా అమలు చేశారు. ప్రతి జిల్లా కేంద్రం లోనూ జిల్లా స్థాయి నిరోధక విభాగాన్ని ఏర్పాటు చేస్తూ దివంగత మహానేత వైయస్సార్ 731/2005 జీవోను జారీ చేశారు. నిబంధనల ప్రకారం ప్రభలపై రాజకీయ పార్టీల జెండాలు, ఫోటోలు పెట్ట కూడదు. దుర్భర ధ్వని కాలుష్యం సృష్టించ కూడదు. ఈ ఏడాది అధికారంలోకి వచ్చిన కూటమి పాలనలో విద్వేష రాజకీయ దాడులకు తోడు, పేట క్లబ్బులు, మట్కా జూదాలు, కోడి పందాలు, విచ్చలవిడి మద్యం బెల్ట్ షాపుల హవా నడుస్తోంది. ఈ నేపథ్యంలో... మళ్లీ అశ్లీల డ్యాన్సుల విష సంస్కృతి పునరావృతం అయ్యే అవకాశం పొంచి ఉంది. శివరాత్రి నుండి దాదాపు మూడు నాలుగు నెలలు ఈ తిరునాళ్ల సీజన్ ఉంటుంది గనుక రెవెన్యూ, పోలీసు, ఎక్సైజ్ అధికారులు మేల్కొని, గత మూడు దశాబ్దాలకు పైగా అమలవుతున్న ద్విముఖ సంస్కరణ పథ కాన్ని అమలుపరిచి కఠిన చర్యలు చేపట్టాలి.

– ఈదర గోపీచంద్,
అశ్లీలతా ప్రతిఘటన వేదిక అధ్యక్షుడు
(నేటి నుండి తిరునాళ్ల ప్రారంభం)

ఇకనైనా ఈ నిషేధం ఎత్తివేయాలి!

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్సిటీలలో, కళాశాలల్లో స్టూడెంట్ బాడీ ఎన్నికల నిర్వహణపై నిషేధం విధించి 36 ఏళ్ళు అవుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1988లో ఉస్మానియా విశ్వ విద్యాలయ అనుబంధ నిజాం కళాశాలలో రెండు విద్యార్థి గ్రూపుల మధ్య ఘర్షణలో ఓ విద్యార్థి హత్య గావించబడ్డాడనే నెపంతో అప్పటి పాలకులు విద్యార్థి సంఘం ఎన్నికలపై నిషేధం విధించారు.

ఎనభయ్యో దశకంలో విద్యార్థి సంఘం ఎన్నికలు విద్యార్థుల ఆలోచనలను మెరుగుపరిచి అభివృద్ధి వైపు నడిపించాయి. విద్యా సంస్థల్లో ఈ ఎన్నికల నుండి ప్రేరణ, చైతన్యం పొంది ప్రధాన స్రవంతి రాజకీయాలలోకి వచ్చిన అనేక మంది సాధారణ విద్యార్థులు నేడు భారత పార్లమెంటరీ రాజకీయ వ్యవస్థలో తమ ప్రభావాన్ని చూపుతున్నారు. మరికొంత మంది విద్యార్థులు ప్రజల ఆకాంక్షలను సఫలం చేసేందుకు భారత విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తున్నారు. నాడు క్యాంపస్‌లలో స్టూడెంట్ బాడీ ఎన్నికలలో ఎన్నికైన విద్యార్థులు విద్యా రంగ సమస్యలను పరిష్కరించడానికి ముందు వరుసలో ఉండేవారు. విద్యా



ర్థుల అకడమిక్ సమస్యలు, వసతి సమస్యలు పరిష్కారమయ్యేవి. దాంతో యూనివర్సిటీలు జ్ఞాన కేంద్రాలుగా, ఉద్యమ కేంద్రాలుగా సమాజంపై గొప్ప ప్రభావాన్ని వేశాయి. నేడు విద్యార్థి సంఘ ఎన్నికలు లేకపోవడంతో విద్యార్థుల డిమాండ్లను లేవనెత్తడం, ఆ యా యాజమాన్యాలు, ప్రభుత్వాలను సంప్రదించి పరిష్కరిం చడం సవాలుగా మారింది.


ఇటీవల కాలంలో విద్యార్థుల పోరాటాలతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాకారమైందనీ, విద్యార్థులు రాజకీయాలలోకి రావాలని తెలంగాణ ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఒకవైపు విద్యార్థి సంఘాల ఎన్నికలపై గత పాలకులు విధించిన నిషేధాన్ని కొనసాగిస్తూ... మరోవైపు విద్యార్థులు రాజకీయాలలోకి రావాలని అనడం విద్యార్థులను మోసం చేయడమే అవుతుంది. ముఖ్య మంత్రి తక్షణమే విద్యార్థి సంఘాల ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించాలి. అందుకు గతంలో జేఎమ్ లింగ్డో కమిటీ సూచనలు పాటిస్తూ విశ్వవిద్యాలయాల నిధుల సంఘం విడుదల చేసిన మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవాలి. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఆర్డరుతో 2005 డిసెంబర్ 2వ తేదీన కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ భారత మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ జేఎమ్ లింగ్డో అధ్యక్షతన ఐదుగురు సభ్యులు ఉన్న కమిటీని... యూనివర్సిటీలు, కళాశాలల్లో విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహణ అంశంపై అధ్యయనం చేసేందుకు నియమిం చింది. 2006 మే 26న కమిటీ తన నివేదికను సమర్పించింది. ఈ నివేదిక ముఖ్య ప్రతిపాదనలు:

దేశవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో విద్యా ర్థుల ప్రాతినిధ్యంతో స్టూడెంట్ బాడీ/యూనియన్ ఎన్నికలు జర పాలి. విద్యార్థి సంఘాలు ఎన్నికల నిర్వహణ కొరకు క్యాంపస్‌లలో శాంతి యుత, స్వేచ్ఛాయుత వాతావరణం నెలకొల్పాలి. నామి నేషన్ల స్వీకరణలో విద్యార్థుల అకడమిక్ ప్రతిభను పరిగ ణనలోకి తీసుకోవాలి. ఐదేళ్లకు ఒకసారి జరిగే పార్లమెంట్ ఎన్నికలను, ప్రెసి డెంట్ ఎన్నికలను నమూనా మోడల్‌గా తీసు కోవాలి. ప్రతి రెండేళ్లకు ఒకసారి విద్యార్థి సంఘం ఎన్నికలపై సమీక్ష జర గాలి. ఆఫీస్ బేరర్ల ఎన్నికలో జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ – ఢిల్లీ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఎన్నికల నిర్వహణ నమూనా పాటించాలి. విద్యార్థి సంఘం ఎన్నికలు రాజకీయ పార్టీలకు దూరంగా ఉండాలి. యూనివర్సిటీ ఎన్నికలలో పాల్గొనే విద్యార్థుల తరగతిగది హాజరు 70% ఉండాలి.

ఈ నివేదికను అమలు చేస్తూ స్టూడెంట్ బాడీ ఎన్నికలు జరపాలని 2006 సెప్టెంబర్ 22న సుప్రీంకోర్టు మరో ఆర్డరు జారీచేసింది. దాంతో, యూనివర్సిటీ నిధుల సంఘం (యూజీసీ) 2007లో దేశంలోని అన్ని యూని వర్సిటీలు, కళాశాలల్లో ఎన్ని కల నిర్వహణకై ఆదేశాలు జారీచేసింది. తదనుగుణంగా దేశంలో స్టూడెంట్ బాడీ ఎన్నికలు నిరంతరాయంగా జరుగుతున్నాయి. కానీ ఎన్నికలపై విధించిన నిషేధం కారణంగా తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో విద్యార్థి సంఘం ఎన్నికలు జరగడం లేదు. విద్యార్థులు ఇందుకోసం ఉద్యమించాలి.


– కోట ఆనంద్
విద్యార్థి నాయకుడు | 87123 52122

భక్తసులభుడు



శివతత్త్వం అతి గాఢం, గూఢం, విస్తారం, సంక్లిష్టం. తనకున్న మేధలో, తానెరిగిన ప్రమాణాలతో, ఆ తత్త్వాన్ని సమగ్రంగా గ్రహించటం సాధ్యం కాదని గ్రహించేం దుకు కూడా మానవుడి మేధ సరిపోదంటారు. కనుబొమల కదలికతోనే బ్రహ్మాం డాలను సృష్టింపజేయగల సర్వ సమర్థుడూ, సర్వవ్యాపీ, సర్వజ్ఞుడూ ఆయన. ఆ సృష్టిలో అణువంత ఈ భూగోళం, అందులో నలుసంతటివాడు మనిషి. హరికీ, విరించికీ అంతుబట్టని శివ తత్త్వం మానవమాత్రుడు గ్రహించగలననుకొంటే, అందుకు కారణం అజ్ఞానమో, అహంకారమో, అమాయకత్వమో కావాలి.

మహాదేవుడి గురించి మహామహులెందరో మథనలూ, శోధ నలూ, వాదనలూ చేశారు. ఆయన ఎవరు? ఎలా వచ్చాడు? ఆకార మేమిటి? లక్ష్యమేమిటి? ఇంతటి సృష్టి ఎలా చేశాడు? దేనితో చేశాడు? ఈ సృష్టి, స్థితి, లయలు ఎలా నిర్వహిస్తాడు? ఈ ప్రశ్నలకు సమగ్ర మైన సమాధానాలు మాత్రం సాధించలేకపోయారు. చివరికి, 'వట్టి



మాటలతో నీ గురించి ఎన్ని సిద్ధాంతాలు ఎలా చేసినా, అవి అపరి పూర్ణాలే. పరమాత్మా, జీవాత్మా, ఈ చరాచర జగత్తూ – అన్నీ నువ్వు గానే కనిపిస్తున్నావు. నువ్వు కాని తత్త్వం ఏదీ మా ఎరుకకు అందటం లేదు – '**న విద్మః తత్ తత్త్వం... యత్ త్వం న భవసి**' (శివ మహిమ్నా స్తోత్రం) అం టూ చేతులు జోడించేశారు. శివతత్త్వంలో అన్నీ వైరుధ్యాలే. ఆయన జగత్ప్రభువు, కానీ ఆదిభిక్షువు. త్రిభువన నిర్మాత, కానీ శ్మశానవాసి. ఎవరు ఏ వరం కోరినా ఇస్తాడు, కానీ తనకు మాత్రం, 'తృవ్వట బాబా, తలపై/ పువ్వట జాబిల్లి, వల్వ బూదట, చేదే బువ్వట చూడ గను, హుళక్కవ్వట...' తృవ్ అని అదిలించబడే ఎద్దు ఆయనకు 'బాబా', వాహనం. జాబిల్లి సిగపూవు. బూడిదే వలువలు. ఆయన బువ్వ చేదు విషం. ఆయనకు 'అవ్వ' – తల్లి – హుళక్కి!

ఆయనలో మరో వైరుధ్యం కూడా ఉంది. ఆయన తత్త్వం ఎవరికీ అంతు చిక్కదు, కానీ ఆయన అనుగ్రహం మాత్రం అడిగిన వారందరికీ లభిస్తుంది. సాలీడుకూ, సర్పానికీ, సామజానికీ కూడా తన సాయుజ్యం ఇచ్చిన భక్త సులభుడు సాంబశివుడు. 'చేదుకో స్వామీ!' అని చిటికెడంత చిత్తశుద్ధితో పిలిచే ఆర్తులను ఉద్ధరించకుండా ఆయన ఊరుకోలేడు. మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా మహాదేవుడికి నమో వాకాలు! ఓం నమశ్శివాయ!

– ఎం. మారుతి శాస్త్రి
(నేడు మహాశివరాత్రి పర్వదినం)

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.త్రయోదశి ఉ.9.48 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** శ్రవణం సా.4.38 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** రా.8.33 నుండి 10.05 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.52 నుండి 12.40 వరకు, **అమృతఘడియలు:** ఉ.6.16 నుండి 7.50 వరకు, తదుపరి తె.5.50 నుండి 7.24 వరకు (తెల్లవారితే గురువారం), మహాశివరాత్రి; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.25, **సూర్యాస్తమయం:** 6.01.

హైదరాబాద్ టు హాంకాంగ్

- వచ్చే నెల నుంచి నేరుగా అందుబాటులోకి విమాన సర్వీసులు
- ఆమ్‌స్టర్‌డ్యామ్, అడిస్ అబాబా, రియాద్ తదితర నగరాలకు...
- ఈ ఏడాది చివరి నాటికి పారిస్, ఆస్ట్రేలియా, హోచిమిన్‌లకు కూడా..



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నుంచి హాంకాంగ్‌కు నేరుగా విమాన సర్వీసులు వచ్చే మార్చి నుంచి అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం హాంకాంగ్‌కు వెళ్లాలంటే.. హైదరాబాద్ నుంచి సింగపూర్, కౌలాలంపూర్, బ్యాంకాక్‌ల మీదుగా రాకపోకలు సాగించేవారు. హైదరాబాద్ నుంచి ఏటేటా అంతర్జాతీయ నగరాలకు కనెక్టివిటీ పెరుగుతోంది. ఇప్పటి వరకు 20 నగరాలకు నేరుగా విమాన సర్వీసులు ఉన్నాయి. రానున్న 18 నెలల్లో దశలవారీగా మరిన్ని అంతర్జాతీయ నగరాలకు కనెక్టివిటీ ఏర్పాటు కానుంది. హాంకాంగ్‌తోపాటు అడిస్ అబాబా, ఆమ్‌స్టర్‌డామ్, రియాద్‌లకు కొత్తగా విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆయా ఎయిర్‌లైన్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు.

- ఈ ఏడాది జూన్‌లో ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ అడిస్ అబాబాకు విమానాలు నడపనుంది. సెప్టెంబర్‌లో ఆమ్‌స్టర్‌డ్యామ్‌కు సర్వీసులు అందుబాటులోకి వస్తాయి. రియాద్‌కు కూడా త్వరలోనే సర్వీసులను ప్రవేశపెట్టనున్నట్టు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు డిసెంబర్ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి మరిన్ని నగరాలకు సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్ నుంచి పారిస్, ఆస్ట్రేలియా, హోచిమిన్ సిటీ, హనోయ్, క్రాబీ, కఠ్మాండు, మదీనా నగరాలకు కొత్తగా విమానాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, పలు విమానయాన సంస్థలతో చర్చలు జరుగుతున్నాయని ఎయిర్‌పోర్ట్ సీఈఓ ప్రదీప్ ఫణికర్ స్పష్టం చేశారు.
- హైదరాబాద్ విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 2019–20 సంవత్సరంలో 32 లక్షల మంది విదేశాలకు రాకపోకలు సాగించగా, 2023–24 నాటికి ఈ సంఖ్య 42 లక్షలకు పెరిగింది.

మూడు రంగులే కాదు.. పీఎంఏవై లోగో ఉండాల్సిందే

సాక్షి, హైదరాబాద్: ఇంటి పైభాగంలో మూడురంగుల చారలు కనిపించగానే అది ఇందిరమ్మ ఇల్లు అని ఠక్కున చెప్పేయొచ్చు. నిరుపేదలకు ఇందిరమ్మ పేరుతో ఇచ్చిన ఇల్లు అని స్ఫురించేలా ప్రముఖంగా ఆ రంగులు అద్దాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా ఆదేశించింది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా రంగంలోకి దిగింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన నిధులతో నిర్మించిన ఇళ్లపై కచ్చితంగా ఆ పథకం లోగో ముద్రించాలని ఆదేశించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్లకు మూడు రంగుల విషయంలో నాటి ప్రభుత్వం అంత పట్టుదలగా వ్యవహరించలేదు. దీంతో కొన్ని ఇళ్లకు మూడు రంగులతో కూడిన చారలను నామమాత్రంగా ఏర్పాటు చేశారు. కొన్నింటికి వాటి ఊసే కనిపించలేదు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మూడు రంగులు ముద్రించటాన్ని తప్పనిసరి చేసింది. దీంతో ఇంటి యజమానుల ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా కచ్చితంగా మూడు రంగులు ముద్రించాల్సి ఉంటుంది. ప్రభుత్వం కొన్ని మండలాల్లో నిర్మించి నమూనా ఇళ్లపై ఆ రంగులను ముద్రించింది. ఇళ్లు ఏ డిజైన్‌లో నిర్మించినా సరే.. పైభాగంలో మాత్రం మూడు రంగులు ఉండాలి. దీనిని దృష్టిలో ఉంచుకొని కేంద్రమంత్రి బండి సంజయ్ ఇటీవల కొన్ని వ్యాఖ్యలు చేశారు. ఆ పథకానికి ఇందిరమ్మ పేరు పెట్టడంపై కూడా ప్రశ్నించారు. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం కొన్ని సూచనలు చేసింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన నిధులతో చేపట్టిన ఇళ్లపై కచ్చితంగా ఆ పథకం లోగోను ముద్రించాలని పేర్కొన్నట్టు తెలిసింది. ప్రతి ఇంటిపై ఆ లోగోను ముద్రించటం సాధ్యం కాదని, కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఇళ్లకు సాయం చేస్తుందో, అన్ని ఇళ్లకు ఈ లోగో ఉండాల్సిందేనని స్పష్టం చేసినట్టు తెలిసింది.

సిరిసిల్ల కలెక్టర్‌పై చర్యలు తీసుకోండి

సీఎస్‌ను కోరిన బీఆర్ఎస్

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సంజయ్ కుమార్ ఝాపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు వివేకానంద, సంజయ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. అనంతరం తెలంగాణ సచివాలయ మీడియా పాయింట్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే కేటీఆర్ నియోజకవర్గంలో ప్రజలను, చిరు వ్యాపారులను కలెక్టర్ ఇబ్బందులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. విపక్ష నేతలు, వారి మద్దతుదారులు, బీఆర్ఎస్‌తో అనుబంధం ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని కలెక్టర్ తన పదవిని దుర్వినియోగం చేశారని విమర్శించారు. చిన్న వ్యాపారి టీ స్టాల్‌ను అన్యాయంగా కూల్చివేయడం, ట్రేడ్ లైసెన్స్ లేదని పాల కేంద్రాన్ని సీజ్ చేయడం, నిత్యావసర సేవలకు అడ్డుతగలడం, వ్యక్తులను అన్యాయంగా అరెస్టు చేయడం వంటి చర్యలకు పాల్పడ్డారని వివరించారు. కలెక్టర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆందోళన చేస్తుందని వారు హెచ్చరించారు.

కేటీఆర్ ఆగ్రహం: రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న సిరిసిల్ల కలెక్టర్ సంజయ్ కుమార్ ఝాపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమాయక ప్రజలపై కలెక్టర్ అక్రమ కేసులు బనాయిస్తున్నారని, రైతులు, సామాన్య ప్రజలపై ఆయన దౌర్జన్యాలు సరికాదని మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

28న టీపీసీసీ కార్యవర్గ సమావేశం

- హాజరుకానున్న పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి, సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 28వ తేదీన టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరగనుంది. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు గాంధీభవన్‌లో జరిగే ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ హాజరుకానున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శులు విష్ణునాథ్, విశ్వనాథన్‌తోపాటు పీసీసీ పీఏసీ, పీఈసీ సభ్యులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాలు, కార్పొరేషన్ల చైర్మన్‌లు, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, అధికార ప్రతినిధులు, సీనియర్ నాయకులు హాజరవుతారని మంగళవారం గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. జాతీయ, రాష్ట్ర రాజకీయాలు, పార్టీ సంస్థాగత అంశాలపై చర్చ ఉంటుందని వెల్లడించాయి.

ఆరు నెలలుగా జీతాల్లేవు

- కాంట్రాక్టు ఉద్యోగుల ఆవేదన

సాక్షి, హైదరాబాద్: అధికారుల అలసత్వమో, ఉద్యోగుల దురదృష్టమో స్వచ్ఛ భారత్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు ఆరు నెలలుగా జీతాల్లేక అలమటిస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులుగా పని చేస్తున్న 67 మంది గత ఏడాది ఆగస్టు నుంచి జీతాల్లేక పూట గడవని స్థితిలో ఉన్నారు. దీనిపై అనేకసార్లు కమిషనర్, మంత్రి సీతక్కకు విన్నవించినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమకు జీతాలు చెల్లించాలని మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా దిశగా..

ఎన్పీడీసీఎల్‌లో 'జియో ట్యాగింగ్' ప్రయోగం

ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో జూన్ నుంచి అమలయ్యేలా చర్యలు

దాదాపుగా పూర్తయిన నంబరింగ్.. యుద్ధ ప్రాతిపదికన మ్యాపింగ్ పనులు

సాక్షిప్రతినిధి, వరంగల్: సాంకేతిక సమస్యలను క్షణాల్లో అధిగమించి..నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేసేందుకు తెలంగాణ ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్) జియో ట్యాగింగ్ విధానాన్ని ప్రవేశపెడుతోంది. ఇందుకోసం ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నిజామా బాద్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో చేపట్టిన విద్యుత్ ఫీడర్‌లు, సబ్‌స్టేషన్‌లు, విద్యుత్ స్తంభాల నంబర్లు, మ్యాపింగ్ ప్రక్రియ తుది దశకు చేరింది. విద్యుత్ స్తంభాలకు జియో ట్యాగింగ్ ఇచ్చేందుకు ప్రత్యేక రంగులతో నంబర్లు వేస్తున్నారు. 33 కేవీ స్తంభానికి పసుపు రంగు, 11 కేవీ స్తంభానికి నలుపు రంగుతో ఈ నంబర్లు ఇస్తున్నారు. ఇది పూర్తయ్యాక జియో ట్యాగింగ్‌కు అనుసంధానం చేస్తారు. ఈ ప్రక్రియ జూన్‌లో ప్రారంభిస్తామని ఆ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఐదు జిల్లాల్లో ఐదు లక్షలకు పైగా విద్యుత్‌స్తంభాలకు జియో ట్యాగింగ్ పూర్తి దశకు చేరినట్టు అధికారవర్గాల సమాచారం. స్తంభాలకు ఇస్తున్న నంబరింగ్ పూర్తయ్యాక జియో ట్యాగింగ్‌కు అనుసంధానం చేస్తారు.

జియో ట్యాగింగ్‌తో ఇవీ ప్రయోజనాలు

విద్యుత్ ఉత్పత్తి నుంచి వినియోగం వరకు చాలా రకాల సమస్యలు ఉంటాయి. ప్రమాదాలు జరిగినప్పుడు, వర్షాలు కురిసినప్పుడు అంతరాయాలు ఎదురవుతాయి. ప్రకృతి విపత్తులో కరెంట్ అంతరాయం, ప్రమాదాలు జరిగినప్పు డు, గాలి దుమారానికి, పిడుగు పడినప్పుడు కరెంట్ స్తంభాలు విరగడం, విద్యుత్ వైర్లు తెగిపోవడం, ఫ్యూజులు పోవడం లాంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. దీంతో గంటలపాటు కరెంట్ సరఫరా నిలిచిపోతుంది. విద్యుత్ అంతరాయానికి కారణం ఏంటి.. సమస్య ఎక్కడొచ్చింది? అన్నది తెలుసుకోవడం సిబ్బందికి తలనొప్పి వ్యవహారమే.

- సాధారణంగా ఒకలైన్‌లో విద్యుత్ అంతరాయం వస్తే దాని పరిధిలోని మిగతా లైన్లకు కరెంట్ సరఫరా నిలిపివేస్తారు. కానీ జియో ట్యాగింగ్ చేస్తే సమస్య ఉన్న లైన్‌కు మాత్రం కరెంట్ సరఫరా ఆగిపోతుందని అధికారులు చెబుతున్నారు.
- జియో ట్యాగింగ్ ద్వారా విద్యుత్ అధికారులు, సిబ్బంది సెల్‌ఫోన్‌లకు మెస్సేజ్‌ల ద్వారా సమాచారం వస్తుంది. దీంతో విద్యుత్ లైన్‌లలో ఎక్కడ సమస్య తలెత్తిన ఆ ప్రాంతాన్ని సులువుగా గుర్తించి పరిష్కరించొచ్చని అధికారులు చెప్పారు.

టీజీ ఎన్పీడీసీఎల్‌లో నంబరింగ్, మ్యాపింగ్ వివరాలు ఇలా..

మొత్తం 33 కేవీ ఫీడర్ల సంఖ్య :	693
నంబరింగ్ పూర్తయినవి :	669
33 కేవీ సబ్‌స్టేషన్‌ల సంఖ్య :	1,502
నంబరింగ్ పూర్తయినవి :	1,476
11 కేవీ ఫీడర్ల సంఖ్య :	6,751
నంబరింగ్ పూర్తయినవి :	4,069



హనుమకొండ జిల్లా వేలేరులో విద్యుత్ స్తంభాలకు వేసిన నంబర్లు

జూన్ మాసాంతం వరకు పూర్తి

పోల్ నంబరింగ్, మ్యాపింగ్ ప్రక్రియ జూన్‌కు పూర్తవుతుంది. యాసంగి పంటలు చేతికి రాగానే మిగిలిపోయిన స్తంభా లకు నంబరింగ్, జియో ట్యాగింగ్ పూర్తి చేస్తాం. జియో ట్యాగింగ్ (మ్యాపింగ్) ద్వారా రైతులు, విద్యుత్ వినియోగదారులకు సరఫరాలో ఏదైనా సమస్య తలెత్తితే విద్యుత్ అధికారులకు, సిబ్బందికి పోల్‌పై నంబర్‌తో సహా సమాచారం అందిస్తే సిబ్బంది మ్యాపింగ్ ద్వారా సులువుగా, త్వరగా చేరుకుంటారు. సమస్య త్వరితగతిన పరిష్కారమవుతుంది. కొత్త లైన్లు వేయాల్సి వస్తే సులభంగా ప్రణాళిక రూపొందించొచ్చు. సత్వర సేవలకు ఈ విధానం ఎంతగానో దోహదపడుతోంది.

– కర్నాటి వరుణ్‌రెడ్డి, సీఎండీ,టీజీఎన్పీడీసీఎల్

హైపర్‌లూప్ టెస్టు ట్రాక్ సిద్ధం

- 422 మీటర్ల ట్రాక్‌ను ఆవిష్కరించిన ఐఐటీ–మద్రాసు
- సహకారం అందించిన రైల్వేశాఖ, ప్రైవేట్ సంస్థలు
- కొత్త టెక్నాలజీతో గంటకు వెయ్యి కిలోమీటర్ల ప్రయాణం

న్యూఢిల్లీ: దేశంలో రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి. గంటకు వెయ్యి కిలోమీటర్లు ప్రయాణించేలా అత్యాధునిక టెక్నాలజీ పట్టాలెక్కబోతోంది. దేశంలోనే మొట్టమొదటిసారిగా హైపర్‌లూప్ టెస్టు ట్రాక్‌ను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)–మద్రాసు అభివృద్ధి చేసింది. 422 మీటర్ల టెస్టు ట్రాక్‌ను ఆవిష్కరించింది. భారత రైల్వే శాఖ సహకారంతో దీన్ని రూపొందించింది. హై–స్పీడ్ రవాణా విషయంలో నూతన శకంలోకి అడుగుపెట్టాలన్న లక్ష్యంతో ఈ హైపర్‌లూప్ టెస్టు ట్రాక్‌ను ఆవిష్కరించారు. తక్కువ పీడనం కలిగిన ట్యూబ్‌లో ప్రయాణికులు అత్యధిక వేగంతో ప్రయాణించవచ్చు. గంట సేపట్లోనే వెయ్యి కిలోమీటర్ల దూరాన్ని అధిగమించవచ్చు. ఈ సాంకేతిక వ్యవస్థ పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే రాజస్తాన్ రాజధాని జైపూర్ నుంచి దేశ రాజధాని ఢిల్లీకి కేవలం అరగంటలో చేరుకోవచ్చు. దీని వేగం ఎలాంటిదో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. హైపర్‌లూప్ టెస్టు ట్రాక్ అభివృద్ధికి లార్సెన్ అండ్ టూబ్రో కన్‌స్ట్రక్షన్, అర్సెలార్ మిట్టల్, హిండాల్కో ఇండస్ట్రీస్ వంటి ప్రఖ్యాత కంపెనీలు సహకారం అందించాయి. హైపర్‌లూప్ టెస్టు ట్రాక్ సిద్ధమైనట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. భవిష్యత్తు ప్రయాణ సాధనాల్లో ఇదొక నూతన సృజన అని వివరించారు. తమిళనాడు రాజధాని చెన్నై, కర్ణాటక రాజధాని బెంగళూరు మధ్య హైపర్‌లూప్ కారిడార్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. రెండు నగరాల మధ్య దూరం 350 కిలోమీటర్లు. కేవలం 15 నిమిషాల్లో చేరుకోవచ్చు. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలను అనుసంధానిస్తూ కారిడార్లను నెలకొల్పాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి ఉన్నట్లు తెలుస్తోంది. దీనిద్వారా అనుసంధానం పెరగడం, ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడమే కాకుండా, అత్యాధునిక రవాణా సాధనాల విషయంలో అంతర్జాతీయంగా భారతదేశ ప్రతిష్ట మరింత పెరగడం ఖాయం.




ఏమిటీ హైపర్ లూప్?

సాధారణంగా రైలంటే పట్టాలపై పరుగులు తీస్తుందని తెలుసు. కానీ. ప్రత్యేకంగా రూపొందించిన ట్యూబ్‌లో రైలు లాంటి క్యాప్సూల్‌ను నడిపించడమే హైపర్‌లూప్ ప్రాజెక్టు. ఈ క్యాప్సూల్‌లో ప్రయాణికులు ఉంటారు. హైపర్‌లూప్‌లో రైలు గంటకు 600 కిలోమీటర్ల నుంచి 1,200 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది.

సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో

సజ్జన్‌కు జీవిత ఖైదు

- శిక్ష ఖరారు చేసిన ఢిల్లీ కోర్టు
- రూ.2.4 లక్షల జరిమానా
- వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా మరణశిక్ష విధించలేదన్న కోర్టు



న్యూఢిల్లీ: మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ హత్యోదంతం తర్వాతి రోజు ఢిల్లీలో చెలరేగిన సిక్కు వ్యతిరేక అల్లర్లలో తండ్రీకొడుకులను సజీవ దహనం చేసిన కేసులో దోషిగా తేలిన కాంగ్రెస్ మాజీ పార్లమెంట్ సభ్యుడు సజ్జన్ కుమార్‌కు జీవితఖైదు విధిస్తూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. మరణశిక్ష విధించాల్సిన ఈ కేసులో దోషి వృద్ధాప్యం, అనారోగ్య కారణాలను దృష్టిలో ఉంచుకుని శిక్ష తగ్గించి జీవితఖైదు విధిస్తున్నట్లు ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా తన తీర్పులో పేర్కొన్నారు. శిక్షతోపాటు దాదాపు రూ.2.4 లక్షల జరిమానా విధించారు. '' సజ్జన్ చేసిన నేరాలు నిస్సందేహంగా అత్యంత కర్కశమైనవే. ఈ నేరాలకు అత్యంత కఠినంగా శిక్షించాల్సిందే. కానీ వయసు 80ఏళ్లకు పైబడటం , తీవ్ర అనారోగ్య సమస్యల వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని మరణదండనకు బదులు యావజ్జీవ కారాగారశిక్ష విధిస్తున్నా. 2018 డిసెంబర్ 17న ఢిల్లీ హైకోర్టు జీవితఖైదు విధించడానికి కారణమైన కేసు లాంటిదే ఈ కేసు కూడా. అందుకే ఈ కేసును అత్యంత అరుదైన కేసుల్లో అరుదైనదిగా పరిగణించట్లేను'' అని జడ్జి కావేరి వ్యాఖ్యానించారు. గత ఏడాది నవంబర్ 8వ తేదీనే ఈ కేసుపై వాదోపవాదనలు విన్న జడ్జి ఆనాడు తీర్పును రిజర్వ్‌లో ఉంచి ఈనెల 12వ తేదీన సజ్జన్‌ను దోషిగా తేలుస్తూ తీర్పుచెప్పారు. కానీ ఆరోజు శిక్షను ఖరారుచేయలేదు. మంగళవారం శిక్షను ఖరారుచేస్తూ తీర్పు వెలువర్చారు.

తండ్రీకొడుకుల సజీవదహనం

1984 నవంబర్ ఒకటో తేదీన పశ్చిమ ఢిల్లీలోని సరస్వతీ విహార్ ప్రాంతంలో జస్వంత్ సింగ్, ఆయన కుమారుడు తరుణ్‌దీప్ సింగ్‌లను వాళ్ల ఇంట్లోనే సజ్జన్ సారథ్యంలోని ఒక అల్లరి మూక సజీవ దహనం చేసిందని కేసు నమోదైంది. బాధితుల ఇంటిని లూటీచేసి, తర్వాత ధ్వంసంచేసి తగలబెట్టారని ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ దాడిలో జస్వంత్ భార్యసహా కుటుంబసభ్యులు, బంధువులు తీవ్రంగా గాయపడ్డారు. 1991లో పంజాబీ బాగ్ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదుకాగా తర్వాత జస్టిస్ జీపీ మాథుర్ కమిటీ సిఫార్సుల మేరకు 2015 ఫిబ్రవరిలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈ కేసును దర్యాప్తుచేసింది. ఈ కేసులో సజ్జన్‌ను నిందితునిగా పేర్కొంటూ నేరాభియోగాలను సమర్పించింది. ఈ కేసులో 2021 ఏప్రిల్ ఆరోతేదీన సజ్జన్‌ను అరెస్ట్‌చేశారు. అయితే సజ్జన్ ఇప్పటికే ఢిల్లీ కన్నాట్‌లో ఆనాడు సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించిన మరో కేసులో దోషిగా తేలి యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్నారు. 1984 అక్టోబర్ 31న ఇందిరాగాంధీ హత్యోదంతం తర్వాత జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్లలో నిర్ధారణ కావడంతో ఈ అంశంపై నిజానిజాలను నిగ్గుతేల్చేందుకు జస్టిస్ జీటీ నానావతి కమిషన్ ఏర్పాటైంది. అల్లర్లలో ఒక్క ఢిల్లీలోనే ఆనాడు 587 ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిల్లో 240 కేసుల్లో ఎలాంటి ఆధారాలు లభించలేదు. 250 కేసుల్లో సరైన ఆధారాలే లేక నాటి నిందితులను నిర్దోషులుగా వదిలేశారు. కేవలం 28 కేసుల్లోనే దాదాపు 400 మందిపై నేరాభియోగాలు రుజువయ్యాయి. వారిలో సజ్జన్‌సహా 50 మందికి హత్య సంబంధ సెక్షన్ల కింద శిక్షలు పడ్డాయి. సిక్కు వ్యతిరేక అల్లర్లలో 2,733 మంది మరణించారు.

కేసు మొదలైంది ఇలా..

- 1991: ఇల్లు లూటీ, ధ్వంసం, ఇద్దరి హత్య కేసులో కేసు నమోదు
- 1994 జూలై 8: సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా విచారణ చేపట్టలేమన్న ఢిల్లీ కోర్టు. చార్జ్‌షీట్‌లో సజ్జన్ పేరు చేర్చని వైనం
- 2015 ఫిబ్రవరి 12: ఈ కేసును సమగ్ర స్థాయిలో దర్యాప్తుచేసేందుకు సిట్ ఏర్పాటు
- 2016 నవంబర్ 21: విస్తృతస్థాయి దర్యాప్తు అవసరమని కోర్టుకు నివేదించిన సిట్
- 2021 ఏప్రిల్ 6: సజ్జన్ అరెస్ట్
- 2021 మే 5: తొలిసారిగా చార్జ్‌షీట్‌ను సమర్పించిన పోలీసులు
- 2021 జూలై 26: చార్జ్‌షీట్‌లోని అంశాలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు
- 2021 అక్టోబర్ 1: కోర్టులో మొదలైన వాదోపవాదనలు
- 2021 డిసెంబర్ 16: హత్య, లూటీ, దాడి నేరాలపై సెక్షన్లను జోడించిన పోలీసులు
- 2024 జనవరి 31: తుది వాదనలను విన్న కోర్టు
- 2024 నవంబర్ 8: తీర్పును రిజర్వ్‌లో ఉంచిన కోర్టు
- 2025 ఫిబ్రవరి 12: సజ్జన్‌ను దోషిగా తేల్చిన కోర్టు
- 2024 ఫిబ్రవరి 25 : సజ్జన్‌కు జీవితఖైదు విధిస్తూ తీర్పు వెలువరించిన కోర్టు

సీబీఎస్ఈ బోర్డు పరీక్ష..

ఇకపై ఏడాదిలో రెండు సార్లు

న్యూఢిల్లీ: 2026 నుంచి ఏడాదిలో రెండుసార్లు పదో తరగతి బోర్డు పరీక్షలను నిర్వహించాలన్న ప్రతిపాదనకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ)ఆమోదం తెలిపింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే ఆన్‌లైన్‌లో ఉంచనుంది. దీనిపై మార్చి 9వ తేదీ వరకు సంబంధిత వర్గాలు తమ అభిప్రాయాలు, సూచనలు సలహాలను అందివ్వవచ్చని అధికారులు వివరించారు. అనంతరం ఈ విధానం ఆమోదం పొందుతుందని తెలిపారు. ప్రతిపాదలను అనుసరించి..పదో తరగతి మొదటి దశ పరీక్షలు ఏటా ఫిబ్రవరి 17 నుంచి మార్చి 6వ తేదీ వరకు, రెండో దశ పరీక్షలు మే 5 నుంచి 20వ తేదీల మధ్య జరగనున్నాయి. 'రెండు దశల పరీక్షల్లోనూ సిలబస్ పూర్తి స్థాయిలో ఉంటుంది. అభ్యర్థులు రెండు దశల్లోనూ ఒకే కేంద్రంలో పరీక్ష రాస్తారు. దరఖాస్తు సమయంలో రెండింటికి కలిపి ఫీజును చెల్లించాలి. ఇవి సప్లిమెంటరీ పరీక్షలుగా కూడా ఉంటాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ వేరుగా ప్రత్యేకంగా పరీక్షలను నిర్వహించబోం'అని అధికారులు వివరించారు. సీబీఎస్ఈ బోర్డు పరీక్షలంటే ప్రజల్లో నెలకొన్న తీవ్రమైన ఉత్కంఠను తొలగించాలన్న నూతన విద్యా విధానాన్ని అనుసరించి ఈ విధానాన్ని ప్రతిపాదించినట్లు సీబీఎస్ఈ వర్గాలు తెలిపాయి.

అస్సాంలో నూతన శకం

డబుల్ ఇంజన్ ప్రభుత్వంతో శరవేగంగా అభివృద్ధి



- ఆర్థిక వ్యవస్థ రూ.6 లక్షల కోట్లకు చేరింది
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం
- 'అడ్వాంటేజ్ అస్సాం 2.0' సదస్సు ప్రారంభం

గౌహతి: ఈశాన్య ప్రాంతంలోని పవిత్ర భూమి అస్సాంలో నూతన శకం ఆరంభమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. దేశ అభివృద్ధి, సౌభాగ్యంలో ఈశాన్య భారతదేశం కీలక పాత్ర పోషించిందని ఉద్ఘాటించారు. 'వికసిత్ భారత్' దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఈ లక్ష్య సాధనకు ఈశాన్య రాష్ట్రాలు పూర్తి శక్తిసామర్థ్యాలు ప్రదర్శించబోతున్నాయని పేర్కొన్నారు. అస్సాం రాజధాని గౌహతిలో మంగళవారం 'అడ్వాంటేజ్ అస్సాం 2.0' పేరిట పెట్టుబడులు, మౌలిక సదుపాయాల సదస్సును మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అస్సాంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ రెండు రెట్లు వృద్ధి చెంది, రూ.6 లక్షల కోట్లకు చేరుకుందని హర్షం వ్యక్తం చేశారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం, డబుల్ ఇంజన్ వేగం వల్ల వచ్చే ఫలితాలేమిటో ప్రత్యక్షంగా చూస్తున్నామని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా అస్థిర పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఇండియా ఆర్థిక వ్యవస్థ వేగంగా పరుగులు తీస్తోందని, ఆర్థిక నిపుణులు సైతం ఈ విషయాన్ని ఏకగ్రీవంగా అంగీకరిస్తున్నారని తెలిపారు. ఈ శతాబ్దంలో రాబోయే 25 ఏళ్ల ప్రగతి కోసం సుదీర్ఘ దార్శనికతతో పని చేస్తున్నామని చెప్పారు. నైపుణ్యాలు, నవీన ఆవిష్కరణల్లో ముందంజలో ఉన్న మన యువతపై ప్రపంచ దేశాలు ఎనలేని విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయని వెల్లడించారు. స్థానిక సప్లై చైన్లను బలోపేతం చేశామని, ప్రపంచ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నామని గుర్తుచేశారు. తూర్పు ఆసియాతో మనకు బలమైన అనుసంధానం ఉందని, ఇండియా–మిడిల్ ఈస్ట్–యూరప్ ఎకనామిక్ కారిడార్‌తో నూతన అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు.

సెమీకండక్టర్ల తయారీలో ముందంజ

సెమీకండక్టర్ల తయారీ రంగంలో మన దేశం ముందుకు దూసుకెళ్తుండడం శుభ పరిణామం అని ప్రధానమంత్రి తెలిపారు. సెమీకండక్టర్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ రంగంలో మరిన్ని ఆవిష్కరణల కోసం ఐఐటీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. మన దేశంలో ఎలక్ట్రానిక్స్ రంగం విలువ ఈ దశాబ్దం ఆఖరు నాటికి 500 బిలియన్ డాలర్లకు(రూ.43.59 లక్షల కోట్లు) చేరనుందని ఆశాభావం వ్యక్తంచేశారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని 2030 నాటికి మరో 500 గిగావాట్లు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. 2030 నాటికి వార్షిక గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిని 5 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేర్చాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని చెప్పారు.

అన్ని రంగాల్లో సంస్కరణలు

ఆర్థిక వ్యవస్థకు ఉత్ప్రేరకంగా నిలిచేలా నేడు అన్ని రంగాల్లో సంస్కరణలు ప్రారంభమయ్యాయని ప్రధానమంత్రి చెప్పారు. సులభతర వాణిజ్యాన్ని(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) మరింత ప్రోత్సహించడానికి చర్యలు చేపట్టామని అన్నారు. పారిశ్రామికీకరణ, నూతన ఆవిష్కరణల సంస్కృతికి ఊతం ఇవ్వడానికి ప్రభుత్వ ఆధ్వర్యంలో సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. స్టార్టప్‌లు, తయారీ రంగ పరిశ్రమలు, సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి కోసం అద్భుతమైన విధానాలు ప్రవేశపెట్టామని తెలియజేశారు. సంస్థాగత సంస్కరణలు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, నూతన ఆవిష్కరణలన్నీ కలిసి మన దేశాభ్యుదయానికి బలమైన పునాదిగా నిలుస్తాయని ప్రధానమంత్రి తేల్చిచెప్పారు.

పుతిన్ నియంత కాదు: ట్రంప్

ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌తో భేటీ అయిన అమెరికా అధ్యక్షుడు

- రష్యా–ఉక్రెయిన్ యుద్ధం త్వరలోనే ముగుస్తుందని ప్రకటన
- ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని పణంగా పెట్టొద్దన్న మాక్రాన్

వాషింగ్టన్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను 'నియంత' అని పిలవడానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిరాకరించారు. ఓవల్ ఆఫీస్‌లో జరిగిన మీడియా సమావేశంలో 'పుతిన్‌ను నియంతగా భావిస్తున్నారా' అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన పై సమాధానమిచ్చారు. తాను ఆ పదాలను అంత తేలికగా ఉపయోగించనని స్పష్టం చేశారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో భేటీ అనంతరం సోమవారం సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ తెలివిగా వ్యవహరిస్తే ఉక్రెయిన్‌లో యుద్ధం తొందరగా ముగిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ''మనం స్మార్ట్ కాకపోతే అది కొనసాగుతూనే ఉంటుంది. లేదంటే ఇది మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుంది'' అని వ్యాఖ్యానించారు. శాంతి ఒప్పందంలో భాగంగా ఉక్రెయిన్ భూభాగాన్ని రష్యాకు అప్పగించాల్సి ఉంటుందా అనేది కీలక చర్చనీయాంశమైంది. దీనిపై ట్రంప్‌ను ప్రశ్నించగా.. ''సంప్రదింపులు ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి. అయితే.. రష్యా ఆక్రమించిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడం అంత తేలికైన విషయం కాదు. అమెరికా, ఉక్రెయిన్ మధ్య ఖనిజాల ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉంది. ఈ ఒప్పందం సంతకం చేయడానికి త్వరలోనే జెలెన్‌స్కీ అమెరికా వస్తారని ఆశిస్తున్నా'' అని ట్రంప్ పేర్కొన్నారు. ఏరోస్పేస్, వైద్య, సాంకేతిక పరిశ్రమలలో ఉపయోగించే కీలకమైన ఖనిజాలు ఉక్రెయిన్‌లో ఉన్నాయి. అయితే.. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి కీవ్‌కు అందించిన 180 బిలియన్ డాలర్ల అమెరికన్ సహాయంలో కొంత భాగాన్ని భర్తీ చేయడానికి ఖనిజాలపై ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉంది. మరోవైపు రష్యా–ఉక్రెయిన్ శాంతి చర్చల అనంతరం పుతిన్‌ను కలుస్తానని ట్రంప్ తెలిపారు. శాంతి ఒప్పందానికి పుతిన్ అంగీకరిస్తారని, అతను మరింత యుద్ధాన్ని కోరుకోవడం లేదని ట్రంప్ చెప్పుకొచ్చారు.

శాంతి అంటే ఉక్రెయిన్ లొంగిపోవడం కాదు: మాక్రాన్

అయితే.. ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని పణంగా పెట్టి ఏ శాంతి ఒప్పందం జరగకూడదని మాక్రాన్ స్పష్టం చేశారు. ఏ శాంతి ఒప్పందంలోనైనా భద్రతా హామీలు ఉండాలని, శాంతి అంటే ఉక్రెయిన్ లొంగిపోవడం కాదని మాక్రాన్ హెచ్చరించారు. ఒప్పందం కుదిరితే ఉక్రెయిన్‌కు శాంతి పరిరక్షక దళాలను పంపే ప్రతిపాదనపై బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో కలిసి పనిచేస్తామని మాక్రాన్ తెలిపారు. సుస్థిరత్వాన్ని ఏర్పరచడానికి యూరప్ సిద్ధంగా ఉందని, ఆ శాశ్వత శాంతిని సాధించడానికి బలమైన అమెరికా జోక్యం అవసరమని మాక్రాన్ నొక్కి చెప్పారు. అట్లాంటిక్ విభేదాలున్నప్పటికీ అమెరికా అధ్యక్షుడితో చర్చలు ముందుకు సాగాయని మాక్రాన్ నొక్కి చెప్పారు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక కొత్త దౌత్య అవకాశం లభించిందన్నారు.



వైట్‌హౌస్ ఓవల్ ఆఫీసులో నవ్వులు చిందిస్తున్న మాక్రాన్, ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్

యూరప్ భాగస్వామ్యం

అవసరం

ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపుపై పుతిన్

మాస్కో: రష్యా–అమెరికా–ఉక్రెయిన్ చర్చల్లో యూరప్ భాగస్వామ్యాన్ని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్వాగతించారు. ఉక్రెయిన్‌లో వివాదాన్ని పరిష్కరించడానికి ఉద్దేశించిన రష్యా–అమెరికా శాంతి చర్చల్లో ఐరోపా ప్రమేయాన్ని తాము వ్యతిరేకించడం లేదని పుతిన్ సోమవారం చెప్పారు. రియాద్‌లో జరిగిన చర్చలపై యూరప్ వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు భావోద్వేగంతో కూడుకున్నవని, ఎలాంటి లాజిక్ లేనివన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా–ఉక్రెయిన్ వివాదాన్ని హేతుబద్ధంగా చూస్తున్నారని స్పష్టం చేశారు. రష్యా ప్రభుత్వ టెలివిజన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పుతిన్ మాట్లాడుతూ... మూడేళ్లుగా కొనసాగుతున్న వివాదానికి పరిష్కారం కోసం జరిగే చర్చల్లో యూరప్ భాగస్వామ్యం సహేతుకమన్నారు.



తామెప్పుడూ యూరప్‌ను తిరస్కరించలేదని, నిరంతరం చర్చలు జరిపామని చెప్పారు. రష్యాకు ఓటమి తప్పదనే భావనలో తమతో సంప్రదింపులు జరిపేందుకు వారే నిరాకరించారని గుర్తు చేశారు. ఉక్రెయిన్‌పై అమెరికా విధానంలో మార్పు ట్రంప్ భావోద్వేగంపై ఆధారపడి ఉందనే అభిప్రాయాన్ని పుతిన్ తోసిపుచ్చారు. ట్రంప్ తార్కికంగా, స్వేచ్ఛగా వ్యవహరిస్తున్నారన్నారని, తను అనుకున్నది, తనకు కావాల్సినది చెబుతున్నారని వివరించారు. ఉక్రెయిన్ వివాదంపై రష్యా, అమెరికాలు గత వారం సౌదీ అరేబియాలోని రియాద్‌లో చర్చలు జరిపాయి. అయితే ఈ చర్చలకు ఉక్రెయిన్‌ను, యూరోపియన్ మిత్రదేశాలను ఆహ్వానించలేదు. దీంతో ఇరు పక్షాలు అభ్యంతరాలను వ్యక్తం చేశాయి.

రష్యాకు బాసటగా అమెరికా

- యుద్ధంలో రష్యా తప్పులేదన్నట్లు ప్రవర్తించిన అమెరికా
- ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా ఓటేసిన ట్రంప్ సర్కార్
- ఐక్యరాజ్యసమితి సాక్షిగా అగ్రరాజ్యం ద్వంద్వ వైఖరి

ఐక్యరాజ్య సమితి: బైడెన్ సారథ్యంలోని అమెరికా ప్రభుత్వం గత మూడేళ్లుగా యుద్ధంలో ఉక్రెయిన్‌కు అన్నిరకాల సాయం చేస్తే తాజాగా ట్రంప్ సర్కార్ అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్న ఉదంతం ఐక్యరాజ్యసమితి సాక్షిగా తొలిసారిగా బహిర్గతమైంది. ఉక్రెయిన్ యుద్ధం అంశంలో రష్యాను దురాక్రమణదారుగా పేర్కొంటూ యూరప్ దేశాలు చేసిన ఒక తీర్మానానికి ఎన్నో దేశాలు మద్దతు పలికితే అమెరికా వ్యతిరేకంగా ఓటేసి అందర్నీ ఆశ్చర్యపరిచింది. యుద్ధం మొదలుకావడానికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మొండివైఖరే కారణమని పదేపదే ప్రస్తావిస్తున్న ట్రంప్ సర్కార్ వైఖరి సోమవారం ఐరాస వేదికగా తేటతెల్లమైంది. యుద్ధానికి తక్షణం ముగింపు పలకాలని, రష్యా సేనలు వెంటనే ఆక్రమణ భూభాగాల నుంచి వెనుతిరగాలని, పలు డిమాండ్లతో ఐరాసలో సోమవారం మూడు తీర్మానాలను పలు సభ్యదేశాలు ప్రతిపాదించాయి. ఒక బిల్లులో రష్యాను ఆక్రమణదారుగా పేర్కొన్నారు. అయితే రష్యాను ఆక్రమణదారుగా పేర్కొనడాన్ని సమర్థించబోనని అమెరికా తెగేసి చెప్పింది. రష్యా తప్పేం లేదన్నట్లు ప్రవర్తిస్తూ ఓటింగ్ వేళ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటేసింది. యూరప్ మిత్రదేశాలను కాదని ట్రంప్ సర్కార్ రష్యా అనుకూల వైఖరితో ముందుకెళ్లడం ఇప్పుడు యూరప్ దేశాల్లో చర్చనీయాంశమైంది. రష్యా సైన్యం తమ ప్రాదేశిక స్థలాల నుంచి వైదొలగాలని ఉక్రెయిన్ చేసిన ఒక తీర్మానాన్ని ఉపసంహరించుకునేలా అమెరికా ఒత్తిడిచేసినట్లు తెలుస్తోంది. యూరప్ దేశాలు చేసిన మరో తీర్మానంలో ఓటేయకుండా అమెరికా దూరంగా ఉండిపోయింది. అమెరికా, యూరప్ దేశాల మధ్య సత్సంబంధాలు సన్నగిల్లుతున్నాయనేది ఐరాస వేదికగా బహిర్గతమైంది.

దూరంగా ఉండిపోయిన భారత్

చర్చలు, సంప్రదింపుల ద్వారానే యుద్ధాన్ని ముగించాలని మొదట్నుంచీ కోరుకుంటున్న భారత్ సైతం ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయింది. సర్వ ప్రతినిధి సభలో ఉక్రెయిన్ ప్రవేశపెట్టిన ఈ తీర్మానంపై ఓటింగ్‌లో 176 దేశాలు పాల్గొనగా 93 దేశాలు అనుకూలంగా ఓటేశాయి. రష్యా, అమెరికా, ఇజ్రాయెల్, ఉత్తరకొరియా సహా 18 దేశాలు వ్యతిరేకంగా ఓటేశాయి. భారత్, చైనా, ఇరాన్, ఇరాక్, బంగ్లాదేశ్, ఖతార్, సిరియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సహా 65 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయాయి. ''యుద్ధం కారణంగా భారీగా ప్రాణ నష్టం జరిగింది. ఇరుదేశాల మధ్య శాంతికి ప్రయత్నాలు చేద్దాం'' అంటూ అమెరికా ప్రతిపాదించిన తీర్మానానికి ఫ్రాన్స్ మూడు సవరణలు సూచించింది. రష్యా కారణంగానే యుద్ధం మొదలైందని పేర్కొంది. దీనిపై రష్యా స్పందించింది. అసలు ఈ ఉద్రిక్తతలకు మూలకారణాలను ప్రస్తావించాలని రష్యా డిమాండ్ చేసింది. అయితే ఈ సవరణలను 93 దేశాలు సమర్థించగా 8 దేశాలువ్యతిరేకించాయి. 73 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయాయి.

ఢిల్లీ అసెంబ్లీలో ఆప్ తీవ్ర నిరసన

21 మంది ఎమ్మెల్యేల సస్పెన్షన్

న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి బీఆర్ అంబేడ్కర్, భగత్ సింగ్‌ల చిత్రపటాలను తొలగించిన వ్యవహారం మంగళవారం ఢిల్లీ అసెంబ్లీని కుదిపేసింది. నూతన అసెంబ్లీనుద్దేశిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా చేసిన ప్రసంగంపై చర్చకు పదేపదే అంతరాయం కలిగిస్తున్నారంటూ ప్రతిపక్ష ఆప్‌నకు చెందిన 21 ఎమ్మెల్యేలను స్పీకర్ మూడు రోజులపాటు సస్పెండ్ చేశారు. ఈ నెల 27, 28వ తేదీల్లో జరిగే సభా కార్యక్రమాల్లో వీరు పాల్గొనేందుకు వీల్లేదు. ఈ మేరకు ప్రజా పనుల శాఖ పర్వేశ్ వర్మ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. మంగళవారం సభ ప్రారంభం కాగానే ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని తొలగించిన వ్యవహారంపై ప్రతిపక్ష నేత ఆతిశీ, తమ ఆప్ ఎమ్మెల్యేలతో కలిసి నిరసనకు దిగారు. బీజేపీ ప్రభుత్వం బీఆర్ అంబేడ్కర్‌ను అగౌరవపరిచిందంటూ నినాదాలు మొదలుపెట్టారు. స్పీకర్ విజేందర్ గుప్తా వారించినా పట్టించుకోలేదు. దీంతో, స్పీకర్ విజేందర్ గుప్తా సభలో ఉన్న మొత్తం 21 మంది ఆప్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేస్తూ నిర్ణయం ప్రకటించారు. సభను 27వ తేదీకి వాయిదా వేశారు. ఆప్‌కు చెందిన 22వ ఎమ్మెల్యే సభకు రాకపోవడంతో ఆయనొక్కరిపైనే సస్పెన్షన్ వేటు పడలేదు. సస్పెండైన శాసనసభ్యులు అసెంబ్లీ సముదాయంలో అంబేడ్కర్ చిత్రపటాలను చేతబూని బాబా సాహెబ్‌కు జరిగిన అన్యాయాన్ని సహించబోమనే నినాదాలతో నిరసనకు దిగారు. బాబా సాహెబ్ కంటే ప్రధాని మోదీయే మిన్న అని బీజేపీ భావిస్తోందా అంటూ ప్రశ్నించారు. ఆప్ అధికారంలో ఉండగా పాల్పడిన అవినీతి బయటపడుతుందనే ఆ పార్టీ ఎమ్మెల్యేలు సభకు అంతరాయం కలిగిస్తున్నారని మంత్రి ఆశిష్ సూద్ ఆరోపించారు. అనంతరం, సీఎం రేఖా గుప్తా కార్యాలయం, ఇతర మంత్రుల ఆఫీసుల్లో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్, భగత్ సింగ్, రాష్ట్రపతి, ప్రధానమంత్రి చిత్ర పటాల ఫొటోలను బీజేపీ 'ఎక్స్'లో షేర్ చేసింది.

నేడే ఆఖరి అమృత స్నానం

- నేటి మహాశివరాత్రితో ముగియనున్న మహాకుంభమేళా
- చివరిరోజు కోటి మంది పుణ్య స్నానాలు ఆచరించే వీలు
- కట్టుదిట్టమైన భద్రత, రక్షణ ఏర్పాట్లు చేసిన యోగి ప్రభుత్వం



మహాకుంభ్ నగర్(యూపీ): కోట్లాది మంది భక్తుల శరణ ఘోష, ఆధ్యాత్మిక పరిమళాల మధ్య భక్త జన కోటి పుణ్య స్నానాలు, వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న ఆనవాయితీకి కొనసాగింపుగా 'మహా కుంభమేళా'గా వినతికెక్కిన మహత్తర ఆధ్యాత్మిక వేడుక ఎట్టకేలకు చిట్టచివరకు చేరుకుంది. గత 44 రోజులుగా త్రివేణి సంగమ క్షేత్రంలో అప్రతిహతంగా కొనసాగుతూ కోట్లాది మంది భక్తుల పవిత్ర స్నానాలతో కిక్కిరిసిన ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా ఘాట్లు బుధవారం తుదిఅంకంలో భాగంగా మహాశివరాత్రితో మరోసారి ఇసుకేస్తే రాలనంత జనసంద్రంగా మారనున్నాయి. నేడు మహాశివరాత్రిని పురస్కరించుకుని కోటి మంది భక్తులు చిట్టచివరిదైన 'అమృత్ స్నాన్' క్రతువులో పాలుపంచుకోనున్నారని ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. ఘాట్‌ల వద్దకు భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు అంతటా వాహనాలను నిషేధించారు. 'నో వెహికల్ జోన్'గా ప్రకటించారు. ఇటీవల త్రివేణి సంగం ఘాట్‌లో తొక్కిసలాట జరిగి పలువురు భక్తులు ప్రాణాలుకోల్పోయిన నేపథ్యంలో ప్రభుత్వం మరింతగా పోలీసు బలగాలను మొహరించింది. చిట్టచివరి రోజు కావడంతో భక్తులు తాకిడి అనూహ్యంగా ఉండొచ్చన్న అంచనాలతో ప్రభుత్వం అన్ని రకాలుగా సర్వసన్నద్ధమైంది. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో కుంభమేళా భక్తుల తొక్కిసలాట ఘటన నేపథ్యంలో ఘాట్‌ల వద్ద ఒకేచోట జనం పోగుబడకుండా ప్రత్యేక పర్యవేక్షణా బలగాలను రంగంలోకి దింపారు.

ఢిల్లీ అసెంబ్లీలో

ఎక్సైజ్ పాలసీపై కాగ్ రిపోర్ట్

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ప్రభుత్వం 2021–22లో తీసుకొచ్చిన ఎక్సైజ్ పాలసీపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) సమర్పించిన నివేదికను ఢిల్లీ సీఎం రేఖా గుప్తా మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ మద్యం విధానం వల్ల ప్రభుత్వ ఖజానాకు ఏకంగా రూ.2,002 కోట్ల నష్టం వాటిల్లినట్లు కాగ్ తేల్చి చెప్పింది. లిక్కర్ పాలసీలో ఎన్నో లోపాలు ఉన్నాయని, అమలు తీరు సైతం సక్రమంగా లేదని కాగ్ స్పష్టం చేసింది. మద్యం దుకాణాలకు లైసెన్స్‌లు జారీ చేసే ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించారని, నూతన పాలసీ విషయంలో నిపుణుల కమిటీ సిఫార్సులను అప్పటి ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా విస్మరించారని ఆక్షేపించింది.

టెన్త్‌లో గ్రేడింగ్ విధానాన్ని యథావిధిగా కొనసాగించాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి ట్రస్మా నేతల వినతి పత్రం



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేస్తున్న ట్రస్మా నేతలు

కవాడిగూడ (హైదరాబాద్): 10వ తరగతిలో గత పదేళ్లుగా కొనసాగుతున్న గ్రేడింగ్ విధానాన్ని యథావిధిగా కొనసాగించాలని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) వ్యవస్థాపక అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.అనిల్ కుమార్, కోశాధికారి కె. శ్రీకాంత్‌రెడ్డిలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్ గౌడ్‌లను కలిసి వినతి పత్రాన్ని అందజేసినట్లు వారు వెల్లడించారు.

నీరా కేంద్రాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- మార్చి 17న మహాధర్నా నిర్వహిస్తాం: మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



పంజగుట్ట (హైదరాబాద్): నీరా కేంద్రాన్ని ధ్వంసం చేయడం గౌడ కులస్తుల ఆత్మగౌరవంమీద, తెలంగాణ సంస్కృతిమీద దాడి చెయ్యడమే అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఘటనకు కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, నీరా కేఫ్‌ను వెంటనే కల్లు, గీత కార్పొరేషన్‌కి అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో గౌడ్‌లకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, ఉన్న నీరా కేంద్రాన్ని కూడా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడాన్ని నిరసిస్తూ మార్చ్ 17న వేలాదిమందితో ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గౌడ సంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పూర్తిగా కల్లు, గీత కార్పొరేషన్ డబ్బులతో కట్టిన నీరా కేంద్రాన్ని టూరిజం డిపార్ట్‌మెంట్ ప్రమోట్ చెయ్యాలికానీ, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం సరికాదన్నారు. వారు కేంద్రంలో ఉన్న తాటి చెట్టును, గీతకార్మికుని బొమ్మలను తొలగించడం, నీరా కేంద్రం పేరు ఉన్న చోట లేక్‌వ్యూ హాల్ అని రాయడం దుర్మార్గమైన చర్య అన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలతోనే బీసీల రేపటి భవిత

ఓటర్లకు బీసీ సంక్షేమ సంఘం బహిరంగ లేఖ



మాట్లాడుతున్న జాజుల. చిత్రంలో చిరంజీవులు

సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాలు, బీసీల దిశ, దశను నిర్దేశించబోతున్నాయని, బీసీల రేపటి భవిష్యత్‌కు ఈ ఎన్నికలు కారణమవుతాయని బీసీ సంక్షేమ సంఘం పేర్కొంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ముగ్గురు బీసీ అభ్యర్థులను గెలిపించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓటర్లను బీసీ సంక్షేమ సంఘం జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు కోరారు. ఈ మేరకు హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఓటర్లకు బహిరంగ లేఖ విడుదల చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పుడు గెలిచే సామాజిక వర్గమే.. 2028లో రాజకీయ అధికారం చేపట్టనుందని జోస్యం చెప్పారు. నిజామాబాద్ ఎన్నికల ప్రచార సభలో సీఎం మాట్లాడుతూ.. ఈ ఎన్నిక పెద్ద ప్రాధాన్యమే కాదని, గెలుపోటములు సాధారణమేనని వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. పరోక్షంగా కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోతున్నారని ఆయన చెప్పకనే చెప్పారన్నారు. బీసీలను గెలిపించిన నెలలో లక్షలాది మందితో పరేడ్ మైదానంలో విజయోత్సవ సభను నిర్వహిస్తామన్నారు. సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్ చారి, కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్, బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తెలుగు తప్పనిసరి

- విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో విధిగా తెలుగును ఒక పాఠ్యాంశంగా బోధించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా ఉత్తర్వులు జారీ చేశారు. మాతృభాష తెలుగును ద్వితీయ భాషగా ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ గుర్తింపు పొందిన పాఠశాలలు, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ ఇతర బోర్డు యాజమాన్యాలకు కూడా తప్పనిసరి చేస్తూ 2018లోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

అప్పుల్లోనే అన్నదాత

- రైతు సృష్టిస్తున్న ప్రతి రూ.100లో దక్కుతున్నది రూ.30 మాత్రమే
- రౌండ్ టేబుల్ సమావేశంలో వ్యవసాయ రంగ నిపుణుడు దొంతి నరసింహారెడ్డి



సాక్షి, హైదరాబాద్: బడ్జెట్‌లో సమృద్ధిగా నిధులు కేటాయించినప్పుడే వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి బయటపడేయటం సాధ్యమని, అప్పుడే రైతుల జీవితాలు మారుతాయని వ్యవసాయ రంగ నిపుణుడు దొంతి నరసింహారెడ్డి అన్నారు. రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్చి 25, 26, 27 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం తృతీయ మహాసభలను పురస్కరించుకొని, 2025–26 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఎలా ఉండాలనే అంశంపై సంఘం కార్యాలయం వై.వి కృష్ణారావు భవన్‌లో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సంఘం ఉపాధ్యక్షుడు కొల్లూరి రాజయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో నరసింహారెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమంపై ప్రభుత్వాలు చెబుతున్న మాటల్లో వాస్తవం లేదని అన్నారు. యూరప్‌కు చెందిన ఓఈసీడీ సంస్థ నిర్వహించిన అధ్యయనంలో.. దేశంలో రైతులు పంటల ద్వారా సృష్టిస్తున్న ప్రతి రూ.100 విలువైన సంపదలో వారికి మిగులుతున్నది రూ.30 మాత్రమేనని తేలినట్లు తెలిపారు. రైతే ప్రభుత్వాలకు రూ.70 సబ్సిడీ రూపంలో అందిస్తున్నాడని పేర్కొన్నారు. ప్రభుత్వాలు రుణమాఫీ చేసినట్లు చెప్పుకొంటున్నా.. ఏ ఒక్క రైతు రుణం నుంచి విముక్తి పొందలేదని ఆవేదన వ్యక్తంచేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి ఏనాడూ 10 శాతం నిధులు కేటాయించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాది వ్యవసాయ రంగానికి కేటాయించిన బడ్జెట్, చేసిన వ్యయంపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ యంత్రాల ధరలను నియంత్రించేందుకు మార్కెట్ నియంత్రణ చట్టం తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం నేతలు ప్రభులింగం, ఎస్ వెంకటరెడ్డి, జంగయ్య, డీజీ నరేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూమి ఇవ్వలేదని తండ్రిపై కొడుకు దాడి

- దెబ్బలకు తాళలేక మృతి



మృతుడు అబ్దుల్ రహీం



నిందితుడు పీర్‌మహ్మద్

పరిగి: తన వాటా భూమిని రిజిస్ట్రేషన్ చేయనందుకు కొడుకు కర్రతో దాడి చేయడంతో తండ్రి మృతి చెందాడు. వికారాబాద్ జిల్లా పరిగి మండలం రావులపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన ఈ సంఘటనపై స్థానికులు, ఎస్ఐ సంతోశ్‌కుమార్ తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన అబ్దుల్ రహీం (72)కు ఇద్దరు భార్యలు ఉండగా.. వారికి ఐదుగురు సంతానం. రహీం చిన్న భార్య కుమారుడు పీర్‌మహ్మద్ గ్రామ సమీపంలోని ఒక ఫామ్‌హౌస్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి చిన్న భార్య దగ్గరకి రహీం వెళ్లగా.. అక్కడే ఉన్న పీర్‌మహ్మద్ వాటా ప్రకారం తనకు రావాల్సిన భూమిని రిజిస్ట్రేషన్ చేయాలంటూ ఆగ్రహంతో ఊగిపోయాడు. ఈ క్రమంలో తండ్రిపై కర్రతో దాడి చేశాడు. గ్రామానికి చెందిన నల్లోల్ల నర్సింహులు అడ్డుకుని అబ్దుల్‌రహీంను ఇంటికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించాడు. దెబ్బలు తాళలేని రహీం మంగళవారం ఉదయం 9గంటలకు అచేతనంగా పడిఉన్నాడు. దీంతో కుటుంబ సభ్యులు పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. మెరుగైన వైద్యం కోసం ఉస్మానియాకు తరలించాలని వైద్యులు సూచించారు. నగరానికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో ఆయన మృతి చెందాడు. మృతుని సోదరి కరీమాబీ పోలీసులకు ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూ సేకరణ) శాఖ
ఫారం-VI
(చట్టం-30/2013లోని నియమం-19 యొక్క ఉప నియమం (1) మరియు విభాగం-11(1) చూడండి)

ప్రాథమిక ప్రకటన

కలెక్టరేట్ ఫైల్ నెం.: ఙ2 /1126/2017 — తేది : 21.02.2025

ఆర్‌డీఓ. నెం.: బి/1222/2025 — తేది : 15.02.2025

తెలంగాణ ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్, రంగారెడ్డి గారి ఆదేశానుసారం రంగారెడ్డి జిల్లా, శ్రీమంతుగూడ గ్రామము, మంచాల్ మండలం భూమి విస్తీర్ణం ఎ.148.31 గుం.లు భూమి ప్రజా ప్రయోజనార్థం డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగముగా శివన్నగూడెం రిజర్వాయర్ కొరకై 0.000 నుంచి 5.857 ఆఫ్ ప్యాకేజ్-6&7 వరకు ఈ దిగువ చూపిన భూమి అవసరం అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరావాస, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 30/2013లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీ చేయనైనది.

తెలంగాణ ప్రభుత్వం వారు జి.ఓ.యం.యస్. నం.39 ఇరిగేషన్ & కాడ్ (ఎల్.ఎ, ఆర్&ఆర్/ఎ2) డిపార్ట్‌మెంట్ తేది: 30.06.2017 జారీ చేసినారు. అట్టి జి.ఓ. నందు సెక్షన్ 10ఎ చట్టం నెంబర్ 21/2017 భూసేకరణ చట్టం 2013 క్రింద అధ్యాయము II & III ఈ ప్రాజెక్ట్ నుండి మినహాయించబడినది.

కావున ఈ ప్రాజెక్ట్ క్రింద రంగారెడ్డి జిల్లా, శ్రీమంతుగూడ గ్రామము, మంచాల్ మండలం భూమి విస్తీర్ణం ఎ.148.31 గుం.లు భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

వివరాల జాబితా

గ్రామము : శ్రీమంతుగూడ — మండలం: మంచాల్ — జిల్లా: రంగారెడ్డి

క్ర. సం.	సర్వే నంబరు	టైటిల్ రకము	భూమి రకము	సేకరించు లో ఉన్న ప్రాంతం (ఎకరాల్లో)	ఆస్తి ఉన్న వ్యక్తి పేరు మరియు చిరునామా (తండ్రి/భర్త పేరు)	హద్దులు: తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	చెట్లు: రకం	సంఖ్య	నిర్మాణాలు: రకం	పూర్తి ప్రాంతం
1	2	3	4	5	6			7		8	9	10	11
1	40/2	లావుని పట్టా	మెట్ట/ ఖుష్కి	2.2000	అంతోని జంగయ్య (రాములు)	40/3	40/1	41	గ్రామ సరిహద్దు	-	-	-	-
2	40/3	లావుని పట్టా	మెట్ట/ ఖుష్కి	3.1300	అయితోని స్వామి (రాములు) పంతంగి మల్లయ్య (దత్తయ్య)	64	41	50	40/4	-	-	-	-
3	40/4/అ/1	లావుని పట్టా	మెట్ట/ ఖుష్కి	0.2700	కారింగు బుచ్చయ్య (నర్సింహ)	40/5	గ్రామ సరిహద్దు	40/3	గ్రామ సరిహద్దు	-	-	-	-
4	40/4/అ/2	లావుని పట్టా	మెట్ట/ ఖుష్కి	0.2700	కారింగు మల్లయ్య (నర్సింహ)	40/5	గ్రామ సరిహద్దు	40/3	గ్రామ సరిహద్దు	-	-	-	-
5	40/4/అ/3	లావుని పట్టా	మెట్ట/ ఖుష్కి	0.2600	కారింగు వెంకటయ్య (నర్సింహ)	40/5	గ్రామ సరిహద్దు	40/3	గ్రామ సరిహద్దు	-	-	-	-
6	40/4/ఆ/1	లావుని పట్టా	మెట్ట/ ఖుష్కి	0.2700	పంతంగి అంజయ్య (దత్తయ్య)	40/5	గ్రామ సరిహద్దు	40/3	గ్రామ సరిహద్దు	-	-	-	-
7	40/4/ఆ/2	లావుని పట్టా	మెట్ట/ ఖుష్కి	0.2700	పంతంగి జంగయ్య (దత్తయ్య)	40/5	గ్రామ సరిహద్దు	40/3	గ్రామ సరిహద్దు	-	-	-	-
8	40/ఇ/3	లావుని పట్టా	మెట్ట/ ఖుష్కి	0.2600	పంతంగి మల్లయ్య (దత్తయ్య)	40/5	గ్రామ సరిహద్దు	40/3	గ్రామ సరిహద్దు	-	-	-	-
9	41/అ/1/1/1/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.3300	పంతంగి యాదమ్మ (పంతంగి వెంకటయ్య)	40/3	40/2	40/2	42	-	-	-	-
10	41/అ/1/1/1/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.3300	పంతంగి గణేష్ (రాజు)	40/3	40/2	40/2	42	-	-	-	-
11	41/అ/1/1/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.3300	పంతంగి యాదయ్య (చంద్రయ్య)	40/3	40/2	40/2	42	-	-	-	-
12	41/అ/1/1/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.3300	పంతంగి పాండు (చంద్రయ్య)	40/3	40/2	40/2	42	-	-	-	-
13	41/అ/1/3	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.3300	చందా సంతోష్ (చందా చంద్రశేఖర్)	40/3	40/2	40/2	42	-	-	-	-
14	41/అ/2/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	1.1500	పిరియాల ప్రమోద్ రెడ్డి (పిరియాల వెంకట్ రెడ్డి)	40/3	40/2	40/2	42	-	-	-	-
15	41/అ/2/ఎ/1/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	1.0000	పంతంగి పద్మ (అంజయ్య)	40/3	40/2	40/2	42	-	-	-	-
16	41/అ/2/ఎ/1/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1500	పిరియాల ప్రమోద్ రెడ్డి (పిరియాల వెంకట్ రెడ్డి)	40/3	40/2	40/2	42	-	-	-	-
17	41/అ/2/ఎ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	1.1500	పంతంగి జంగమ్మ (జంగయ్య)	40/3	40/2	40/2	42	-	-	-	-
18	41/ఆ/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	2.3000	కారింగు బుచ్చయ్య (నర్సింహ)	40/3	40/2	40/2	42	-	-	-	-
19	41/ఆ/2/1/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	2.1000	కారింగు మల్లయ్య (నర్సింహ)	40/3	40/2	40/2	42	-	-	-	-
20	41/ఆ/2/1/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0900	చంద్రశేఖర్ చందా (మార్కండేయులు)	40/3	40/2	40/2	42	-	-	-	-
21	41/ఆ/2/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1100	వేదపాలెం శ్రీధర్ (రామమూర్తి వేదపాలెం)	40/3	40/2	40/2	42	-	-	-	-
22	41/ఆ/3	పట్టా	మెట్ట/ ఖుష్కి	2.3000	కారింగు వెంకటయ్య (నర్సింహ)	40/3	40/2	40/2	42	-	-	-	-
23	42/అ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0300	జాలోత్ చిన్న (రాజా)	50	48/3	49	41	-	-	-	-
24	42/అ/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	4.0000	రమావత్ శ్రీను (చిన్న)	50	48/3	49	41	-	-	-	-
25	42/ఆ/2/1/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	1.0000	సపావత్ దీప్లా (లేట్ సపావత్ చందు)	50	48/3	49	41	-	-	-	-
26	42/ఆ/2/1/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.2000	సపావత్ రాజా (లేట్ సపావత్ చందు)	50	48/3	49	41	-	-	-	-
27	42/ఆ/2/1/3	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.2000	సపావత్ వసి (లేట్ సపావత్ చందు)	50	48/3	49	41	-	-	-	-
28	42/ఆ/2/2/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	1.0500	రమావత్ లచ్చి (అమృత)	50	48/3	49	41	-	-	-	-
29	42/ఆ/2/2/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.3500	పంతంగి శ్రీకాంత్ (పంతంగి జంగయ్య)	50	48/3	49	41	-	-	-	-
30	42/ఇ	పట్టా	మెట్ట/ ఖుష్కి	3.0000	రమావత్ భీకు (బాషా)	50	48/3	49	41	-	-	-	-
31	42/ఈ	పట్టా	మెట్ట/ ఖుష్కి	1.0000	మర్ల లచ్చయ్య (ఎర్రయ్య)	50	48/3	49	41	-	-	-	-
32	42/ఉ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1000	మర్ల లచ్చయ్య (ఎర్రయ్య)	50	48/3	49	41	-	-	-	-
33	50/అ	పట్టా	మెట్ట/ ఖుష్కి	1.0400	జాటావత్ నాతి (చిన్న)	52	42	49	వాగు	-	-	-	-
34	50/అం	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0600	జాలోత్ సంతు (చంద్రు)	52	42	49	వాగు	-	-	-	-
35	50/ఆ/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1100	జటావత్ జాను (శక్రు)	52	42	49	వాగు	-	-	-	-
36	50/ఆ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1100	జటావత్ పాండు (శక్రు)	52	42	49	వాగు	-	-	-	-
37	50/ఆ/3	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1100	జటావత్ లచ్చ (శక్రు)	52	42	49	వాగు	-	-	-	-
38	50/ఆ/4	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1100	జటావత్ శంకర్ (శక్రు)	52	42	49	వాగు	-	-	-	-
39	50/ఇ/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0700	జటావత్ నర్సింహ (జటావత్ మంగ్యా)	52	42	49	వాగు	-	-	-	-
40	50/ఇ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0700	జటావత్ నరేందర్ (మంగ్యా)	52	42	49	వాగు	-	-	-	-
41	50/ఈ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1300	జాలోత్ గాంప్య (రాలు)	52	42	49	వాగు	-	-	-	-
42	50/ఉ/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0700	జటావత్ పత్తి (జాలోత్ చిక్లా)	52	42	49	వాగు	-	-	-	-
43	50/ఉ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0700	జటావత్ గన్న (జాలోత్ చిక్లా)	52	42	49	వాగు	-	-	-	-
44	50/ఊ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1400	జాలోత్ లచ్చ (రాలు)	52	42	49	వాగు	-	-	-	-
45	50/ఋ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0150	జె. కిషన్ (సీత్య)	52	42	49	వాగు	-	-	-	-
46	50/ఋ/3	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0150	జె. శంకర్ (సీత్య)	52	42	49	వాగు	-	-	-	-
47	50/ఎ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0300	జాలోత్ పాండు (మోత్యా)	52	42	49	వాగు	-	-	-	-
48	50/ఏ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0300	జాలోత్ దెవ్య (మోత్యా)	52	42	49	వాగు	-	-	-	-
49	50/ఐ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0400	జాలోత్ జమ్ము (తార్యా)	52	42	49	వాగు	-	-	-	-
50	50/ఒ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0300	జాలోత్ బీమ (మోత్యా)	52	42	49	వాగు	-	-	-	-
51	50/క	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1500	జాలోత్ చందు (రాము)	52	42	49	వాగు	-	-	-	-
52	50/ఖ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1400	జాలోత్ ధర్మ (చెట్యా)	52	42	49	వాగు	-	-	-	-
53	50/గ/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.2500	జటావత్ నరేష్ (జాను)	52	42	49	వాగు	-	-	-	-
54	50/గ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.2500	జటావత్ నరేష్ (జాను)	52	42	49	వాగు	-	-	-	-
55	50/ఘ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0400	జటావత్ వస్య (లేక్యా)	52	42	49	వాగు	-	-	-	-
56	50/చ/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0200	జటావత్ శ్రీను (తర్యా)	52	42	49	వాగు	-	-	-	-
57	50/చ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0200	జటావత్ రమేష్ (తర్యా)	52	42	49	వాగు	-	-	-	-
58	50/ఛ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0400	జాలోత్ రాజు (పూర్యా)	52	42	49	వాగు	-	-	-	-
59	50/జ/1/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0200	జటావత్ సోని (రాథింగ్)	52	42	49	వాగు	-	-	-	-
60	50/జ/1/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0100	జటావత్ రవీందర్ (పూలు)	52	42	49	వాగు	-	-	-	-
61	50/జ/1/3	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0100	జటావత్ కౌసల్య (శ్రీను)	52	42	49	వాగు	-	-	-	-
62	50/జ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0200	జాలోత్ బాల్య (పూర్యా)	52	42	49	వాగు	-	-	-	-
63	50/జ/3	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0200	జాలోత్ భాస్కర్ (బాల్య)	52	42	49	వాగు	-	-	-	-
64	51/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0500	జటావత్ సోని (రాథింగ్)	52	50	52	వాగు	-	-	-	-
65	51/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0500	జటావత్ రవీందర్ (పూలు)	52	50	52	వాగు	-	-	-	-
66	51/3	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0400	జటావత్ కౌసల్య (శ్రీను)	52	50	52	వాగు	-	-	-	-
67	51/4	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1400	జాలోత్ బీమ (మోత్యా)	52	50	52	వాగు	-	-	-	-
68	51/5	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1400	జటావత్ లచ్చి (రెడ్డి)	52	50	52	వాగు	-	-	-	-
69	51/6	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1400	జాలోత్ పాండు (మోత్యా)	52	50	52	వాగు	-	-	-	-
70	51/7	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1100	జాలోత్ సంతు (చంద్రు)	52	50	52	వాగు	-	-	-	-
71	51/8	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1400	జాలోత్ జమ్ము (తార్యా)	52	50	52	వాగు	-	-	-	-
72	51/అ	పట్టా	మెట్ట/ ఖుష్కి	1.2700	జాటావత్ నాతి (చిన్న)	56	50	53	51	-	-	-	-
73	52/అ/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0750	జాటావత్ పాండు (శక్రు)	56	50	53	51	-	-	-	-
74	52/అ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0750	జాటావత్ జాను (శక్రు)	56	50	53	51	-	-	-	-
75	52/అ/3	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0750	జాటావత్ లచ్చ (శక్రు)	56	50	53	51	-	-	-	-
76	52/అ/4	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0750	జాటావత్ శంకర్ (శక్రు)	56	50	53	51	-	-	-	-
77	52/ఆ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.3000	జాలోత్ గాంప్య (రాలు)	56	50	53	51	-	-	-	-
78	52/ఇ/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1500	జాటావత్ పత్తి (జాలోత్ చిక్లా)	56	50	53	51	-	-	-	-
79	52/ఇ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1500	జటావత్ గన్న (జాలోత్ చిక్లా)	56	50	53	51	-	-	-	-
80	52/ఈ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.3000	జాలోత్ లచ్చ (రాలు)	56	50	53	51	-	-	-	-
81	52/ఋ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0600	జె కిషన్(సీత్య)	56	50	53	51	-	-	-	-
82	52/ఋ/3	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0600	జె శంకర్ (సీత్య)	56	50	53	51	-	-	-	-
83	52/ఎ/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0300	జటావత్ సోని (రాథింగ్)	56	50	53	51	-	-	-	-
84	52/ఎ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0300	జటావత్ రవీందర్ (పూలు)	56	50	53	51	-	-	-	-
85	52/ఎ/3	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0400	జటావత్ కౌసల్య (శ్రీను)	56	50	53	51	-	-	-	-
86	52/ఏ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1000	జాలోత్ పాండు (మోత్యా)	56	50	53	51	-	-	-	-
87	52/ఐ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1000	జాలోత్ దెవ్య (మోత్యా)	56	50	53	51	-	-	-	-
88	52/ఒ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1000	జాలోత్ జమ్ము (తార్యా)	56	50	53	51	-	-	-	-
89	52/ఓ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1000	జాలోత్ సంతు (చంద్రు)	56	50	53	51	-	-	-	-
90	52/క/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1000	జటావత్ నర్సింహ (జటావత్ మంగ్యా)	56	50	53	51	-	-	-	-
91	52/క/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1000	జటావత్ నరేందర్ (మంగ్యా)	56	50	53	51	-	-	-	-
92	52/ఖ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.2000	జాలోత్ చందు (రాము)	56	50	53	51	-	-	-	-
93	52/గ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.2000	జాలోత్ ధర్మ (చెట్యా)	56	50	53	51	-	-	-	-
94	52/ఘ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0200	జటావత్ వస్య (లేక్యా)	56	50	53	51	-	-	-	-
95	52/చ/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0500	జాలోత్ దేవుల (జగన్)	56	50	53	51	-	-	-	-
96	52/చ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0500	జాలోత్ నరేష్ (జగన్)	56	50	53	51	-	-	-	-
97	52/ఛ/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0600	జటావత్ శ్రీను (తర్యా)	56	50	53	51	-	-	-	-
98	52/ఛ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0600	జటావత్ రమేష్ (తర్యా)	56	50	53	51	-	-	-	-
99	52/జ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1200	జాలోత్ రాజు (పూర్యా)	56	50	53	51	-	-	-	-
100	52/ఝ/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1000	జాలోత్ బీమ (మోత్యా)	56	50	53	51	-	-	-	-
101	52/ఝ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0600	జాలోత్ బాల్య (పూర్యా)	56	50	53	51	-	-	-	-
102	52/ఝ/3	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0600	జాలోత్ భాస్కర్ (బాల్య)	56	50	53	51	-	-	-	-
103	56/అ/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0600	రమావత్ ధర్మ (బాకు)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
104	56/అ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0700	అంబోత్ లక్ష్మి (గోపాల్)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
105	56/ఆ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0900	అంబోత్ లక్ష్మి (గోపాల్)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
106	56/ఇ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.2400	రమావత్ మార్య (లేక్యా)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
107	56/ఈ/1/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1100	మెగావత్ బీక్ల (గేమ్యా)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
108	56/ఈ/1/3	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1100	మెగావత్ శ్రీను (గేమ్యా)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
109	56/ఈ/3	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0100	మెగావత్ శ్రీను (గేమ్యా)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
110	56/ఉ/1/1/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0300	యర్కాలి వెంకటేష్ (యర్కాలి కృష్ణ స్వామి)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
111	56/ఉ/1/1/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0200	ఎడమ గణేష్ (నర్సింహ)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
112	56/ఉ/1/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0200	ఎడమ సత్తమ్మ (గోపాల్)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
113	56/ఉ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0200	ఎడమ మహేశ్ (పరమేశ్)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
114	56/ఊ/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0500	బాలోత్ సోమ్లా (గాంప్య)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
115	56/ఊ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0500	ఉదావత్ భీకు (రాజా)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
116	56/ఊ/3/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1000	జటావత్ నర్సింహ (జటావత్ మంగ్యా)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
117	56/ఊ/3/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0700	జాలోత్ ధర్మ (చెట్యా)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
118	56/ఎ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1000	జటావత్ సంతా (చిన్న)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
119	56/ఏ/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0480	జె శంకర్ (సీత్య)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
120	56/ఏ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0380	జాలోత్ రాజు (పూర్యా)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
121	56/ఏ/3	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0140	జటావత్ శ్రీను (తర్యా)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
122	56/ఐ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1000	బొడ్డు లక్ష్మమ్మ (బొడ్డు చంద్రయ్య)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
123	56/ఒ/1/1/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0475	జటావత్ సుజాత (జటావత్ భాస్కర్)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
124	56/ఒ/1/1/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0475	జటావత్ రాజు (జాటావత్ జాను)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
125	56/ఒ/1/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0475	జటావత్ శంకర్ (శక్రు)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
126	56/ఒ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0375	జటావత్ శంకర్ (శక్రు)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
127	56/ఓ/1/1/1/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0100	జటావత్ పాండు (శక్రు)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
128	56/ఓ/1/1/1/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0300	జటావత్ పత్తి (జాలోత్ చిక్లా)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
129	56/ఓ/1/1/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0625	జాటావత్ వినోద్ కుమార్ (జటావత్ లచ్చ)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
130	56/ఓ/1/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0350	జటావత్ గన్న (జాలోత్ చిక్లా)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
131	56/ఓ/1/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0625	జాలోత్ గాంప్య (రాలు)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
132	56/ఓ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0200	జటావత్ నర్సింహ (జటావత్ మంగ్యా)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
133	56/ఔ/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0050	జటావత్ శ్రీను (తర్యా)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
134	56/ఔ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0190	జటావత్ రమేష్ (తర్యా)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
135	56/ఔ/3	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0190	జటావత్ వస్య (లేక్యా)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
136	56/ఔ/4	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0095	జాలోత్ దేవుల (జగన్)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
137	56/ఔ/5	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0095	జాలోత్ నరేష్ (జగన్)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
138	56/ఔ/6	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0190	జాటోత్ సుధాకర్ (జాటోత్ బాలియా)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
139	56/ఔ/7	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0190	జాలావత్ శారద (జాలావత్ భాస్కర్)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
140	56/క/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1000	జటావత్ సంతా (చిన్న)	57/4	52	గ్రామ సరిహద్దు	62	-	-	-	-
141	57/3/అ	లావుని పట్టా	మెట్ట/ ఖుష్కి	1.0000	రమావత్ చంద్రు (రాము)	58	60	57/2	59	-	-	-	-
142	57/3/ఆ	లావుని పట్టా	మెట్ట/ ఖుష్కి	1.0000	రమావత్ సీత్య (రాము)	58	60	57/2	59	-	-	-	-
143	58/అ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1500	రామావత్ మార్య (లేక్యా)	గ్రామ సరిహద్దు	57/3	గ్రామ సరిహద్దు	59	-	-	-	-
144	58/అ/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0700	మెగావత్ బీక్ల (గేమ్యా)	గ్రామ సరిహద్దు	57/3	గ్రామ సరిహద్దు	59	-	-	-	-
145	58/అ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0700	మెగావత్ శ్రీను (గేమ్యా)	గ్రామ సరిహద్దు	57/3	గ్రామ సరిహద్దు	59	-	-	-	-
146	58/ఆ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1000	బాలోత్ సోమ్లా (గాంప్య)	గ్రామ సరిహద్దు	57/3	గ్రామ సరిహద్దు	59	-	-	-	-
147	58/ఆ/3	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1000	ఉదావత్ భీకు (రాజా)	గ్రామ సరిహద్దు	57/3	గ్రామ సరిహద్దు	59	-	-	-	-
148	58/ఇ/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1600	సింహ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్	గ్రామ సరిహద్దు	57/3	గ్రామ సరిహద్దు	59	-	-	-	-
149	58/ఇ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1000	పోరెడ్డి అనిత (పోరెడ్డి అంజి రెడ్డి)	గ్రామ సరిహద్దు	57/3	గ్రామ సరిహద్దు	59	-	-	-	-
150	58/ఈ	పట్టా	మెట్ట/ ఖుష్కి	1.0400	పోరెడ్డి అనిత (పోరెడ్డి అంజి రెడ్డి)	గ్రామ సరిహద్దు	57/3	గ్రామ సరిహద్దు	59	-	-	-	-
151	58/ఉ	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0800	కొంపల్లి యాదమ్మ (పెద్దయ్య)	గ్రామ సరిహద్దు	57/3	గ్రామ సరిహద్దు	59	-	-	-	-
152	58/ఊ/1/1	పట్టా	తరి	0.0400	బొడ్డు శంకర్ (యాదయ్య)	గ్రామ సరిహద్దు	57/3	గ్రామ సరిహద్దు	59	-	-	-	-
153	58/ఊ/1/2	పట్టా	తరి	0.0600	లలిత గుంటూరు (లేట్ రాధా కృష్ణ మూర్తి గుంటూరు)	గ్రామ సరిహద్దు	57/3	గ్రామ సరిహద్దు	59	-	-	-	-
154	58/ఋ/1/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0400	బొడ్డు స్వామి (చంద్రయ్య)	గ్రామ సరిహద్దు	57/3	గ్రామ సరిహద్దు	59	-	-	-	-
155	58/ఋ/1/2/1	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0200	సింహ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (సింహ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్)	గ్రామ సరిహద్దు	57/3	గ్రామ సరిహద్దు	59	-	-	-	-
156	58/ఋ/1/2/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.0400	లలిత గుంటూరు (లేట్ రాధా కృష్ణ మూర్తి గుంటూరు)	గ్రామ సరిహద్దు	57/3	గ్రామ సరిహద్దు	59	-	-	-	-
157	58/ఎ/1/1	పట్టా	మాగాణి	0.0400	బొడ్డు యాదయ్య (సాయిలు)	గ్రామ సరిహద్దు	57/3	గ్రామ సరిహద్దు	59	-	-	-	-
158	58/ఎ/1/2/1	పట్టా	మాగాణి	0.0200	సింహ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (సింహ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్)	గ్రామ సరిహద్దు	57/3	గ్రామ సరిహద్దు	59	-	-	-	-
159	58/ఎ/1/2/2	పట్టా	మాగాణి	0.0400	గాయత్రి గుంటూరు (రామనారాయణ్ కొంపెల్ల)	గ్రామ సరిహద్దు	57/3	గ్రామ సరిహద్దు	59	-	-	-	-
160	58/ఎ/2	పట్టా	మెట్ట/ ఖుష్కి	0.1100	బొడ్డు లక్ష్మమ్మ (బొడ్డు చంద్రయ్య)	గ్రామ సరిహద్దు	57/3	గ్రామ సరిహద్దు	59	-	-	-	-

(మిగతా 8వ పేజీలో...)

(...7వ పేజీ తరువాయి)

161	58/ఉ/3	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0600	గాయత్రి గుంటూరు (రామనారాయణ్ కొంపెల్ల)	గ్రామ సరిహద్దు	57/3	గ్రామ సరిహద్దు	59	-	-	-	-
162	59/అ	పట్టా	మెట్ట/ఖుష్కి	1.1200	అంబోత్ లక్ష్మి (గోపాల్)	66/2	60	58	65/2	-	-	-	-
163	59/ఇ/1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.1700	మెగావత్ దీప్ల (దేవ్యా)	66/2	60	58	65/2	-	-	-	-
164	59/ఇ/2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.1800	మెగావత్ శ్రీను (దేవ్యా)	66/2	60	58	65/2	-	-	-	-
165	59/ఈ/1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.1500	బానోత్ సోమ్లా (గాంప్యా)	66/2	60	58	65/2	-	-	-	-
166	59/ఈ/2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.1500	ఉదావత్ భీకు (రాజా)	66/2	60	58	65/2	-	-	-	-
167	59/ఈ/3	పట్టా	మెట్ట/ఖుష్కి	0.3500	మద్ది లచ్చయ్య (ఎర్రయ్య)	66/2	60	58	65/2	-	-	-	-
168	59/ఉ	పట్టా	మెట్ట/ఖుష్కి	1.1000	జయలక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	66/2	60	58	65/2	-	-	-	-
169	59/ఊ	పట్టా	మెట్ట/ఖుష్కి	1.2500	పోరెడ్డి అనిత (పోరెడ్డి అంత రెడ్డి)	66/2	60	58	65/2	-	-	-	-
170	59/ఎ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2600	కొంపల్లి యాదమ్మ (సిద్ధయ్య)	66/2	60	58	65/2	-	-	-	-
171	59/ఏ/1/1/1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0850	పోరెడ్డి అనిత (పోరెడ్డి అంత రెడ్డి)	66/2	60	58	65/2	-	-	-	-
172	59/ఏ/1/1/2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0200	సంధ్య శివ పూర్ణిమ చంద్ర (గన్నిన బాలు మహేంద్ర)	66/2	60	58	65/2	-	-	-	-
173	59/ఏ/1/2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.1250	పుల్లెపు రవి ప్రసాద్ (వంశతి రావు)	66/2	60	58	65/2	-	-	-	-
174	59/ఐ/2/1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.1050	పోరెడ్డి అనిత (పోరెడ్డి అంత రెడ్డి)	66/2	60	58	65/2	-	-	-	-
175	59/ఐ/2/2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.1250	రాజశేఖర్ పుల్లెపు (వంశతిరావు)	66/2	60	58	65/2	-	-	-	-
176	59/ఒ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2300	జయలక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	66/2	60	58	65/2	-	-	-	-
177	59/ఓ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2300	పోరెడ్డి అనిత (పోరెడ్డి అంత రెడ్డి)	66/2	60	58	65/2	-	-	-	-
178	59/ఔ/1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.3600	రమావత్ మార్య (దేశ్యా)	66/2	60	58	65/2	-	-	-	-
179	60/అ	పట్టా	మెట్ట/ఖుష్కి	1.0100	రమావత్ మార్య (దేశ్యా)	59	63	57/3	65/2	-	-	-	-
180	60/ఆ/1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2400	మెగావత్ దీప్ల (దేవ్యా)	59	63	57/3	65/2	-	-	-	-
181	60/ఆ/2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2400	మెగావత్ శ్రీను (దేవ్యా)	59	63	57/3	65/2	-	-	-	-
182	60/ఇ	పట్టా	మెట్ట/ఖుష్కి	1.1500	మద్ది లచ్చయ్య (ఎర్రయ్య)	59	63	57/3	65/2	-	-	-	-
183	60/ఇ2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2000	ఉదావత్ భీకు (రాజా)	59	63	57/3	65/2	-	-	-	-
184	60/ఈ/1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0400	బొర్ర్వాల రాము (వెంకటయ్య)	59	63	57/3	65/2	-	-	-	-
185	60/ఈ/2/1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0400	పోతురాజు పాండు (సోమయ్య)	59	63	57/3	65/2	-	-	-	-
186	60/ఈ/2/2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.1000	పోతురాజు కిరణ్ (యాదయ్య)	59	63	57/3	65/2	-	-	-	-
187	60/ఈ/3	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2000	పోతురాజు పాండు (సోమయ్య)	59	63	57/3	65/2	-	-	-	-
188	60/ఉ/1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.1100	మరిగె శ్రీను (వర్గుశాలు)	59	63	57/3	65/2	-	-	-	-
189	60/ఉ/2	పట్టా	మెట్ట/ఖుష్కి	1.2100	జయలక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	59	63	57/3	65/2	-	-	-	-
190	60/ఉ/3	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2000	జయలక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	59	63	57/3	65/2	-	-	-	-
191	60/ఊ/1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2000	జయలక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	59	63	57/3	65/2	-	-	-	-
192	60/ఊ/2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2000	జయలక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	59	63	57/3	65/2	-	-	-	-
193	60/ఎ/1	పట్టా	మెట్ట/ఖుష్కి	1.0200	రమావత్ ధర్మ (దాస్)	59	63	57/3	65/2	-	-	-	-
194	60/ఎ/2	పట్టా	మెట్ట/ఖుష్కి	1.1400	అంబోత్ లక్ష్మి (గోపాల్)	59	63	57/3	65/2	-	-	-	-
195	60/ఏ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2000	బానోత్ సోమ్లా (గాంప్యా)	59	63	57/3	65/2	-	-	-	-
196	60/ఐ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2000	జయలక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	59	63	57/3	65/2	-	-	-	-
197	60/ఓ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2100	కొంపల్లి యాదమ్మ (సిద్ధయ్య)	59	63	57/3	65/2	-	-	-	-
198	61/అ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0600	రమావత్ ధర్మ (దాస్)	60	60	60	63	-	-	-	-
199	61/ఆ/1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0300	మెగావత్ దీప్ల (దేవ్యా)	60	60	60	63	-	-	-	-
200	61/ఆ/2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0200	మెగావత్ శ్రీను (దేవ్యా)	60	60	60	63	-	-	-	-
201	61/అ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0200	కొంపల్లి యాదమ్మ (సిద్ధయ్య)	60	60	60	63	-	-	-	-
202	61/ఇ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0400	మద్ది లచ్చయ్య (ఎర్రయ్య)	60	60	60	63	-	-	-	-
203	61/ఇ1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0200	బానోత్ సోమ్లా (గాంప్యా)	60	60	60	63	-	-	-	-
204	61/ఇ2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0200	ఉదావత్ భీకు (రాజా)	60	60	60	63	-	-	-	-
205	61/ఈ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.1000	మరిగె శ్రీను (వర్గుశాలు)	60	60	60	63	-	-	-	-
206	61/ఈ/3	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0200	పోతురాజు కిరణ్ (యాదయ్య)	60	60	60	63	-	-	-	-
207	61/ఉ/2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0200	జయలక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	60	60	60	63	-	-	-	-
208	61/ఊ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0200	జయలక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	60	60	60	63	-	-	-	-
209	61/ఊ/1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0200	జయలక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	60	60	60	63	-	-	-	-
210	61/ఓ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0400	బొర్ర్వాల రాము (వెంకటయ్య)	60	60	60	63	-	-	-	-
211	62/అ1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0200	రమావత్ ధర్మ (దాస్)	60	56	56	63	-	-	-	-
212	62/అ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0200	కొంపల్లి యాదమ్మ (సిద్ధయ్య)	60	56	56	63	-	-	-	-
213	62/ఇ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0800	రమావత్ మార్య (దేశ్యా)	60	56	56	63	-	-	-	-
214	62/ఈ/1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0400	మెగావత్ దీప్ల (దేవ్యా)	60	56	56	63	-	-	-	-
215	62/ఈ/2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0500	మెగావత్ శ్రీను (దేవ్యా)	60	56	56	63	-	-	-	-
216	62/ఉ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0900	మద్ది లచ్చయ్య (ఎర్రయ్య)	60	56	56	63	-	-	-	-
217	62/ఉ1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0300	బానోత్ సోమ్లా (గాంప్యా)	60	56	56	63	-	-	-	-
218	62/ఉ2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0300	ఉదావత్ భీకు (రాజా)	60	56	56	63	-	-	-	-
219	62/ఊ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0400	జయలక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	60	56	56	63	-	-	-	-
220	62/ఋ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.1400	మరిగె శ్రీను (వర్గుశాలు)	60	56	56	63	-	-	-	-
221	62/ఏ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0400	బొర్ర్వాల రాము (వెంకటయ్య)	60	56	56	63	-	-	-	-
222	62/ఐ/1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0200	జయలక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	60	56	56	63	-	-	-	-
223	62/ఐ/2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0200	జయలక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	60	56	56	63	-	-	-	-
224	62/ఒ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0200	జయలక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	60	56	56	63	-	-	-	-
225	62/ఓ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0200	జయలక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	60	56	56	63	-	-	-	-
226	63/అ/	పట్టా	మెట్ట/ఖుష్కి	0.3200	రమావత్ ధర్మ (దాస్)	60	65/5	62	65/1	-	-	-	-
227	63/ఆ/1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2000	రమావత్ రవి (రమావత్ మర్యా)	60	65/5	62	65/1	-	-	-	-
228	63/ఆ/2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2000	రమావత్ లచ్చీరాం (రమావత్ మర్యా)	60	65/5	62	65/1	-	-	-	-
229	63/ఇ	పట్టా	మెట్ట/ఖుష్కి	1.1500	రమావత్ మార్య (దేశ్యా)	60	65/5	62	65/1	-	-	-	-
230	63/ఈ/1	పట్టా	మెట్ట/ఖుష్కి	1.0800	మెగావత్ దీప్ల (దేవ్యా)	60	65/5	62	65/1	-	-	-	-
231	63/ఈ/2	పట్టా	మెట్ట/ఖుష్కి	1.0700	మెగావత్ శ్రీను (దేవ్యా)	60	65/5	62	65/1	-	-	-	-
232	63/ఉ/1/1/1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.1100	అరకం యాదయ్య (కృష్ణస్వామి)	60	65/5	62	65/1	-	-	-	-
233	63/ఉ/1/1/2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0300	యర్కాలి వెంకటేష్ (యర్కాలి కృష్ణస్వామి)	60	65/5	62	65/1	-	-	-	-
234	63/ఉ/1/1/2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0800	ఎరకం గణేశ్ (నర్సింహా)	60	65/5	62	65/1	-	-	-	-
235	63/ఉ/1/2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0800	ఎరకం మహేశ్ (నర్సింహా)	60	65/5	62	65/1	-	-	-	-
236	63/ఉ/2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0800	ఎరకం సత్తమ్మ (గోపాల్)	60	65/5	62	65/1	-	-	-	-
237	63/ఊ	పట్టా	మెట్ట/ఖుష్కి	1.3000	మద్ది లచ్చయ్య (ఎర్రయ్య)	60	65/5	62	65/1	-	-	-	-
238	63/ఊ/3	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2000	బానోతు సోమ్లా (గాంప్యా)	60	65/5	62	65/1	-	-	-	-
239	63/ఊ/4	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2000	ఉదావత్ భీకు (రాజా)	60	65/5	62	65/1				
240	63/ఎ/1/1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0700	జయ లక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	60	65/5	62	65/1				
241	63/ఎ 1/2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2000	జయ లక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	60	65/5	62	65/1				
242	63/ఎ/2/1	పట్టా	మెట్ట/ఖుష్కి	0.0700	జయ లక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	60	65/5	62	65/1				
243	63/ఎ/2/2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2000	జయ లక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	60	65/5	62	65/1				
244	63/ఎ/3	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2700	జయ లక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	60	65/5	62	65/1				
245	63/ఎ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2700	జయ లక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	60	65/5	62	65/1				
246	63/ఏ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.1500	కొంపల్లి యాదమ్మ (సిద్ధయ్య)	60	65/5	62	65/1				
247	63/ఐ	పట్టా	మెట్ట/ఖుష్కి	0.2100	జయ లక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	60	65/5	62	65/1				
248	63/ఒ/1	పట్టా	మెట్ట/ఖుష్కి	1.0500	మరిగ రాములమ్మ (వర్గుశాలు)	60	65/5	62	65/1				
249	63/ఓ	పట్టా	మెట్ట/ఖుష్కి	1.0800	బొర్ర్వాల రాము (వెంకటయ్య)	60	65/5	62	65/1				
250	63/ఔ/1	పట్టా	మెట్ట/ఖుష్కి	1.0500	మరిగె శ్రీను (వర్గుశాలు)	60	65/5	62	65/1				
251	63/ఔ/2	పట్టా	మెట్ట/ఖుష్కి	1.0300	చంద్రయ్య సర్ల (సాంబశివుడు)	60	65/5	62	65/1				
252	63/ఔ/3	పట్టా	మెట్ట/ఖుష్కి	0.1700	జయ లక్ష్మి గోసాల (దాశ కృష్ణ రెడ్డి)	60	65/5	62	65/1				
253	64/అ/1	పట్టా	మెట్ట/ఖుష్కి	3.1000	బతోని నర్సింహ (రాములు)	65/5	40/5	51	గ్రామ సరిహద్దు				
254	64/అ/3	పట్టా	మెట్ట/ఖుష్కి	1.0000	చంటా సంతోష్ (చంటా చంద్రశేఖర్)	65/5	40/5	51	గ్రామ సరిహద్దు				
255	64/ఆ/1	పట్టా	మెట్ట/ఖుష్కి	1.0000	బతోని శ్రీను (నర్సింహా)	65/5	40/5	51	గ్రామ సరిహద్దు				
256	64/ఆ/2	పట్టా	మెట్ట/ఖుష్కి	0.1000	చంటా సంతోష్ (చంటా చంద్రశేఖర్)	65/5	40/5	51	గ్రామ సరిహద్దు				
257	64/ఇ	పట్టా	మెట్ట/ఖుష్కి	1.1000	రమావత్ కోటి (బిచ్చ)	65/5	40/5	51	గ్రామ సరిహద్దు				
258	64/ఈ	పట్టా	మెట్ట/ఖుష్కి	2.2000	ఉడతల మల్లయ్య (బాలయ్య)	65/5	40/5	51	గ్రామ సరిహద్దు				
259	64/ఉ	పట్టా	మెట్ట/ఖుష్కి	1.3100	పంతంగి మల్లయ్య (సత్తయ్య)	65/5	40/5	51	గ్రామ సరిహద్దు				
260	65	ప్ర.భూమి/ప్రభుత్వ భూమి/ప్రభుత్వము	ప్ర.భూమి/ప్రభుత్వ భూమి/నర్సాంరి	6.2600	ప్రభుత్వ భూమి (ప్రభుత్వ భూమి)	63	65/7	64	65/4				
261	65/అ	లావణి పట్టా	మెట్ట/ఖుష్కి	2.0000	ఎరకం మారయ్య (కృష్ణయ్య)	65/2	65/4	63	66/1	-	-	-	-
262	65/ఆ	లావణి పట్టా	మెట్ట/ఖుష్కి	4.0000	రచ్చీర్ జంగయ్య (ఎల్లరెడ్డి)	గ్రామ సరిహద్దు	59	59	66/1	-	-	-	-
263	65/ఇ/1	లావణి పట్టా	మెట్ట/ఖుష్కి	0.3000	అయితగోని వెంకటయ్య (పొన్నయ్య)	63	గ్రామ సరిహద్దు	65/5	65/1	-	-	-	-
264	65/ఈ/1	లావణి పట్టా	మెట్ట/ఖుష్కి	0.1500	పోతరాజు సోమయ్య (ముత్తయ్య)	65/5	64	64	64	-	-	-	-
265	65/ఈ/2	లావణి పట్టా	మెట్ట/ఖుష్కి	0.1500	పోతరాజు జలేశ్ (మారయ్య)	65/5	64	64	64	-	-	-	-
266	65/ఉ	లావణి పట్టా	మెట్ట/ఖుష్కి	2.2000	రాంచంద్రయ్య అయితగోని (ఎల్లయ్య)	66/2	65/1	60	66/1	-	-	-	-
267	66	ప్ర.భూమి/ప్రభుత్వ భూమి/ప్రభుత్వము	ప్ర.భూమి/ప్రభుత్వ భూమి/నర్సాంరి	9.26	ప్రభుత్వ భూమి (ప్రభుత్వ భూమి)	గ్రామ సరిహద్దు	59	59	66/1				
	పూర్తి విస్తీర్ణం			ఎ.148.31 గు.లు									

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు కేంద్ర భూసేకరణ చట్టం 2013 (నెం. 30/2013)లోని నియమంలోని సెక్షన్ (11) 1 ప్రకారం సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీచేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు భూసేకరణ అధికారి మరియు రాజస్వ మండలాధికారి, ఇబ్రహీంపట్నం, డివిజన్ గారి కార్యాలయములో మరియు ఇ.ఇ.ఇరిగేషన్ డివిజన్ నెం. 11, మర్రిగూడ (గ్రా. & మ) కార్యాలయంలో అందుబాటులో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ వేళలలో తనఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం /జిల్లా కలెక్టర్, రంగారెడ్డి గారు రాజస్వ మండలాధికారి, ఇబ్రహీంపట్నం, డివిజన్ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ 12 ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణ కొరకు ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, రంగారెడ్డి గారి ముందస్తు అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరించబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయంలో సంబంధించిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరము ఉన్న యెడల, మరియు నష్టపరిహారము సంప్రదింపుల ద్వారా పరిష్కారం కొరకు చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం జిల్లా కలెక్టర్, రంగారెడ్డి మరియు రాజస్వ మండలాధికారి, ఇబ్రహీంపట్నం డివిజన్ గార్లకు లిఖిత పూర్వకంగా ప్రకటన జారీ చేసిన 60 (అరవై) దినముల లోపల తెలియచేయవలసి ఉన్నది.

సం/-	సం/-	సం/-	సం/-
తహశీల్దార్ మంచాల్ మండలం	రాజస్వ మండలాధికారి ఇబ్రహీంపట్నం డివిజన్	అదనపు కలెక్టర్ (రెవెన్యూ), రంగారెడ్డి	జిల్లా కలెక్టర్ రంగారెడ్డి

DIPR RO No. 712/LA-PP/Advt/Pub/2024-25


విద్యుత్ దీపాల వెలుగుల్లో రాజన్న ఆలయం

ఎములాడ రాజన్న జాతర షురూ


- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్
- నేడు మహాశివరాత్రి పర్వదినం

వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకొని, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. జాతర జాగరణ కోసం అంతా సిద్ధం చేశారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆర్జిత సేవలన్నింటినీ రద్దు చేసి కేవలం లఘు దర్శనాలకు మాత్రమే అనుమతించారు. భక్తులకు ఉచితంగా అల్పాహారం, భోజనవసతి కల్పించారు. రాజన్న గుడి చెరువులో రాష్ట్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో శివార్చనలో భాగంగా 1,500 మంది కళాకారులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి అధికారులు పెయిడ్ పాస్‌లు జారీచేశారు. ఏర్పాట్లను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆర్డీవో రాజేశ్వర్‌లు పరిశీలించారు.

పట్టువస్త్రాలు సమర్పణ


రాజన్న ఆలయంలో మంగళవారం మహాశివరాత్రి జాతర వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఈ వేడుకలు అత్యంత వైభవంగా కొనసాగనున్నాయి. స్వామివారికి రాష్ట్ర ప్రభుత్వపక్షాన పట్టు వస్త్రాలను మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌లు సమర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు సైతం శ్రీస్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.


రాజన్నకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్


మహాశివరాత్రి సందర్భంగా విద్యుద్దీప కాంతుల్లో వెలిగిపోతున్న నల్లగొండలోని పానగల్ ఛాయా సోమేశ్వర ఆలయం -సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

డీజీపీ పోస్టుపై గౌరవంతో నియంత్రించుకుంటున్నాం..!

- పోలీసులు వాస్తవాలను దాచి పెడుతూ తప్పుల మీద తప్పులు చేస్తున్నారు
- ఏపీ హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు..



సాక్షి, అమరావతి: డీజీపీ పోస్టుపై తమకు ఉన్న గౌరవంతో ఆయన వ్యక్తిగత హాజరుకు ఆదేశాలు ఇవ్వకుండా నియంత్రించుకుంటున్నామని ఏపీ హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. సోషల్ మీడియా యాక్టివిస్ట్ బొసా రమణ అరెస్ట్ విషయంలో పోలీసులు వాస్తవాలను దాచిపెట్టి తప్పుల మీద తప్పులు చేస్తున్నారని ఆక్షేపించింది. రమణ అరెస్ట్ వ్యవహారంలో నివేదిక ఇవ్వాలని ఆదేశించినా ఇంతవరకు డీజీపీ నుంచి అందలేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. కేసు సున్నితత్వాన్ని దృష్టిలో పెట్టుకునే డీజీపీ నుంచి నివేదిక కోరామని పేర్కొంది. రాతపూర్వకంగా ఆదేశాలు ఇస్తేనే నివేదిక సమర్పించాలని డీజీపీ భావిస్తే.. ఆ మేరకు ఆదేశాలు జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తేల్చి చెప్పింది. రమణ అరెస్ట్ విషయంలో విశాఖ పోలీస్ కమిషనర్, ప్రకాశం ఎస్పీ దాఖలు చేసిన నివేదికలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయని తప్పుబట్టింది. ఈ కేసులో పూర్తి వివరాలు సమర్పించేందుకు ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) అందుబాటులో లేనందున సహాయ న్యాయవాది అభ్యర్థన మేరకు విచారణను మార్చి 11వతేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావు ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులను విమర్శిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారంటూ విశాఖ జిల్లా మద్దిపాలెం, చైతన్యనగర్‌కి చెందిన బొసా రమణను పోలీసులు అరెస్ట్ చేశారు. తన భర్తను అక్రమంగా నిర్బంధించారని, ఆయన్ను కోర్టు ముందు హాజరుపరిచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ రమణ భార్య బొసా లక్ష్మి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరుపుతున్న జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడుతూ పలు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు వచ్చింది.

'సాక్షి'కి సభా హక్కుల ఉల్లంఘన నోటీసు

సభా హక్కుల సంఘానికి పంపిస్తామని ఏపీ స్పీకర్ వెల్లడి

సాక్షి, అమరావతి: శాసన సభలో మంగళవారం 'సాక్షి' మీడియాపై సభా హక్కుల ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ నందికొట్కూరు ఎమ్మెల్యే జి.జయసూర్య (టీడీపీ) సభలో స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. శాసనసభకు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులపై 'సాక్షి'పత్రికలో ప్రచురించిన కథనంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ విషయాన్ని సభ దృష్టికి తీసుకుని వచ్చారు. 'సాక్షి'యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. సభా హక్కుల సంఘానికి సిఫారసు చేయాలని స్పీకర్‌ను కోరారు. ఈ నేపథ్యంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించి సభ్యుడి ప్రతిపాదనను ఆమోదించినట్లు ప్రకటించారు. వెంటనే ఫిర్యాదును సభా హక్కుల సంఘానికి రిఫర్ చేస్తున్నానని, సంఘం తీసుకున్న నిర్ణయం ఆధారంగా 'సాక్షి'పై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సాక్షి హైదరాబాద్

బుధవారం ၊ 26 ၊ ఫిబ్రవరి ၊ 2025



నవజాత శిశువుల విక్రయం
గుజరాత్ నుంచి హైదరాబాద్‌కు నవజాత శిశువులను అక్రమంగా తరలించి.. విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. -10లో



యూరప్ పిలుస్తోంది..
అమెరికా డాలర్ కల కరిగిపోతోంది. బాగా చదువుకొని యూఎస్‌లో స్థిరపడాలనుకున్న యువత ఆశల రెక్కలను ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ తుంచేశాడు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/20.0

వాతావరణం
నగర పరిధిలో బుధవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 20 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



శివయ్యా.. పూజలందుకోవయ్యా!



విద్యుద్దీపాల కాంతుల్లో కీసర రామలింగేశ్వర స్వామి ఆలయం

బంజారాహిల్స్‌లో పండ్లు, పూల విక్రయాలు






మహా శివరాత్రికి శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి దర్శనానికి బుధవారం భక్తులు పోటెత్తనున్నారు. కాగా.. మంగళవారం నగరంలోని మార్కెట్లు పండ్లు, పూల కొనుగోళ్లతో సందడిగా మారాయి. వీటి ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. అరటి పండ్లు డజన్‌కు రూ.80 నుంచి రూ.100కు విక్రయించగా.. చిన్న సైజు పుచ్చకాయ రూ.50, పెద్దవి రూ.100, తెల్ల ద్రాక్ష కిలో రూ.150, నల్ల ద్రాక్ష రూ.250, కీర దోస రూ.70 చొప్పున విక్రయించారు. మరోవైపు పూల ధరలు కూడా పెరిగాయి. బాటసింగారం పండ్ల మార్కెట్‌కు గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో వివిధ రకాల పండ్లు దిగుమతులు అయ్యాతయి.

– సాక్షి, సిటీబ్యూరో/కీసర/బంజారాహిల్స్

బంజారాహిల్స్ రోడ్డు నెం-1లో..



స్టాండింగ్ కమిటీ సభ్యులకు సర్టిఫికెట్ల అందజేత



లక్డీకాపూల్: జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీకి ఎన్నికైన సభ్యులకు మంగళవారం సర్టిఫికెట్లను అందజేశారు. బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగిన నేపథ్యంలో గెలుపొందిన వారికి సెక్రటరీ సత్యనారాయణ ఆధ్వర్యంలో వీటిని అందించారు. కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి పాల్గొన్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులుగా గెలుపొందిన 15 మందిలో 10 మంది కమిటీ సభ్యులు మాత్రమే సర్టిఫికెట్లు అందుకున్నారు. వీరిలో కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి (చర్లపల్లి), బానోత్ సుజాత(హస్తినాపురం), సయ్యద్ మిన్హాజుద్దీన్ (అక్బర్ బాగ్), అబ్దుల్ వాహెబ్ (చాంద్రాయణగుట్ట), ప్రవీణ్ సుల్తానా (ఘాన్సీ బజార్), మహమ్మద్ సలీమ్ (దూద్‌బౌలి), డా.ఆయేషా హుమేరా(టోలిచౌకి), మహాలక్ష్మి రామన్ గౌడ్ (హిమాయత్ నగర్), సి.ఎన్.రెడ్డి (రహమత్ నగర్), బురుగడ్డ పుష్ప (రామచంద్రపురం)లు ఉన్నారు.

పాతకక్షలతో యువకుడి దారుణ హత్య



భానుప్రకాష్

మోతీనగర్: పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడు హత్యకు గురైన ఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అల్లాపూర్ సీఐ సామల వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట డివిజన్ కబీర్‌నగర్‌కు చెందిన ఎర్రోళ్ల భానుప్రకాష్ (26) ప్రైవేట్ ఉద్యోగి. గతంలో భాను ప్రకాష్‌కు, రాకేష్ అనే వ్యక్తికి మాదాపూర్‌లో పాత కక్షలు ఉండేవి. ఈ నేపథ్యంలో రాకేష్‌ను భానుప్రకాష్ తరచూ వేధిస్తుండేవాడు. సోమవారం రాత్రి శివాజీనగర్‌లో భాను ప్రకాష్ తన మిత్రుడు శ్రీధర్, రాకేష్ తన స్నేహితులు రాజేష్, రాహుల్, శివలతో కలిసి మద్యం తాగారు. ఈ క్రమంలో భాను ప్రకాష్, రాకేష్‌ల మధ్య వాగ్వాదం జరిగింది. భాను ప్రకాష్‌పై రాకేష్ తన మిత్రులతో కలిసి ఇటుక, గొడ్డలితో దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి మిత్రుడైన శ్రీధర్ తలకు సైతం గాయాలయ్యాయి. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు అల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ.. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి 100కు డయల్ చేయడంతో తమ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లారని, అప్పటికే భాను ప్రకాష్ హత్యకు గురయ్యాడని తెలిపారు.

నిర్మాణ అనుమతులు ఇక సులభతరం: మేయర్

లక్డీకాపూల్: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత పరిజ్ఞానంతో రూపొందించిన ఫాస్ట్ డ్రాయింగ్ స్క్రూటిని సిస్టం ద్వారా నిర్మాణ అనుమతుల ప్రక్రియ సులభతరం, వేగవంతమవుతుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బిల్డ్ నౌ ద్వారా నగర పౌరులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని నిర్మాణ అనుమతులను త్వరితగతిన పొందవచ్చన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఫాస్ట్ డ్రాయింగ్ స్క్రూటినీ సిస్టమ్ కోసం అధునాతన సాంకేతికతతో కూడిన యూనిఫైడ్ సింగిల్ విండో సిస్టమ్ అమలులో భాగంగా బిల్డ్ నౌ శిక్షణ తరగతులను మేయర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు, సీసీపీ శ్రీనివాస్, జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, అడిషనల్ సీసీపీలు గంగాధర్, ప్రదీప్ పాల్గొన్నారు.



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న మేయర్

గ్రీన్ ఫీల్డ్ రోడ్డుకు రతన్ టాటా పేరు

రావిర్యాల నుంచి ఆమన్‌గల్ వరకు నిర్మాణం

- ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు హెచ్ఎండీఏ నోటిఫికేషన్



రతన్ టాటా రోడ్డు నమూనా

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు 'రతన్ టాటా రోడ్డు'గా నామకరణం చేసింది. ఈ గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు ఔటర్ రింగ్ రోడ్డులోని టాటా ఇంటర్‌చేంజ్ (రావిర్యాల) నుంచి ఆమన్‌గల్ రీజినల్ రింగ్‌రోడ్డు వరకు విస్తరించనుంది. రెండు దశల్లో నిర్మించనున్న రతన్ టాటా రోడ్డు కోసం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) మంగళవారం ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు నోటిఫికేషన్ వెలువరించింది. ఆసక్తి ఉన్న నిర్మాణ సంస్థలు ఈ నెల 28 నుంచి టెక్నికల్ బిడ్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. మార్చి 21న టెక్నికల్ బిడ్స్ తెరుస్తారు. ఈ రోడ్డు స్కిల్ యూనివర్సిటీ, ఫ్యూచర్ సిటీలతో పాటు భవిష్యత్‌లో ఔటర్‌కు, రీజినల్ రింగ్‌రోడ్డుకు మధ్య విస్తరించనున్న పట్టణాలకు కీలకమైన కనెక్టివిటీ కానుంది.

రెండు దశల్లో విస్తరణ..

రావిర్యాల ఇంటర్‌చేంజ్ నుంచి ఆమన్‌గల్ వరకు 41.50 కిలోమీటర్ల రేడియల్ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును రెండు దశలుగా నిర్మించనున్నారు. మొదటి దశలో రావిర్యాల నుంచి (టాటా ఇంటర్‌చేంజ్) నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు 19.2 కిలోమీటర్లు పూర్తి చేస్తారు. ఇందుకోసం రూ.1,665 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. రెండోదశలో మీర్‌ఖాన్‌పేట్ నుంచి ట్రిపుల్ ఆర్ వద్ద ఆమన్‌గల్ వరకు రూ.2,365 కోట్లతో 22.3 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, యాచారం, కడ్తాల్, ఆమన్‌గల్ మండలాల్లోని 14 గ్రామాలకు ఈ రోడ్డుతో కనెక్టివిటీ సదుపాయం ఏర్పడనుంది.

ప్రత్యేకతలు ఇవీ..

- ఇది 100 మీటర్ల వెడల్పుతో కూడిన యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే. ఆరు లైన్ల ప్రధాన రహదారి (3+3 లేన్)
- ఈ రహదారిని భవిష్యత్‌లో 8 లైన్‌లకు (4+4) విస్తరించే అవకాశం ఉంది.
- గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు మధ్యలోనే మెట్రో కారిడార్ కోసం 20 మీటర్ల భూమిని కేటాయిస్తారు. ఈ మార్గంలో మెట్రో కారిడార్ రానుంది.
- గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు రెండు వైపులా 3-లైన్‌ల సర్వీస్ రోడ్లు ఉంటాయి. 2 మీటర్ల చొప్పున గ్రీన్‌బెల్ట్‌ను (పచ్చదనం) ఏర్పాటు చేస్తారు.
- రెండు వైపులా 3 మీటర్ల సైకిల్ ట్రాక్ నిర్మించనున్నారు. 2 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్ ఉంటుంది. మరో 2 మీటర్ల యుటిలిటీ కారిడార్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.
- టెండర్ పత్రాలు ఈ నెల 28 నుంచి హెచ్ఎండీఏ అధికారిక వెబ్‌సైట్ www.tender.telangana.gov.inలో అందుబాటులో ఉంటాయి.

నిరీక్షణకు తెర!

అంబర్‌పేట ఫ్లై ఓవర్‌కు లైన్ క్లియర్

- నేటి నుంచి వాహనాలకు అనుమతి



అంబర్‌పేట: ఏళ్ల తరబడి నిరీక్షణకు తెరపడింది. అంబర్‌పేటలోని వరంగల్ జాతీయ రహదారిపై నిర్మించిన ఫ్లైఓవర్‌పై బుధవారం నుంచి వాహనాలకు అనుమతించి ట్రాఫిక్ ఇబ్బందులను తీర్చాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన అధికారులతో కలిసి అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను పరిశీలించారు. గోల్నాక చర్చి నుంచి ఇరానీ హోటల్ వరకు కాలి నడకన అధికారులతో కలిసి ఫ్లై ఓవర్‌ను పరిశీలించారు. సుమారు రూ. 338 కోట్లతో ఫ్లైఓవర్ పైన నిర్మాణం పూర్తి కావడంతో శివరాత్రి నుంచి వాహనదారులను అనుమతిస్తే కింద ట్రాఫిక్ తగ్గి ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. ట్రాఫిక్‌ను తాత్కాలికంగా పైనుంచి అనుమతిస్తే కింద సర్వీస్ రోడ్డు పనులు పూర్తి చేయడానికి ఇబ్బందులు తొలగుతాయన్నారు. 'ఫ్లైఓవర్ నిర్మాణంలో భూ సేకరణ కీలకం. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్థల సేకరణ చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్థలాలను తక్షణమే సేకరించాల్సి ఉంది. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి లేఖలు రాశాను' అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన వెంట జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ మారుతీ దివాకర్, ఆర్ అండ్‌బీ ఈఈ ధర్మారెడ్డి, బీజేపీ నేతలు కృష్ణా యాదవ్, డాక్టర్ గౌతమ్‌రావు, ఓబీసీ అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, కార్పొరేటర్ కన్నె ఉమా రమేశ్ యాదవ్, అజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ వనం రమేశ్, చింతాల శ్రీనివాస్ ముదిరాజ్, నాగభూషణం చారి తదితరులు ఉన్నారు.



ఫ్లై ఓవర్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



పాత రేషన్ కార్డుల్లో 'పెండెన్సీ పరేషాన్'

పెండింగ్‌లో మూడు లక్షలకుపైగా దరఖాస్తులు

- వీటికి మోక్షం లభిస్తేనే కొత్త అర్జీలకు అవకాశం

మాదన్నపేటకు చెందిన వెంకట్‌కు ఆరేళ్ల క్రితం వివాహమైంది. కొత్తగా కాపురానికి వచ్చిన భార్య పేరును కుటుంబం తెల్ల రేషన్ కార్డులో చేర్పించేందుకు దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కొత్త సభ్యుల ఆమోదానికి మోక్షం లభించలేదు. తాజాగా ఉమ్మడి కుటుంబం నుంచి వేరుపడ్డారు. కొత్త రేషన్ కార్డు దరఖాస్తు చేసేందుకు ప్రయత్నించగా.. ఇప్పటికే దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నట్లు ఆన్‌లైన్‌లో కనిపించింది. పెండింగ్ దరఖాస్తుల ఆమోదం, తిరస్కరణ జరిగితే కానీ కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేకుండాపోయింది.

పదేళ్ల క్రితం సికింద్రాబాద్‌కు చెందిన సత్యనారాయణ కుటుంబానికి రేషన్ కార్డు మంజూరైంది. అందులో భార్య భర్తతో పాటు కుమారుడు లబ్ధిదారులుగా ఉన్నారు. రేషన్ కార్డులో మరో కుమారుడి పేరును చేర్పించేందుకు 2017లో దరఖాస్తు చేసుకున్నాడు. ఇప్పటి వరకు ఆమోదం లభించలేదు. ఆ తర్వాత ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు. ప్రస్తుతం వారి వయసు ఐదేళ్లు దాటింది. తాజాగా రేషన్ కార్డులో వారి పేర్లను నమోదు చేయించేందుకు మీ సేవ కేంద్ర ద్వారా ప్రయత్నించారు. ఇప్పటికే దరఖాస్తు పెండింగ్‌లో ఉన్న కారణంగా క్లియర్ అయ్యేవరకు కొత్త దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు లేకుండా పోయింది. రెండు కుటుంబాల సమస్య కాదు ఇది. నగరంలోని చాలా కుటుంబాలు ఎదుర్కొంటున్నదే.

సాక్షి, సిటీబ్యూరో: పాత రేషన్ కార్డుల్లో పెండెన్సీ దరఖాస్తులు కొత్త సమస్య తెచ్చిపెడుతున్నాయి. ఇప్పటికే చేర్పులు.. మార్పుల కోసం చేసుకున్న దరఖాస్తులు క్లియర్ అయితే తప్ప కొత్తగా అర్జీలు పెట్టుకునేందుకు వెసులుబాటు లేకుండా పోయింది. ఎనిమిదేళ్లుగా రేషన్‌కార్డులోని సభ్యులు (యూనిట్లు) వివిధ సాకులతో తొలగింపునకు గురవుతున్నా.. కొత్త సభ్యుల చేర్పుల దరఖాస్తులకు మాత్రం మోక్షం లభించడం లేదు. ఈ వ్యవధిలో ఉమ్మడి కుటుంబాలు రెండు, మూడుగా ఏర్పడగా.. మరోవైపు కుటుంబంలో మరికొందరు కొత్త సభ్యులుగా చేరారు. కనీసం వీరికి కొత్తగా రేషన్ కార్డు కోసం, చేర్పులు మార్పులు కోసం దరఖాస్తు చేసుకునే వీలు లేక ఆందోళనకు గురవుతున్నారు.

రేషన్ కార్డులో కొత్త సభ్యుల చేర్పుల ప్రక్రియ పెండింగ్‌లో మగ్గుతోంది. గ్రేటర్ పరిధిలో సుమారు 17,21,603 రేషన్ కార్డులు ఉండగా, అందులో 59,00,584 సభ్యులు ఉన్నారు. అందులో సుమారు మూడు లక్షల కుటుంబాలు తొమ్మిది లక్షల కొత్త సభ్యుల పేర్ల నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఆన్‌లైన్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పులు కోసం దరఖాస్తుల స్వీకరణ కొనసాగిస్తూనే... ఆమోదించే ఆప్షన్‌ను మాత్రం ప్రభుత్వం నిలిపివేసింది. అయితే.. రేషన్ కార్డులోని సభ్యుల తొలగింపు నిరంతరం ప్రక్రియగా సాగుతోంది. ఆమోదం లేక పోవడంతో నిరుపేద కుటుంబాలు మీ సేవ, సివిల్ సప్లయ్ ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.



రేషన్‌కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పుల కోసం దరఖాస్తులు ఇలా..

పౌరసరఫరాల శాఖ సర్కిల్	దరఖాస్తులు
మలక్‌పేట-1	12,805
యాకుత్‌పురా-2	18,825
చార్మినార్-3	24,129
నాంపల్లి-4	5,430
మెహిదీపట్నం-5	17,143
అంబర్‌పేట-6	9,294
ఖైరతాబాద్-7	15,047
బేగంపేట్-8	10,926
సికింద్రాబాద్-9	8,626

వచ్చే నెలలో వివాహం.. అంతలోనే విషాదం

కారు రూపంలో దూసుకొచ్చిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములిద్దరూ దుర్మరణం
- యాద్గార్‌పల్లి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో ఘటన



చంద్రశేఖర్ (ఫైల్)



మత్స్యగిరి (ఫైల్)

కీసర: బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో అన్నదమ్ములిద్దరూ మృతి చెందిన విషాద ఘటన సోమవారం రాత్రి యాద్గార్‌పల్లి ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డులో జరిగింది. మృతుల్లో తమ్ముడికి వచ్చే నెలలో వివాహం జరగాల్సి ఉండగా.. అంతలోనే రోడ్డు ప్రమాదం అతడిని బలిగొనడంతో ఆ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. కీసర సీఐ శ్రీనివాస్, ఎస్ఐ నాగరాజు చెప్పిన వివరాల ప్రకారం.. యాదాద్రి-భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం రహీంఖాన్ గూడకు చెందిన గూడూరు చంద్రశేఖర్ (36) బతుకుదెరువు నిమిత్తం కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చాడు. తార్నాక ప్రాంతంలో టైలర్‌గా పని చేస్తున్నాడు. లాలాపేట శాంతినగర్‌లో ఉండే అతని సోదరుడు మత్స్యగిరి (27) విజయ డెయిరీలో పని చేస్తున్నాడు. వీరిద్దరూ కలిసి సోమవారం తమ అల్లుడు శ్రీను (17)తోకలిసి సోమవారం యాద్గార్‌పల్లిలోని బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వచ్చారు. ఇదే రోజు రాత్రి తిరిగి నగరానికి వెళ్తుండగా యాద్గార్‌పల్లి- చీర్యాల ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డులో ఎదురుగా అతివేగంతో వచ్చిన కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ముగ్గురు రోడ్డుపై పడిపోయారు. తీవ్ర గాయాలతో చంద్రశేఖర్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మత్స్యగిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్ను మూశాడు.

చంద్రశేఖర్‌కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. మార్చి 20న మత్స్యగిరి వివాహం జరగాల్సి ఉంది. రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములిద్దరూ మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నగరంలోని గాంధీ ఆసుపత్రిలో పోస్టు మార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాదంలో గాయపడిన శ్రీను ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆ ట్రావెల్స్ జోలికి వెళ్లొద్దు

ప్రైవేట్ బస్సుల అక్రమ రవాణాపై ఆర్టీఏ పక్షపాతం

- కొన్ని ట్రావెల్స్‌కు మినహాయింపు
- విస్మయానికి గురవుతున్న ఎంవీఐలు
- స్టేజీ క్యారియర్‌లపై కొనసాగుతున్న దాడులు
- ఆల్ ఇండియా పర్మిట్‌లతో స్టేజీ క్యారియర్ సేవలు



సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేట్ బస్సుల అక్రమ రవాణాపై ఆర్టీఏ కొరడా ఝుళిపించింది. కొద్దిరోజులుగా తనిఖీలను విస్తృతం చేసింది. ఇంతవరకు బాగానే ఉంది. కానీ.. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ట్రావెల్స్‌లో సుమారు 20 సంస్థలకు మాత్రం ఈ దాడుల నుంచి మినహాయింపునివ్వడం గమనార్హం. ఈ మేరకు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లకు పైనుంచి ఆదేశాలు అందాయి. హైదరాబాద్ నుంచి ఏపీలోని విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, కాకినాడ, కడప, కర్నూలు తదితర ప్రాంతాలకు ప్రతి రోజు సుమారు 1000 బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. టూరిస్ట్ బస్సులుగా పర్మిట్‌లు తీసుకొని స్టేజీ క్యారియర్లుగా నడుపుతున్నారు. సుమారు 70 ట్రావెల్స్ హైదరాబాద్ కేంద్రంగా తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలకు కూడా సర్వీసులను నడుపుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నడిచే బస్సులపై రవాణాశాఖ చర్యలు తీసుకుంటుంది. పన్ను చెల్లించకుండా తిరిగే వాటిపై భారీ మొత్తంలో జరిమానా విధిస్తున్నారు. ఇందుకోసం అధికారులు ప్రత్యేక తనిఖీ బృందాలను రంగంలోకి దింపారు. ప్రతిరోజూ ఒక్కో ఆర్టీఏ కార్యాలయం పరిధిలో తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయాలని నిర్దేశించారు. కానీ.. కొన్నింటిని మాత్రం ఈ దాడుల నుంచి మినహాయించడంపై మోటారు వాహన తనిఖీ అధికారులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పై నుంచి ఆదేశాలు..

సాధారణంగా ఆల్ ఇండియా పర్మిట్‌లు తీసుకొని తిరిగే టూరిస్ట్ బస్సులపై ఎలాంటి తనిఖీలు ఉండవు. కాగా.. ఈ బస్సులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి పర్యాటకులను మాత్రమే తీసుకెళ్లాల్సి ఉంటుంది. స్టేజీ క్యారియర్లుగా నడపడానికి వీల్లేదు. ఆల్ ఇండియా పర్మిట్‌లకు ఏసీ బస్సులకు రూ.90 వేలు, నాన్‌ఏసీ బస్సులకు రూ.60 వేల చొప్పున చెల్లించాలి. ఇంటర్‌స్టేట్ పర్మిట్‌లకు మాత్రం ఒక్కో సీట్‌కు రూ.4000 చొప్పున ప్రతి 3 నెలలకు ఒకసారి పన్ను చెల్లించి పర్మిట్‌లను పొందాల్సి ఉంటుంది. ఇంటర్ స్టేట్ పర్మిట్ కంటే ఆల్ ఇండియా పర్మిట్ ఫీజు తక్కువగా ఉండడంతో ట్రావెల్స్ సంస్థలు ఆల్ ఇండియా పర్మిట్‌లపైనే బస్సులను నడుపుతున్నాయి. టూరిస్ట్ బస్సులుగా మాత్రమే నడపాల్సి ఉండగా, అందుకు భిన్నంగా ఆన్‌లైన్‌లో టికెట్ బుకింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేసుకొని పలు స్టేజీల వద్ద ప్రయాణికులను తీసుకెళ్తున్నాయి. మోటారు వాహన నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఈ అక్రమ రవాణాను లక్ష్యంగా చేసుకొని అధికారులు దాడులు కొనసాగిస్తున్నారు.

ఆ ట్రావెల్స్‌కు మినహాయింపు ఎందుకో?

ట్యాక్సీ చెల్లించకుండా తిరిగే బస్సులు పట్టుబడితే ఒక్కో క్వార్టర్‌కు (3 నెలలకు) సుమారు రూ.1.4 లక్షల నుంచి రూ.1.6 లక్షలకు వరకు చెల్లించాల్సి వస్తుంది. మూడేళ్లుగా ఈ క్వార్టర్లీ ట్యాక్స్ చెల్లించకుండా తిరుగుతున్న బస్సులు పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి. తమకు ఆల్ ఇండియా పర్మిట్ ఉందనే ధీమాతో ఇంటర్‌స్టేట్ పర్మిట్‌లు తీసుకోకుండా తిరుగుతున్నాయి. గత మూడేళ్లలో పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోయాయి.ఈ క్రమంలోనే కొన్ని ట్రావెల్స్ సంస్థలు పై స్థాయిలో పైరవీలు చేసుకొని తనిఖీల నుంచి మినహాయింపు పొందినట్లు సమాచారం. నిబంధనలు అందరికీ ఒకేలా ఉండాలని, ఆర్టీఏ ధోరణి సరైంది కాదని ఇతర ట్రావెల్స్‌కు చెందిన ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

నవజాత శిశువుల విక్రయం!

- ఆడ బిడ్డకు రూ.1.5 లక్షలు, మగ బిడ్డకు రూ.2.5 లక్షల చొప్పున అమ్మకం
- గుజరాత్ నుంచి రైళ్లల్లో అక్రమంగా పసికందుల తరలింపు
- తెలుగు రాష్ట్రాల్లో పిల్లలు లేని తల్లిదండ్రులకు అప్పగింత
- గత నెల రోజుల్లో నలుగురు పిల్లల్ని విక్రయించిన ముఠా
- 11 మందిని అరెస్టు చేసిన రాచకొండ పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు, ఇతర పోలీసు ఉన్నతాధికారులు

సాక్షి, సిటీబ్యూరో: గుజరాత్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా నవజాత శిశువులను తరలించి, విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టు రట్టయింది. అహ్మదాబాద్‌లోని ప్రధాన సూత్ర ధారి నుంచి ఆడబిడ్డకు రూ.1.5 లక్షలు, మగ బిడ్డకు రూ.2.5 లక్షల చొప్పున ఇచ్చి కొనుగోలు చేసి, రూ.4-5 లక్షలకు నగరంలో పిల్లలు లేని దంపతులకు విక్రయిస్తుండగా..నిందితులను, కొనుగోలు చేసిన తల్లిదండ్రులను రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. ఆయా వివరాలను కమిషనర్ జి.సుధీర్‌బాబు మంగళవారం మీడియాకు వెల్లడించారు.

- సూరారంకు చెందిన కోల కృష్ణవేణి నగరంలో ఓ కంపెనీ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తోంది. ఈమెకు సంతానం కలుగకపోవడంతో భర్తకు విడాకులిచ్చింది. ఈ క్రమంలో ఏడాది క్రితం బిడ్డను కొనుగోలు చేయడం/దత్తత తీసుకోవడంలో తనకు సహకరించాలని కోరుతూ కృష్ణవేణికి తెలిసిన వ్యక్తి ఒకరు ఆమెను సంప్రదించారు. దీంతో ఆమె సామాజిక మాధ్యమాలలో వెతకగా..ఢిల్లీకి చెందిన మనోజ్‌తో పరిచయం ఏర్పడింది. రూ.5 లక్షలకు డీల్ కుదుర్చుకున్న మనోజ్.. మగ బిడ్డను హైదరాబాద్‌కు తీసుకొచ్చి విక్రయిస్తుండగా గోపాలపురం పోలీసులు పట్టుకున్నారు. మనోజ్‌తో పాటు కృష్ణవేణిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

జైలు నుంచి బయటికొచ్చాక..

జైలు నుంచి బయటికొచ్చాక కృష్ణవేణి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. సులభంగా డబ్బు సంపాదించే మార్గం కావడంతో మళ్లీ అక్రమంగా పిల్లలను విక్రయించే దందాను ప్రారంభించింది. గతంలో పరిచయమైన పిల్లల విక్రయం, తరలించే సభ్యులతో కలిసి ముఠాను ఏర్పాటు చేసింది. కొత్తపేటకు చెందిన బట్టు దీప్తి, ఈమె భర్త శ్రవణ్ కుమార్, గుజరాత్‌కు చెందిన గౌతమ్, సావిత్రి దేవి, ఫలక్‌నుమాకు చెందిన శారద, కవాడిగూడకు చెందిన సంపత్ కుమార్‌లతో కలిసి గ్యాంగ్‌ను ఏర్పాటు చేసింది. సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడిన గుజరాత్‌కు చెందిన వందన అనే మహిళ నుంచి నవజాత శిశువుల విక్రయ ఒప్పందం చేసుకుంది. సునీత సుమన్, సావిత్రీ దేవిలు పిల్లలను రైళ్లలో హైదరాబాద్‌కు తీసుకొచ్చేవారు. అనంతరం మధ్యవర్తులు శారద, ఉమారాణి, జయశ్రీ, శ్రవణ్, సోని కీర్తిల ద్వారా పిల్లలు లేని తల్లిదండ్రులకు విక్రయించేవారు. ఒక్కో బిడ్డ విక్రయం మీద మధ్యవర్తులకు ఒక్కో శిశువు మీద రూ.50 వేల చొప్పున కమీషన్ అందించేది.

విద్యావంతులే కొనుగోలుదారులు...

అక్రమంగా పిల్లలను కొనుగోలు చేసిన వారిలో విద్యావంతులు, ఉన్నత హోదాల్లో ఉన్నవారే అధికంగా ఉన్నారు. విజయవాడలోని ఎస్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఓగుటి నాగవెంకట పవన్ భగవాన్, భార్య రమా శ్రావణి, సైదాబాద్‌కు చెందిన తెప్పల వినయ్ కుమార్, భార్య స్వాతి, మహబూబాబాద్‌కు చెందిన లింగల రమేష్‌లపై పిల్లలను కొనుగోలు చేసినందుకు గాను జువైనల్ జస్టిస్ చట్టం (జేజే) కింద కేసులు నమోదు చేశారు. వీరి మీద బీఎన్ఎస్ చట్టం సెక్షన్ 143(4)(5) రెడ్‌విత్ 3(5)లతో పాటు జేజే సెక్షన్ 80, 81, 87, 88ల కింద కూడా కేసులు నమోదు చేశారు.

డబ్బు కోసం వచ్చి పోలీసులకు చిక్కి..

ఈ ముఠా అక్రమంగా పిల్లలను విక్రయించడంతో పాటు నకిలీ జనన ధృవీకరణ పత్రాలు, దత్తత ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డులను సృష్టిస్తున్నారు. వీటిని శిశువులను కొనుగోలు చేసిన తల్లిదండ్రులకు అందజేస్తున్నారు. ఈక్రమంలో పిల్లలను కొనుగోలు చేసిన పేరెంట్స్ మొత్తం సొమ్ము ఇవ్వకపోవడంతో వారిని హైదరాబాద్‌కు రప్పించారు. ఈమేరకు విశ్వసనీయ సమాచారం అందడంతో మల్కాజ్‌గిరి స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ), చైతన్యపురి పోలీసులు, సీడబ్ల్యూసీ అధికారులతో కలిసి చైతన్యపురి బస్టాప్ వద్దకు చేరుకున్నారు. కృష్ణవేణి, సావిత్రి, సంపత్‌లు పసికందును ఎత్తుకొని అనుమానాస్పదంగా సంచరిస్తుండటం గమనించారు. వారిని అరెస్టు చేసి విచారించగా..మరో నిందితురాలు దీప్తి ఇంట్లో మరో ముగ్గురు శిశువులను గుర్తించారు. పిల్లలను సీడబ్ల్యూసీ అధికారులకు అప్పగించారు. 11 మందిని అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

వందన చిక్కితేనే గుట్టు తెలిసేది..

ఈ కేసులో అహ్మదాబాద్‌కు చెందిన ప్రధాన సూత్రధారి వందన చిక్కితేనే అసలు గుట్టు వీడుతుంది. అసలు పిల్లలను ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు? ఆసుపత్రి, ఇతరత్రా ప్రదేశాల నుంచి అపహరిస్తున్నారా? లేక తల్లిదండ్రులే పిల్లలను విక్రయిస్తున్నారా? కృష్ణవేణి తరహాలో ఇంకా ఎంత మంది ఉన్నారు వంటి అన్ని అంశాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు తెలిపారు. నిందితులు అరెస్టు కాగానే.. వందన సైతం ఫోన్ స్విచాఫ్ చేసుకొని, అజ్ఞాతంలోకి వెళ్లిపోయిందని, దీంతో ప్రత్యేక బృందాలతో ఆమె కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లకు సర్టిఫికెట్ల పంపిణీ

మీర్‌పేట: ట్రాన్స్‌జెండర్స్ తమ నైపుణ్యాన్ని బట్టి ఉద్యోగం, స్వయం ఉపాధి లేదా ఇతర వ్యాపారాలు చేసినప్పుడే సమాజంలో గౌరవం లభిస్తుందని ఎల్బీనగర్ డీసీపీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ప్రజ్వల ఫౌండేషన్ వికల్ప్ సెంటర్ ఆధ్వర్యంలో మీర్‌పేట ఠాణాలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్స్ కోసం ప్రజ్వల ఫౌండేషన్ వారు వికల్ప్ సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వికల్ప్ సెంటర్‌ను ఇప్పటివరకు 310 మంది సందర్శించగా, 41 మందికి ఉపాధి, 32 మందికి స్వయం ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. దీంతో పాటు 15 మంది ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు.


మాసబ్ చెరువులో మట్టి డంపు చేస్తే చర్యలు



తుర్కయంజాల్: మాసబ్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పరిధిలో అక్రమంగా మట్టిని డంప్ చేస్తే వాల్టా చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని ఇరిగేషన్ డీఈ చెన్న కేశవ రెడ్డి, ఏఈ వంశీ హెచ్చరించారు. సర్వే నంబర్ 173, 175లో ఇటీవల సత్యనారాయణ అనే వ్యక్తి డంప్ చేసిన మట్టిని మంగళవారం రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి తొలగింపు పనులు చేపట్టారు. సాయంత్రం వరకు సుమారు 1000 క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించామని, మరో 500 క్యూబిక్ మీటర్ల మట్టి డంప్ ఉందని, దాన్ని కూడా పూర్తిగా తొలగిస్తామని పేర్కొన్నారు. మట్టిని డంప్ చేసి చెరువు ఆక్రమణకు యత్నించిన సత్యనారాయణపై చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నిజాం తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీ రామలింగేశ్వరుడి కల్యాణం

స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి





కల్యాణోత్సవంలో పాల్గొని..స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మహేందర్‌రెడ్డి దంపతులు

కీసర: కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యఘట్టమైన శ్రీ భవానీ శివదుర్గా సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారి కల్యాణం మంగళవారం రాత్రి అశేష భక్తజనుల సమక్షంలో శోభాయమానంగా జరిగింది. రాత్రి 8 గంటల సమయంలో కీసరలో శ్రీ స్వామివారికి మేళతాళాలతో వేదపండితులు ఎదుర్కోలు పలికారు. అనంతరం నందివాహనంపై స్వామివారు కీసరగుట్టకు చేరుకున్నాక విశేష పూజలు నిర్వహించారు. ఆ తర్వాత సుమారు గంటన్నరపాటు వేదపండితులు స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ప్రభుత్వం తరపున ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి, జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తటాకం నారాయణ దంపతులు, ఈఓ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్(పరిపాలన)గా వేణుగోపాల్

సాక్షి,సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ (పరిపాలన)గా కె.వేణుగోపాల్‌ను నియమించారు. ప్రస్తుతం ఈ పోస్టులో ఉన్న జి.నళినీ పద్మావతిని బదిలీ చేశారు. ఆమెకు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. ప్రస్తుతం కమిషనర్ ఓఎస్డీగా పనిచేస్తున్న వేణుగోపాల్ రెండుబాధ్యతలు నిర్వహించనున్నారు. ఈమేరకు మంగళవారం పొద్దుపోయాక కమిషనర్ ఇలంబర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనకు 'వాకథాన్'



సాక్షి, సిటీబ్యూరో: ఆర్థిక అంశాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) డిప్యూటీ జనరల్ మేనేజర్ జగదీష్ కుమార్ అన్నారు. ఆర్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉస్మానియా వర్సిటీ క్యాంపస్‌లో 2 కి.మీ. వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత మహిళలకు మరింత ముఖ్యమని, గృహిణులు, ఉద్యోగినులు, మహిళా ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ప్రత్యేక అవగాహన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీజీఎం రాజేష్ కుమార్ తదితరులు మాట్లాడారు. వాక్‌థాన్‌లో బ్యాంక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్‌పై కారు దగ్ధం

– ఎయిర్ పోర్టుకు వెళ్తుండగా ఘటన



పటాన్‌చెరు టౌన్: ఎయిర్ పోర్టుకు వెళ్తుండగా ఓఆర్ఆర్‌పై కారు దగ్ధమైన ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్‌లోని మల్లంపేటకు చెందిన రామకృష్ణ భగవాన్ కారులో మంగళవారం సుల్తాన్‌పూర్ ఓఆర్ఆర్ నుంచి ఎయిర్ పోర్ట్‌కు వెళ్తున్నాడు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాటీ సమీపంలోకి రాగానే కారులో నుంచి పొగలు రావడం గమనించాడు. భగవాన్ వెంటనే కారును పక్కకు నిలిపి చూడగా అప్పటికే కారులోంచి మంటలు వ్యాపించాయి. కొద్దిసేపటికే కారు పూర్తిగా కాలిపోయింది.

పొట్టకూటికి వచ్చి వాగులో పడి మృతి

మృతుడు హైదరాబాద్‌లోని ఈసీఐఎల్ వాసి



అంజయ్య మృతదేహం

మర్కూక్(గజ్వేల్): ప్రమాదవశాత్తు కూడవెల్లి వాగులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌కు చెందిన బొంత అంజయ్య (40) రోజు మాదిరిగానే మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసొచ్చి నర్సన్నపేట, ఎర్రవల్లి గ్రామాల మధ్య రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలకు గుంతలు తీస్తున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో పక్కనే కూడవెల్లి వాగులో కాళ్లు, చేతులు కడుక్కోవడానికి వెళ్లారు. ముందుగా వెళ్లిన అంజయ్య చేతులు కడుగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి వాగులో పడిపోయాడు. వెంటనే కూతురు భారతి, అల్లుడు నవీన్ తమ వద్ద ఉన్న చీరను చెరువులోకి విసిరి కాపాడే ప్రయత్నం చేశారు. ఈత రాకపోవడంతో అప్పటికే అంజయ్య చెరువులో మునిగిపోయాడు. వారి అరుపులు విన్న గ్రామస్తులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కూతురు భారతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉద్యోగం పేరిట ఊడ్చేశారు!

- నగర యువకుడి నుంచి రూ.15.88 లక్షలు స్వాహా
- నిందితుడి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: వివిధ నగరాల్లో ప్రైవేట్ ఉద్యోగాలతో పాటు విదేశాల్లోనూ కొలువులు ఇప్పిస్తానంటూ ఆన్‌లైన్ ద్వారా ఎర వేసి, అందినకాడికి దండుకుంటూ మోసం చేస్తున్న ఉత్తరప్రదేశ్ వాసిని సిటీసైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఓ యువకుడి నుంచి రూ.15.88 లక్షలు కాజేయడంతో ఇక్కడ కేసు నమోదైందని, దేశ వ్యాప్తంగా నిందితుడిపై ఐదు కేసులు ఉన్నట్లు గుర్తించామని డీసీపీ దార కవిత మంగళవారం ప్రకటించారు. యూపీకి చెందిన ధర్మేంద్రకుమార్ అలియాస్ రోషన్ ఢిల్లీ కేంద్రంగా కాల్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. వివిధ సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో దేశవిదేశాల్లో ఉద్యోగాల పేరుతో ప్రకటనలు ఇస్తాడు. వీటికి ఆకర్షితులైన వాళ్లు అందులో ఉన్న ఫోన్ నెంబర్లకు కాల్ చేస్తుంటారు. వీటిని అందుకునే కాల్ సెంటర్‌లోని ఉద్యోగులు ఆకర్షణీయంగా మాట్లాడుతూ బుట్టలో వేసుకుంటారు. ఆపై బయోడేటా పంపమని, నకిలీ ఇంటర్వ్యూలు చేసి ఉద్యోగం ఖాయమంటారు. చివరకు సెక్యూరిటీ, రిఫండబుల్ డిపాజిట్ పేరుతో అందినకాడికి దండుకుని మోసం చేస్తుంటారు. అమీర్‌పేటకు చెందిన ఓ వ్యక్తి (49) ఈ కాల్ సెంటర్‌ను సంప్రదించగా... నగరంలోనే ఉన్న ఆప్టియం కంపెనీలో ఉద్యోగం ఖరారైనట్లు చెప్పారు. అతడి నుంచి రూ.15.88 లక్షలు కాజేసి మోసం చేశారు. బాధితుడు సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ కె.మధుసూదన్‌రావు దర్యాప్తు చేపట్టారు. ఎస్ఐ మహిపాల్, హెడ్-కానిస్టేబుల్ మహేశ్వర్‌రెడ్డి సహకారంతో సాంకేతిక దర్యాప్తు చేసి ప్రధాన నిందితుడు ధర్మేంద్రకుమార్‌గా గుర్తించారు. అక్కడకు వెళ్లిన ప్రత్యేక బృందం ఇతడిని అరెస్టు చేసి తీసుకువచ్చింది.

ఉమెన్స్ డే రోజు 'రన్ ఫర్ యాక్షన్-2025'

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో మార్చి 8న నగర షీ-టీమ్స్ 'రన్ ఫర్ యాక్షన్-2025' పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. పీవీ నర్సింహారావు మార్గ్‌లోని పీపుల్స్ ప్లాజాలో జరిగే ఈ 5కే, 2కే పరుగుకు సంబంధించిన పోస్టర్‌ను కొత్వాల్ సీవీ ఆనంద్ మంగళవారం ఆవిష్కరించారు. వీటిలో పాల్గొనాలని భావించే వారు (https://rfa.bebetter.run) వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మహిళా భద్రత విభాగం డీసీపీ లావణ్య తెలిపారు. 'మహిళల భద్రతకు అవసరమైన చర్యలు వేగవంతం చేయండి' అనే థీమ్‌తో ఈ రన్ నిర్వహిస్తున్నారు.

మార్చి 1 నుంచి జూ పార్కు ఎంట్రీ టికెట్ ధరల పెంపు

చార్మినార్: నగరంలోని నెహ్రూ జూలాజికల్ పార్క్ ఎంట్రీ టికెట్ రేట్లను పెంచారు. జూ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ 13వ గవర్నింగ్ బాడీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. పెద్దలకు టికెట్ ధర రూ.100, చిన్నారులకు రూ.50కి పెంచారు. ఈ రేట్లు సందర్శకులకు మార్చి 1వ తేదీ (శనివారం) నుంచి అమలులోకి వస్తాయని జూ క్యూరేటర్ ఒక ప్రకటనలో తెలిపారు.

టార్గెట్ స్పా సెంటర్స్!

- నగరంలో రెచ్చిపోతున్న ప్రైవేట్ సైన్యం
- పోలీసుల పేరుతో స్పాలకు వెళ్లి సోదాలు
- డీవీఆర్‌లు స్వాధీనం చేసుకుని వీరంగం
- ఆపై పలు చోట్లకు పిలిచి భారీగా వసూళ్లు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ ముఠా పశ్చిమ మండలంలోని స్పా సెంటర్లను టార్గెట్‌గా చేసుకుంది. ఆయా సెంటర్లకు కస్టమర్‌గా వెళ్లి, అసాంఘిక కార్యకలాపాల రంగు పూసి, సోదాలు చేసి, భయభ్రాంతులకు గురి చేసి, సెటిల్‌మెంట్‌కు పిలిచి, అందినకాడికి దండుకుంటోంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సోమాజిగూడ సహా అనేక చోట్ల పంజా విసిరిన ఈ ముఠా ఇప్పటికి దాదాపు రూ.50 లక్షల వరకు కొల్లగొట్టినట్లు సమాచారం. ఈ గ్యాంగ్‌కు కొందరు పోలీసులు కూడా సహకరిస్తున్నట్లు తెలుస్తోంది.

ఫోన్ చేసి, కస్టమర్‌గా వెళ్లి...

వెస్ట్‌జోన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న స్పా లేదా మసాజ్ సెంటర్ వద్ద రెక్కీ నిర్వహిస్తున్న ఈ ముఠా అనువైన దాన్ని టార్గెట్ చేసుకుంటోంది. కొన్ని సందర్భాల్లో ఆన్‌లైన్‌లోనూ వీటిని ఎంపిక చేసుకుంటోంది. ఆపై దాని ఫోన్ నెంబర్ సేకరించే ఈ ముఠా సభ్యుడు నిర్వాహకులకు కాల్ చేస్తాడు. కస్టమర్ మాదిరిగా మాట్లాడుతూ ఆయా సెంటర్లు అందించే సేవలు, వాటి రుసుముల్ని తెలుసుకుంటాడు. ఈ తంతు పూర్తయిన తర్వాత వినియోగదారుడి మాదిరిగా ఆ సెంటర్‌కు వెళ్లే అతగాడు తనతో పాటు కండోమ్ ప్యాకెట్లు తీసుకువెళ్తాడు. ఇతడు వెళ్లే సమయంలో మిగిలిన ముఠా సభ్యులు ఆ సెంటర్‌కు సమీపంలోనే వేచి ఉంటారు. స్పా సెంటర్‌లోకి వెళ్లిన ముఠా సభ్యుడు అదును చూసుకుని తనతో తెచ్చిన కండోమ్ ప్యాకెట్లను మసాజ్ టేబుల్ కింద పడేస్తాడు. ఆ తర్వాత మిగిలిన వారికి సందేశం ఇచ్చి పోలీసుల మాదిరిగా రమ్మంటాడు.

దాడి చేసి, హడావుడి చేస్తూ....

ఈ సందేశం అందుకున్న వెంటనే సమీపంలో వేచి ఉన్న ముఠా సభ్యులు పోలీసుల మాదిరిగా ఆ సెంటర్‌పై దాడి చేస్తారు. తొలుత సీసీ కెమెరాలను ఆపేసి, వాటి దృశ్యాలు రికార్డు అయ్యే డిజిటల్ వీడియో రికార్డర్ (డీవీఆర్) స్వాధీనం చేసుకుంటున్నారు. స్పా మొత్తం సోదాలు చేస్తున్నట్లు నటిస్తూ తమ ముఠా సభ్యుడు ఉన్న గదిలోకి వెళ్తారు. అక్కడి టేబుల్ కింద పడి ఉండే కండోమ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, అతడితో పాటు థెరపిస్టును 'అదుపులోకి' తీసుకుంటారు. వీటి ఆధారంగా ఆ స్పాలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ హడావుడి చేసి నిర్వాహకులను పూర్తి భయభ్రాంతులకు గురి చేస్తారు. వాళ్లు పూర్తిగా తమ ట్రాప్‌లో పడ్డారని నిర్ధారించుకున్న తర్వాత మరో అంకానికి తెరలేపుతారు. ముఠాకు చెందిన ఓ సభ్యుడు స్పా సెంటర్ నిర్వాహకులకు సహాయం చేస్తున్నట్లు ముందుకు వచ్చి వారితో మాట్లాడతాడు. సెంటర్‌లో ఏ తప్పు జరగట్లేదని తాను నమ్ముతున్నానని, ఈ విషయాన్ని తాను సెటిల్ చేస్తానంటూ చెప్తాడు. అటు నిర్వాహకులు, ఇటు పోలీసులుగా వచ్చిన తమ ముఠా సభ్యులతో మాట్లాడుతూ రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేస్తున్నాడు. ఈ తంతు మొత్తం అయితే అదే స్పా సెంటర్‌లో లేదంటే మరో ప్రాంతంలోని రెస్టారెంట్‌లో జరుగుతోంది. కాగా అప్పుడప్పుడు స్పా సెంటర్ల కేంద్రంగా జరిగే అసాంఘిక కార్యకలాపాలు వెలుగులోకి వస్తున్నాయి. టాస్క్‌ఫోర్స్‌తో పాటు శాంతిభద్రతల విభాగం అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. ఇలాంటి వివాదాలను క్యాష్ చేసుకుంటూ ఈ ముఠా తమ దందా కొనసాగిస్తోంది. ఇలా ఈ గ్యాంగ్ ఇప్పటి వరకు పశ్చిమ మండలంలోని పలు సెంటర్లపై పంజా విసిరి దాదాపు రూ.50 లక్షల వరకు కొల్లగొట్టినట్లు తెలిసింది. ఈ ముఠాకు సహకరిస్తున్న వారిలో కొందరు పోలీసులు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



బంజారాహిల్స్: మాఘమాస మహోత్సవాల్లో భాగంగా బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లోని విశ్వసాయి మందిరంలో కొలువుదీరిన శ్రీసాయిబాబాకు మంగళవారం పసుపు, కుంకుమ జలంతో అభిషేకం నిర్వహించారు.

మాఘమాస హనుమత్ ఉత్సవాలు

పూజల్లో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి



వెంగళరావునగర్: మధురానగర్‌కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయంలో మూడు రోజులుగా ఘనంగా కొనసాగుతున్న మాఘ మాస హనుమత్ వైభవ ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖ వేద పండితులైన అష్టాక్షరి సంపత్ కుమార్ జీయర్ స్వామి పర్యవేక్షణలో ఆలయ ప్రధాన పూజారి పవనకుమారాచార్య ఆధ్వర్యంలో పూజలు కొనసాగాయి.

స్వల్ప అగ్నిప్రమాదం




వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్ బ్రాహ్మణగల్లీలో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. ఐదు సైకిళ్లు, ఒక ద్విచక్ర వాహనం, కరెంటు వైర్లు, మీటర్లు కాలిపోయాయి. కాగా ఇంట్లో నివాసం ఉంటున్న ఒక వ్యక్తి మోటారు వేయడానికి ప్రయత్నించగా షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందని నరసింహాచారి అనే బాధితుడు తెలిపాడు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ ఘటనా స్థలానికి వచ్చి బాధితులను ఓదార్చారు.

ఇంటి తలుపు కొడితే.. దాడి చేశాడు..

బంజారాహిల్స్: ఇంటి తలుపు కొట్టాడనే నెపంతో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటగిరి శివాస్ దివ్యహైట్స్‌లో నివాసం ఉండే భోగి విక్రమ్ సోమవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో కార్యాలయానికి వెళ్లేందుకు లిఫ్ట్ వద్ద వేచి చూస్తున్నాడు. అదే సమయంలో అదే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే హకన్ అనే వ్యక్తి విక్రమ్ వద్దకు వచ్చి తన ఇంటి డోర్ ఎందుకు కొట్టావంటూ ప్రశ్నించాడు. తాను కొట్టలేదని చెప్పినా వినిపించుకోకుండా విక్రమ్‌పై హకన్ దాడి చేసి ఇంట్లోకి వెళ్లిపోయాడు. అనంతరం ఈ విషయాన్ని విక్రమ్ తన భార్యకు చెప్పి జాగ్రత్తగా ఉండాల్సిందిగా సూచించి ఆఫీసుకు వెళ్లిపోయాడు. లిఫ్ట్ వద్ద జరిగిన విషయాన్ని విక్రమ్ భార్య వారి ఇంటి ఎదురుగా ఉన్న మహిళతో మాట్లాడుతుండగా హకన్ మళ్లీ బయటకు వచ్చాడు. విక్రమ్ భార్యతో హకన్ వాగ్వాదానికి దిగి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో హకన్‌తో తన భార్యకు ప్రాణహాని ఉందని, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విక్రమ్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ కమిషన్ చైర్మన్‌కు ఆహ్వానం అందజేత



మోతీనగర్: మహా శివరాత్రి పూజా కార్యక్రమాలకు హాజరు కావాలని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం ప్రసన్నవేంకటేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారి గుమ్మడిదల సుధాకర్, ఆలయ అర్చకులు ఆహ్వాన పత్రం అందజేశారు.







అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకులు

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. అంకురార్పణం సందర్భంగా సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం అనంతరం శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో రమేష్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చలువ పందిళ్లతో ముస్తాబు

వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి అందంగా రంగవల్లులు తీర్చిదిద్దారు. ఆకట్టుకునేలా పుష్పాలంకరణలు, విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. ధ్వజారోహణంతో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు తిరుచ్చి ఉత్సవం జరగనుంది. ఉదయం 9.45 గంటలకు ధ్వజారోహణం, రాత్రి 7 నుండి 8 గంటల వరకు పెద్దశేష వాహనం నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు వాహనసేవలు నిర్వహిస్తారు.

బ్రహ్మోత్సవాల్లో వాహనసేవలు..

బుధవారం రోజున ధ్వజారోహణం(మేష లగ్నం), పెద్దశేష వాహనం, గురువారం చిన్నశేష వాహనం, హంస వాహనం, శుక్రవారం సింహ వాహనం, ముత్యపు పందిరి వాహనం, శనివారం కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, ఆదివారం పల్లకీ ఉత్సవం(మోహినీ అవతారం), గరుడ వాహనం, సోమవారం హనుమంత వాహనం, గజ వాహనం, మంగళవారం సూర్య ప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, బుధవారం రథోత్సవం, అశ్వవాహనం, గురువారం చక్రస్నానం, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు ఉంటాయి. వచ్చేనెల 7వ తేదీన మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుష్పయాగం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

బీసీ బిడ్డనే అయినా.. మద్దతు లేదు



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

పంజగుట్ట: జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ సంఘాల నాయకులు, మేదావులు డబ్బున్న బీసీ అభ్యర్థులకే మద్దతు ప్రకటించడం దారుణమని కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర్య అభ్యర్థి, తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోర్స్ వ్యవస్థాపకులు డాక్టర్ బండారి రాజ్‌కుమార్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను బీసీ బిడ్డనే అయినప్పటికీ బీసీ సంఘాల నాయకులు, మేధావులు తనకు మద్దతు ఇవ్వకుండా డబ్బున్న వ్యక్తులకే ఇవ్వడం బాధాకరమన్నారు. వారిమధ్య చీకటి ఒప్పందం ఏమైనా జరిగిందా, డబ్బులు తీసుకుని మద్దతు ఇస్తున్నారా..? అని ప్రశ్నించారు. ఇప్పుడు పోటీలో ఉన్నవారంతా కార్పొరేట్ శక్తులే అని, వారిని తరిమికొట్టి ప్రజా సమస్యలు తెలిసిన తన సీరియల్ నంబర్ 37పై ఓటువేసి గెలిపించాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ కృష్ణ ప్రియ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సినీ కార్మికుడి అనుమానాస్పద మృతి



మృతదేహం వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని ఎంఆర్‌సీ కాలనీలో ఓ సినీ కార్మికుడు అనుమానాస్పదంగా మృతి చెందగా ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలంటూ మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు ఘటనా స్థలంలో వివరాలు సేకరించారు. ఎంఆర్‌సీ కాలనీకి చెందిన హుస్సేన్(55) తెలుగు సినీ పరిశ్రమలో లైట్‌మెన్ యూనియన్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం పని ముగించుకుని ఎంఆర్‌సీ కాలనీలోని తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి గోడ తగిలి ఆ ఇంట్లో కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. కొద్దిసేపటి తర్వాత నిర్మాణానికి సంబంధించి కూలీలు అక్కడకు వచ్చి చూడగా హుస్సేన్ మృతదేహం ప్రహరీగోడ లోపల పడి ఉండటాన్ని గమనించారు. వెంటనే యజమానికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన అక్కడికి వచ్చిన యజమాని కూలీలతో కలిసి మృతదేహాన్ని కాంపౌండ్ వాల్‌లో నుంచి హుస్సేన్ ఇంటి ముందుకు తీసుకువచ్చి అక్కడ పడేసి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న హుస్సేన్ భార్య ఇందిర ఈ ఘటనపై విచారణ జరపాల్సిందిగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిలింనగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. నిర్మాణంలో ఉన్న ఇంటి సబ్జా తలకు తగలడంతో కిందపడి మృతి చెంది ఉంటాడని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఇంటి యజమాని వ్యవహారం పలు అనుమానాలకు తావిస్తోందని మృతుడి భార్య ఆందోళన వ్యక్తం చేయడంతో పోలీసులు చుట్టుపక్కల వారిని విచారించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఖరీదైన మొబైల్‌తో పారిపోయిన వ్యక్తి అరెస్టు



నిందితుడు ఇక్రముద్దీన్

బంజారాహిల్స్: స్నేహంగా ఉన్నట్లు నమ్మించి ఫోన్ చేసుకుంటానని ఫోన్ తీసుకుని మాట్లాడుతున్నట్లు నటిస్తూనే ఖరీదైన మొబైల్ ఫోన్‌తో ఉడాయించిన నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. చింతల్‌కు చెందిన సునీతారాయ్ ఈ నెల 12వ తేదీన రాత్రి ఓ కేసులో ఏడాది కాలంగా తనకు పరిచయం ఉన్న మహ్మద్ ఇక్రముద్దీన్(24)తో ఉద్యోగావకాశాలపై చర్చించారు. జాబ్ సెర్చింగ్‌లో ఉన్న ఇక్రముద్దీన్ ఆమెతో గంట పాటు మాట్లాడిన అనంతరం బయట క్యాబ్ కోసం వేచి చూస్తుండగా ఒకసారి ఇంటికి ఫోన్ చేస్తానంటూ ఆమె ఐ-ఫోన్‌ను తీసుకున్నాడు. ఫోన్ మాట్లాడుతున్నట్లు నటిస్తూ నాలుగైదు అడుగులు వేస్తూ ముందుకు వెళ్లిన ఇక్రముద్దీన్ అటు నుంచి అటే పరారయ్యాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ క్రైమ్ పోలీసులు నిందితుడి కదలికలపై దృష్టి పెట్టి అరెస్టు చేసి ఫోన్ రికవరీ చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వర్గీకరణను జాతీయ ఎస్సీ కమిషన్ అడ్డుకోవాలి

లిబర్టీ: ఎస్సీ వర్గీకరణను జాతీయ ఎస్సీ కమిషన్ అడ్డుకోవాలని మాల మహానాడు జాతీయ గౌరవ అధ్యక్షుడు సుప్రీంకోర్టు న్యాయమూర్తి కృష్ణస్వరూప్ కోరారు. వర్గీకరణను అడ్డుకోవాలని కోరుతూ జాతీయ ఎస్సీ కమిషన్‌కు వినతిపత్రం పంపినట్లు ఆయన తెలిపారు. నేతకాని మహర్ ఇతర కులాలు తీవ్రంగా నష్టపోతాయని పేర్కొన్నారు. మాల మహానాడు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 క్లాస్ 9 ప్రకారం జాతీయ ఎస్సీ కమిషన్‌ను సంప్రదించకుండా రాష్ట్రంలో వర్గీకరణ పేరుతో మాదిగలకు ఎక్కువ రిజర్వేషన్లు కల్పించిందని ఆరోపించారు. కనీసం రాజ్యాంగ నిబంధనలను పాటించకుండా సహజమైన సూత్రాలకు సామాజిక న్యాయ సూత్రాలు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవర్తిస్తోందని అన్నారు. జస్టిస్ షమీం ఇచ్చిన నివేధిక ఆధారంగా మూడు గ్రూపులు చేసి రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. తెలంగాణ నేతకాని మహర్ కుల సంఘం అధ్యక్షుడు జి.శ్రీకాంత్, జయంరావు, ఎం.ప్రవీణ్‌కుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

బాలానగర్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బాలానగర్ డివిజన్ కల్యాణీనగర్‌లో, ఫతేనగర్ డివిజన్‌లోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో, కూకట్‌పల్లిలోని శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం హాజరై పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుష్పారెడ్డి , మాజీ కార్పొరేటర్ కృష్ణగౌడ్, కంచి మహేందర్, ఫతేనగర్ డివిజన్ అధ్యక్షులు కుక్కల రమేష్, బోయినపల్లి డివిజన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షులు మేకల రమేష్, రాజు, ఆలయ కమిటీ చైర్మన్‌లు నరసింహారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శిలాఫలకం



శ్రీనగర్‌కాలనీ: కోహినూర్ మహాలక్ష్మి గ్లాస్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న నల్ల పోచమ్మ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో వినాయక, నవగ్రహ, నాగదేవత, శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ శిలాఫలకాన్ని మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ ప్రారంభించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాలయ కమిటీ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ గంట మల్లేష్, రవిగౌడ్, జి.సుధాకర్, గంట శ్రీనివాస్, డి.రామచందర్, డాక్టర్ రవీందర్, రామ్‌కుమార్, నర్సింగ్‌రావు, రాజేష్ సాహు, బాలయ్య, రఘు, గణేష్, మహికాంత్, శ్రీశైలం, గంట దయానంద్, స్వామిదాస్, భీమ్‌రాజ్; రాజు, మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి



అవగాహన సదస్సులో ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ నరేష్‌రెడ్డి

ఖైరతాబాద్: సంస్థల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్‌రెడ్డి అన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్త ఆధ్వర్యంలో లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాలలో ప్రాజెక్ట్ వర్క్‌షాప్‌పై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. సంస్థల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, కళాశాలలు కూడా వివిధ రకాల సాంకేతిక కోర్సులను అందించాలన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఐపీఈ డైరెక్టర్ శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో పరిశోధనా నైపుణ్యాలను పెంచేందుకు ప్రాజెక్ట్ వర్క్ గైడెన్స్‌పై సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. సదస్సులో సదస్సు కో ఆర్డినేటర్ కృష్ణకుమార్, ఐఐఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్లు రజిని, నరేంద్రనాథ్, సత్యనారాయణ, కళ్యాణి, రామకృష్ణ, చంద్రశేఖర్, సింజు శంకర్ విద్యార్థులు పాల్గొన్నారు.

రహమత్‌నగర్‌లో మహిళా కాంగ్రెస్ సభ్యత్వాలు

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్‌లో మహిళా కాంగ్రెస్ సభ్యత్వాలు జోరుగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర, సికింద్రాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు కవిత, సునీతారావు ఆదేశాల మేరకు డివిజన్ అధ్యక్షురాలు మేఘన పద్మ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మంగళవారం కార్మికనగర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

ఆలోచింపజేసిన వైజ్ఞానిక ప్రదర్శన





సరస్వతి స్కూల్‌లో సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల నమూనాలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.11లోని శ్రీసరస్వతి హైస్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు ఆలోచనాత్మక నమూనాలను ప్రదర్శించారు. పాఠశాలలోని 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు సుమారు 300 మంది విద్యార్థులు 120కి పైగా నమూనాలను వివిధ విభాగాల వారిగా ఏర్పాటు చేసినట్లు స్కూల్ కరస్పాండెంట్ రామసుబ్బయ్య తెలిపారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ సైన్స్ ఫెయిర్‌లు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు విద్యుత్ ఉత్పత్తి, వాతావరణ కాలుష్యం, అంధులు వినియోగించేలా సెన్సార్ స్టిక్స్, మోడల్ టౌన్స్, వ్యవసాయం, మానవ శరీరం వంటి అంశాలపై నమూనాలను ఏర్పాటు చేశారు.

జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



మూసాపేట: కేపీహెచ్‌బీకాలనీ 9వ ఫేజ్ గ్రౌండ్‌లో తెలంగాణ జాగృతి స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్‌ను మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.

జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా మహాలక్ష్మి



కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్‌కు నియామక పత్రం అందజేస్తున్న మేయర్ విజయలక్ష్మి

కాచిగూడ: జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీకి హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి చేతుల మీదుగా మంగళవారం ఆమె నియామక పత్రాన్ని అందుకున్నారు. డివిజన్ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని మహాలక్ష్మి తెలిపారు. తన ఎంపికకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల విజయలక్ష్మికి కృతజ్ఞతలు తెలియజేశారు.

నాలా ఆక్రమిస్తున్నారంటూ బస్తీవాసుల ఆందోళన



బస్తీవాసులను అడ్డుకునేందుకు నియమించిన బౌన్సర్లు



ఆందోళన చేస్తున్న బస్తీవాసులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.13లోని అంబేడ్కర్‌నగర్ బస్తీని ఆనుకొని ఉన్న నాలాను బంజారాహిల్స్ రోడ్‌నెం.11 వైపు ఉన్న భవన యజమాని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని అంబేడ్కర్‌నగర్ బస్తీవాసులు మంగళవారం ఆందోళన చేశారు. సదరు భవన యజమాని నాలాను ఆనుకొని గోడ నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్న విషయాన్ని గమనించిన బస్తీవాసులు వారిని అడ్డుకునేందుకు యత్నించగా సదరు నిర్మాణదారుడు బౌన్సర్లను ఏర్పాటు చేసి బస్తీవాసులను అటువైపు రాకుండా చేశారు. దీంతో బస్తీవాసులు ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ సర్కిల్-18 డీసీ ప్రశాంతితో పాటు నీటి పారుదల శాఖ అధికారులకు తెలియజేశారు. ఇప్పటికే నాలాను చాలా మంది ఆక్రమిస్తున్నారని, వారిని అడ్డుకోవాల్సిన అవసరం ఉందని అంబేడ్కర్‌నగర్ బస్తీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్ వెనుక వైపు నుంచి నాయుడునగర్ సింగాడ బస్తీ, సింగాడికుంట, ఉదయ్‌నగర్, అంబేడ్కర్‌నగర్ బస్తీ నుంచి ఈ నాలా నేరుగా తాజ్‌బంజారా లేక్‌లో కలుస్తుంది. ఒక వైపు చెరువులు, కుంటలు, నాలాలు కబ్జా కాకుండా ప్రభుత్వ హైడ్రాతో కృషి చేస్తుంటే మరో వైపు ఇక్కడ వీళ్లు పట్టపగలే నాలాలు ఆక్రమిస్తూ కట్టడాలు చేపట్టేందుకు యత్నిస్తున్నారని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ ఆక్రమణలను అడ్డుకోవాల్సిన అవసరం ఉంది.

శాటిలైట్ ద్వారా విద్యాబోధన భేష్

– నిసా అధ్యక్షుడు డాక్టర్ కుల్‌భూషణ్



శాటిలైట్ విద్యావిధానాన్ని పరిశీలిస్తున్న నిసా అధ్యక్షుడు కుల్‌భూషణ్

బంజారాహిల్స్: ఇంటర్‌నెట్ అవసరం లేకుండానే శాటిలైట్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాల విద్యార్థులకు విద్య అందించేందుకు డిజిటల్ స్టూడెంట్స్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అలయన్స్(నిసా) అధ్యక్షుడు డాక్టర్ కుల్‌భూషణ్ అన్నారు. లక్డీకాపూల్‌లోని డిజిటల్ స్టూడెంట్స్ సంస్థ శాటిలైట్ స్టూడియోను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠాలు, స్టడీ మెటీరియల్స్, శాటిలైట్ ద్వారా పాఠాలు బోధిస్తున్నప్పుడు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఉత్తర భారతదేశంలో కూడా ఇదే విధంగా బోధన అందించేందుకు ప్రయత్నిస్తున్నామని, అందులో భాగంగానే ఇక్కడ పర్యటిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డిజిటల్ స్టూడెంట్స్ సంస్థ ఫౌండర్ డాక్టర్ సోమశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే మంచిర్యాల, ఆదిలాబాద్, జడ్చర్ల, కరీంనగర్, నిర్మల్ ప్రాంతాల్లోని సుమారు 10 వేల మంది పేద విద్యార్థులకు శాటిలైట్ ద్వారా ఇంటర్నెట్ అవసరం లేకుండా విద్య అందిస్తున్నామని, ఇది విజయవంతం అయితే దేశంలోని పలు రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ దీన్ని అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహుడి అఖండజ్యోతి యాత్ర



యాదాద్రి భవన్ వద్ద పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సద్ది వెంకట్‌రెడ్డి తదితరులు

కాచిగూడ: యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి వారి అఖండజ్యోతి యాత్రకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం బర్కత్‌పురలోని యాదాద్రి భవన్ వద్ద ఈ యాత్రను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభిస్తారు. ఈసారి 12 అడుగుల ఎత్తులో శ్రీ స్వామి, అమ్మవార్ల ప్రతిమలతో దివ్య పుష్ప రథాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. భక్త జనావళికి యాదాద్రీశుడి ఆశీస్సులు అందించేందుకు నిర్వహిస్తున్న ఈ అఖండజ్యోతి యాత్ర వివిధ జిల్లాల గుండా సాగుతూ మార్చి ఒకటో తేదీన యాదగిరిగుట్టకు చేరుతుందని యాత్ర కమిటీ చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు.

సమగ్ర సర్వేతోనే బీసీలకు న్యాయం: నిరంజన్



సికింద్రాబాద్ నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్న నిరంజన్

సికింద్రాబాద్: కుటుంబ సర్వే సమగ్రంగా జరిగితేనే బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ నియోజకవర్గంలోని సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సర్వే జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారాసిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల లెక్కలు, రిజర్వేషన్ల శాతం తేలిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ ఆశన్న, జీహెచ్ఎంసీ డీపీఓ టి.శ్రీకాంత్, సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- టర్కీ పర్యాటక ప్రమోషన్, డవలప్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో సిక్స్-సిటీ ఇండియా డెస్టినేషన్ ప్రమోషన్ ఈవెంట్ 2025 ఉదయం 10 గంటల నుంచి జరుగుతుంది.
- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, తెలంగాణ లైఫ్ సైన్స్ ఆధ్వర్యంలో బయో ఏషియా–2025 స్టార్టప్ అవార్డు ప్రదానోత్సవం సాయంత్రం 4 గంటలకు కొండాపూర్‌లోని నోవాటెల్ హెచ్ఐసీసీలో జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఖర్జూర మార్కెట్ కళకళ



రంజాన్ నేపథ్యంలో భారీగా దిగుమతులు

- నగరంలో రోజూ 50–60 టన్నుల వినియోగం
- అందుబాటులో 100 రకాలు

సాక్షి, సిటీబ్యూరో: నోరూరించే ఖర్జూరాలు మార్కెట్‌కు పోటెత్తాయి. రంజాన్ నేపథ్యంలో దిగుమతులు భారీగా పెరిగాయి. గత నాలుగు రోజులుగా దాదాపు మూడు వేల టన్నుల ఖర్జూరం నగర మార్కెట్లకు దిగుమతి అయినట్లు హోల్‌సేల్ వ్యాపారుల అంచనా. నెల వంక కనబడితే ఈ నెల 28 నుంచి రంజాన్ ప్రారంభమవుతుంది. మరో రెండు మూడు, రోజుల్లో దాదాపు రూ.300 కోట్ల వరకు వ్యాపారం జరుగుతుందని వ్యాపారవర్గాలు వెల్లడిస్తున్నాయి. రంజాన్ మాసంలో ముస్లింలు ఖర్జూరాలతోనే ఉపవాసాలను విరమిస్తారు. దీంతో ప్రతిరోజు నగరంలో దాదాపు 50–60 టన్నుల ఖర్జూర వినియోగం ఉంటుందని హోల్‌సేల్ వ్యాపారులు అంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఖర్జూరాలు 120 రకాలు కాగా, నగరం మార్కెట్‌లో దాదాపు 100 రకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రపంచంలో 80 శాతం మేర ఖర్జూరాలు ఇరాన్‌లో పండుతాయి. ఇక్కడి నుంచే నగర వ్యాపారులు నేరుగా తీసుకొస్తారు. హైదరాబాద్ ఖర్జూర మార్కెట్ దక్షిణాదిలో అతి పెద్దది. మార్కెట్‌లో ఇరానీ కప్ కప్, ఇరానీ ఫనాకజర్, బాందా ఖర్జూర్ అందుబాటులో ఉన్నాయి. కిలో రూ.150 నుంచి రూ.450 వరకు విలువ చేసే రకరకాల ఖర్జూరాలు మార్కెట్‌లో ఉన్నాయి. ప్రత్యేక అజ్వా ఖర్జూరం ధర కేజీ రూ.1,200–2,200 వరకు కూడా ఉంది.

నిలకడగానే ధరలు



ఖర్జూరం ధరలు నిలకడగానే ఉన్నాయి. దాదాపు అన్ని రకాల ఖర్జూరాలు ఇరాన్, ఇరాక్, సౌదీ అరేబియాలోనే పండుతాయి. ఈ దేశాల్లో ఖర్జూరాలపై ఎలాంటి ట్యాక్స్‌లు ఉండవు. ఖర్జూరాలతో రంజాన్ ఉపవాసాలను విరమిస్తే పుణ్యం వస్తుందని భావించి అక్కడి ప్రభుత్వాలు రేట్లు పెంచవు.

–రాజ్‌కుమార్ టండన్, వ్యాపారి, బేగంబజార్

ఎల్ఆర్ఎస్‌కు రాయితీ.. దరఖాస్తుదారుల్లో ఆసక్తి

- క్రమబద్ధీకరణ ఫీజు.. ఖాళీ స్థలాల చార్జీలకు 25 శాతం రాయితీ
- 4 ఏళ్లుగా పరిష్కారానికి నోచని ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు
- మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో 3.85 లక్షల దరఖాస్తులు



సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలు, పంచాయతీల పరిధిలోని లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)పట్ల దరఖాస్తుదారుల్లో ఆసక్తి పెరుగుతోంది. నాలుగేళ్లుగా ఈ ప్రక్రియ పరిష్కారానికి నోచుకోకపోవడంతో అనేక దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి రాయితీ ప్రకటించింది. క్రమబద్ధీకరణ ఫీజు... స్థలాల చార్జీలకు 25 శాతం రాయితీ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2000 సంవత్సరంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు స్వీకరించింది. ఆ తర్వాత వాటిని పరిష్కరించకుండా వదిలేయడంతో గతేడాది నుంచి కాంగ్రెస్ సర్కారు మళ్లీ దరఖాస్తుల పరిశీలనకు పూనుకుంది. అయినా దరఖాస్తుదారులు ఆసక్తి కనబర్చలేదు. పరిశీలన బృందాలు అర్జీదారులకు ఫోన్ చేసి స్థలాలు చూపించాలని కోరినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం వన్ టైం సెటిల్‌మెంట్ పథకాన్ని ప్రారంభించింది. రాయితీ అవకాశం రావటంతో దరఖాస్తుదారులు ఇప్పుడిప్పుడే దరఖాస్తుల పరిశీలనకు ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది.

దృష్టి సారిస్తే.....

క్రమబద్ధీకరణ ఫీజుతోపాటు ఎల్ఆర్ఎస్ కటాఫ్ తేదీ నాటికి మార్కెట్ విలువలో 14 శాతం ఖాళీ స్థలాల చార్జీలపైనా ఈ రాయితీ లభించనుంది. ప్రభుత్వ ప్రకటనతో దరఖాస్తుదారులు చెల్లించాల్సిన మొత్తంలో నాలుగో వంతు మినహాయింపు వచ్చినట్లేనని దరఖాస్తుదారులు పేర్కొంటున్నారు. మార్చి 31వ తేదీ వరకు చెల్లించినవారికి మాత్రమే 25 శాతం రాయితీ వర్తించనుంది. ఆ తర్వాత రాయితీ వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఇక మేల్కొంటేనే...

నగరపాలక సంస్థలతోపాటు పురపాలికలు, పంచాయతీలు, గ్రామాల పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసిన వారు ముందస్తుగా వాటిని పరిశీలించుకోవాల్సి ఉంటోంది. అత్యధిక శాతం స్థలాలు నిషేధిత జాబితాలో ఉండటంతో వీటన్నింటికి కావాల్సిన ధ్రువపత్రాలు పొందాలంటే రిజిస్ట్రేషన్, రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. నగర శివారుల్లోని మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 3,85,674 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఉండగా, ఇందులో 29 పురపాలక సంఘాలలో 3,774,47 దరఖాస్తులు, పంచాయతీల్లో 11,227 దరఖాస్తులు ఉన్నాయి. లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్)లో చెరువులు, కుంటలు లేకపోయినా, అబాది ఉన్నా సరే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకే సర్వే నంబర్‌లో ఏ ఒక్క చోట కోర్టు కేసు ఉన్నా నిషేధిత జాబితాలో ఉంటోంది. దీన్ని తొలగించుకోవాలంటే దరఖాస్తుదారులు రిజిస్ట్రేషన్ శాఖకు వెళ్లి రాతపూర్వకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటోంది.

'ఆత్మగౌరవం, అహంకారం మధ్యే ఎమ్మెల్సీ ఎన్నికలు'

పంజగుట్ట: ఈ నెల 27వ తేదీన రాష్ట్రంలో జరగనున్న ఒక గ్రాడ్యుయేట్, రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు బడుగుల ఆత్మగౌరవానికి, అగ్రకుల అహంకారానికి మధ్య జరుగుతున్న ఎన్నికలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ ఎన్నికలే బీసీల రాజకీయ భవిష్యత్‌ను నిర్దేశిస్తాయని, ప్రతీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఓట్లు తప్పకుండా బీసీ అభ్యర్థికే వేయాలని పిలుపునిచ్చారు. బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఓటర్ల కోసం రూపొందించిన బహిరంగ లేఖను మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ మేధావుల ఫోరం అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, వివిధ బీసీ సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ ఎన్నికల్లో ఒక్కో చోట నుంచి ఇద్దరు ముగ్గురు బీసీ అభ్యర్థులు ఉన్నప్పటికీ గెలిచే అవకాశం ఉన్నవారికే మద్దతు ఇస్తున్నామని పేర్కొన్నారు. నల్లగొండ–ఖమ్మం–వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పూల రవీందర్, కరీంనగర్–నిజామాబాద్–ఆదిలాబాద్–మెదక్, పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ప్రసన్న హరికృష్ణ, ఇదే నియోజకవర్గం ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్క కొమరయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని జాజుల సూచించారు. రెండు, మూడో ప్రాధాన్యత ఓటు కూడా బీసీ అభ్యర్థులకే వేయాలని కోరారు. రాష్ట్రంలో రెడ్ల పాలనకు ఈ ఎన్నికలతో చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి, బాల్‌రాజ్ గౌడ్, విక్రమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇక 'నార్త్ ఇండియా గో బ్యాక్' ఉద్యమం

ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న గాలి వినోద్‌కుమార్

లాలాపేట: నాన్ ముల్కీ, నార్త్ ఇండియా గో బ్యాక్ పేరుతో ప్రత్యేక ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తున్నట్లు దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ(డి–జాక్) చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం తార్నాకలోని డి జాక్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు ఉత్తర భారత దోపిడిదారులతో ఈ ప్రాంతం దగా పడుతోందన్నారు. ఉత్తరాదివారు తమ అవకాశాలను దోచుకుంటున్నారని మండిపడ్డారు. తెలంగాణలోని ప్రైవేట్ ఉద్యోగాల్లో 75 శాతం తెలంగాణ వారికి, 25 శాతం దక్షిణాది వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతోపాటుగా వ్యాపార, వాణిజ్య రంగాల్లో తెలంగాణవారికి తగిన వాటా దక్కాలన్నారు. వాటి పరిరక్షణ కోసం డి జాక్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నడిపిస్తామన్నారు. మార్చి 3న బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో డిజాక్ కో చైర్మన్లు నకిరేకంటి సంజీవరావు, నడిమిదొడ్డి ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్లకు స్కిల్డ్ జీతాలు చెల్లించాలి



మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

ముషీరాబాద్: మెడికల్ కళాశాలల్లో పనిచేస్తున్న ల్యాబ్ అటెండెంట్‌లు, టెక్నీషియన్‌లను అన్‌స్కిల్డ్‌గా మార్చడం అన్యాయమని, వారికి స్కిల్డ్ జీతాలు చెల్లించాలని టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, ఉపాధ్యక్షులు ఎస్.ఎల్.పద్మ అన్నారు. 2024 ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ద్వారా ఇంటర్వ్యూలు, పరీక్ష నిర్వహించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగంలో చేరినప్పుడు వారికి సెమీ స్కిల్డ్, స్కిల్డ్ ఉద్యోగులుగా అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ విషయమై ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందజేయగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. మంత్రిని కలిసినవారిలో రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణ్‌కుమార్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వర్మ, శ్రీనివాస్, కృష్ణ తదితరులు ఉన్నారు.

కొత్త సవాళ్లను ఎదుర్కొనేలా విద్యావ్యవస్థ

ఏజీ వర్సిటీ ఉపకులపతి అల్దాస్ జానయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జానయ్య

ఏజీ వర్సిటీ: విద్యావ్యవస్థలో అనేక కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని, వాటిని ఎదుర్కొనే విధంగా మార్పులు రావాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ అల్దాస్ జానయ్య అన్నారు. మంగళవారం వ్యవసాయ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ ఫ్యాకల్టీ ట్రైనింగ్ ఇన్ కమ్యూనిటీ సైన్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్ రీసెర్చ్‌లో 21 రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణలో వివిధ రాష్ట్రాల వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల బోధన సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని సిబ్బందికి కూడా స్వల్పకాలిక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. తొలిసారిగా విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్‌ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కేంద్రియ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ హెల్త్ సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ జి.పద్మజ మాట్లాడుతూ మనిషి జీవితంలో ఫుడ్, మూడ్‌లు అవినాభావ సంబంధం కలిగి ఉన్నాయన్నారు. మనుషుల జీవిత కాలం పెరుగుతున్నప్పటికీ, జీవితాల్లో నాణ్యత కొరవడిందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులో విద్యార్థులు, బోధనేతర సిబ్బంది కూడా అనేక ఒత్తిళ్లకు గురవుతున్నారని కమ్యూనిటీ సైన్స్ ఫ్యాకల్టీ డీన్ విజయలక్ష్మి అన్నారు. వాటిని ఎదుర్కొనేందుకు ఇటువంటి శిక్షణా తరగతులు తోడ్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో బోధన సిబ్బంది కోర్సు నిర్వహణ బాధ్యులు శ్రీదేవి, డాక్టర్ సుప్రజ. పి జానకి శ్రీనాథ్, జి.స్వరుపరాణి తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు

పోరాటయోధుడు మఖ్దూం మోయినుద్దీన్



చిక్కడపల్లి: నైజాం నవాబు నియంత పాలనకు వ్యతిరేకంగా మఖ్దూం మోయినుద్దీన్ పోరాడారని, తన రచనలతో బలహీనుల పక్షం నిలిచారని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని మంగళవారం సాయంత్రం కళాసుబ్బారావు కళా వేదికపై ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా మోయినుద్దీన్ యాదిలో సంస్మరణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగామధుసూదనాచారి మాట్లాడుతూ మోయినుద్దీన్ తన రాతలతో ప్రజలను చైతన్యపరచటం నచ్చని పాలకులు ఆయనను హతమార్చారని చెప్పారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి అధ్యక్షత వహించిన సభలో శ్రీమణి, ఆమని, సుమిత, పీఎస్ఆర్ మూర్తి పాల్గొన్నారు.

'దోస్త్'ని కొనసాగించాలి

చార్మినార్: రాష్ట్రంలోని వివిధ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాల కోసం గత ఎనిమిదేళ్లుగా సక్రమంగా నిర్వహిస్తున్న దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్) విధానాన్ని రద్దు చేయాలనుకోవడం సరికాదని తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గోపి ఒక ప్రకటనలో తెలిపారు. గత ఎనిమిదేళ్లుగా విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ డిగ్రీ కళాశాలలో సక్రమంగా అడ్మిషన్లను అందజేస్తున్న దోస్త్ విధానాన్ని తప్పనిసరిగా కొనసాగించాల్సిందేనని వారు అన్నారు. రాష్ట్రంలో ఏ మారుమూల ప్రాంతంలోనైనా నివసించే విద్యార్థి దోస్త్ ఆన్‌లైన్ విధానం వల్ల రాష్ట్రంలోని ఏ ఏ కళాశాలల్లో ఏ ఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయో సులభంగా తెలుసుకొని, దరఖాస్తు చేసుకొని అడ్మిషన్లు పొందుతున్నారని వారు తెలియజేశారు. ఉన్నత విద్యామండలి చైర్మన్‌పాటు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, కళాశాల విద్యాశాఖ కమిషనర్‌లను కలిసి విన్నవించగా 'దోస్త్'ను కొనసాగించేటట్లు చూస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

యూటీఎస్ టికెట్‌లపై క్యాష్‌బ్యాక్

– ఆర్–వాలెట్ ద్వారా అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: సాధారణ టికెట్ల కోసం ప్రవేశపెట్టిన అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ (యూటీఎస్) మొబైల్ యాప్ ద్వారా టికెట్లు కొనుగోలు చేసే ప్రయాణికులకు 3 శాతం క్యాష్‌బ్యాక్ రాయితీ ఇవ్వనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. 2016లో నగరంలోని ఎంఎంటీఎస్ ప్రయాణికుల కోసం మొదటిసారి యూటీఎస్‌ను ప్రవేశపెట్టారు. ఆ తరువాత 2018 జూలై నుంచి అన్ని రైళ్లలో సాధారణ టికెట్ కొనుగోళ్లకు దీన్ని విస్తరించారు. ప్లాట్‌ఫామ్ టికెట్‌లు, సీజన్ టికెట్లు కూడా యూటీఎస్ ఆర్–వాలెట్ నుంచి కొనుగోలు చేయవచ్చు. దేశవ్యాప్తంగా ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ప్రయాణికులు ఆర్–వాలెట్‌తోపాటు, పేటీఎం, ఫోన్ పే, గూగుల్ పే, యూపీఐ యాప్‌లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా డిజిటల్ చెల్లింపులు చేయవచ్చు. ఆర్–వాలెట్‌లో రూ.20 వేల వరకు డిపాజిట్ చేసే సదుపాయం ఉంది. యూటీఎస్ యాప్ ద్వారా టికెట్ కొనుగోళ్లను ప్రోత్సహించడానికే ఈ క్యాష్‌బ్యాక్ సదుపాయాన్ని ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. గత సంవత్సరం సగటున ప్రతిరోజు సుమారు 83,510 మంది యూటీఎస్‌ను వినియోగించుకోగా, ఈ ఏడాది ఆ సంఖ్య రోజుకు 93,487కు పెరిగింది. ఏడాది కాలంలో 12 శాతం పెరిగినట్లు సీపీఆర్వో తెలిపారు. టికెట్ కౌంటర్‌ల వద్ద పడిగాపులు కాయవలసిన అవసరం లేకుండా అప్పటికప్పుడు యాప్ ద్వారా కొనుగోలు చేసుకొని బయలుదేరవచ్చు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



పంజగుట్ట ట్రాఫిక్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డెవిస్

ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డెవిస్

బంజారాహిల్స్: నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా జోయల్ డెవిస్ పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా, పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్‌తో కలిసి ఇక్కడ ఉన్న 90 మంది ట్రాఫిక్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా 8 గంటల డ్యూటీలో ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎండ, వానల నుంచి పోలీసులు రక్షణ పొందేందుకుగాను చల్లదనాన్నిచ్చే క్యాప్‌లు, సరికొత్త రెయిన్ కోట్లు అందుబాటులోకి తెచ్చేవిధంగా కసరత్తు చేస్తున్నామని జోయల్ డెవిస్ పేర్కొన్నారు. ట్రాఫిక్ పోలీసులు సంయమనంతో మెలగాలని, వాహనదారులతో స్నేహపూర్వకంగా ఉండాలని, గౌరవాన్ని మరింత ఇనుమడింపజేసే దిశలో పనితీరు కనబర్చాలని అన్నారు.

హైకోర్టు అదనపు న్యాయమూర్తులకు సన్మానం



సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తులు, నాంపల్లి కోర్టు జడ్జీలు

సిటీ కోర్టులు: హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా పదోన్నతి పొందిన జస్టిస్ రేణుకా యారా, జస్టిస్ నర్సింగ్‌రావు నందికొండ, జస్టిస్ తిరుమలా దేవి, జస్టిస్ బీఆర్ మధుసూదన్‌రావులను మంగళవారం నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ నలుగురు జిల్లా కోర్టుల్లో జడ్జీలుగా విధులు నిర్వహించి ఇటీవల హైకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి పొందారు. ఈ నేపథ్యంలో నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.రాజవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాంపల్లి సెషన్స్ కోర్టు జడ్జి బి.సురేశ్, సీబీఐ ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి కోర్టు టి.రఘురాంతోపాటు బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సీవీ శ్రీనాథ్, వైస్ ప్రెసిడెంట్ గోకుల్, రామంజనేయులు, జాయింట్ సెక్రటరీ రమేశ్, కమిటీ సభ్యులు జి.ఈశ్వర్ కుమార్, శివకుమార్, మాధవి, కుమార్, శ్రీకిషన్,దయాకర్, రాజాగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధికి కృత్రిమ మేధ అవసరం



రాయదుర్గం: సుస్థిర అభివృద్ధి సాధనలో కృత్రిమ మేధ, డిజిటల్ సాంకేతికత అవసరమని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జయప్రకాశ్ నారాయణ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల, అవినాష్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ సంయుక్తంగా ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు పర్యవేక్షణలో ఎస్కీలో మంగళవారం జాతీయ సెమినార్ నిర్వహించారు. భారతదేశం 2047 నాటికి సుస్థిర అభివృద్ధిని సాధిస్తుందని, ఇందుకోసం యువత తమ మేధస్సును మరింత పదును పెట్టాలని సూచించారు. ప్రపంచమంతటా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అనేదే వినపడుతోందని తెలంగాణ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. ఏఐ, ఇతర సాంకేతికతలపై విశ్రాంత ఐజీ డాక్టర్ ఎస్.ఉమాపతి, డాక్టర్ సంధ్య చింత, ప్రమోద్ చింతపెంట, డాక్టర్ హఫీజ్ భాష, శ్రీనివాస్ భూసారపు, డాక్టర్ నీల్ రాచమళ్ళ వివరించారు. కార్యక్రమంలో సాయికృష్ణ, కశ్యప్ కొంపెల్ల, విజయ్‌కుమార్, కేఎస్ రవికుమార్, సుశీల, పోలీసు ఉన్నతాధికారి నర్సింగ్‌రావు ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ హెడ్ సాయి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, బుధవారం, 26, ఫిబ్రవరి, 2025

హోలీ ఏర్పాట్లు షురూ..



- నగరంలో పెద్ద సంఖ్యలో ఈవెంట్స్
- టికెట్ ధర రూ.200 నుంచి ప్రారంభం
- టీం ప్యాకేజీలతో ఆకర్షిస్తున్న సంస్థలు

సాక్షి, సిటీబ్యూరో : సంస్కృతి, సంప్రదాయాలకు భాగ్యనగరం వేదికగా నిలుస్తోంది. ప్రతి పండగనూ ఘనంగా నిర్వహించుకోవడం ఇక్కడ ఆనవాయితీ. ఈ క్రమంలోనే మార్చి 14న జరుగనున్న హోలీ సెలబ్రేషన్స్‌కు నగరంలోని పలు సంస్థలు సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటి నుంచే ఆన్‌లైన్‌లో టికెట్ల బుకింగ్స్ ఓపెన్ చేశాయి. మాదాపూర్, హైటెక్ సిటీ, నానక్‌రాంగూడ, గచ్చిబౌలి, ఉప్పల్ మున్సిపల్ స్టేడియం, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, నాగోల్, పీర్జాగూడ, తదితర ప్రాంతాల్లో పేరొందిన సంస్థలు ఈవెంట్ నిర్వహణకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాయి. ఒక్కో టికెట్ కనీసం రూ.200 నుంచి ప్రారంభం కానుంది. పిల్లలు, పెద్దలు, బృందాలకు వేర్వేరు ప్యాకేజీలను అందిస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచి వేడుకలు మొదలవుతాయని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

ఉచ్చారణ నుంచి వస్త్రధారణ వరకూ..

సాక్షి, సిటీబ్యూరో : భాష, యాస, ఆహార్యం తదితరాల వల్ల నెలకొన్న అభద్రతా భావం మన అవకాశాలపై ప్రభావం చూపిస్తుందని ప్రముఖ అంతర్జాతీయ సంస్థ పియర్సన్ ఇండియా ఇంగ్లిష్ లాంగ్వేజ్ లెర్నింగ్ డైరెక్టర్ ప్రభుల్ రవీంద్రన్ తెలిపారు. చదువు, ఉద్యోగం తదితర వీసాల కోసం ఆంగ్ల భాషా పరీక్ష ఎదుర్కొనేవారితో 'పియర్సన్ టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్' అధ్యయన ఫలితాలను ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు. సర్వేలో పాల్గొన్నవారిలో 62% మంది తమ ఉచ్చారణ ఫలితాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. అలాగే తమ ఆహార్యం పరీక్ష స్కోర్‌ను ప్రభావితం చేస్తుందని 74% మంది నమ్ముతున్నారు. తమ చర్మం రంగు వల్ల తమ పట్ల పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని 59% మంది నమ్ముతున్నారు. ఒక నిర్దిష్ట యాసను కలిగి ఉండటం వల్ల స్పీకింగ్ పరీక్షలో మెరుగైన స్కోరు సాధించవచ్చని 64% మంది భావిస్తున్నారు. అమెరికన్ యాస మెరుగైన పరీక్ష స్కోర్‌కు దోహదపడుతుందని 35% మంది నమ్ముతుండగా, బ్రిటిష్ యాస తమకు ప్రయోజనకరంగా ఉంటుందని 21% మంది అంటున్నారు.

గుజరాతీ ఘుమఘుమలు..



నగరంలోని నోవోటెల్ ఎయిర్‌పోర్ట్ వేదికగా గుజరాత్ కతియావాడి వంటకాల ఘుమఘుమలు నగరవాసులను అలరిస్తున్నాయి. 'స్వాద్ కతియావాడ్ కా' పేరుతో గుజరాత్‌కు చెందిన ప్రముఖ చెఫ్ పూనమ్ దేధియ ఆధ్వర్యంలో రూపొందించిన వసందైన రుచులు నగరానికి చేరుకున్న అతిథులను విశేషంగా అలరిస్తున్నాయి. భారతీయ సాంస్కృతిక సమ్మేళనంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కల్చరల్ ఫుడ్ ఫెస్ట్‌కు మంచి ఆదరణ లభిస్తోందని నోవోటెల్ హైదరాబాద్ విమానాశ్రయం జనరల్ మేనేజర్ సుఖ్‌బీర్ సింగ్ తెలిపారు. గుజరాత్ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రత్యేక వంటకాలతో పాటు విశ్వవ్యాప్తంగా ఇష్టపడే తమ సిగ్నేచర్ డిష్‌లను వండి వడ్డిస్తున్నామని చెఫ్ పూనమ్ దేధియ సంతోషాన్ని వ్యక్తం చేశారు. మార్చి 2 వరకూ కొనసాగనున్న ఈ ఫెస్ట్‌లో సూర్తి ప్యాటీలు, కుచ్చి దబేలి లైవ్ కౌంటర్లు ఫుడ్ లవర్స్‌ను నోరూరించనున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో

యూరప్ పిలుస్తోంది..





కరిగిపోతున్న అమెరికా డాలర్ కల



- లక్షలాది మంది విద్యార్థులు, యువతకు భంగపాటు
- ఆంక్షల నేపథ్యంలో ఫ్రాన్స్, ఐర్లాండ్, జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాలకు పయనం
- ప్రధాని పర్యటనతో యూరప్‌లో మెరుగైన అవకాశాలు
- లైఫ్ సైన్స్ కోర్సుల్లో ఉద్యోగావకాశాలు పుష్కలం

అమెరికా డాలర్ కల కరిగిపోతోంది. బాగా చదువుకొని యూఎస్‌లో స్థిరపడాలని ఆశించిన యువత ఆశల రెక్కలను ట్రంప్ మహాశయుడు తుంచేశాడు. ఏదో ఒక విధంగా అమెరికాకు వెళితే చాలు నాలుగు డాలర్లు వెనుకేసుకోవచ్చని ఆశించిన లక్షలాది మంది విద్యార్థులు, యువత భంగపాటుకు గురయ్యారు. నకిలీ కన్సల్టెన్సీలను నమ్ముకొని, ఊరూ, పేరూ లేని విశ్వవిద్యాలయాల్లో చేరి ఉన్నత చదువుల నెపంతో రకరకాల ఉద్యోగాలు చేస్తున్న యువత ట్రంప్ దెబ్బకు తిరుగుపయనం అవుతున్నారు. మరోవైపు తమ పిల్లలు అమెరికాలో చదువుకుంటున్నారని, అగ్రదేశంలో ఉద్యోగాలు చేస్తున్నారని గొప్పగా చెప్పుకొన్న తల్లిదండ్రులు సైతం ట్రంప్ దెబ్బతో తల్లడిల్లుతున్నారు. ఈ క్రమంలో ఉన్నత చదువులు చదివి విదేశాల్లో స్థిరపడాలని, బాగా సంపాదించాలని కోరుకొనే యువతను ఇప్పుడు యూరప్ దేశాలు ఆకర్షిస్తున్నాయి. కేవలం ఐటీ ఆధారిత కోర్సులు, ఐటీ ఆధారిత ఉద్యోగ, ఉపాధి అవకాశాలే కాకుండా లైఫ్‌సెన్స్, ఎన్విరాన్‌మెంటల్, బయోటెక్నాలజీ వంటి కోర్సుల్లోనూ అద్భుత అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు తమ అభిరుచికి తగిన వాటిని ఎంపిక చేసుకోవచ్చని పలు కన్సల్టెన్సీలు సూచిస్తున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో

యూఎస్‌కు వెళ్లే విద్యార్థుల్లో చాలామంది ప్రామాణికమైన విశ్వవిద్యాలయాలను ఎంపిక చేసుకోవడంలో విఫలమవుతున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. నకిలీ కన్సల్టెన్సీలను నమ్మి మోసపోతున్నారు. ఏదో ఒక విధంగా ఇక్కడి నుంచి అక్కడికి వెళ్లిన తరువాత ఆ దేశంలో ఉండే కన్సల్టెన్సీలు సైతం విద్యార్థులను మరోవిధంగా మోసం చేస్తున్నాయి. ఉదాహరణకు ఒక ప్రామాణికమైన విశ్వవిద్యాలయంలో చేరేందుకు కనీసం రూ.40 లక్షల వరకూ ఖర్చు కావచ్చు. కానీ తాము కేవలం రూ.8 లక్షలతో మరో వర్సిటీలో తమకు నచ్చిన కోర్సుల్లో చేర్పిస్తామంటూ నమ్మిస్తున్నారు. మరోవైపు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసుకోవాలని చెబుతున్నారు. దీంతో అలాంటి యూఎస్ కన్సల్టెన్సీలను నమ్మి నకిలీ వర్సిటీల్లో చేరుతున్నారు. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)లో భాగంగా మొదటి 36 నెలల పాటు పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసుకొనే వెసులుబాటు ఉంటుంది. మరోవైపు లాటరీలో హెచ్-1 వీసా లభిస్తే ఇక భవిష్యత్తుకు ఎలాంటి ఢోకా ఉండబోదనే ఆలోచనతో తక్కువ బడ్జెట్ ఆఫర్‌లతో ఆకట్టుకొనే వర్సిటీల్లో చేరుతున్నారు. మరి కొందరు రకరకాల విశ్వవిద్యాలయాల పేరిట ఆన్‌లైన్ కోర్సుల్లో చేరి ఒకే సమయంలో రెండు, మూడు రకాల పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తున్నారు. ఇలా ఒక నిర్దిష్ట లక్ష్యం లేకుండా, ప్రామాణికమైన విశ్వవిద్యాలయంలో చేరకుండా ఏదో ఒకవిధంగా స్థిరపడాలని భావించే వారిపై ట్రంప్ ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. యూఎస్‌లోని వివిధ ప్రాంతాల్లో కనీసం లక్షన్నర మంది విద్యార్థులు ఉన్నట్లు నగరానికి చెందిన ఓ ప్రముఖ కన్సల్టెన్సీ వెల్లడించింది. ట్రంప్ విధానాల ఫలితంగా ప్రస్తుతం చాలా మంది విద్యార్థులు ఇంటిదారి పట్టినట్లు ఆ సంస్థ ప్రతినిధి చెబుతున్న మాట.





వెల్‌కం టు యూరప్..

ఈ క్రమంలో యూరప్ విశేషంగా ఆకట్టుకుంటోంది. విదేశాల్లో చదువుకొని స్థిరపడాలని కోరుకొనే విద్యార్థులు ప్రస్తుతం బ్రిటన్, ఐర్లాండ్, జర్మనీ, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ తదితర దేశాలను ఎంపిక చేసుకుంటున్నారు. 'యూఎస్‌లో ఎన్నికల వాతావరణం మొదలైనప్పటి నుంచి విద్యారంగంలో మార్పులు కనిపించాయి. ముఖ్యంగా ట్రంప్ గెలుపు అనివార్యంగా మారిన తరువాత చాలా మంది విద్యార్థులు యూఎస్ ఆలోచనను విరమించుకొని బ్రిటన్, తదితర దేశాలకు వెళ్తున్నారు.' అని అమీర్‌పేట్‌కు చెందిన కాన్వొకేషన్స్ స్క్వేర్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ వ్యవస్థాపకులు హిమబింధు కోల్లా తెలిపారు. జర్మనీ, ఫ్రెంచ్ వంటి భాషల్లో కొద్దిపాటి ప్రవేశం ఉన్నా చాలు అక్కడి విద్యాసంస్థల్లో చేరవచ్చు. స్విట్జర్లాండ్‌లోనూ గొప్ప విద్య, ఉద్యోగావకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ఇటీవల ప్రధాని పర్యటనతో మన విద్యార్థులకు ఫ్రాన్స్ ప్రాధాన్యతనిస్తోంది. ప్రస్తుతం 5 సంవత్సరాల గడువుతో కూడిన వీసాలు ఇస్తున్నారు. దీంతో విద్యార్థులు ఉన్నత విద్యను పూర్తి చేయవచ్చు. జర్మనీలో స్థిరపడుతున్న తెలుగువాళ్ల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. దీంతో అక్కడ స్థిరపడాలనుకొనేవారికి చక్కటి అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

సృజనాత్మకతకు పెద్దపీట..

చాలా మంది బీటెక్ చదివి ఇంజినీరింగ్ వైపే వెళ్లాలని భావిస్తారు. కానీ ఎన్విరాన్‌మెంటల్ సస్టెయినబుల్ గవర్నెన్స్ (ఈఎస్‌జీ), వేస్ట్‌మేనేజ్‌మెంట్, ఏఐ ఎథిక్స్, సైబర్‌క్రైమ్, సైబర్ సెక్యూరిటీ, ఫైనాన్షియల్ టెక్నాలజీ, నర్సింగ్, మాస్టర్స్ ఇన్ మేనేజ్‌మెంట్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ వంటి వివిధ కోర్సుల్లో ప్రతిభను చాటే విద్యార్థులు, యువతకు యూరప్ దేశాల్లో అద్భుత అవకాశాలు ఉన్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు.

స్పష్టమైన లక్ష్యంతో ఢోకా లేదు..


"అమెరికాలో కూడా చదువుకోవచ్చు. అక్కడే మంచి ఉద్యోగాల్లో చేరి స్థిరపడొచ్చు. కానీ ఏ లక్ష్యంతో వెళ్లాలి, ఏ విశ్వవిద్యాలయంలో చదవాలనే విషయంలో స్పష్టత ఉండాలి. యూరప్‌లో అభిరుచికి తగిన కోర్సుల్లో చదివి ఉద్యోగాలు సంపాదించుకునేందుకు చాలా అవకాశాలు ఉన్నాయి."

- హిమబింధు కోల్లా, కాన్వొకేషన్స్‌స్క్వేర్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ



అవకాశాల వేదికగా హ్యాక్ 4 జాబ్ 2025

- మెట్ లైఫ్ ఆధ్వర్యంలో మార్చి 22, 23 తేదీల్లో నిర్వహణ
- టెక్నాలజీ భవిష్యత్తుకు మార్గంగా 'హ్యాక్ 4 జాబ్' : మెట్ లైఫ్ గ్లోబల్ ఆపరేషన్స్



సాక్షి, సిటీబ్యూరో : మెట్ లైఫ్ ఐఎన్‌సీ ఆధ్వర్యంలో ఆర్టిఫీషియల్ ఇంటలీజెన్స్ (ఏఐ), డేటా ఇంజినీరింగ్, డెవ్ సెక్ ఆప్స్, ఎస్‌డీఈటీ, ఎగ్జైల్ వంటి అధునాతన సాంకేతికతల్లో అవకాశాల కల్పనకు 'మెట్ లైఫ్ హ్యాక్ 4 జాబ్ 2025'ని ప్రకటించింది. మార్చి 22, 23 తేదీల్లో నగరంలోని హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ వేదికగా హ్యాక్ 4 జాబ్ నిర్వహించనున్నామని మెట్ లైఫ్ గ్లోబల్ ఆపరేషన్స్ సర్వీస్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ ఆషిష్ శ్రీవాత్సవ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ హ్యాకథాన్‌లో పాల్గొనే వారికి నైపుణ్యాలను అందించడానికి విభిన్నమైన అవకాశాన్ని అందిస్తున్నామని, ఈతరంలో ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించడానికి ఈ వినూత్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఇందులో పాల్గొనే వారందరికీ ఉద్యోగ అవకాశాలను అందించడమే లక్ష్యంగా సాంకేతిక రంగ నిపుణులను ఇందులో భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. ఇందులో పాల్గొన్న విజేతలను మార్చి 23న ప్రకటిస్తామని, షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులను అదే రోజు ఆన్ సైట్ ఇంటర్వ్యూకి సైతం పిలుస్తామని శ్రీవాత్సవ పేర్కొన్నారు. ఔత్సాహిక అభ్యర్థులు మార్చి 12 లోపు https:// vision. hack2 skill. com/ event/ metlifehack4 job2025 లింక్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆదరించి.. అన్నంపెట్టి..

ఆయన వృత్తి రీత్యా ప్రభుత్వ ఉద్యోగి.. ప్రవృత్తి జంతు ప్రేమికుడు. శునకాలు, పిల్లులు చూపించే ప్రేమ, విశ్వాసం పట్ల ఆకర్షితుడై వాటిని పెంచుకుంటున్నాడు. ఆయన రాకను గమనిస్తే చాలు కుక్కలు, పిల్లులు పరుగున ఆయన చుట్టూ చేరతాయి. కాకులు ఎగురుకుంటూ వచ్చి ముందు వాలతాయి. కేవలం ఇంటి దగ్గరే కాదు.. ఆయన పని చేస్తున్న ఆఫీసు ప్రాంగణంలోనూ ఇదే తంతు. 18 ఏళ్లుగా తన ఇంట్లో కుక్కలు, పిల్లులను పెంచిపోషిస్తున్నాడు. సంపాదనలో నెలకు రూ.20 వేలు వాటి పోషణకు ఖర్చు చేస్తున్నాడు. వాటికి బర్త్‌డేలు, డేత్‌డేలు చేస్తూ జంతువుల పట్ల తనకున్న ప్రేమను చాటుతున్నాడు. ఆయనే మలక్‌పేట ముంతాజ్ కాలేజ్ రోడ్డులోని ప్రభుత్వ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న తుమ్మల శివకుమార్. - మలక్‌పేట

జంతువుల పట్ల ప్రేమను చాటుతూ

- ఆహారానికి నెలకు రూ.20 వేలు ఖర్చు చేస్తూ
- బర్త్‌డేలు, డెత్‌డేలు సైతం నిర్వహిస్తూ
- ప్రభుత్వ ఉద్యోగి శివకుమార్ ఔన్నత్యం





శివకుమార్, అనిత దంపతులు 2007లో రెండు పెంపుడు కుక్కలు తీసుకొచ్చుకున్నారు. వాటికి ఫ్రూటీ, స్నూపీ అని పేరుపెట్టారు. అదే విధంగా పిల్లిని కూడా పెంచుకుంటున్నారు. ఈ క్రమంలో కుక్కలు, పిల్లుల పట్ల ప్రేమ పెరుగుతూ వచ్చింది. ఫ్రూటీ, స్నూపీకి పుట్టిన సంతానానికి సిద్ధు, డ్రోణి, పొట్టి, టిల్లు, టిమ్మీ జిమ్మి, దగ్గు ఇలా పేర్లు పెట్టి వాటికి బర్త్‌డేలు చేస్తున్నాడు. పండుగలకు కుక్కలతో కలిసి పూజలు చేస్తాడు.

ఆరోగ్యం పట్ల ప్రత్యే శ్రద్ధ..

చికెన్, పాలు, పెడిగ్రీ, నూకల అన్నం వంటి పోష్టికాహారం పెట్టి వాటిని సాకుతున్నాడు. వీటితోపాటు ఇంటి బయట వీధి కుక్కలకు నీటి సంపు ఏర్పాటు చేశాడు. ప్రతి రోజూ సాయంత్రం 12 వీధి కుక్కలకు 3 కిలోల నూకల అన్నం పెడుతున్నాడు. ఆఫీస్ ప్రాంగణంలో అడుగు పెట్టాడంటే పదుల సంఖ్యలో జంతువులు ఆయన చుట్టూ చేరతాయి.



బర్త్‌డే, డెత్ డేలు..

మొదట పెంచుకున్న స్నూపీ, ఫ్రూటీ చనిపోగా వాటిని తన ఇంటి ఆవరణలోనే కననం చేసి సమాధి కట్టారు. వాటి సమాధులకు పూజలు చేసి దీపాల వెలిగించి, డేత్‌డే నిర్వహిస్తున్నాడు. తాను పెంచే జంతువులకు బర్త్‌డేలు సైతం నిర్వహిస్తుంటాడు. ప్రస్తుతం 20 కుక్కలు, 10 పిల్లులు ఉన్నాయి. రోడ్ల వెంబడి కుక్కలకు తిండి లేకుండా కనిపిస్తే బాధేస్తుందని చెబుతున్నారు శివకుమార్ దంపతులు.

హమ్ హై నేపాలీ.. దిల్ హై హైదరాబాదీ..

వెల్లివిరియనున్న ఆధ్యాత్మిక శోభ

- శివాలయానికి వేలాదిగా భక్తుల రాక
- ఎస్పీఆర్‌హిల్స్ నేపాలీమయం

సుమారు 60 వేల మంది నేపాల్ దేశస్తులు.. అందులోనూ శివభక్తులు.. ప్రతి మహాశివరాత్రి రోజున వీరంత ఎక్కడున్నా.. పరమ శివుడి సన్నిధిలో కలుసుకుంటారు.. భక్తి శ్రద్ధలతో భోళా శంకరుడిని ఆరాధిస్తారు.. అర్చనలు, అభిషేకాలు, భజనలతో తమ ఇష్టదైవమైన పరమశివుడిని కొలుస్తారు.. ఈ ప్రాంతంలో ఏకంగా నేపాల్ దేశస్తులు తమ ఆచారం ప్రకారం శివాలయం నిర్మించి తమ భక్తిని చాటుకున్నారు.. ప్రతి మహాశివ రాత్రి తాము నిర్మించుకున్న దేవాలయానికి కుటుంబ సమేతంగా వచ్చి నేపాల్ దేశ సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. - రహమత్‌నగర్



రహమత్‌నగర్ డివిజన్‌లోని ఎస్పీఆర్ నగర్‌లో కొండ (క్వారీ)పై సుమారు 60 యేళ్ల క్రితం ఉద్యోగ రీత్యా నగరానికి వచ్చిన నేపాల్ దేశస్తులు ఇక్కడ చిన్న శివాలయం ఏర్పాటు చేశారు. ఈ దేవాలయానికి తమ దేశంలో ఉన్న పసుపతి గోరఖ్‌నాథ్ శివాలయంగా నామకరణం చేశారు. ప్రారంభంలో గుట్టపై బండ రాళ్లతో చిన్న ఆలయాన్ని నిర్మించి కొద్ది మంది పూజలు చేసేవారు. వాస్తు, స్థలం పరిశీలన కోసం నేపాల్‌కు చెందిన బాబాలను రప్పించి వారితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇదే ఆలయం ఈ ప్రాంతంలో ప్రముఖ శివాలయంగా మారింది. ఈ ఆలయాన్ని దర్శించుకున్న వారికి కోరిన కోర్కెలు నెరవేరతాయాని భక్తుల అపార నమ్మకం. అయితే ప్రతి మహా శివరాత్రి రోజున ఈ దేవాలయంలో జరిగే పూజా కార్యక్రమంలో ఒక ప్రత్యేకత ఉంటుంది. నగరంలో నివాసముంటున్న నేపాల్ దేశస్తులంతా ఈ పర్వదినాన శివాలయానికి రావడం విశేషం. యేటా 60 వేల మంది నేపాల్ దేశస్తులు మహా శివరాత్రికి వస్తుంటారని ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. ఆ రోజున అభిషేకం, రుద్రాభిషేకం, శివపార్వతుల కల్యాణం, భజన కార్యక్రమాలు కన్నుల పండువగా జరుగుతుంటాయి. పూజా విధానాలు నేపాలీ భాషలో కొనసాగడం మరో విశేషం. ఈ క్రమంలోనే నేడు జరుగనున్న మహాశివరాత్రి పర్వదినానికి శివాలయం మరోసారి ముస్తాబైంది.

నాగరాజు దర్శనం..

సాక్షాత్తు పరమశివుడే మహాశివ రాత్రి రోజున బంగారు రంగులో నాగుపాము రూపంలో స్వామి ఆలయానికి వచ్చి భక్తులను దీవిస్తాడని చెబుతుంటారు. ఎవరికి ఏ హానీ చేయకుండా భక్తులకు దీవెనలు అందిస్తాడని భక్తులు విశ్వసిస్తుంటారు. నాగరాజు దర్శనం కోసం భక్తులు తెల్లవార్లూ జాగారం చేస్తుంటారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

"ఎంతో మహిమగల ఎస్పీఆర్ నగర్ గోరఖ్‌నాథ్ శివాలయాన్ని అభివృద్ధి చేయాలి. ఈ దిశగా ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలి. ఆలయ పరిసరాల్లో అనేక సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించాలి."

- రతన్ ఛత్రి, ఆలయ కమిటీ అధ్యక్షుడు

ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పిల్లల ఫీజులు, తల్లిదండ్రుల వైద్య ఖర్చులు ఏటా తడిసి మోపెడవుతున్నాయి. నిత్యావసరాల ధరలు సరేసరి.. కానీ, ఆ స్థాయిలో ఆదాయాలు పెరగటంలేదు. వచ్చే సంపాదనలోనే ఎంతో కొంత భవిష్యత్ కోసం పొదుపు చేస్తున్నా.. అవి ఏమూలలకూ సరిపో వటంలేదు.. ఇదీ నేడు సగం మంది భారతీయుల ఆవేదన. ముఖ్యంగా 35 - 54 ఏళ్ల మధ్య వయసున్న భారతీయులు భవిష్యత్‌పై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొదుపు, ఖర్చులపై యూ గా, ఎడిల్‌వీస్ లైఫ్ ఇన్సూరెన్స్ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనంలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి.

- సాక్షి, హైదరాబాద్

భవిష్యత్ భయాలు

సగంమంది భారతీయుల్లో ఆర్థిక స్థితిపై ఆందోళన

- పొదుపు, ఆర్థికావసరాలకు పొంతన ఉండటం లేదని ఆవేదన
- తల్లిదండ్రులు, పిల్లల అవసరాలు తీర్చటంలో ఇబ్బందులు
- 35–54 ఏళ్ల లోపువారిలోనే భవిష్యత్ భయాలు అధికం
- యూ గా, ఎడిల్‌వీస్ లైఫ్ ఇన్సూరెన్స్ అధ్యయనంలో వెల్లడి





అధ్యయనంలోని కీలకాంశాలు..

- దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లోని 4,000 మంది ఈ సర్వేలో పాల్గొన్నారు. వారిలో 94 శాతం మంది భవిష్యత్ కోసం సవివరమైన ఆర్థిక ప్రణాళిక లేదా ఒక మోస్తరు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు.
- సర్వేలో పాల్గొన్నవారిలో సగానికిపైగా తాము చేస్తునపొదుపు భవిష్యత్ అవసరాలకు సరిపోదని ఆందోళన వ్యక్తంచేశారు.
- పక్కా ఆర్థిక ప్రణాళిక రూపొందించుకున్నా చివరకు అది పూర్తిస్థాయిలో అక్కరకు రావడం లేదని తెలిపారు.

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు, వయసు పెరుగుతున్న పిల్లల ఆర్థిక అవసరాలను తీర్చడంలో నిమగ్నమైన 35–54 ఏళ్ల లోపువారిలో 60 శాతం మంది తమ పొదపు భవిష్యత్ అవసరాలకు సరిపోదని అంగీకరించారు.

- వివిధ రూపాల్లో ఎదురయ్యే అత్యవసరాలను ఎదుర్కొనే విషయంలో పొదుపు సొమ్ము సరిపోక అప్పులు చేయాల్సి వస్తోందని ఎక్కువ మంది చెప్పారు.
- అనారోగ్య సమస్యలు, విద్య, ఇంటికి మరమ్మతులు వంటివాటికి అన్నిరకాల రుణాలను వినియోగించుకుంటుండటంతో దీర్ఘకాలిక ఆకాంక్షలు నెరవేర్చుకునే విషయంలో ఇబ్బందులు తప్పడం లేదని తెలిపారు.
- భవిష్యత్ అవసరాలకు పనికి వస్తుందనే ఆశతో పలు మార్గాల్లో పెట్టుబడులు పెడుతున్నా.. అది అవసరానికి చేతికి రావటం లేదని కొంతమంది పేర్కొన్నారు.
- భవిష్యత్‌లో ఎదురయ్యే ఆర్థిక సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా లేమని సర్వేలో పాల్గొన్న 35 – 54 ఏళ్ల మధ్య వయస్కుల్లో సగంమందికి పైగా అభిప్రాయపడ్డారు.

భవిష్యత్ ఆర్థిక అవసరాలను తీర్చేందుకు జీవిత బీమా వంటి మార్గాలను ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

రెండు రకాల సవాళ్లు

రెండు తరాలవారిని (తల్లి దండ్రులు, పిల్లలు) ఆదుకోవాల్సిన బాధ్యతల మధ్య 'సాండ్‌విచ్ జనరేషన్' (35 - 54 ఏళ్ల మధ్యవారు) నలిగిపోయే పరిస్థితి ఎదురవుతోంది. పెద్దలకు ఆరోగ్యపరమైన సమస్యలు వచ్చినపుడు తగిన విధంగా ఖర్చు చేయడం, పెరుగుతున్న పిల్లలకు నాణ్యమైన విద్యను అందించటం వీరికి సవాల్‌గా మారుతోంది.
–సుమిత్ రాయ్, ఎండీ–సీఈవో, ఎడిల్‌వీస్ లైఫ్ ఇన్సూరెన్స్.

ఉండమీరి పెళ్లి జోడ!

కోయ భాషలో పెళ్లి పత్రిక



ఇల్లెందు రూరల్: మాతృ భాషపై మమకారంతో ఓ ఆదివాసీ కుటుంబం పెళ్లి శుభలేఖ (ఉండమీరి పెళ్లి జోడ)ను కోయ భాషలో ముద్రించి ప్రత్యేకత చాటుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన సున్నం (ఉండం) సాధు సింగరేణిలో ఉద్యోగం చేస్తూ ఇల్లెందు మండలం సంజయ్‌నగర్‌లో జీవనం సాగించేవారు. ఆయన మరణానంతరం పెద్ద కుమారుడు బాలరాజు కుటుంబ బాధ్యతలు చూస్తున్నాడు. కాగా, సోదరుడు శ్రీనివాస్ వివాహం లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన చింత వినీతతో మార్చి 2న జరగనుంది. దీంతో సోదరుడి వివాహ ఆహ్వాన పత్రికను కోయ భాషలో ముద్రించి బంధు మిత్రులకు పంపిణీ చేశారు. కాగా, అంతరించిపోతున్న భాషను బతికించేందుకు బాలరాజు చేస్తున్న కృషిని పలువురు అభినందించారు.

మీనాక్షి మేడం 'మౌనవ్రతం'

ప్రతి శనివారం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాట్లాడరట..

చాలా ఏళ్లుగా గాంధీయిజం పాటిస్తున్న మాజీ ఎంపీ



సాక్షి, హైదరాబాద్: నిరాడంబరతకు మారుపేరుగా గుర్తింపు పొందిన రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ చాలా ఏళ్లుగా గాంధీయిజం పాటిస్తున్నారు. మహాత్మాగాంధీ స్ఫూర్తితో ఆమె ఎన్నో ఏళ్లుగా ప్రతి శనివారం మౌనవ్రతం ఆచరిస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు చెపుతున్నారు. గాంధీభవన్ వర్గాల సమాచారం ప్రకారం, ఆమె ఏ హోదాలో ఉన్నా.. ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా కచ్చితంగా ఈ దీక్షను కఠినంగా పాటిస్తారు. శుక్రవారం అర్ధరాత్రి 12 దాటిన తర్వాత మళ్లీ శనివారం అర్ధరాత్రి 12 గంటలు దాటేవరకు ఆమె ఎవరితోనూ ఒక్క మాట కూడా మాట్లాడరు. ఏ సమాచారమైనా ఆ రోజున సంజ్ఞలు, సందేశాల ద్వారానే వెల్లడిస్తారు. అదేవిధంగా ఆ రోజంతా ఉపవాసం ఉండి నేలపైనే నిద్రిస్తారని, ఎన్ని ఆటంకాలు వచ్చినా ఈ దీక్షను ఆమె కొనసాగిస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు చెపుతున్నారు. గాంధీయిజంలో భాగంగా వారంలో ఒక రోజున ఉపవాసం ఉండడాన్ని గాంధేయవాదులు చాలా మంది ఆచరిస్తారని, అయితే మీనాక్షి మాత్రం మౌనదీక్ష కూడా చేస్తారని అంటున్నారు. రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండే వారిలో చాలా అరుదుగా మాత్రమే ఈ దీక్షను ఆచరించగలుగుతారని, గాంధేయవాదం పట్ల ఆమె నిబద్ధతకు ఈ మౌన దీక్షే నిదర్శనమని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఒకేరోజు లక్ష రేషన్‌కార్డులు

మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: కొత్త రేషన్‌కార్డుల జారీపై ప్రభుత్వం శుభవార్త చెప్పింది. లక్ష కొత్త రేషన్‌కార్డులను ఒకేరోజు పంపిణీ చేయనుంది. ఈ మేరకు ముహూర్తం కూడా ఖరారు చేసినట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రజాపాలన, కులగణన సందర్భంగా దరఖాస్తులు తీసుకున్న ప్రభుత్వం ఇటీవలి కాలంలో మీసేవ సెంటర్ల నుంచి కూడా దరఖాస్తులు స్వీకరించింది. జనవరి 26న రాష్ట్రవ్యాప్తంగా 16,900 కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేయగా, మార్చి 1న హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఒకే రోజు లక్ష రేషన్‌కార్డులు పంపిణీ చేయాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది.

మార్చి 8 తర్వాత మిగతా జిల్లాల్లో...

ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో మార్చి 8 తర్వాత కొత్త రేషన్‌కార్డుల జారీ ఉంటుందని మంత్రి చెప్పారు.

మెడికల్ సీట్లలో బీసీలకు అన్యాయం

తెలంగాణ ప్రభుత్వంపై జస్టిస్ ఈశ్వరయ్య ఆగ్రహం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మెడికల్ సీట్ల కేటాయింపులో బీసీలతోపాటు ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతోందని ఆల్ ఇండియా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్ అధ్యక్షుడు జస్టిస్ ఈశ్వరయ్య మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయంతో అగ్రవర్ణాలకు అప్పనంగా 200 నుంచి 300 సీట్లు దక్కుతున్నా యన్నారు. ఆయన మంగళవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో తీసుకొచ్చిన జీవో వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. బీసీల అభ్యున్నతే లక్ష్య మంటున్న రాహుల్.. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మెడికల్ సీట్ల విషయంలో బీసీల కోసం ప్రత్యేకంగా జీవో తీసుకురావా లని జస్టిస్ ఈశ్వరయ్య డిమాండ్ చేశారు.

ఆ విమర్శలను తప్పుగా తీసుకోకండి

రెడ్డి కులస్తులకు జగ్గారెడ్డి వినతి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలోని కొందరు నేతలు తమ సామాజిక వర్గం గురించి చేస్తున్న విమర్శలను తప్పుగా తీసుకోవద్దని రెడ్డి కులస్తులకు టీపీ సీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి విజ్ఞప్తి చేశారు. అవి కేవలం భావోద్వేగంతో మాట్లాడిన మాటలేనని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి మధ్యలో వచ్చి అవగాహన లేకుండా మాట్లాడుతున్న వారి మాటలను కూడా తీవ్రంగా పరిగణించ వద్దని కోరారు. కొందరు కాంగ్రెస్ నేతలు మాట్లాడిన మాటలు రెడ్డి సామాజికవర్గంపై వ్యతిరేకతతో మాట్లాడి నవి కాదని గుర్తించాలని కోరారు.

నా మాటలు వక్రీకరించారు

- ఎవరితో విభేదాలు లేవు
- మాజీ ఎంపీ అంజన్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: కుల గణనకు మద్దతుగా తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కులగణనను స్వాగతిస్తూ.. యాదవ కుల బాంధవుల సమావేశం ఏర్పాటు చేసి సీఎం రేవంత్ ప్రజాపాలనను కొనియాడితే .. తాను చేయని వ్యాఖ్యలను చేసినట్టు తప్పుడు ప్రచారం చేశారని దుయ్యబట్టారు. రెడ్డి సామాజిక వర్గం నేతలతో ఎలాంటి విభేదాలు లేవని, తన స్నేహితులు అనేకమంది రెడ్డి కులస్తులు ఉన్నారని స్పష్టం చేశారు.

కేసీఆర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి ఉంటే కాంగ్రెస్ సగం ఖాళీ అయ్యేది

ఢిల్లీ పర్యటనలో రేవంత్ ఎవరిని కలుస్తున్నారో చెప్పాలి: హరీశ్‌రావు

- ఢిల్లీకి కప్పం తీసుకెళ్లేందుకు కొత్త వైస్రాయ్ వచ్చారు
- రేపు ఎస్‌ఎల్‌బీసీ సందర్శనకు వెళ్తాం



సాక్షి, హైదరాబాద్: తమ నాయకుడు కేసీఆర్ అంగీకరించి ఉంటే కాంగ్రెస్ పార్టీ నుంచి సగం మంది ఎమ్మెల్యేలు వెళ్లిపోయేవారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. 36 పర్యాయాలు ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం రాష్ట్రానికి సాధించిందేమీ లేదని, ప్రైవేటు కార్లలో ఒంటరిగా వెళ్లి అక్కడ ఎవరితో భేటీ అవుతున్నారో చెప్పాలన్నారు. హరీశ్‌రావు మంగళవారం బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టి మాట్లాడారు. 'మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్ల కొనుగోలు కోసం కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి చేత రూ.90 కోట్లు ఖర్చు పెట్టించి ఆ పార్టీ ఎమ్మెల్యేలు డబ్బులు నొక్కేశారని ప్రణాళిక సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం చైర్మన్ చిన్నారెడ్డి చెప్పారు. ప్రతీ చిన్న విషయానికి స్పందించే సీబీఐ, ఈడీ, ఐటీ విభాగాలు దీనిపై ఎందుకు విచారణ జరపడం లేదు. కాంగ్రెస్, బీజేపీ నడుమ బంధానికి ఇంతకంటే సాక్ష్యం ఏం కావాలి. ఎల్‌ఆర్‌ఎస్‌ను పేదల రక్తం తాగే స్కీమ్‌గా ప్రతిపక్షంలో ఉన్నపుడు జనాలను రెచ్చగొట్టిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీతక్క, ఎమ్మెల్సీ కోదండరాం గొంతు ఎందుకు మూగబోయింది. ఎల్‌ఆర్‌ఎస్ వసూళ్ల కోసం ఆషాడం సేల్, దీపావళి బొనాంజా మాదిరిగా డిస్కౌంట్లు ప్రకటిస్తున్నారు. డిస్కౌంట్ల పేరిట మోసం చేస్తున్న రేవంత్ జనం దృష్టిలో 'మిస్ కౌంట్'గా మిగిలిపోతారు. ఢిల్లీ కాంగ్రెస్‌ను సాకేందుకు గల్లీ కాంగ్రెస్ ప్రజలను బాదుతోంది. ఢిల్లీకి ఎప్పటికప్పుడు కప్పం కట్టించేందుకు కాంగ్రెస్ కొత్త వైస్రాయ్‌ను నియమించింది' అని హరీశ్‌రావు చెప్పారు.

హౌస్ అరెస్టులు చేయకుండా చూడాల్సిన బాధ్యత

'పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క కిలోమీటర్ సొరంగం కూడా తవ్వలేదని మంత్రి ఉత్తమ్ అబద్ధాలు చెప్తున్నాడు. అనేక సాంకేతిక సమస్యలు ఎదురైనా 12 కిలోమీటర్లు తవ్వడంతో పాటు డిండి, పెండ్లిమర్రి రిజర్వాయర్ పనులు 90శాతం మేర పూర్తి చేశాం. గురువారం మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లా బీఆర్‌ఎస్ నేతలతో కలిసి ఎస్‌ఎల్‌బీసీని సందర్శిస్తాం. పోలీసులు హౌస్ అరెస్టులు చేయకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీయేతర అభ్యర్థుల్లో మంచి వారిని చూసి ఎన్నుకోవాలని పిలుపునిస్తున్నాం. వానాకాలం రైతుబంధు, రెండు లక్షల ఉద్యోగాలు, కళ్యాణలక్ష్మిలో తులం బంగారం, నిరుద్యోగ భృతి, పీఆర్‌సీ, డీఏ పెండింగ్ బకాయిలు వచ్చాయని భావిస్తేనే కాంగ్రెస్‌కు ఓటేయండి లేదంటే ఆ పార్టీ అభ్యర్థులను ఓడించండి. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపి, మెడికల్ కాలేజీల స్థాపనలో అన్యాయం చేసిన బీజేపీని ఓడించాలి' అని హరీశ్‌రావు చెప్పారు.

రేవంత్‌కు నిద్రలోనూ కేసీఆర్ గుర్తుకొస్తున్నారు

▶ మొదటి పేజీ తరువాయి

పలువురు కార్యకర్తలు మంగళవారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ '48 గంటల్లో ఏడుగురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా సీఎం రేవంత్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఉన్నాడు. ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదంలో 8 మంది కార్మికులు చిక్కుకున్నా ఢిల్లీ పర్యటనకు వెళ్లాడు. వ్యవసాయరంగంలో మోగుతున్న చావుడప్పునకు చేతకాని రేవంత్ రెడ్డి పాలనే ప్రధాన కారణం. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి' అని అన్నారు.

కాళేశ్వరంపై విష బీజాలు

'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీ నేతలు తెలంగాణ ప్రజల మనసుల్లో విష బీజాలు నాటారు. సుంకిశాల రిటైనింగ్ వాల్, ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ కూలినా, ఖమ్మం పెద్దవాగు బ్రిడ్జి కొట్టుకుపోయినా బీజేపీ నాయకులు మాట్లాడటం లేదు. రేవంత్ ప్రభుత్వానికి ప్రధాని మోదీ రక్షణ కవచంలా పనిచేస్తున్నారు. ఈ ప్రమాదాలపై జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) ఎందుకు మౌనంగా ఉంది. తెలంగాణలో రాహుల్, రేవంత్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని సాక్షాత్తు ప్రధాని ఆరోపించినా ఇప్పటిదాకా బీజేపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కేసీఆర్‌ను నిత్యం విమర్శించే రేవంత్‌రెడ్డి బీజేపీపై చిన్న విమర్శ కూడా చేయడం లేదు. ఎమ్మెల్యే కడియం శ్రీహరికి దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేయాలి. 14 నెలల కాలంలో రూ.1.50లక్షల కోట్లు అప్పు చేసిన రేవంత్ ఢిల్లీకి పంపుతున్న మూటలతో కాంగ్రెస్ పార్టీని నడిపిస్తున్నారు. త్వరలో సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్ కాంగ్రెస్ కార్యకర్తలు కూడా బీఆర్‌ఎస్‌లో చేరతారు' అని కేటీఆర్ అన్నారు.

ప్రమాదంపై జ్యుడీషియల్ కమిషన్

ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదంలో జ్యుడీషియల్ కమిషన్ వేయాలని కేటీఆర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 'ప్రమాద ఘటనకు బాధ్యులైన వారిపై విచారణ జరపాలి. ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో ప్రమాదంతో ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయల ఆర్థిక నష్టం జరిగింది. ఈ ప్రమాదాలపై హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో ప్రభుత్వం న్యాయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. ఆర్మీ, ఇతర సంస్థల సహాయంతో సొరంగంలో చిక్కుకున్న వారిని వెంటనే వెనక్కి తీసుకువచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలి' అని కేటీఆర్ చెప్పారు.

త్వరలోనే ఎస్సీల వర్గీకరణకు చట్టం

- మార్చి 3న రవీంద్రభారతిలో మాదిగల కృతజ్ఞత సభ: మంత్రి దామోదర రాజనర్సింహ



అమరవీరుల కుటుంబ సభ్యుల కాళ్లు కడుగుతున్న మంత్రి దామోదర

సాక్షి, హైదరాబాద్: త్వరలోనే ఎస్సీల వర్గీకరణ కోసం అసెంబ్లీలో చట్టం చేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో మాదిగ అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ఈ సభకు హాజరైన మంత్రి దామోదర మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ అమలులో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కొత్త చరిత్ర రాయబోతున్నామన్నారు. ఎస్సీల వర్గీకరణ చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతగా మార్చి 3వ తేదీన రవీంద్రభారతిలో సభ నిర్వహిస్తామని చెప్పారు. జాతి ప్రయోజనాల కోసం ప్రాణాలర్పించిన అమరుల కుటుంబాలకు మాదిగలు జీవితాంతం రుణపడి ఉంటారన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యుల కాళ్లను కడిగిన మంత్రి, ఆ కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయ చెక్కులను అందజేశారు. ఈ సంస్మరణ సభలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, వేముల వీరేశం, తోట లక్ష్మీకాంతారావుతోపాటు మాజీ మంత్రులు మోత్కుపల్లి నర్సింహులు, డాక్టర్ ఏ.చంద్రశేఖర్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, మాజీ ఎంపీ పసునూరు దయాకర్ పాల్గొన్నారు.

గ్లోబల్ అకడమిక్ లీడర్‌షిప్ సమ్మిట్ సక్సెస్

తాపర్ ఇన్‌స్టిట్యూట్ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యలో సవాళ్లు, అవకాశాలపై చండీగఢ్‌లో తాపర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (టైట్) ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించిన గ్లోబల్ అకడమిక్ లీడర్‌షిప్ సదస్సు విజయవంత మైందని ఆ సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. 60 ప్రఖ్యాత విద్యా సంస్థల వైస్ చాన్స్‌లర్లు, డైరెక్టర్లతోపాటు ప్రొఫెసర్లు, విద్యావేత్తలు, విధాన నిర్ణేతలు, పారిశ్రామికవేత్తలు ఈ సదస్సులో పాల్గొన్నారన్నారు. విద్యా సంస్థలకు ప్రభుత్వం ఇస్తున్న ర్యాంకులు, అక్రెడిటేషన్ల ప్రభావం తదితరాలపై అభిప్రాయాలను వెల్లడించారన్నారు.

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

వారం రోజుల్లో పెళ్లి.. అంతలోనే ఘోరం



భువనగిరి టౌన్: వారం రోజుల్లో పెళ్లిపీటలు ఎక్కాల్సిన ఓ మహిళా కానిస్టేబుల్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం వరికోల్ గ్రామానికి చెందిన మామిడాల అనూష (30) 2020 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్. నాలుగు సంవత్సరాలుగా భువనగిరిలో విధులు నిర్వర్తిస్తూ విద్యానగర్‌లో నివాసముంటోంది. అనూషకు కోహెడ మండలానికి చెందిన యువకుడితో మార్చి 6న వివాహం జరగాల్సి ఉంది. ఈ నెల 14న ఆమెకు వివాహ నిశ్చితార్థం జరిగింది.

నాన్నకు యాక్సిడెంట్ అయ్యిందని చెప్పి..: నాన్నకు యాక్సిడెంట్ అయ్యిందని, తనకు సెలవు కావాలని అనూష మంగళవారం ఉదయం ఏఆర్ సీఐకి సమాచారం ఇచ్చి ఇంటికి చేరుకుంది. అనంతరం ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే, ఆమె మరో యువకుడితో ప్రేమలో ఉందని, తను ప్రేమించిన వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసింది. అనూష కుటుంబ సభ్యులు మంగళవారం మధ్యాహ్నం సమయంలో అనూషకు ఫోన్ చేయగా ఎత్తలేదు. దీంతో సహోద్యోగికి సమాచారం ఇవ్వగా, ఆమె అనూష ఆత్మహత్య చేసుకుందని చెప్పింది. దీంతో వారు వెంటనే భువనగిరికి బయలుదేరి వచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనూష తల్లిదండ్రులు మామిడాల పద్మ, లక్ష్మయ్యలు ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించారు. పెళ్లి చేసుకోవడం ఇష్టంలేకనే అనూష ఆత్మహత్యకు పాల్పడిందని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎఫ్‌టీఎల్ సమీప సర్వే నంబర్లివ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

గుర్తైతే, గతంలో చెల్లించిన మొత్తం ఫీజు నుంచి 10 శాతం ప్రాసెసింగ్ చార్జీలను మినహాయించుకుంటారు.

- వెంచర్‌లోని 10 శాతం ప్లాట్లను 2020 ఆగస్టు 26కు ముందు విక్రయించి ఉంటే, మిగతా ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం.. విక్రయించిన ప్లాట్ల వివరాలను ఈసీ రూపంలో సమర్పించాల్సి ఉంటుంది.
- లేఅవుట్ క్రమబద్ధీకరణ చార్జీలు, ఓపెన్ స్పేస్ చార్జీలు చెల్లించిన తర్వాత తాత్కాలిక ఫీజు నిర్ణయమవుతుందని ప్రభుత్వం తెలిపింది.
- సబ్–రిజిస్ట్రార్ సంబంధిత ప్లాట్‌ను నమోదు చేసి, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు వివరాలు, సేకరించిన చార్జీలను ఎల్‌ఆర్‌ఎస్ పోర్టల్‌కు ప్రాసెసింగ్ కోసం పంపితే క్రమబద్ధీకరణ చార్జీలు ఆన్‌లైన్‌లోనే నిర్ణయమవుతాయి.

మాది భారత్.. కాంగ్రెస్‌ది పాక్ టీం

▶ మొదటి పేజీ తరువాయి

చేయడం లేదు..'అని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. మంగళవారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఫోన్ ట్యాపింగ్‌పై దమ్ముంటే సీబీఐ విచారణ కోరండి..: 'దూదేకుల కులాలకు రిజర్వేషన్లను మేం ఏనాడూ అభ్యంతర పెట్టలేదు. కానీ ముస్లింలందరినీ బీసీల్లో చేర్చి బిల్లు పంపితే ఎందుకు ఆమోదించాలి? 60 లక్షల మంది బీసీల జనాభా ఎట్లా తగ్గిందో సమాధానం చెప్పాలి. ఫోన్ ట్యాపింగ్ కేసుపై హైకోర్టులో పిటిషన్ వేసి సీబీఐ విచారణ జరిపించాలని కోరితే అడ్వకేట్ జనరల్ ఒప్పుకోని విషయం నిజం కాదా? కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్రభాకర్‌రావు, శ్రవణ్ విదేశాలకు పారిపోయారు. మీరు విదేశాలకు పంపిస్తే..మేం పట్టుకురావాలా? మేం లిక్కర్ కేసులో కవితను జైల్లో వేశాం. ట్యాపింగ్ కేసులో మీకు దమ్ముంటే సీబీఐ విచారణ కోరండి. దోషులందరినీ అరెస్టు చేసి బొక్కలో వేస్తాం..' అని సంజయ్ అన్నారు.

బీసీ సమాజాన్ని సీఎం అవమానించాడు..: 'పేదరికం ఆధారంగా రాష్ట్రాలకు కేంద్రం నిధులు ఇస్తుంది. యూపీఏ పదేళ్ల పాలనలో 2.94 కోట్ల ఉద్యోగాలిస్తే, పదేళ్లలో మోదీ 17.19 కోట్ల కొలువులిచ్చారు. తెలంగాణ అభివృద్ధిలో కేంద్రం పాత్రపై చర్చకు సిద్ధమా అని సవాలు విసిరితే, తోక ముడిచి పారిపోయారు. ప్రధాని మోదీని పెద్ద బీసీ, నన్ను చిన్న బీసీ అంటూ సీఎం బీసీ సమాజాన్ని అవమానించాడు. కాంగ్రెస్ అగ్రనేత అల్లుడి కోసం రూ.15 వేల కోట్ల ఖర్చయ్యే మూసీ ప్రక్షాళనను రూ.1.5 లక్షల కోట్లకు పెంచి కమీషన్లు దొబ్బాలనుకుంటే కేంద్రం ఎందుకు సహకరించాలి?..'అని కేంద్రమంత్రి ప్రశ్నించారు.

ఓడిపోతే ముక్కు నేలకు రాస్తారా?..: ఆరు గ్యారంటీలు సహా హామీలన్నీ అమలు చేశారని భావిస్తే కాంగ్రెస్ పార్టీకే ఓటెయ్యాలని, సమస్యలపై నిరంతరం పోరాడుతూ సర్కార్ మెడలు వంచేది బీజేపీ అనుకుంటే తమకు మద్దతివ్వాలని సంజయ్ కోరారు. 'కాంగ్రెస్ పాలన బాగుందనుకుంటే మీ 14 నెలల పాలనపై ఎమ్మెల్సీ ఎన్నికలను రెఫరెండంగా తీసుకుందామా? కాంగ్రెస్ ఓడిపోతే ముక్కు నేలకు రాసి సీఎం పదవి నుంచి తప్పుకుంటారా?..'అని నిలదీశారు. దమ్ముంటే తన సవాల్‌ను స్వీకరించాలన్నారు.

భారత్, పాక్ మ్యాచ్‌తో ఏం సంబంధం?

▶ మొదటి పేజీ తరువాయి

మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్నిక ఏదైనా హిందూ.. ముస్లిం, భారత్..పాకిస్తాన్ ముచ్చట తీయకుండా బీజేపీ ఓటడగదని విమర్శించారు. 2014లో శ్రీరాముడి పేరిట అధికారంలోకి వచ్చిన బీజేపీ చేసిందేమీ లేదని, తర్వాత రెండుసార్లు దేవుడి పేరునే వాడుకుందని ధ్వజమెత్తారు. బీజేపీకి లాభం చేసేందుకే బీఆర్‌ఎస్ పోటీలో లేదన్నారు. బీసీలను అణగదొక్కే బీజేపీ ఒక వైపు, రెడ్డి సీఎంగా ఉన్నా బీసీలకు న్యాయం చేసే కాంగ్రెస్ మరోవైపు ఉన్నాయని, పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

సంజయ్‌ది అవగాహనా రాహిత్యం

దేశంలో అన్ని ధరలు పెరిగాయని, పేదలకు మోదీ ప్రభుత్వం ఏం న్యాయం చేసిందో సంజయ్ చెప్పాలన్నారు. ఈ-ఫార్ములా రేసు కేసులో ఒక పక్క విచారణ జరుగుతుంటే, కేటీఆర్‌కు నోటీసు కూడా ఇవ్వలేదని అనడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. కేంద్రమంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్‌పై ఎందుకు సీబీఐ విచారణ జరిపించకూడదని ప్రశ్నించారు. సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనని 3.1 శాతం కుటుంబాలు కూడా వివరాలు నమోదు చేసుకోవాలని, 28వ తేదీ వరకు కేసీఆర్, హరీశ్‌లాంటి వారికి కూడా అవకాశం ఇచ్చామని చెప్పారు.

నేడు ప్రధానితో సీఎం రేవంత్ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ప్రధాని మోదీతో భేటీ కానున్నారు. ప్రధానితో అపాయింట్‌మెంట్ ఖరారు కావడంతో మంగళవారం రాత్రి ఆయన ఢిల్లీకి చేరుకున్నారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు ప్రధానితో సీఎం రేవంత్ సమావేశం అవుతారని తెలుస్తోంది. ప్రధానితో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ముఖ్యమంత్రి చర్చించే అవకాశముంది. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో చట్టం చేసి పంపితే దాని అమలుకు సహకరించాలని కోరనున్నట్లు తెలిసింది. అలాగే తెలంగాణలో తాము చేపట్టిన కులగణన గురించి వివరించడంతోపాటు దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని మోదీకి సీఎం రేవంత్ సూచించనున్నట్లు సమాచారం. మెట్రో కారిడార్, ఆర్‌ఆర్‌ఆర్‌కు నిధులు కేటాయించాలని, రాష్ట్ర విభజన సమస్యలను పరిష్కరించాలని, పంచాయతీరాజ్ శాఖకు కేంద్రం నుంచి రావాల్సిన రూ. 6 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని ప్రధానికి విజ్ఞప్తి చేయనున్నారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన ప్రమాదం, కొనసాగుతున్న సహాయక చర్యల గురించి కూడా మోదీకి రేవంత్‌రెడ్డి వివరించనున్నట్లు తెలిసింది.

కాంగ్రెస్ అధిష్టానం పెద్దలతోనూ..

ప్రధాని మోదీతో భేటీ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అధిష్టానం పెద్దలనూ కలిసే అవకాశం ఉంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీతోపాటు కొత్తగా రాష్ట్రానికి ఇన్‌చార్జ్‌గా నియమితులైన మీనాక్షి నటరాజన్‌ను సీఎం రేవంత్ కలవనున్నట్లు తెలిసింది. ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలు, నామినేటెడ్ పదవులు, మంత్రివర్గ విస్తరణ, పార్టీ నేతలు చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలపైనా అధిష్టాన పెద్దలతో రేవంత్ చర్చించే అవకాశం ఉంది.

ఏపీపై కృష్ణా బోర్డు ఆంక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

జలాశయాలైన శ్రీశైలం, సాగర్ నీటి వినియోగానికి సంబంధించి ఓ రాష్ట్రంపై కృష్ణా బోర్డు ఆంక్షలు విధించడం ఇదే తొలిసారి అని అధికారవర్గాలు తెలిపాయి. గతంలో కేవలం జల విద్యుత్‌ను నియంత్రించాలని కోరుతూ మాత్రమే కృష్ణా బోర్డు రెండు రాష్ట్రాలకు లేఖలు రాసిందని వెల్లడించాయి. శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో మిగిలి ఉన్న నిల్వలను రెండు రాష్ట్రాలకు కేటాయించే విషయంలో నిర్ణయం తీసుకునేందుకు. ఈ నెల 24న జలసౌధలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో పై ఆదేశాలకు సంబంధించి కేఆర్‌ఎంబీ కీలక నిర్ణయాలు తీసుకుంది. బోర్డు చైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో తెలంగాణ తరఫున నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ జి.అనిల్‌కుమార్, ఏపీ తరఫున ఈఎన్సీ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీటి అవసరాలు తీరిన తర్వాతే..

ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో కనీస నీటి మట్టం (ఎండీడీఎల్) 834 అడుగులకు ఎగువన కేవలం 24 టీఎంసీల నీటి లభ్యత ఉండగా, సాగర్ ఎండీడీఎల్ 510 అడుగులకు ఎగువన 42.3 టీఎంసీలే లభ్యతగా ఉన్నాయని కృష్ణా బోర్డు తెలిపింది. తాగునీటి అవసరాలకు రెండు జలాశయాల్లో నిల్వలను వచ్చే వేసవి ముగిసే వరకు లేదా జూలై 31 వరకు సంరక్షించాలని నిర్ణయించింది. తాగునీటి అవసరాలు తీరిన తర్వాతే మిగిలే జలాలను రెండు రాష్ట్రాల సాగునీటి అవసరాలకు కేటాయిస్తామని స్పష్టం చేసింది.

నేడు కేటాయింపులపై కీలక సమావేశం

తెలంగాణ నీటిపారుదల శాఖ నల్లగొండ సీఈ, ఏపీ జలవనరుల శాఖ ఒంగోలు సీఈలు.. శ్రీశైలం, సాగర్ జలాల వినియోగంపై రెండు రాష్ట్రాల ఉమ్మడి ప్రణాళికను సిద్ధం చేసి ఈ నెల 25లోగా సమర్పించాలని కృష్ణా బోర్డు ఆదేశించింది. ప్రస్తుత ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు ఉండనున్న సాగునీటి, జూలై 31 వరకు ఉండనున్న తాగునీటి అవసరాల వివరాలు ఈ ప్రణాళికలో ఉండాలని కోరింది. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు జలసౌధలో సమావేశమై, సదరు ప్రణాళిక ఆధారంగా శ్రీశైలం, సాగర్ జలాశయాల నుంచి రెండు రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై నిర్ణయం తీసుకుంటామని తెలిపింది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 26-2-2025


• హ్యూమనిస్టు

జగమై జంగమమై



జగత్సర్వం శివమయం. శివునికి అతీతమైనది ఏదీ లేదు ఆకార నిరాకార దివ్యదీపం శివుని రూపం. నిరంజనుడు. నిరూపుడు. నిర్గుణుడు. మేరునగానికి మరుభూమికి తేడా చూడని తత్వమే శివ తత్వం. భస్మ లేపనమైనా సుగంధమైనా తనకు ఒక్కటే. జనన.. మరణం లేని ఆది అంతం లేని అనాది ఉనికి శివుడు. గమనానికి వాహకమై ఏ చలనం లేని అచలం శివుడు. సమస్తాన్ని సృష్టించి, తానే సమస్తమైనవాడు. తనలో జనించిన జగత్తు దుఃఖాలకు, సౌఖ్యాలకు తాను అతీతుడు. స్థావర జంగమాత్మక జగత్తులో ఒక జంగముడై అనాది యుగాల నుండి నడయాడే శూన్య సంచారి. నిజమైన సమతా తత్వానికి పాదు శివుడే. ముడుపులు, కానుకలకు మురువని వాడు. అభిషేకానికి, బిల్వ పత్రానికి పరవశించే పసివాడు శివుడు.

చరిత్రకారులు ఈమని శివ నాగిరెడ్డి, కన్నడ సాహితీవేత్త ఆచార్య ఏ. శివప్రకాశ్, ఏటుకూరి బలరామ మూర్తి, ఆధ్యాత్మికవేత్త శివానంద మూర్తి వీరి రచనల అధ్యయనం వల్ల, బౌద్ధానికి, శివతత్వానికి ఉన్న ఎన్నో సారూప్యతలను కాంచగలం. జగద్గురు ఆదిశంకరుడు బౌద్ధాన్ని అధ్యయనం చేసి అందులోని ప్రతీత్య సముత్పాద తత్వమునకు ఆకర్షితుడై అద్వైతాన్ని రూపొందించినట్లు తెలుస్తున్నది. శంకరుని అద్వైతానికన్నా ముందే సిద్ధ నాగార్జునుని మాధ్యమిక వాదముంది. ఇంచుమించు అదే కాలంలో కాశ్మీరానికి చెందిన అభినవగుప్తుని పూర్ణాద్వైతం సాత్విక ధోరణిలో ఎంతో ప్రామాణికమైనది. దృశ్యం మిథ్య. సకలం నిష్కలం ... ఈ జగత్ అంతా బుద్బుద ప్రాయం ఈ భావసంచయమంతా బౌద్ధం నుంచి శంకరాచార్యుడు పొందినాడని అనేకులు ప్రస్తావించినారు.



కర్ణాటకలో దేవర దాసమయ్య, బసవన్న, అక్క మహాదేవి, అల్లమా ప్రభు, మదార చెన్నయ్య, శివ నాగమయ్య ఎందరో శివయోగులు కుల, మత, లింగ భేదాలు పాటించలేదు. ఇష్టలింగమే నీలోని శివుడని, కాయకమే కైలాసమన్నారు. నీలో ఉన్న ఇష్ట లింగాన్ని నీకు నీవే పూజించుకొని నిన్ను నీవే తరింప చేసుకోమన్నారు. కర్మ కాండలు, క్రతువులు అనివార్యం కాదని బోధించారు. లోకహితమే ఆధ్యాత్మిక తత్వమన్నారు. మహోన్నతమైన ఆలోచనలతో, ఆచరణలతో విశాల ప్రజా రాసులకు దగ్గరైనారు. ఆనాటి బసవన్న నుంచి ఈ మధ్యే లింగైక్యం చెందిన టుముకూరు సిద్ధ గంగస్వామి సనాతన శివ భక్తిని, ఆధునిక విజ్ఞానాన్ని మిళితం చేశారు. అందరికి నాణ్యమైన ఉచిత విద్య, ఆధునిక వైద్యసేవలనందించి ఎన్నో జీవితాలను వెలిగించారు. సంపదపై ఏ ఒక్కరి హక్కు ఉండదని దేవర దాసమయ్య వాక్కును ఉటంకించారు రుద్రాక్షమఠం ప్రభు లింగస్వామి. డాక్టర్ భాస్కర యోగి శివ తత్వమునెరిగిన అవధూతలెందరినో పరిచయం చేశారు.

మరోవైపు శ్రీధరస్వామి, శివరామదీక్షితులు, కంభ బ్రహ్మం, అనుమన గిరి శివరామ యోగి, కాల జ్ఞాని వీర బ్రహ్మం, యోగి వేమన శివతత్వాన్ని అచలంతో మేళవించి పరిపూర్ణమైన ఎరుకను బోధ చేసినారు. పోరుమామిళ్ల కాశినాయన, అమరాబాద్ సయ్యద్ అబ్దుల్, వారి శిష్యుడు బాలకిషన్, చిన్న రాముడు, కాసిదాసు, కోటకదిరా చంద్ర మౌళీశ్వర స్వామి, చెన్నదాసు, దుర్గి సుబ్బదాసు, కైవారం నారాయణ తాత, అహ మదుద్దిన్, ఉత్తరాస్పెల్లి విశ్వద్దీన్, యాన గొంది మాణిక్యమ్మ, పూదోట బసవయ్య, ఇమ్మడిజెట్టి చంద్రయ్య, దున్న ఇద్దాసు, హఠ యోగి చెన్నదాసు, నడిగడ్డ ఈశ్వరయ్య... ఇలా ఎందరో మాన్యులు మహాజ్ఞాన సంపన్నులై నిరాడంబరంగా జీవించి ప్రలోభాలకు, కాసులకు, అధికార పీఠాలకు ఆమడ దూరంలో ఉండినారు. పరిపూర్ణమైన ఎరుకతో లోకాన్ని తరింపజేసినారు. ఈ శివతత్వం మానవులలో ద్వేషం మాపుతుంది. భోగ లాలసతనాపుతుంది. క్రౌర్యానికి కళ్ళెం వేస్తుంది. ఆశా మోహాలను అదుపులో ఉంచుతుంది. ''మేలైన ఆకాశ పృథ్వి, జలం, అగ్ని, గాలితో కూడిన మూలం లేని ఈ జగత్ స్థితిని దాని స్వస్వరూపాన్ని అవగతం చేస్తుంది.

అరూపకుడైన శివుడు నిరాకార సాకారమై భాసిస్తున్నాడు. స్వర్గం నరకం, పునర్జన్మ, కర్మ.. ఇవన్నీ మానవుని పరిమిత అన్వేషణలో జనించినవే. వీటికి అతీతమైనదే శివతత్వం. అంతటా వ్యాపించి, అంతట తానై, ఉండీ లేనట్లుగా ఉండే తత్వమే శివతత్వం. బుద్ధభగవానుడు మొదలుకొని, రమణమహర్షి దాక, జగద్గురు శంకరుడు మొదలుకొని వీరబ్రహ్మం దాక, రామచంద్ర ప్రభు నుండి శివరామ దీక్షితులు దాక... కనకదాసు నుండి కాశీ నాయనదాకా... ఈ తత్వాన్ని దర్శించి దారులేసిన వాళ్లే. ఆ దారిని చూపే దీపాన్ని నీలో నీవు వెలిగించుకోవలసిందే.

• గోరటి వెంకన్న

• 'ఉమ'నిస్టు

సగమై సంగమమై



లోకంలో భార్యను ప్రేమించే వారు చాలామంది ఉండొచ్చు. అయితే శివుడు తన భార్యను ప్రేమించినంతగా మరొకరెవరూ ప్రేమించలేరేమో అనిపిస్తుంది. ఎందుకంటే శివుడికి పార్వతి మీద ప్రేమ ఎంతటి గొప్పదంటే ఆమెకు తన శరీరంలో సగభాగాన్ని పంచి ఇచ్చేటంత!

శివుడి అర్ధనారీశ్వర తత్వాన్ని, శివుడిలో శక్తిగా వెలిగే అమ్మవారిని దర్శించడానికి సౌందర్యలహరిలో అనేక ఉదాహరణలున్నాయి కానీ... మచ్చుకు మొదటి రెండు శ్లోకాలు పట్టుకుంటే చాలు.

'శివశ్శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం
న చే దేవం దేవో న ఖలు కుశలః స్పందితు మపి
అత స్త్వా మారాధ్యాం హరిహర విరించాదిభిరపి
ప్రణంతుం స్తోతుం వా కథ మకృత పుణ్యః ప్రభవతి'

శివుడు శక్తితో కలిసినప్పుడే శక్తిమంతుడై సృష్టి స్థితి లయలు చేయగలుగుతున్నాడు. శక్తి కలవనప్పుడు కనీసం స్పందించే శక్తి కూడా లేనివాడుగా ఉన్నాడు. అలాంటి నీగురించి చెప్పాలంటే గతజన్మల్లో పుణ్యం లేకపోతే...బ్రహ్మ–విష్ణు–రుద్రులకైనా సాధ్యమవుతుందా? అమ్మవారిని పొగుడుతూ మొట్టమొదటి శ్లోకం మొట్టమొదటి మాట 'శివ' అని అయ్యవారితో మొదలుపెట్టడంలో శంకరుడి హృదయాన్ని పట్టుకోవాలి.

'కలాభ్యాం చూడాలంకృత శశికలాభ్యాం నిజతపః
ఫలాభ్యాం భక్తేషు ప్రకటితఫలాభ్యాం భవతు మే
శివాభ్యా మస్తోక త్రిభువన శివాభ్యాం హృది పున
ర్భవాభ్యా మానందస్ఫురదనుభవాభ్యాం నతి రియమ్'

శివపార్వతులు ఒకరి తపస్సుకు ఒకరు ఫలమైనవారు. ఒకరు ఎక్కువా కాదు. ఒకరు తక్కువా కాదు. ఆది దంపతులు ఇద్దరూ సమానం. అమ్మవారి సౌందర్యానికి తగిన శబ్దసౌందర్యంతో సాగిన రచన ఇది. శంకరాచార్యుల సంస్కృతంలో శబ్ద సౌందర్యం, అర్థగాంభీర్యం వర్ణించడానికి మాటలు చాలవు. కవిత్వం, ప్రాసలు, తూగు, చమత్కారం, భావం, సాంద్రత, ఎత్తుగడ, ముగింపు, మకుటం, పునరుక్తి లేకుండా ఒకే విషయాన్ని రకరకాలుగా చెప్పడం, అత్యంత సంక్లిష్టమైన విషయాలను అరటిపండు ఒలిచిపెట్టినట్లు అత్యంత తేలికగా చెప్పడం... ఇలా తోడుకున్నవారికి తోడుకున్నన్ని అందాలు, ఆనందాలు, అర్థాలు, పరమార్థాలు. శంకరుడు పుట్టకపోయి ఉంటే దేవుళ్ళకు ఇన్నిన్ని స్తోత్రాలే ఉండేవి కావు.

బ్రహ్మ సృష్టి చేయాలనుకున్నప్పుడు అవసరమైన శివుడి అర్ధనారీశ్వర రూపంలో ఇంకా అనేక ఆధ్యాత్మిక, యోగ సాధనా రహస్యాలు దాగున్నాయి. కాళిదాసు రఘువంశ ప్రార్థన శ్లోకాల్లో చెప్పినట్లు–

'వాగర్థా వివ సంపృక్తౌ వాగర్థప్రతిపత్తయే,
జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ'

అని శివరాత్రి పూట శివుడిలో భాగమైన పార్వతికి; పార్వతిలో భాగమైన శివుడికి; వేరు చేయడానికి వీల్లేకుండా కలిసి ఉన్న జగత్తుకు తల్లిదండ్రులైన ఆదిదంపతులిద్దరికీ నమస్కారం పెట్టి... లోకంలో దంపతులు కూడా అలా వేరు చేయడానికి వీల్లేకుండా కలిసి ఉండాలని కోరుకుందాం.

– పమిడికాల్వ మధుసూదన్



నేడు శివరాత్రి

జనమనోహరుడు

శివరాత్రివేళ ఒక్కసారిగా పుణ్యనదులు, పుణ్యక్షేత్రాలు జనవాహినితో సందడిగా ఉంటాయి. ఒక సమైక్యతకీ, సమన్వయానికీ సంకేతమిది. భాషలు, ఆచార వ్యవహారాలు, కట్టూ బొట్టూ ఇలాంటి తేడాలు ఎన్ని ఉన్నా భారతీయులందరూ ఒకే శివభావంతో ఒక్కటిగా మసలే సుదినమిది.

దేవదానవులు క్షీరసాగర మథనం చేసినప్పుడు ముందుగా పుట్టిన హాలాహలాన్ని ఉండలా చేసుకుని కంఠంలో ఉంచి కాపాడిన వాడు శివుడు. ఆ తరువాత పాల కడలిని మథించగా వచ్చిన అద్భుతమైన వస్తువులన్నింటినీ దేవదానవులే పంచుకున్నారు. అవేవీ శివుడు స్వీకరించలేదు. ఆశించలేదు. ఈ లీల ద్వారా జగత్పాలకుడైన శివుడు, పాలకులు ఎలా ఉండాలో బోధించాడు.

ఒక పాలకుడిగా ప్రజల ధనాలనీ, ప్రయోజనాలనీ తాను అనుభవించకుండా, సుఖాలను మాత్రం అందకి పంచి, కటువైన విషాన్ని తాను దిగమింగిన అమృతమూర్తి రుద్రుడు.

భూమికోసం... తన పితరుల మోక్షం కోసం భగీరథుని ప్రార్థన మేరకు గంగను తన జటాజూటాల నుంచి దించిన వేల్పు శివుడు.

లోకక్షేమంకోసం ఎంతటి భారాన్నైనా స్వీకరించి నిర్వహించే సమర్థత, సౌజన్యం శివుని సహజ స్వభావం.

లోకకంటకులైన త్రిపురాసురాది దుష్టుల్ని నిగ్రహించి, తన పరాక్రమాన్ని, ప్రసన్నతనీ ప్రదర్శించిన పరమాత్ముడు.

'శివం' అంటే 'మేలు, మంచి'. లోకాలకి మేలు చేసే స్వభావం కలవాడు కనుకనే శివుడు.

ప్రాణికోటికి శుభాన్ని కోరేవాడు, శ్రేయస్సును కలిగించే వాడు శివుడు.

రుద్రుడు – దుఃఖాన్ని పోగొట్టేవాడు;
శంకరుడు – సుఖాన్నీ, శాంతినీ కలిగించేవాడు;
శంభుడు – శాంతికిమూలమైన వాడు;
సదాశివుడు – ఎల్లవేళలా శుభస్వరూపుడు.

• ఇలా శివుని నామాలన్నీ ఆయనలోని 'మేలు' గుణాల్ని చెబుతున్నాయి. ఈ స్వభావాలను మనలో పెంచుకునేలా చేసేదే శివభావన, శివారాధన.

• 'శివుని పూజించడం – అంటే తపస్సునీ, జ్ఞానాన్నీ, త్యాగాన్నీ ఆరాధించడమే. భారతీయుల ఆదర్శాలివి. అందుకే నిరంతరం తపోరూపంలో ఉన్న శివుని ఆరాధిస్తున్నారు'' అని స్వామి వివేకానందుల వాగ్భావన.

ఈ సుదినాన శివ తత్వాన్ని అర్థం చేసుకుందాం.. చేతనైన మేరకు శివరాత్రిని జరుపుకుందాం.

మన చిత్తాలను శుద్ధి చేసుకొని, పవిత్ర భావనతో అంతర్ముఖులమై మనలోని పరమాత్మని ధ్యానించడమే ముఖ్య శివారాధన. అంతర్ముఖత్వానికి సంకేతమే రాత్రి. సత్యాన్ని మరువకుండా జాగరూకతతో మెలగడమే జాగరణ. ఇంద్రియ చపలత్వాన్ని నిగ్రహించడమే ఉపవాసం. సద్భావనలతో పరమాత్మను ఆరాధించడమే అభిషేకం.

– డి.వి.ఆర్.

లీగల్

వరకట్న నిషేధ చట్టం అందరికీ వర్తిస్తుంది!

నాకు పెళ్ళి అయ్యి రెండు సంవత్సరాలు అవుతోంది. మేము ముస్లిమ్స్. పెళ్లి సమయంలో నా భర్త తరపు వాళ్లు కోరిన మొత్తాన్ని ఇచ్చాము. మేమిద్దరం ఉద్యోగులమే... నెలకు చెరొక లక్ష జీతం. ఇప్పుడు మేము విడిపోవాలని అనుకుంటున్నాం. అయితే నేను కేసుపెడితే కట్నం ఇచ్చినందుకు మమ్మల్ని కూడా జైల్లో పెడతారు అని నా భర్త బెదిరిస్తున్నాడు. వరకట్న నిషేధ చట్టం ముస్లింలకు వర్తించదు అని అంటున్నాడు. అది నిజమేనా? దయచేసి వివరణ ఇవ్వండి.

–షేక్ కవిత, తిరుపతి

వరకట్న నిషేధ చట్టం అన్ని మతాల వారికి వర్తిస్తుంది. కొందరు 'మెహర్'ను విడాకులతో పొరబడుతుంటారు. వరకట్న నిషేధ చట్టం ప్రకారం కట్నం ఇచ్చినా తీసుకున్నా రెండు నేరాలే. కానీ, కట్నం ఇచ్చిన వారు ఒత్తిడికి లోనై ఇస్తారు కాబట్టి, కట్నం ఇచ్చిన వారికి శిక్షపడే ప్రమాదం తక్కువే. అలా కట్నం ఇచ్చిన వారందరినీ శిక్షిస్తూ పోతే వరకట్న నిషేధ చట్టం ఉద్దేశ్యానికే అర్థం లేకుండా పోతుంది. మీ విషయంలో మీ భర్త కూడా ఒప్పుకుంటే సామరస్యంగా విడిపోయి ఎవరి జీవితం వారు చూసుకోండి. పిల్లలు ఉంటే, మీ భర్త కూడా పిల్లల మెయింటెనెన్స్ పంచుకోవాల్సి వస్తుంది.



– శ్రీకాంత్ చింతల,
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

• టిట్ ఫర్ ఫ్యాట్

ఓవరాయిల్ వద్దు

ఇటీవల 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఊబకాయంపై మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ 10 శాతం వంట నూనెల వాడకం తగ్గించాలన్నారు. దీంతో ఆయిల్ వాడకం వల్ల లాభనష్టాల మాట మళ్లీ చర్చకి వచ్చింది. మనం ఎలాంటి నూనెలు వాడితే మంచిది? ఏ వయసువాళ్లు ఎంత నూనె వాడాలి? మహిళలు, పురుషులు వారి ఆరోగ్య రీత్యా వాడే నూనెలలో తేడాలుండాలా.. ఈ అంశాల గురించిన వివరణ..



ప్రపంచంలో 250 కోట్ల మంది అధికబరువుతో ఉన్నారని, ఆహారంలో నూనెల వాడకం వల్ల ఈ సమస్య ఉత్పన్నం అవుతోందని మోదీ డబ్ల్యూహెచ్ఓ డేటాని ఉటంకిస్తూ రోజువారి ఆహారంలో తక్కువ నూనె వాడకం ప్రాముఖ్యతను వివరించారు.

కుటుంబ బాధ్యత

వంటల్లో నూనెని తగ్గిస్తే ఊబకాయం నుంచి బయటపడొచ్చు. వంటల్లో నూనె తగ్గించడాన్ని కుటుంబం పట్ల బాధ్యతగా తీసుకోవాలి. ఎక్కువ నూనె వాడితే గుండె సమస్యలు, షుగర్, బీపి వంటివి వస్తాయి. అలాంటి వాటి నుంచి తప్పించుకునేందుకు ఆహారంలో చిన్న చిన్న మార్పులు చేసి హెల్దీగా, ఫిట్‌గా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్య సమస్యలకి దూరంగా ఉండొచ్చు.

ప్రమాదకరమైనవి

వంట నూనెల్లో ఎక్కువగా ట్రాన్స్ ఫ్యాట్ ఉంటుంది. ఇది అత్యంత ప్రమాదకరమైనది. ట్రాన్స్ ఫ్యాట్ ఎక్కువగా ఉండే ఆహారం ఊబకాయానికి కారణమవుతుందని ఎన్నో పరిశోధనలు చెబుతున్నాయి. నూనెలోని కొవ్వు చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయులను పెంచుతుంది. దీనివల్ల గుండె సమస్యలు, డయాబెటిస్ వంటి సమస్యలు వస్తాయి. అధిక రక్తపోటు ప్రమాదం పెరుగుతుంది.

తగ్గించాలంటే...

పండ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలు, సమతుల ఆహారం తీసుకోవాలి. రోజూ కనీసం గంటసేపు వ్యాయామం చేయాలి. ఊబకాయం గురించి అవగాహన కల్పించడానికి మోదీ పది మంది సెలబ్రిటీలను నామినేట్ చేశారు. వారిలో జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా, నటులు ఆర్.మాధవన్, దినేష్ లాల్ యాదవ్ నిరాహువా, మోహన్ లాల్, స్పోర్ట్స్ షూటర్ మను భాకర్, వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, గాయని శ్రేయా ఘోషల్, రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి ఉన్నారు.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఆయిల్ అధికంగా తీసుకుంటే నష్టాలు

- గ్రాము నూనెలో 9 క్యాలరీలు ఉంటాయి. అధికంగా తీసుకుంటే శరీర బరువు పెరుగుతుంది.
- కొవ్వు అధికంగా కలిగి ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల గుండెకు సంబంధించిన సమస్యలు రావచ్చు. ముఖ్యంగా ట్రాన్స్ ఫ్యాట్స్ ఎక్కువగా ఉన్న నూనెలు హాని చేస్తాయి.
- అసమతుల్యమైన నూనెలు తీసుకుంటే బ్యాడ్ కొలెస్ట్రాల్ పెరిగి, గుడ్ కొలెస్ట్రాల్ తగ్గుతుంది.
- అధిక నూనె వాడకం ఫ్యాటీ లివర్ సమస్యకు దారితీస్తుంది. మధుమేహం వచ్చే ప్రమాదం ఉంటుంది.

ఏ నూనెలు వాడాలి?

సమతుల కొవ్వులు ఉండే నూనెలను వాడాలి. ముఖ్యంగా ప్రాసెసింగ్ తక్కువగా చేసిన (కోల్డ్ ప్రెస్డ్) నూనెలు ఆరోగ్యానికి మంచివి.

సురక్షితమైన, ఆరోగ్యకరమైనవి:
సన్‌ఫ్లవర్, వేరుశనగ, ఒమేగా, మొక్కజొన్న నూనె, ఆలివ్ ఆయిల్, అవిసె నూనె, కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్‌లలో ప్రాసెసింగ్ తక్కువగా ఉండి పోషకాలు ఎక్కువ.

తక్కువగా వాడవలసినవి:
పామ్ ఆయిల్ (Palm oil) – అధికంగా ప్రాసెస్ అవుతుంది.
వనస్పతి – ట్రాన్స్ ఫాట్స్ ఎక్కువ
స్నాక్స్ తయారీలో ఒకసారి ఉపయోగించినవి, తిరిగి వాడుతుంటారు. వీటి వల్ల ఎక్కువ ప్రమాదం ఉంది.

వయసుల వారీగా...

- **పిల్లలు (6–19 ఏళ్లు)**
  రోజుకు 4 – 5 టీస్పూన్లు (20–25ఎం.ఎల్) ఆడ–మగ ఇద్దరికీ. ముఖ్యంగా కొబ్బరి, ఆలివ్ ఆయిల్, కనోలా, నెయ్యి వంటి ఆరోగ్యకరమైన నూనెలు వాడాలి.
- **20 – 59 ఏళ్ల వరకు**
  రోజుకు 5 – 6 టీస్పూన్లు (25–30ఎం.ఎల్) ఆడ–మగ ఇద్దరికీ. ఆలివ్, కనోలా, అవకాడో, వేరుశనగ, సన్‌ఫ్లవర్, రిఫైన్డ్ వెజిటబుల్ ఆయిల్స్. కొబ్బరినూనె, అవిసె నూనె రోజుకు
- **60 ఏళ్ల.. అంతకు మించి...**
  రోజుకు 4 – 5 టీస్పూన్లు (20–25ఎం.ఎల్.) ఆడ–మగ ఇద్దరికీ. గుండె ఆరోగ్యానికి మేలు చేసే ఆలివ్, అవిసె, కనోలా నూనెలను వాడాలి. **గర్భవతులు మాత్రం రోజూ 6–7 టీ స్పూన్ల ఆరోగ్యకరమైన నూనె వాడాలి. వాటిలో ఆలివ్, అవకాడో, ఫ్లాక్స్ సీడ్ ఆయిల్స్ (ఒమెగా 3 ఉన్న నూనెలు) వాడాలి.**



డా. జానకి,
పోషకాహార నిపుణులు



సరైన పరిమితిలో తగిన రకాల నూనెలను తీసుకోవడం ఆరోగ్యానికి మేలే చేస్తుంది.

- నూనెలు మంచి క్యాలరీ సోర్స్‌గా పనిచేస్తాయి. వీటిలో అవసరమైన కొవ్వు ఆమ్లాలు (ఫ్యాటీ యాసిడ్స్) ఉంటాయి.
- ఒమేగా–3, ఒమేగా–6 వంటి ఆరోగ్యకరమైన కొవ్వులు గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.
- కొన్ని నూనెలలో విటమిన్–ఇ, కె, శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చర్మం, కేశాల ఆరోగ్యానికి మంచిది.
- కొవ్వులు శరీరంలోని వివిధ హార్మోన్ల ఉత్పత్తికి అవసరమైనవి.

మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ జోడీపై యూకీ బాంబ్రీ విజయం

వారం రోజుల వ్యవధిలో భారత డబుల్స్ టెన్నిస్ స్టార్ యూకీ బాంబ్రీ మరోసారి ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ జోడీని బోల్తా కొట్టించాడు. దుబాయ్ ఓపెన్ చాంపియన్‌షిప్ ఏటీపీ–500 టోర్నీలో భాగంగా మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో యూకీ బాంబ్రీ (భారత్)–అలెక్సీ పాపిరిన్ (ఆస్ట్రేలియా) ద్వయం 4–6, 7–6 (7/1), 10–3తో 'సూపర్ టైబ్రేక్'లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ మార్సెలో అరెవాలో (ఎల్ సాల్వడోర్)–మాట్ పావిక్ (క్రొయేషియా) జంటను ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. 86 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో–ఆసీస్ జోడీ ఆరు ఏస్‌లు సంధించింది. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసింది. గతవారం దోహా ఓపెన్–500 టోర్నీలో ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా)తో కలిసి ఆడిన యూకీ క్వార్టర్ ఫైనల్లో అరెవాలో–పావిక్ జంటపై గెలిచింది. దుబాయ్ ఓపెన్‌లోనే ఆడుతున్న మరో భారత జోడీ జీవన్ నెడుంజెళియన్–విజయ్ సుందర్ ప్రశాంత్ తొలి రౌండ్‌లో 4–6, 6–7 (6/8)తో జేమీ ముర్రే (బ్రిటన్)–జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా) ద్వయం చేతిలో ఓడిపోయింది.





నెదర్లాండ్స్‌కు భారత్ షాక్

భువనేశ్వర్: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రో లీగ్ భారత అంచె పోటీలను భారత మహిళల, పురుషుల జట్లు విజయంతో ముగించాయి. మంగళవారం జరిగిన మ్యాచ్‌ల్లో సలీమా టెటె సారథ్యంలోని భారత మహిళల జట్టు 'షూటౌట్'లో 2–1 గోల్స్ తేడాతో ప్రస్తుత ప్రపంచ చాంపియన్, ఒలింపిక్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ నెదర్లాండ్స్ జట్టును బోల్తా కొట్టించగా... హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్సీలోని భారత పురుషుల జట్టు 2–1 గోల్స్ తేడాతో ఇంగ్లండ్ జట్టుపై గెలిచింది. నెదర్లాండ్స్ మహిళల జట్టుతో జరిగిన మ్యాచ్‌లో రెండు క్వార్టర్‌లు ముగిసేసరికి భారత జట్టు 0–2తో వెనుకబడింది. ఆ తర్వాత ఎనిమిది నిమిషాల వ్యవధిలో టీమిండియా రెండు గోల్స్ చేసి స్కోరును 2–2తో సమం చేసింది. భారత్ తరఫున దీపిక (35వ నిమిషంలో), బల్జీత్ కౌర్ (43వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. నెదర్లాండ్స్ జట్టుకు పియెన్ సాండర్స్ (17వ నిమిషంలో), వాన్ డెర్ ఫే (28వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. నిర్ణీత సమయం ముగిశాక రెండు జట్లు సమంగా నిలువడంతో విజేతను నిర్ణయించేందుకు 'షూటౌట్' నిర్వహించారు. 'షూటౌట్'లో భారత గోల్‌కీపర్ సవితా పూనియా అడ్డుగోడలా నిలబడి నలుగురు నెదర్లాండ్స్ క్రీడాకారిణుల షాట్‌లను నిలువరించింది. నెదర్లాండ్స్ తరఫున మరీస్ వీస్ మాత్రమే సఫలమైంది. భారత్ తరఫున దీపిక, ముంతాజ్ సఫలమవ్వగా... బ్యూటీ డుంగ్‌డుంగ్, బల్జీత్ కౌర్ విఫలమయ్యారు. నెదర్లాండ్స్ ఐదో షాట్ తర్వాత భారత విజయం ఖరారు కావడంతో టీమిండియా ఐదో షాట్‌ను తీసుకోలేదు. ఇంగ్లండ్‌తో పోరులో భారత జట్టుకు హర్మన్‌ప్రీత్ (26వ, 32వ నిమిషంలో) రెండు గోల్స్ అందించాడు.

ఒక్క బంతి పడకుండానే...

వర్షం కారణంగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మ్యాచ్ రద్దు ● ఇరు జట్లకు చెరో పాయింట్



రావల్పిండి: ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ 'బి'లో హోరాహోరీగా సాగాల్సిన మ్యాచ్‌పై వరుణుడు నీళ్లు చల్లాడు. దీంతో రావల్పిండిలో పసందైన క్రికెట్ విందును ఆస్వాదించాలని వచ్చిన ప్రేక్షకులకు నిరాశే మిగిలింది. రెండు పటిష్ట జట్ల మధ్య నువ్వా నేనా అన్నట్లు సాగుతుందనుకున్న సమరం సర్వత్రా ఆసక్తిని రేపింది. గెలిచిన జట్టు సెమీఫైనల్ వైపు నడిచేది. కానీ వర్షం వల్ల ఈ మ్యాచ్ ఒక్క బంతికైనా నోచుకోలేకపోయింది. తెరిపినివ్వని వానతో మైదానమంతా చిత్తడిగా మారడంతో బ్యాట్లు, బంతులతో కుస్తీ చేయాల్సిన ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌లకే పరిమితమయ్యారు. చివరకు చేసేదేమీ లేక ఫీల్డ్ అంపైర్లు క్రిస్ గఫాని (ఆస్ట్రేలియా), రిచర్డ్ కెటిల్‌బొరొ (ఇంగ్లండ్)లు అవుట్‌ఫీల్డ్‌ను పరిశీలించి మ్యాచ్ నిర్వహణ అసాధ్యమని తేల్చారు. వెంటనే మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇరు జట్లకు ఒక్కో పాయింట్ కేటాయించారు. గ్రూప్ 'బి'లో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా తమ తొలి మ్యాచ్‌ల్లో శుభారంభం చేశాయి. ఫలితమివ్వని ఈ మ్యాచ్ వల్ల గ్రూప్‌లోని ఇంగ్లండ్, అఫ్గానిస్తాన్... అన్ని జట్లు ఇప్పుడు రేసులో నిలిచినట్లయ్యింది. ఎందుకంటే మూడేసి పాయింట్లతో ఉన్న దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాలకు మిగిలింది ఒక్కటే మ్యాచ్ కాగా... పాయింట్ల పట్టికలో ఖాతా తెరువని ఇంగ్లండ్, అఫ్గానిస్తాన్‌లకు రెండేసి మ్యాచ్‌లున్నాయి.

చాంపియన్స్ ట్రోఫీలో నేడు
ఇంగ్లండ్ X అఫ్గానిస్తాన్
వేదిక: లాహోర్, మధ్యాహ్నం గం. 2:30 నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియోహాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఢిల్లీ అలవోకగా...

- ఆరు వికెట్లతో గుజరాత్‌పై విజయం
- బంతితో మెరిసిన మరిజాన్, శిఖా
- అదరగొట్టిన జొనాసెన్, షఫాలీ


జొనాసెన్

బెంగళూరు: ఈ సీజన్ మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో ఢిల్లీ క్యాపిటల్స్ నిలకడైన విజయాలతో దూసుకెళ్తోంది. మంగళవారం జరిగిన పోరులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఢిల్లీ ఆరు వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై ఘనవిజయం సాధించింది. ముందుగా గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 127 పరుగులు చేసింది. భారతి ఫుల్మాలి (29 బంతుల్లో 40 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) జట్టును ఆదుకుంది. డాటిన్ (24 బంతుల్లో 26; 5 ఫోర్లు) మెరుగ్గా ఆడింది. మరిజాన్ కాప్, శిఖా పాండే, అనాబెల్ సదర్లాండ్ తలా 2 వికెట్లు తీశారు. తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ 15.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జెస్ జొనాసెన్ (32 బంతుల్లో 61 నాటౌట్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), షఫాలీ వర్మ (27 బంతుల్లో 44; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగారు.

ఆరంభంలోనే దెబ్బ...

మొదట బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జట్టులో బ్యాటర్లు మూకుమ్మడిగా చేతులెత్తేశారు. నాలుగో ఓవర్లో హర్లీన్ (5), లిచ్‌ఫీల్డ్ (0)లను అవుట్ చేసిన మరిజాన్ కాప్ దెబ్బ తీసింది. మరుసటి ఓవర్లో శిఖాపాండే వరుస బంతుల్లో బెథ్ మూని (10), కాశ్వీ గౌతమ్ (0)లను అవుట్ చేయడంతో ఇరవై పరుగులకే 4 కీలక వికెట్లను కోల్పోయింది. కాసేపటికి కెప్టెన్ ఆష్లీ గార్డ్‌నర్ (3), డియాండ్ర డాటిన్‌లు స్వల్ప వ్యవధిలో నిష్క్రమించడంతో 60/6 వద్ద గుజరాత్ కుదేలైంది. ఈ దశలో లోయర్ ఆర్డర్ బ్యాటర్ భారతి, తనూజ (16) ఏడో వికెట్‌కు 51 పరుగులు జోడించడంతో స్కోరు 100 దాటింది.

ధనాధన్...

సులువైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఢిల్లీ ఆరంభంలోనే కెప్టెన్ మెగ్‌లానింగ్ (3) వికెట్‌ను కోల్పోయింది. స్టార్ బ్యాటర్‌ను అవుట్ చేశామన్న ఆనందం గుజరాత్‌కు ఎంతోసేపు నిలువలేదు. ఓపెనర్ షఫాలీ వర్మ, వన్‌డౌన్ బ్యాటర్ జెస్ జొనాసెన్ ధాటిగా ఆడటంతో పరుగులు వేగంగా వచ్చాయి. జెస్ బౌండరీలతో అలరించగా, షఫాలీ భారీ సిక్సర్లతో అదరగొట్టింది. వీరిద్దరు 31 బంతుల్లోనే 74 పరుగులు జత చేశారు. షఫాలీ జోరుకు గార్డ్‌నర్ అడ్డుకట్ట వేయగా, జెమీమా (5), అనాబెల్ (1) స్వల్ప వ్యవధిలో నిష్క్రమించినా... 26 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్న జొనాసెన్ మిగతా లాంఛనాన్ని చకచకా పూర్తి చేసింది. **నేడు జరిగే మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌తో ముంబై ఇండియన్స్ ఆడుతుంది.**

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ఫన్ స్పోర్ట్స్ ఈ–పేపర్‌లో

స్కోరు వివరాలు

గుజరాత్ జెయింట్స్ ఇన్నింగ్స్: బెత్ మూనీ (సి) నికీ (బి) శిఖా పాండే 10; హర్లీన్ డియోల్ (సి) బ్రైస్ (బి) మరిజాన్ కాప్ 5; లిచ్‌ఫీల్డ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మరిజాన్ కాప్ 0; ఆష్లీ గార్డ్‌నర్ (బి) టిటాస్ సాధు 3; కాశ్వీ (సి) నికీ (బి) శిఖా పాండే 0; డియాండ్రా (బి) అనాబెల్ 26; తనూజ (రనౌట్) 16; భారతి (నాటౌట్) 36; సిమ్రన్ (సి) లానింగ్ (బి) అనాబెల్ 5; మేఘన (బి) జెస్ జొనాసెన్ 0; ప్రియా మిశ్రా (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 127. వికెట్ల పతనం:** 1–16, 2–16, 3–20, 4–20, 5–41, 6–60, 7–111, 8–121, 9–122. **బౌలింగ్:** శిఖా పాండే 3–0–18–2, మరిజాన్ కాప్ 4–1–17–2, టిటాస్ సాధు 2–0–15–1, అనాబెల్ 4–0–20–2, మిన్ను మణి 4–0–21–0, జెస్ జొనాసెన్ 3–0–24–1.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: మెగ్ లానింగ్ (బి) కాశ్వీ 3; షఫాలీ వర్మ (ఎల్బీడబ్ల్యూ) (బి) గార్డ్‌నర్ 44; జెస్ జొనాసెన్ (నాటౌట్) 61; జెమీమా (సి) భారతి (బి) తనూజ 5; అనాబెల్ (సి) బెత్ మూనీ (బి) కాశ్వీ 1; మరిజాన్ కాప్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (15.1 ఓవర్లలో 4 వికెట్లకు) 131. వికెట్ల పతనం:** 1–14, 2–88, 3–114, 4–115. **బౌలింగ్:** డియాండ్ర 4–0–30–0, కాశ్వీ 4–0–26–2, ఆష్లీ గార్డ్‌నర్ 3–0–33–1, మేఘన 1–0–8–0, ప్రియా 1.1–0–18–0, తనూజ 2–0–13–1.

రోయింగ్ లీగ్ @ హుస్సేన్ సాగర్

- నేటి నుంచి పోటీలు ప్రారంభం
- బరిలో 8 జట్లు

సాక్షి, హైదరాబాద్: ఐపీఎల్, డబ్ల్యూపీఎల్, పీకేఎల్, హెచ్ఐఎల్ ఇలా ప్రతి క్రీడలో లీగ్‌ల జోరు సాగుతున్న తరుణంలో... మరో వినూత్న లీగ్‌కు రంగం సిద్ధమైంది. ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్‌లో భారత ప్రాతినిధ్యం ఉన్న రోయింగ్‌లో నేటి నుంచి లీగ్ జరగనుంది. తొలిసారి నిర్వహిస్తున్న మహిళల 'అస్మిత రోయింగ్ లీగ్'కు హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ వేదిక కానుంది. 'ఖేలో ఇండియా'లో భాగంగా జరుగుతున్న ఈ లీగ్‌లో మొత్తం 8 జట్లు పాల్గొంటున్నాయి. భోపాల్ వేవ్స్ క్వీన్స్, చెన్నై రాణీస్, కొచ్చి క్వీన్స్, కటక్ రోయింగ్, డెక్కన్ క్వీన్ పుణే, హైదరాబాద్ క్వీన్స్, కోల్‌కతా రోర్స్, లుధియానా రోయింగ్ జట్లు లీగ్‌లో పోటీపడుతున్నాయి. ఎనిమిది జట్లలో కలిపి మొత్తం 250 మంది రోవర్లు పాల్గొననున్నారు. భారత రోయింగ్ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ లీగ్‌లో సింగిల్ స్కల్స్, డబుల్ స్కల్స్, క్వాడ్రాపుల్ స్కల్స్, కాక్స్‌లెస్ పెయిర్స్, కాక్స్‌లెస్ ఫోర్స్ ఈవెంట్‌లలో పోటీలు నిర్వహించనున్నారు. ఒక్కో ఈవెంట్‌లో టాప్–6లో నిలిచిన వాళ్లకు రివార్డులు అందివ్వనున్నారు.



సాక్షి సినిమా



నా సినిమాల్లో విలువలు ఉండేలా చూసుకుంటాను

– దర్శకుడు నక్కిన త్రినాథరావు

"నా సినిమాల్లో ఎంత ఫన్ ఉన్నా విలువలు ఉండేలానూ జాగ్రత్తలు తీసుకుంటాను. 'సినిమా చూపిస్త మావ, నేను.. లోకల్, హలో గురూ ప్రేమకోసమే, ధమాకా!'... ఇలా నా చిత్రాల్లో డైలాగ్స్ రూపంలోనో, సీన్స్ రూపంలోనో విలువలు ఉండేలా చూసుకుంటాను. ఇక ప్రతి మగాడికీ ఓ మహిళ తోడు ఎంత అవసరమో 'మజాకా'లో చూపించే ప్రయత్నం చేశాం" అన్నారు దర్శకుడు త్రినాథరావు నక్కిన. సందీప్ కిషన్, రీతూ వర్మ జంటగా నటించిన చిత్రం 'మజాకా'. ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, హాస్య మూవీస్‌పై రాజేశ్ దండా నిర్మించిన ఈ చిత్రం నేడు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకరుల సమావేశంలో నక్కిన త్రినాథరావు చెప్పిన విశేషాలు.

- ఇద్దరు మగాళ్లు మాత్రమే ఉన్న ఆడ దిక్కులేని ఓ ఇంట్లో ఓ మహిళ పని చేసేందుకు భయపడుతుంటుంది. అందుకే ఆ తండ్రీకొడుకులు తమకో ఫ్యామిలీ కావాలనుకుంటారు. వాళ్లు పడే తపన, చేసే ప్రయత్నాల సమాహారమే 'మజాకా' కథ. ఈ సినిమా వినోదాత్మకంగా సాగుతుంది. కానీ చివరి 20 నిమిషాలు ఎమోషనల్‌గా ఉంటుంది. చిన్నప్పట్నుంచి అమ్మ ఎమోషన్‌ను అనుభూతి చెందని ఓ వ్యక్తి ఆ ఎమోషన్‌కు కనెక్ట్ అయితే ఎలా ఉంటుంది? ఈ తండ్రీకొడుకులు ఒకరి కోసం ఒకరు త్యాగాలు చేసుకోవాల్సి వచ్చినప్పుడు ఏం జరుగుతుంది? అనే ఆసక్తికరమైన విషయాలను సినిమాలోనే చూడాలి.
- ప్రసన్నకుమార్ మంచి కథలు ఇస్తున్నారు. అందుకే ఆయనతో సినిమాలు చేస్తున్నాను. నా సొంత కథలతో చేయనని కాదు... నా సొంత కథలతో చేసిన సినిమాలూ ఉన్నాయి. ఇటీవల రైటర్ శ్రీనివాస్ ఓ కథ చెప్పాడు... నచ్చింది. 'మజాకా' రిలీజ్ తర్వాత ఆలోచిస్తాను.
- నా ప్రొడక్షన్‌లోని 'చౌర్య పాఠం' సినిమాని ఏప్రిల్ 18న రిలీజ్ చేయాలనుకుంటున్నాను. అలాగే 'అనకాపల్లి' అనే సెమీ పీరియాడికల్ లవ్‌స్టోరీ ఫిల్మ్ చేస్తున్నాను. 'మజాకా'కు సీక్వెల్‌గా 'డబుల్ మజాకా' ఉంది. 'ధమాకా'కు సీక్వెల్‌గా 'డబుల్ ధమాకా' అనుకుంటున్నాం. రవితేజగారితో చేస్తే బాగానే ఉంటుంది. మా ప్రయత్నం కూడా ఇదే... చూడాలి.

ఇండియాతో ఎంతో అనుబంధం ఉంది

– హాలీవుడ్ నటుడు జెరోమ్ ఫ్లిన్



"నాకు ఇండియాతో ఎంతో అనుబంధం ఉంది. నా యంగ్ ఏజ్‌లో నేను ఎక్కువగా ఇక్కడి ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించాను. ఇండియాలో గడిపిన తర్వాత నా జీవితం పూర్తిగా మారిపోయింది. 'ఎల్2ఈ ఎంపురాన్' సినిమాలో నటించడంతో మళ్లీ నా ఇంటికి వచ్చినట్టు అనిపించింది" అని ప్రముఖ హాలీవుడ్ నటుడు జెరోమ్ ఫ్లిన్ ('గేమ్ ఆఫ్ థ్రోన్స్, జాన్ విక్ చాప్టర్ 3, సోల్జర్ సోల్జర్, బ్లాక్ మిర్రర్' ఫేమ్) తెలిపారు. మోహన్‌లాల్ హీరోగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో వచ్చిన హిట్ మూవీ 'లూసిఫర్' (2019)కి సీక్వెల్‌గా 'ఎల్2ఈ ఎంపురాన్' మూవీ రూపొందింది. సీక్వెల్‌లోనూ మోహన్‌లాల్ హీరోగా నటించగా పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటించడంతో పాటు దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో జెరోమ్ ఫ్లిన్ చేసిన బోరిస్ ఆలివర్ పాత్రని రివీల్ చేశారు. జెరోమ్ ఫ్లిన్ మాట్లాడుతూ– "ఖురేషి (మోహన్‌లాల్ పాత్ర పేరు) ప్రయాణంలో బోరిస్ ఆలివర్‌ది ఒక ముఖ్యమైన పాత్ర. ఈ క్యారెక్టర్‌ని ప్రేక్షకులు ఇష్టపడతారు" అని పేర్కొన్నారు. మార్చి 27న మలయాళం, తెలుగు, తమిళ, హిందీ, కన్నడ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

శివ శివ శంకరా...


విష్ణు

విష్ణు మంచు హీరోగా నటించిన చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో కన్నప్ప పాత్రను విష్ణు మంచు పోషించగా, రుద్రుడిగా ప్రభాస్, మహా శివుడిగా అక్షయ్ కుమార్ కనిపించనున్నారు. మోహన్‌బాబు, మోహన్‌లాల్, కాజల్ అగర్వాల్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 25న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. స్టీఫెన్ దేవస్సీ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి ఇటీవల విడుదలైన 'శివ శివ శంకరా...' అనే పాట సోషల్ మీడియాలో చార్ట్ బస్టర్‌గా నిలిచినట్లు చిత్రయూనిట్ తెలిపింది. ఈ సందర్భంగా విష్ణు మంచు మాట్లాడుతూ– "'శివ శివ శంకరా' పాటని ఇప్పటికే 80 మిలియన్ల (8 కోట్లు) మంది వీక్షించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో రెండు లక్షలకు పైగా రీల్స్ చేశారు. ప్రజలు ఈ పాటని ఆదరించిన విధానం, రీల్స్ చేస్తూ తమ భక్తిని ప్రదర్శిస్తుండటం ఆనందంగా ఉంది. ఇంతలా ఈ పాట ట్రెండ్ అవుతుందని మేం ఊహించలేదు. శివరాత్రి సందర్భంగా ఈ సాంగ్ మరింతగా చేరువ అవుతుందనే నమ్మకం ఉంది" అని తెలిపారు.

ఏం దుష్టగ్రహాలు వస్తాయో..!


'మ్యాడ్ స్క్వేర్' పోస్టర్

"వెంకీ అట్లూరి వెయ్యి నూటపదహార్లు, అనుదీప్ కేవీ ఐదొందల పదహార్లు, సూర్యదేవర నాగవంశీ నూటపదహార్లే చదివిపించిండు" అనే డైలాగ్‌తో మొదలవుతుంది 'మ్యాడ్ స్క్వేర్' సినిమా టీజర్. సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్, విష్ణు ఓఐ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం మార్చి 29న విడుదల కానుంది. మంగళవారం ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. "ముహూర్తానికి ఇంకా మూడ్రోజుల టైమ్ ఉంది... ఏం దుష్టగ్రహాలు వస్తాయో... ఏమైతదో..?" అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. కొందరు స్నేహితులు గోవాలో బ్యాచ్‌లర్ పార్టీకి వెళ్లినప్పుడు అక్కడ జరిగే హంగామా నేపథ్యంలో 'మ్యాడ్ స్క్వేర్' సినిమా ఉంటుందని తెలుస్తోంది. "ప్రేక్షకులు ఊహించినదాని కంటే ఎక్కువ వినోదాన్ని 'మ్యాడ్ స్క్వేర్' మూవీలో చూడబోతున్నారు" అని చిత్రయూనిట్ పేర్కొంది. ఇక సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్, విష్ణు నటించిన హిట్ ఫిల్మ్ 'మ్యాడ్' (2023)కి సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' రూపొందిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్.

మహిళ గొప్పతనం చాటేలా...


మాధవ్, టీవీఎస్ రవి, మిమో, సాషా, తమ్మారెడ్డి భరద్వాజ్

"నేనెక్కడున్నా' మూవీ ట్రైలర్ అందరికీ నచ్చేలా ఉంటుంది. ఈ మూవీలో అందరూ గొప్పగా నటించారు. మా నాన్న మిథున్ చక్రవర్తి గారిలా నేను కూడా తెలుగు సినిమా ఇండస్ట్రీలో భాగమవుతున్నందుకు చాలా హ్యాపీగా ఉంది" అని మిమో చక్రవర్తి అన్నారు. బాలీవుడ్ ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి కుమారుడు మిమో చక్రవర్తి, సాషా చెత్రి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'నేనెక్కడున్నా'. మాధవ్ కోదాడ దర్శకత్వంలో కేబీఆర్ సమర్పణలో మారుతి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి రిటైర్డ్ ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు గంగాధర్, గోపీనాథ్ రెడ్డితో పాటు పలువురు సినీ ప్రముఖులు అతిథులుగా హాజరయ్యారు. దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ మాట్లాడుతూ– "మిథున్ చక్రవర్తిలా మిమో చక్రవర్తి కూడా సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను" అన్నారు. "పత్రికా రంగంలోని వ్యక్తికి ఎలాంటి సమస్యలు వస్తాయి? ఆ సమస్యలను వారు ఎదుర్కోవడం అవసరమా? అనే ప్రశ్నకు జవాబు ఈ సినిమా" అని గోపీనాథ్ రెడ్డి చెప్పారు. "మహిళల గొప్పతనం చాటి చెప్పేలా జర్నలిజం నేపథ్యంలో ఈ సినిమా చేశాం" అని చెప్పారు మాధవ్ కోదాడ.

ఈ ప్రయోగం సక్సెస్ కావాలి

– జేడీ చక్రవర్తి


హరిప్రసాద్, జేడీ చక్రవర్తి, శివప్రసాద్

ఆర్టిస్టుల్ని చూపించకుండా కథ, కథనాల మీదే నడిచే మూవీగా రూపొందిన చిత్రం 'రా రాజా'. బి. శివ ప్రసాద్ దర్శకత్వంలో పద్మ సమర్పణలో శ్రీ పద్మిణీ సినిమాస్ నిర్మించిన ఈ చిత్రం మార్చి 7న విడుదల కానుంది. ఈ చిత్రం పోస్టర్‌ను జేడీ చక్రవర్తి రిలీజ్ చేసి, మాట్లాడుతూ– "పోస్టర్ చూస్తుంటే సినిమాలో చాలా ట్విస్టులు ఉన్నాయని అర్థమవుతోంది. ఇదొక సూపర్ నేచురల్ థ్రిల్లర్ మూవీ అని తెలుస్తోంది. సినిమాలో ఒక్క ముఖాన్ని కూడా చూపించకుండా భయపెట్టడం మామూలు విషయం కాదు. ఇలా డిఫరెంట్ కాన్సెప్ట్‌తో సినిమా చేయడం గ్రేట్. ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలి" అన్నారు.

ఒగ్గు కళాకారుల నేపథ్యంలో...


ఆమని

ఆమని, జయరామ్, కొమరం బన్నీ రాజ్, కనికా వాద్య, జోగిని శ్యామల ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'బ్రహ్మాండ'. రాంబాబు దర్శకత్వంలో దాసరి సురేష్ నిర్మించారు. ఈ మూవీ టీజర్‌ని డైరెక్టర్ చందు మొండేటి విడుదల చేసి, మాట్లాడుతూ– "టీజర్ బాగుంది. డిజైన్స్ చాలా ఆసక్తిగా ఉన్నాయి. ఈ చిత్రం మంచి విజయం సాధించాలి" అని అన్నారు. రాంబాబు మాట్లాడుతూ– "ఒగ్గు అంటే శివుని చేతిలోని డమరుకం అని అర్థం. ఒగ్గు కళాకారుల నేపథ్యంలో వారి సంస్కృతీ సంప్రదాయాలకు పెద్ద పీట వేసిన చిత్రం ఇది" అన్నారు. "మా సినిమా టీజర్ ఆవిష్కరించిన చందు మొండేటిగారికి రుణపడి ఉంటాను" అని దాసరి సురేష్ తెలిపారు. చిత్ర సహ నిర్మాత దాసరి మమత, సినిమాటోగ్రాఫర్ కాసుల కార్తీక్, నటుడు కొమరం బన్నీ రాజ్ మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: వరికుప్పల యాదగిరి.

క్రైమ్... యాక్షన్


రంజిత్ రామ్, అప్సరా రాణి

రంజిత్ రామ్, అప్సరా రాణి ప్రధాన పాత్రల్లో నటించిన యాక్షన్ అండ్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'బ్లడ్ రోజెస్'. నాగన్న, లక్ష్మమ్మల సమర్పణలో ఎంజీఆర్ దర్శకత్వంలో టీబీఆర్ సినీ క్రియేషన్స్ పతాకంపై కె. హరీష్ ఈ సినిమాను నిర్మించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేయనున్నారు. శివరాత్రి సందర్భంగా 'బ్లడ్ రోజెస్' ఫస్ట్ లుక్‌ను మంగళవారం విడుదల చేశారు. సుమన్, 'ఘర్షణ' శ్రీనివాస్, టార్జాన్, రాజేంద్ర తదితరులు నటించి ఈ సినిమాకు సంగీతం: పెద్దపల్లి రోహిత్ (పీఆర్), సహ–నిర్మాత: ఎల్లప్ప.

కామెడీ... సస్పెన్స్


భైరవి

ప్రముఖ గాయని సునీత తనయుడు ఆకాశ్ హీరోగా శివ వరప్రసాద్ దర్శకత్వంలో ఓ విలేజ్ బ్యాక్‌డ్రాప్ మూవీ తెరకెక్కుతోంది. ఈ రొమాంటిక్ లవ్ అండ్ సస్పెన్స్ కామెడీ ఫిల్మ్‌కి తాటి బాలకృష్ణ నిర్మాత. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు భైరవిని ఎంపిక చేసినట్లుగా తాటి బాలకృష్ణ తెలియజేసి, మాట్లాడుతూ– "హీరోయిన్‌గా భైరవికి తెలుగులో ఇది తొలి చిత్రం. ఈ సినిమాలో హీరో పాత్రకు మరదలుగా ఆమె నటించింది. పల్లెటూరి అమ్మాయిగా భైరవి పాత్ర ఆడియన్స్‌ను మెప్పిస్తుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలోనే టైటిల్, విడుదల తేదీని ప్రకటిస్తాం" అని అన్నారు. ఈ సినిమాకు సంగీతం: యశ్వంత్, సహ–నిర్మాత: తాటి భాస్కర్.

సాక్షి **బిజినెస్**
బుధవారం
26-2-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	148	74,602
నిఫ్టీ ▼	6	22,548

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11:30 ముగింపు)			
నాస్‌డాక్	19,112	▲	177
డోజోన్స్	43,609	▲	148
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,669	▲	10
డాక్స్	22,410	▼	16
షాంఘై	3,346	▼	27
నికాయ్	38,238	▼	539

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	86,400	▲	247
బంగారం (99.5 స్వచ్ఛత)	86,054	▲	246
వెండి (కిలో)	96,115	▼	346

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		86.45	87.47
£	బ్రిటన్ పౌండ్		108.50	111.39
€	యూరో		89.76	92.39
¥	జపాన్ ఎన్ (100)		57.32	58.78
AUS	ఆస్ట్రేలియా డాలర్		54.15	56.36
S$	సింగపూర్ డాలర్		63.00	67.41
SAR	సౌదీ రియాల్		22.37	23.90
UAE D	యూఏఈ దిర్హామ్		22.86	24.63
¥	చైనా యువాన్		11.14	12.96

వారానికి 47.5 గంటలే పని

- వారాంతాల్లో ఈమెయిల్స్ ఉండవు
- క్యాప్‌జెమినీ ఇండియా సీఈవో అశ్విన్ వెల్లడి



ముంబై: దేశం అధిక వృద్ధి సాధించాలంటే ప్రజలు మరిన్ని గంటలు పని చేయాలంటూ కొందరు కార్పొరేట్లు చేసిన వ్యాఖ్యలపై చర్చ ఇంకా కొనసాగుతోంది. తమ కంపెనీలో మాత్రం వారానికి 47.5 గంటలే పని వేళలు ఉంటాయని ఐటీ సేవల దిగ్గజం క్యాప్‌జెమినీ ఇండియా సంస్థ సీఈవో అశ్విన్ యార్డీ తెలిపారు. వారాంతాల్లో ఉద్యోగులకు ఈమెయిల్స్ పంపించడంలాంటి ధోరణి ఉండదని వివరించారు. ఉద్యోగులు వారానికి ఎన్ని గంటలు పనిచేయడం సహేతుకంగా ఉంటుందనే ప్రశ్నకు స్పందిస్తూ 'మా కంపెనీలో నలభై ఏడున్నర గంటలు. వారానికి అయిదు రోజుల పని. రోజుకు తొమ్మిది గంటల విధానాన్ని అమలు చేస్తాం' అని చెప్పారు. కొన్ని సార్లు తాను స్వయంగా వారాంతాల్లో పని చేసినా, వీకెండ్‌లో నిర్దిష్టమైన పని పూర్తి కాదని తెలిసినప్పుడు ఉద్యోగులకు ఈమెయిల్స్ పంపనని తెలిపారు. నాలుగేళ్లుగా తాను ఇదే సూత్రాన్ని పాటిస్తున్నట్లు నాస్కామ్ టెక్నాలజీ లీడర్‌షిప్ ఫోరం (ఎన్‌టీఎల్ఎఫ్)లో పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు. యువ ఐటీ ఉద్యోగుల అంచనాలకు అనుగుణంగా కంపెనీలు తమను తాము మల్చుకోవడం ముఖ్యమని అశ్విన్ తెలిపారు. మరోవైపు, మెరుగైన ఫలితాల కోసం, తాను మాత్రం రాత్రి 11 గంటలకు కూడా ఈమెయిల్స్ పంపిస్తానంటూ ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం మారికో సీఈవో సౌగత గుప్తా వెల్లడించారు. ఉద్యోగులు వారానికి 70 గంటలు పనిచేయాలని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి, 90 గంటలు పని చేయాలని ఎల్అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

ఫలితాలు ముఖ్యం..

పని గంటల కంటే ఫలితాలకు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలని జర్మన్ టెక్ దిగ్గజం ఎస్ఏపీ ఇండియా ఎండీ, నాస్కామ్ చైర్మన్ సింధు గంగాధరన్ అభిప్రాయపడ్డారు. రాజకీయాలపరమైన ఒత్తిళ్ల కారణంగా ఉద్యోగుల్లో వైవిధ్యాన్ని పాటించే విషయంపై టెక్ దిగ్గజాలు వెనక్కి తగ్గడం దురదృష్టకరమని ఆమె చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా దీని ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉందని వివరించారు. కంపెనీలు తమ ప్రాథమిక సూత్రాలకు కట్టుబడి ఉండకపోతే అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించలేవని ఆయన పేర్కొన్నారు.

స్టార్టప్‌లకు బ్యాంకుల ఈక్విటీ మద్దతు ..



దేశీయంగా అంకుర సంస్థలకు బ్యాంకులు ఈక్విటీపరమైన మద్దతు కూడా ఇచ్చే వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. ఎస్‌బీఐ ప్రత్యేకంగా ఏడు శాఖల ద్వారా స్టార్టప్‌లకు బ్యాంకింగ్ లావాదేవీలు, రుణాలపరంగా సేవలు అందిస్తున్నట్లు వివరించారు. అంకుర సంస్థలకు రూ. 100 కోట్ల వరకు రుణ హామీ పథకాన్ని అమలు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ప్రస్తుతం స్టార్టప్‌లకు రుణ రూపంలో తప్ప ఈక్విటీ రూపంలో మద్దతునివ్వడానికి బ్యాంకులకు అనుమతి లేదు.

జీసీసీల్లో హైరింగ్ జోరు



- మిడ్, స్మాల్ ఐటీ కంపెనీల్లో కూడా
- ఆచి తూచి బడా సంస్థలు
- ఎంట్రీ స్థాయి నియామకాలు అంతంతే
- మిడ్-సీనియర్ స్థాయిల్లో రిక్రూట్‌మెంట్

సాక్షి, బిజినెస్ డెస్క్: ఈ ఏడాది టెక్ నిపుణుల హైరింగ్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ), మిడ్-స్మాల్ ఐటీ కంపెనీలు ముందువరుసలో ఉండనున్నాయి. బడా ఐటీ కంపెనీలు కాస్త ఆచి తూచి వ్యవహరించనున్నాయి. అలాగే మిడ్-సీనియర్ స్థాయిల్లో నియామకాలు మెరుగ్గానే ఉండనున్నప్పటికీ ఎంట్రీ లెవెల్ స్థాయిలో మాత్రం హైరింగ్ నెమ్మదించవచ్చని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ప్రాజెక్టులను అసైన్ చేయడానికి ముందు మళ్లీ ప్రత్యేకంగా శిక్షణనివ్వాల్సిన పరిస్థితి ఉండకూడదని కంపెనీలు భావిస్తుండటమే ఇందుకు కారణమని వివరించాయి. ఈ నేపథ్యంలోనే వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో పెద్ద ఎత్తున ఫ్రెషర్లను తీసుకోవడం కన్నా మిడ్ నుంచి సీనియర్ స్థాయి సిబ్బందిని తీసుకోవడానికే ప్రాధాన్యమివ్వొచ్చని పేర్కొన్నాయి. 'చాలా మంది ఫ్రెషర్లలో ఉద్యోగ నైపుణ్యాలు ప్రశ్నార్థకంగా ఉండటం వల్ల ఐటీ సర్వీసుల కంపెనీలు హైరింగ్ విషయంలో ఆచి తూచి వ్యవహరిస్తున్నాయి' అని మైఖేల్ పేజ్ ఇండియా ప్రాంతీయ డైరెక్టర్ ప్రాంశు ఉపాధ్యాయ్ తెలిపారు. బహుళ జాతి సంస్థలు దేశీయంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ఏర్పాటు చేస్తుండటం, విస్తరిస్తుండటంతో టెక్నాలజీలో అనుభవమున్న ఉద్యోగులకు జీసీసీల్లో డిమాండ్ బాగా ఉంటోంది. టీమ్‌లీజ్ గణాంకాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దాదాపు 55 లక్షలుగా ఉన్న ఐటీ ఉద్యోగుల సంఖ్య 2027 ఆర్థిక సంవత్సరం నాటికి 65 లక్షలకు చేరే అవకాశం ఉంది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో టెక్ మహీంద్రా, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్ మొదలైన సంస్థల్లో నియామకాలు పెరిగినా, హెచ్‌సీఎల్ టెక్, విప్రో, కాగ్నిజెంట్ తదితర సంస్థల్లో తగ్గాయి. 2024లో నియామకాలు 5–7 శాతం తగ్గినప్పటికీ, మొత్తం మీద 2025లో హైరింగ్ వృద్ధి కాస్త సానుకూలంగా 8–12 శాతం స్థాయిలో ఉండొచ్చని ఉపాధ్యాయ్ పేర్కొన్నారు.

స్పెషలైజ్డ్ నైపుణ్యాలకు డిమాండ్

సాధారణ విధులకు సంబంధించి వేరే సంస్థలకు వెళ్లిపోయిన ఉద్యోగుల స్థానాలను భర్తీ చేయడం లేదా కొత్తవారిని తీసుకోవడమనేది 2024లో 8–10 శాతం మేర తగ్గినట్లు రాండ్‌స్టాడ్ వర్గాలు వెల్లడించాయి. అయితే, చిన్న స్థాయి నుంచి పెద్ద స్థాయి వరకు ఐటీ కంపెనీలు ప్రత్యేక టెక్ నైపుణ్యాలున్న వారిని నియమించుకునే ధోరణి పెరుగుతోందని పేర్కొన్నాయి. 2025లో ఏఐ, ఎంఎల్, డేటా అనలిటిక్స్, క్లౌడ్ టెక్నాలజీస్ తదితర విభాగాల్లో నిపుణులను దేశీ ఐటీ కంపెనీలు నియమించుకోవచ్చని వివరించాయి.



ఉత్పాదకతపైనే ఫోకస్

కంపెనీలు ఉత్పాదకత, వ్యయాల నియంత్రణపై మరింతగా దృష్టి పెడుతున్నాయి. అందుకే తక్కువ వేతనాలకే పెద్ద సంఖ్యలో ఫ్రెషర్లు దొరికే అవకాశం ఉన్నప్పటికీ నియామకాలపై సుముఖంగా లేవు. సాధారణంగా ఎంట్రీ లెవెల్ ఉద్యోగులు గరిష్ట స్థాయిలో ఉత్పాదకత సాధించాలంటే ఏడాది, రెండేళ్లు పట్టేస్తుందని, కంపెనీలు అంత కాలం నిరీక్షించే పరిస్థితి లేదని ఎగ్జిక్యూటివ్ సెర్చ్ సంస్థ ఏబీసీ కన్సల్టెంట్స్ వర్గాలు తెలిపాయి. ఉద్యోగులను నియమించుకున్న దగ్గర్నుంచే కంపెనీలు పనితీరు, ఉత్పాదకతను పరిశీలిస్తున్నాయని వివరించాయి.

రూపాయి 47 పైసలు క్రాష్

87.19 వద్ద ముగింపు

ముంబై: డాలర్ మారకంలో రూపాయి విలువ 47 పైసలు బలహీనపడి 87.19 వద్ద ముగిసింది. నెలాఖరున డాలర్లకు డిమాండ్ పెరగడంతో పాటు అమెరికా వాణిజ్య సుంకాల పెంపు అనిశ్చితులు దేశీయ కరెన్సీపై ఒత్తిడి పెంచాయి. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో 86.83 వద్ద రూపాయి ట్రేడింగ్ మొదలైంది. రోజంతా ప్రతికూలంగా ట్రేడవుతూ చివరికి ఇంట్రాడే కనిష్టం 87.19 వద్ద ముగిసింది. 'విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, దేశీయ ఈక్విటీ మార్కెట్ వరుస పతనమూ రూపాయి కోతకు కారణమయ్యాయి. డాలర్ ఇండెక్సు రికవరీ అయితే మరింత ఒత్తిడి నెలకొంటుంది' అని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ విశ్లేషకుడు అనుజ్ చౌదరీ తెలిపారు.



బెయిన్ క్యాపిటల్ చేతికి మణప్పురం!

- ప్రమోటర్ల షేర్ల కొనుగోలు, ఓపెన్ ఆఫర్ సైతం
- ప్రిఫరెన్షియల్ కేటాయింపులతో నియంత్రిత వాటా

ముంబై: ఎన్‌బీఎఫ్‌సీ మణప్పురం ఫైనాన్స్‌ను పీఈ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ కొనుగోలు చేయనుంది. మెజారిటీ వాటాను సొంతం చేసుకునేందుకు మణప్పురం ప్రమోటర్లతో బెయిన్ క్యాపిటల్ చేపట్టిన చర్చలు తుది దశకు చేరినట్లు సమాచారం. బంగారు ఆభరణాలపై రుణాలందించే కేరళ సంస్థలో నియంత్రిత వాటా కొనుగోలు చర్చలకు తుదిరూపు లభించనున్నట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.


రూ. 17,360 కోట్లు..: ప్రస్తుతం మణప్పురం గ్రూప్‌లో ఎండీ, సీఈవో ప్రమోటర్ వీపీ నందకుమార్‌కు 35.25 శాతం వాటా ఉంది. పబ్లిక్‌కు 64.75 శాతం వాటా ఉంది. బీఎస్ఈలో మంగళవారం షేరు ధర రూ. 205 ప్రకారం కంపెనీ మార్కెట్ విలువ రూ. 17,360 కోట్లుగా నమోదైంది. ప్రమోటర్లు బెయిన్ క్యాపిటల్‌కు సెకండరీ షేర్లను విక్రయించనున్నారు. అంతేకాకుండా ప్రిఫరెన్షియల్ కేటాయింపుల ద్వారా బెయిన్ క్యాపిటల్ నుంచి మణప్పురం తాజా పెట్టుబడులను అందుకోనుంది. మార్కెట్ ధరతో పోలిస్తే ఒక్కో షేరుకి 12.5–15 శాతం ప్రీమియంతో వీటిని జారీ చేయనున్నారు. వెరసి షేరుకి రూ. 230–240 ధరలో డీల్ కుదరనున్నట్లు అంచనా. ఫలితంగా సెబీ నిబంధనల ప్రకారం మణప్పురం వాటాదారుల నుంచి మరో 26%వాటాను బెయిన్ క్యాపిటల్ కొనుగోలు చేయవలసి ఉంటుంది. ఈ లావాదేవీల అనంతరం విస్తారిత మణప్పురం ఈక్విటీలో బెయిన్‌కు 46% వాటా లభించే వీలుంది. ఇందుకు సమారు రూ. 9,000–10,000 కోట్లు వెచ్చించనున్నట్లు తెలుస్తోంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..	
పీసీలకు ఫుల్ డిమాండ్	ఈక్విటీ డెరివేటివ్స్‌పై సెబీ ఫోకస్

ఫైనాన్స్, ఎఫ్ఎంసీజీ షేర్లకు డిమాండ్

సెన్సెక్స్ ప్లస్.. నిఫ్టీ మైనస్

ముంబై: ఫైనాన్స్, ఎఫ్ఎంసీజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సెన్సెక్స్ అయిదు రోజుల నష్టాల నుంచి గట్టెక్కింది. మంగళవారం 148 పాయింట్లు పెరిగి 74,602 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఆరు పాయింట్ల స్వల్ప నష్టంతో 22,548 వద్ద నిలిచింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 331 పాయింట్లు ఎగసి 74,785 వద్ద, నిఫ్టీ 72 పాయింట్లు బలపడి 22,625 వద్ద గరిష్టాన్ని తాకింది. ట్రేడింగ్ చివర్లో ఫార్మా, మెటల్, ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో నిఫ్టీ ఆరంభ లాభాలు కోల్పోగా... సెన్సెక్స్ స్వల్ప లాభంతో గట్టెక్కింది.



మహాశివరాత్రి సందర్భంగా బీఎస్ఈ, ఎన్ఎస్ఈ బుధవారం పని చేయవు

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- కెమిస్ట్రీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-రీజనింగ్

పరీక్షల్లో విజయం సాధించేలా!

» మరికొద్ది రోజుల్లో టెన్త్, ఇంటర్ బోర్డ్ పరీక్షలు
» ఆ వెంటనే జేఈఈ, నీట్ సహా పలు ఎంట్రన్స్ టెస్ట్‌లు
» కొద్దిపాటి మెలకువలతో మంచి మార్కులకు అవకాశం

అకడమిక్ పరీక్షలు.. ప్రవేశ పరీక్షలు.. ఎగ్జామ్ ఏదైనా.. టాప్ మార్కులు సాధించాలని విద్యార్థులు కోరుకుంటారు. పరీక్షల సీజన్ మొదలైందంటే.. రేయింబవళ్లు, నిద్రాహారాలు మాని పుస్తకాలే ప్రపంచంగా ప్రిపరేషన్ సాగిస్తారు. మంచి మార్కులు సాధించాలని, టాప్ ర్యాంకు సొంతం చేసుకోవాలని విపరీతంగా చదువుతూ ఒత్తిడికి లోనవుతుంటారు. కొద్దిపాటి మెలకువలతో ఒత్తిడిని జయించి.. పరీక్షల్లో మెరుగ్గా రాణించే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. త్వరలో.. పదో తరగతి, ఇంటర్మీడియెట్ బోర్డ్ పరీక్షలు.. అదేవిధంగా జేఈఈ, నీట్ సహా పలు ఎంట్రన్స్‌లు జరగనున్న నేపథ్యంలో.. ఆయా పరీక్షల్లో విజయానికి నిపుణుల సలహాలు, సూచనలు..

ఆత్మవిశ్వాసమే ఆయుధం

పరీక్షల్లో రాణించేందుకు అత్యంత ఆవశ్యకమైన ఆయుధం.. ఆత్మవిశ్వాసం. ముందుగా విద్యార్థులు మార్కులు, ర్యాంకుల గురించి ఆలోచించడం, సహచరులతో పోల్చుకోవడం వంటివి మానేయాలి. పరీక్షల సమయంలో మార్కులు, ర్యాంకుల గురించి ఎక్కువగా ఆలోచిస్తే ఆందోళన అధికమవుతుంది. ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. విద్యార్థులు పరీక్షల ఒత్తిడికి గురవడానికి తోటివారితో పోల్చుకోవడమే ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి విద్యార్థులు తమపై తాము నమ్మకం పెంచుకొని ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరుకావాలి. అంతేకాని ఫలితం ఎలా ఉంటుందో.. మంచి మార్కులు వస్తాయా లేదా.. అనే ఆలోచనలను కొనసాగిస్తే మానసిక ఆందోళన మరింత పెరుగుతుంది. అది చివరకు పరీక్ష హాల్లో ప్రదర్శనపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

పటిష్ట ప్రణాళిక

పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలనుకునే విద్యార్థులు దానికి అనుగుణంగా కార్యాచరణకు ఉపక్రమించాలి. సిలబస్ అంశాలను ఏకాగ్రతతో అధ్యయనం చేయాలి.చదవాల్సిన టాపిక్స్‌ను పూర్తిచేసేందుకు నిర్దిష్టమైన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి.

తాము చదవాల్సిన అంశాలు, పూర్తి చేయాల్సిన పనులను ప్రాధాన్యత క్రమంలో ఒక జాబితాగా రూపొందించుకోవాలి. ఈ జాబితాను డైలీ లేదా వీక్లీ బేస్ట్ విధానంలో రూపొందించుకోవాలి. వీలైతే వాటిని డైరీలోనో లేదా తమకు నిత్యం కనిపించే విధంగా వాల్ క్యాలెండర్‌లోనో నోట్ చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల నిర్దిష్ట సమయంలోపు అన్ని సిలబస్ అంశాలు పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుంది. ముందస్తు ప్రణాళిక ఉంటే చివరి క్షణంలో సిలబస్ పూర్తి కాలేదనే ఆందోళనను అధిగమించొచ్చు.

రిలాక్సేషన్ టెక్నిక్స్

విద్యార్థులు ఆయా పరీక్షల ప్రిపరేషన్ సమయంలో రిలాక్సేషన్ టెక్నిక్స్ పాటించాలనేది నిపుణుల అభిప్రాయం. కొత్త అంశాలు చదువుతున్నప్పుడు.. లేదా అప్పటికే చదివిన అంశాలను జ్ఞప్తికి తెచ్చుకోలేనప్పుడు ఆందోళన ఎక్కువగా ఉంటోంది. ఇలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు విద్యార్థులు ఉపశమన చిట్కాలు పాటించాలి. ఒత్తిడికి లోనైనప్పుడు చదువుతున్న పుస్తకాలను కొద్దిసేపు పక్కనపెట్టి మెంటల్ రిలాక్సేషన్ టెక్నిక్స్ పాటించాలి. సంగీతం, గార్డెనింగ్, టీవీ చూడటం వంటివి చేయొచ్చు. రిలాక్సేషన్ సమయంలో ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

ప్రాధాన్యత ఆధారంగా

బెస్ట్ స్కోర్‌కు ఉపకరించే మరో సాధనం.. టాపిక్స్ వారీగా ప్రాధాన్యతలను ముందుగానే గుర్తించడం. ఆయా ప్రాధాన్యతల ఆధారంగా తమ ప్రిపరేషన్‌ను కొనసాగించాలి. ఉదాహరణకు ఒక విద్యార్థి చదవాల్సిన నాలుగు లేదా అయిదు అంశాల్లో ముఖ్యమైన వాటిని గుర్తించాలి. వాటిని ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేయాలి. ఇందుకోసం ఫ్యాకల్టీ, నిపుణులను సంప్రదించాలి. వారి సూచన మేరకు సమయం కేటాయించుకోవాలి.

ఈజీ టు డిఫికల్ట్

ప్రిపరేషన్ సమయంలో తాము చదవాల్సిన అంశాలను వాటి క్లిష్టత స్థాయి ఆధారంగా ఈజీ.. మోడరేట్.. డిఫికల్ట్ అనే మూడు విభాగాలుగా వర్గీకరించుకోవాలి. ముందుగా సులభమైన అంశాలతో ప్రిపరేషన్ ప్రారంభించాలి. తద్వారా కొంత కష్టమైన, బాగా క్లిష్టమైన వాటిని ఎదుర్కొనేందుకు ముందస్తు సంసిద్ధత లభిస్తుంది. ఇలా కాకుండా.. కష్టమైన అంశాలతో ప్రిపరేషన్ మొదలుపెడితే ఒత్తిడి మరింత పెరుగుతుంది.

గత ఫలితాల స్ఫూర్తి

ఒత్తిడిని అధిగమించేందుకు తాము గతంలో సాధించిన ఫలితాల నుంచి ప్రేరణ పొందాలి. ఒత్తిడికి గురైన సందర్భంలో.. తాము గతంలో సాధించిన విజయాలను గుర్తు చేసుకోవాలి. ఫలితంగా తాము హాజరు కాబోతున్న పరీక్షలో మెరుగ్గా రాణించగలమనే మానసిక ధీమా లభిస్తుంది. అంతేకాకుండా గతంలో తాము సాధించిన విజయాలు ప్రస్తుత లక్ష్యాలకు సరితూగే విధంగా అన్వయించుకుంటే ఆత్మవిశ్వాసం రెట్టింపవుతుంది.

గది వాతావరణం

పరీక్షలకు ప్రిపరేషన్‌పై పరిసరాల ప్రభావం కూడా ఉంటుంది. కాబట్టి విద్యార్థులు తాము చదివే గది వాతావరణం, పరిసరాలు ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలి. గదిలో టీవీ వంటివి లేకుండా చూసుకోవాలి. అదే విధంగా.. బయటి నుంచి ఎలాంటి శబ్దాలు వినిపించకుండా ఏర్పాటు చేసుకోవాలి. దీంతోపాటు సహజమైన గాలి, వెలుతురు వచ్చే ప్రాంతంలో కూర్చుంటే.. మానసికంగా, శారీరకంగా ఆహ్లాదకరంగా ఉంటుంది. ఏకాగ్రతతో చదివేందుకు అవకాశం లభిస్తుంది.

సానుకూల వైఖరి

ఒత్తిడిని జయించే క్రమంలో విద్యార్థులు పూర్తిగా సానుకూల దృక్పథంతో ముందుకుసాగాలి, ముఖ్యంగా.. తమ పరిసరాల్లో ప్రతికూల వాతావరణం లేకుండా చూసుకోవాలి. పరీక్షల సమయంలో ప్రతికూల ధోరణితో ఉండే వ్యక్తులకు దూరంగా ఉండడం మేలు చేస్తుంది.



పరీక్ష రోజుకు సిద్ధంగా

పరీక్ష రోజు చూపే ప్రతిభే భవిష్యత్తును నిర్దేశిస్తుందని గుర్తించాలి. పరీక్ష రోజు చాలా మంది ఒత్తిడికి గురవుతారు. దీనికి పరిష్కారంగా..పరీక్ష హాల్లోకి వీలైనంత ముందుగా ప్రవేశించాలి. అక్కడి వాతావరణానికి అలవాటు పడాలి. పరీక్ష రోజుకు అవసరమైన సామగ్రి, ఇతర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేసుకుంటే లాస్ట్ మినిట్ టెన్షన్ నుంచి ఉపశమనం పొందొచ్చు. కొశ్చన్ పేపర్‌ను చూడగానే ఆందోళన చెందడం కాకుండా.. కొద్ది సేపు ప్రశాంతంగా అన్ని ప్రశ్నలను పరిశీలించాలి. ఆ తర్వాత సులభమైన వాటితో నింపాదిగా రాయడం మొదలుపెట్టాలి. దీంతో చదివిన అంశాలు క్రమేణా గుర్తుకొస్తుంటాయి.

యోగా.. ధ్యానం

విద్యార్థులు ప్రతి రోజు కొంత సమయం యోగా, ధ్యానం వంటి వాటికి కేటాయించాలి. దీని వల్ల మానసికంగా ఉల్లాసంగా ఉండేందుకు ఉపయోగపడుతుంది. దీంతోపాటు పిల్లల పరీక్షల ప్రిపరేషన్‌లో తల్లిదండ్రులు తమ వంతు సహకారం అందించాలి. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణం కల్పించాలి. వారికి పౌష్టికాహారం అందించాలి. ఆత్మవిశ్వాసంతో ప్రిపరేషన్ సాగించేలా ప్రోత్సహించాలి.

జాబ్ పాయింట్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 2,691 అప్రెంటిస్‌లు

ముంబైలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా..దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో ఖాళీగా ఉన్న అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం ఖాళీల సంఖ్య:** 2,691.
» **తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు:** తెలంగాణ-304, ఆంధ్రప్రదేశ్-549.
» **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 01.02.2025 నాటికి 20 నుంచి 28 ఏళ్ల ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు రూ.15,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.03.2025
» **వెబ్‌సైట్:** www.unionbankofindia.co.in

సీఎస్ఐఆర్-ఎన్ఐవో, గోవాలో 17 సైంటిస్ట్ పోస్టులు

సీఎస్ఐఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ(ఎన్ఐవో).. సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 17.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో, ఎంఈ/ఎంటెక్, పీహెచ్‌డీ(ఫిజికల్ ఓషనోగ్రఫీ)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 17.03.2025 నాటికి 32 ఏళ్ల మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.67,700 నుంచి రూ.2,08,700.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.03.2025
» **వెబ్‌సైట్:** https://www.nio.res.in

బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 10 స్పెషలిస్ట్ సెక్యూరిటీ పోస్టులు

ముంబైలోని బ్యాంక్ ఆఫ్ ఇండియాలో స్పెషలిస్ట్ సెక్యూరిటీ ఆఫీసర్ (ఎంఎంజీఎస్-2) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.
» **అర్హత:**గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి లేదా తత్సమాన విద్యార్హత ఉండాలి. **వయసు:** 40 ఏళ్ల మించకూడదు.
» **పే స్కేల్:** నెలకు రూ.64,820 నుంచి రూ.93,960.
» **ఎంపిక విధానం:** గ్రూప్ డిస్కషన్ లేదా ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.03.2025
» **వెబ్‌సైట్:** https://bankofindia.co.in

ఎన్ఐఈఎల్ఐటీ, న్యూఢిల్లీలో 78 సైంటిఫిక్ అసిస్టెంట్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఎన్ఐఈఎల్ఐటీ).. సైంటిఫిక్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 78.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఎస్సీ/బీఈ/ బీటెక్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్ టెలీ కమ్యూనికేషన్స్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అండ్ నెట్‌వర్కింగ్ సెక్యూరిటీ, సాఫ్ట్‌వేర్ సిస్టమ్, ఐటీ, ఎలక్ట్రికల్, ఇన్ఫర్మేటిక్స్) ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 30 ఏళ్ల మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.35,400 నుంచి రూ.1,12,400.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.03.2025
» **వెబ్‌సైట్:** http://https//recruitdelhi.nielit.gov.in

సీఎస్ఐఆర్-సీఎంఈఆర్ఐ, దుర్గాపూర్‌లో 16 పోస్టులు

దుర్గాపూర్‌లోని సీఎస్ఐఆర్-సెంట్రల్ మెకానికల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎంఈఆర్ఐ).. జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 16.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(జనరల్)-08, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్)-04, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(స్టోర్స్ అండ్ పర్చేజ్)-04.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు టైపింగ్ వచ్చి ఉండాలి.
» **వయసు:** 28 ఏళ్ల మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.36,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.03.2025
» **వెబ్‌సైట్:** https://www.cmeri.res.in

'ఎస్‌హెచ్‌జీ' చేతికి స్టీరింగ్



ఐటీ కారిడార్‌లో తొలిసారి క్యాబ్‌లు నడపనున్న మహిళలు

సంగారెడ్డి జిల్లాలో 35 మంది గుర్తింపు.. డ్రైవింగ్‌లో శిక్షణ

క్యాబ్ సేవలు వినియోగించుకునేలా ఐటీ కంపెనీలకు లేఖలు రాయాలని కలెక్టర్ క్రాంతి నిర్ణయం



వల్లూరు క్రాంతి

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో ఇకపై స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) క్యాబ్ సేవలందించనున్నాయి. నగరానికి అతి సమీపంలో ఉన్న సంగారెడ్డి జిల్లాకు చెందిన ఎస్‌హెచ్‌జీ మహిళలు ఈ క్యాబ్‌లను నడపనున్నారు. ఇందుకోసం జిల్లాలోని 35 మంది మహిళలను గుర్తించారు. వీరికి ఇప్పటికే కార్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు కూడా జారీ చేశారు. వీరు క్యాబ్ కార్లు కొనుక్కునేందుకు వీలుగా ఒక్కో సభ్యురాలికి రూ.ఐదు లక్షల చొప్పున బ్యాంకు రుణం అందజేయనున్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఐటీ కంపెనీలకు ఈ క్యాబ్‌లను అనుసంధానం చేస్తారు. ఈ మేరకు కొండాపూర్, హైటెక్ సిటీ, నానక్‌రాంగూడ తదితర ప్రాంతాల్లో ఉన్న ఐటీ కంపెనీలకు లేఖలు రాయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి నిర్ణయించారు. మహిళా ఉద్యోగులను తరలించేందుకు ఈ ఎస్‌హెచ్‌జీ మహిళల క్యాబ్‌లను వినియోగించుకోవాలని ఆయా కంపెనీలతో ఒప్పందం చేసుకుంటారు. దీంతో ఐటీ ఉద్యోగాలు చేసే మహిళలు అర్ధరాత్రి సైతం సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చడంతోపాటు, ఎస్‌హెచ్‌జీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని భావిస్తున్నారు.

సబ్సిడీ కోసం ప్రతిపాదనలు



స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.లక్షల్లో ధరలుండే కార్లను కొనుగోలు చేయడం ఆర్థిక భారంతో కూడుకున్న వ్యవహారం. దీనిని అధిగమించేందుకు ఎస్సీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల నుంచి సబ్సిడీ వర్తింపచేయాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. కార్ల కొనుగోలుకు అవసరమైన బ్యాంకు రుణాల మంజూరు ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ జంగారెడ్డి 'సాక్షి'కి తెలిపారు. గతంలో ఇదే తరహాలో సంగారెడ్డి జిల్లాలో కొందరు మహిళలకు షీక్యాబ్‌ల పేరుతో రూ.లక్షల్లో సబ్సిడీలు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఈ కార్లు కిరాయికి పెట్టేలా అధికారులు పెద్దగా ప్రోత్సహించలేదు. దీంతో ఆశించిన మేరకు సేవలందించలేదు. ఇప్పుడు అలా కాకుండా ఐటీ కంపెనీలతో మాట్లాడి, స్వయం ఉపాధి కల్పించేలా అడుగులు పడుతున్నాయి.

గోదావరి గుండెపై ఎర్ర తివాచీ



మిరపకాయలను కోసిన తర్వాత ఆరబెట్టేందుకు అనువైన ప్రదేశం ఏదైనా ఉందంటే.. అది గోదావరి ఒడ్డేనని చెప్పాలి. ములుగు జిల్లా ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట మండలాలకు చెందిన 30 శాతం మంది రైతులు.. గోదావరి ఒడ్డు వెంట మిర్చి కల్లాలను ఏర్పాటు చేసుకొని మిర్చిని ఎండబెడుతున్నారు. సాధారణ భూమిపై మిర్చి ఆరేందుకు సమయం పడుతుంది. కానీ గోదావరి నది ఒడ్డునున్న ఇసుకపై మిర్చి ఆరబోయడం వల్ల వారం రోజుల్లో ఎండిపోతుంది. దీంతో ఎండుమిర్చికి మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతుంది. ఆరబోసిన మిరపకాయలతో గోదావరి ఒడ్డు మొత్తం ఎర్ర తివాచీ పరచినట్లు దర్శనమిస్తోంది. - ఏటూరునాగారం

ఎరువుల కొరత.. కృత్రిమం

- తెలంగాణలో ఎరువుల కొరత లేనేలేదు... అడిగిన దానికంటే ఎక్కువగానే కేంద్రం ఇచ్చింది
- రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత వల్లే కృత్రిమ కొరత: కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఎరువుల కొరత లేదని, కావాలనే కొందరు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతే కారణమని ఆరోపించారు. మంగళవారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'ఎరువుల కొరతపై మీడియాలో కథనాలు రావటంతో నేను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రితో మాట్లాడాను. రాష్ట్ర ప్రభుత్వం అడిగిన దానికంటే ఎక్కువ కోటా ఎరువులు విడుదల చేశామని కేంద్రం స్పష్టత ఇచ్చింది. 2024–25 రబీ సీజన్‌లో 9.5 లక్షల మెట్రిక్‌టన్నుల యూరియా అవసరమైతే, 10 లక్షల మెట్రిక్ టన్నులు పంపింది. ఈ విషయంలో ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. గత పదేళ్లుగా దేశంలో ఎక్కడా ఎరువుల కొరత లేకుండా కేంద్రం చర్యలు తీసుకుంది. పాత అలవాటు ప్రకారం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు' అని విమర్శించారు.

27 శాతం అధికంగా సరఫరా

గత ఏడాది అక్టోబర్1 నుంచి ఈ నెల 22 వరకు కూడా తెలంగాణలో యూరియా అందుబాటులో ఉందని కిషన్‌రెడ్డి తెలిపారు. గతేడాదితో పోలిస్తే 27.37 శాతం అధికంగా ఎరువులు సరఫరా చేశామని చెప్పారు. ఈ నెల 22న 40 వేల టన్నుల యూరియాను కేంద్రం అదనంగా పంపిందని వెల్లడించారు. 23, 24 తేదీల్లో అదనంగా మరో 48 వేల టన్నుల యూరియా పంపిస్తున్నట్లు కేంద్రం తెలిపిందని వివరించారు. లెక్క ప్రకారం ప్రస్తుతం రాష్ట్రంలో ఇంకా 1.22 లక్షల టన్నుల యూరియా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఇదిగాక 6 వేల టన్నులు కృష్ణపట్నం పోర్టు నుంచి ఆదిలాబాద్‌కు తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణకే అత్యధికంగా ఎరువుల సరఫరా చేస్తున్నామని చెప్పారు. యూరియాను రైతులకు సరఫరా చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టంచేశారు. పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి ద్వారా తెలంగాణలో 31 లక్షల మంది రైతులు లబ్ధి పొందారని వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాల్లో బీజేపీని గెలిపించాలని కిషన్‌రెడ్డి కోరారు.

యూరియాపై విపక్షాల రాద్ధాంతం

- స్వార్థ రాజకీయాల కోసమే జగిత్యాల పీఏసీఎస్‌లో పాస్‌బుక్‌లు క్యూలో పెట్టారు
- వ్యవసాయ మంత్రి తుమ్మల ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో యూరియా కొరత అంటూ బీఆర్ఎస్ అనవసర రాద్ధాంతం చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. రాష్ట్రంలో యూరియా కొరత ఉందంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం సాగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. యూరియా కొరతకు సంబంధించి మీడియాలో వస్తున్న వార్తల నేపథ్యంలో మంత్రి తుమ్మల వ్యవసాయశాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డితో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యూరియా నిల్వలు, రైతుల అవసరాల గురించి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన ఓ ప్రకటనలో వాస్తవ పరిస్థితిని వివరించారు.

890 బస్తాలు అందుబాటులో ఉంటే 80 మంది కూడా క్యూలో లేరు..

జగిత్యాల పీఏసీఎస్‌లో యూరియా కోసం క్యూలైన్లలో పాస్‌పుస్తకాలు, ఆధార్ కార్డులు ఉంచి వేచి చూసినట్లుగా జరిగిన ప్రచారం కుట్రపూరితంగా రూపొందించిందని తుమ్మల తెలిపారు. ఈ పీఏసీఎస్‌లో 890 యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని, కానీ సహకార బ్యాంకు వద్ద వేచి వున్న జనం 80 మంది కూడా దాటరని వ్యాఖ్యానించారు. సొసైటీ తెరిచే సమయానికంటే ముందే వచ్చిన కొందరు వ్యక్తులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులను క్యూలో ఉంచి వీడియో తీసి సోషల్ మీడియాలో ప్రచారం చేసి, రైతులను ఆందోళనకు గురిచేశారన్నారు. అలాగే మహబూబాబాద్ జిల్లాలో యూరియా కోసం పోలీసులు టోకెన్లు జారీ చేశారనే ప్రచారం కూడా అవాస్తవమని అన్నారు. రైతులు ఎక్కువగా ఉన్నారని బందోబస్తు కోసం పోలీసులు వస్తే తప్పుడు ప్రచారం చేసి, రైతులను ఆందోళనకు గురి చేయడం సరికాదన్నారు. గత సంవత్సరంలో యాసంగికంటే ఈసారి ఇప్పటికే 1.91 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అధికంగా పంపిణీ చేశామని చెప్పారు. రాష్ట్రంలో 1.14 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలున్నాయని, ఇంకా 40 వేల టన్నుల యూరియా ఈ నెలలోనే పంపిణీ చేస్తామన్నారు. రైతాంగాన్ని ఆందోళన పరిచే యత్నాలను విపక్షాలు మానుకోవాలన్నారు.

మహిళలకు డ్రైవింగ్‌లో ఉచితశిక్షణ: మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: జిల్లా మహిళా ప్రాంగణాల్లో ఆటో, కారు డ్రైవింగ్ సెంటర్లు నెలకొల్పి ఉచితంగా మహిళలకు శిక్షణ ఇస్తామని మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మహిళా ప్రాంగణ భూముల్లో మహిళా పెట్రోల్ బంకులు ఏర్పాటు కూడా చేస్తామని, దీనికోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తామని తెలిపారు. టైలరింగ్, బ్యూటీషియన్, ఫుడ్ ప్రాసెసింగ్, కంప్యూటర్ స్కిల్స్ వంటి రంగాల్లో మహిళలకు శిక్షణ ఇవ్వాలని అధికారులకు చెప్పారు. మహిళా ప్రాంగణాల్లో ఉత్పత్తి అయ్యే పసుపు, కారం, ఇతర వస్తువులను అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లకు సరఫరా చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. సీఎంతో చర్చించి మహిళా సహకార డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వస్తువులను ప్రభుత్వ హాస్టళ్లు, ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళా ఉత్పత్తులకు వర్క్ ఆర్డర్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, జిల్లా కేంద్రాల్లో మహిళా సూపర్‌మార్కెట్ల ఏర్పాటుపైనా ఆలోచన చేస్తున్నామని తెలిపారు.

5 బస్తాల యూరియా కోసం.. 5 గంటలకు పైగా..

పెద్దవూర: యాసంగి సీజన్‌లో సాగుచేసిన వరి పొలాలలకు ప్రస్తుతం యూరియా అవసరం ఏర్పడింది. రైతులు యూరియా కోసం ప్రైవేట్ ఎరువుల దుకాణాల చుట్టూ తిరిగినా ఎక్కడా లభించటం లేదు. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని ప్రాథమిక సహకార సంఘానికి(పీఏసీఎస్) మంగళవారం రెండు లారీలలో 35 టన్నులు(700 బస్తాలు) యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు వివిధ గ్రామాల నుంచి వేకువజామునే వచ్చి పీఏసీఎస్ ఎదుట క్యూలో నిల్చున్నారు. ఉదయం పది గంటలకు పీఏసీఎస్ కార్యాలయాన్ని తీయగానే రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు. పురుషులు, మహిళా రైతులకు ఒకేదగ్గర కౌంటర్ ఏర్పాటు చేయడంతో తోపులాట జరిగింది. దీంతో పీఏసీఎస్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి రైతులను క్యూలో నిలబెట్టారు. చేతిలో పాస్‌పుస్తకంతో రైతులు వరుసలో నిలబడి ఐదు బస్తాల చొప్పున యూరియా కు రశీదులు తీసుకుని గోదాము వద్దకు వెళ్లారు. అక్కడ కూడా ట్రాక్టర్లు, ఆటోలతో క్యూలో నిల్చోవాల్సి వచ్చింది. ఐదు బస్తాల యూరియా కోసం రైతులు సుమారు ఐదు గంటలకు పైగా నిల్చున్నారు.



పెద్దవూరలోని పీఏసీఎస్ ఎదుట క్యూలో నిల్చున్న రైతులు

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

శభాష్ ధనావత్

ఇండియన్ డిజేబుల్ క్రికెటర్‌కు గవర్నర్ అభినందన



సాక్షి, హైదరాబాద్: ఇండియన్ డిజేబుల్ క్రికెటర్‌గా భారతదేశం తరపున ఎన్నికయిన ధనావత్ వస్తం నాయక్‌ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అభినందించారు. ఈ సందర్భంగా మంగళవారం గవర్నర్‌ను.. ధనావత్ వస్తం నాయక్, ఎన్‌టీపీ ప్రతినిధి ధనావత్ జగదీశ్ నాయక్ కలిశారు. ధనావత్ మారుమూల గ్రామం, అట్టడుగు వర్గం నుంచి ఈ స్థాయికి ఎదిగినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా బాల్య జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సమయం దొరికినప్పుడల్లా తమ రంగాలలో జరుగుతున్న అభివృద్ధిని, ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలపై ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. దీనివల్ల కొత్తతరం ముందుకొచ్చి.. మరిన్ని విజయాలను దేశానికి అందించడానికి దోహదపడుతుందని గవర్నర్ అభిప్రాయపడ్డారు.

‘బండి’కి సోయి లేదు

టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ ‘సామ’



సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ సోయి లేకుండా మాట్లాడుతున్నాడని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కేంద్రంలోని హోంశాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయనకు.. ఏ కేసును ఎవరెలా విచారిస్తారో తెలియదా? అని ప్రశ్నించారు. రామ్మోహన్‌రెడ్డి మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య మ్యాచ్‌ఫిక్సింగ్‌ను ఫోన్‌ట్యాపింగ్ కేసు రుజువు చేసిందన్నారు. సీబీఐని పర్యవేక్షించేది బండి సంజయ్ చూసే హోం శాఖనేనని, అది కూడా తెలియకపోతే ఎలా? అని ప్రశ్నించారు. కానీ, ఏడాదిగా సీబీఐ ఆ పని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీజేపీ సహకరిస్తున్నందునే గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తన అభ్యర్థిని నిలబెట్టలేదని చెప్పారు.

ఎన్నికల్లో గెలవడానికి ఇంతలా దిగజారాలా

బండి సంజయ్‌పై ఆది శ్రీనివాస్ ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో లబ్ధి కోసం కేంద్రమంత్రి బండి సంజయ్ మతతత్వాన్ని ప్రోత్సహిస్తున్నారని, ఎన్నికల్లో గెలవడానికి ఇంతలా దిగజారాలా అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. మంగళవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బండి సంజయ్ తీరును పట్టభద్రులు తీవ్రంగా ఖండించాలన్నారు. కేంద్రమంత్రిగా ఉండి మతాన్ని అడ్డుపెట్టుకోవడం, కాంగ్రెస్ పార్టీని పాకిస్తాన్‌తో పోల్చి మాట్లాడడానికి సిగ్గుండాలని ధ్వజమెత్తారు. ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది.. దేశం కోసం త్యాగాలు చేసింది కాంగ్రెస్, గాంధీ కుటుంబమని పేర్కొన్నారు. దేశం కోసం త్యాగం చేసిన ఒక్క బీజేపీ నాయకుడిని చూపించాలని ఆయన సవాల్ విసిరారు. బీజేపీ బీసీ, కులగణన వ్యతిరేక పార్టీ అని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై ముస్లింలకు ముడిపెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలను బీసీల్లో చేర్చలేదా? మీరు చేస్తే ఒప్పు.. మేం చేస్తే తప్పా అని ఆది శ్రీనివాస్ నిలదీశారు.

ఇండియా, పాకిస్తాన్ తప్ప మరేం లేదా?

కేంద్రమంత్రి బండి వ్యాఖ్యలపై ఎంపీ కిరణ్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడేందుకు.. కులాలు, మతాలు, ముస్లింలు, ఇండియా, పాకిస్తాన్ తప్ప మరేం లేదా? అని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. ఆయన మంగళవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధులు లింగం యాదవ్, వచన్‌కుమార్, శ్రీకాంత్ యాదవ్, మేడి రవిచంద్రలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఓట్ల కోసం బీజేపీ నేతలు అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా ముస్లింలు ఓబీసీ కేటగిరీలో ఉన్నారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ నిందితులను తెలంగాణ బీజేపీ నేతలే రక్షిస్తున్నారని ఆరోపించారు. కార్ రేసింగ్ కేసులో కేటీఆర్‌ను ఈడీ ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. కాగా, ఇండియా గెలవాలంటే బీజేపీకి, పాకిస్తాన్ గెలవాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని గ్రాడ్యుయేట్ ఓటర్లను కోరుతూ వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై ఎంపీ చామల ఈసీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పార్టీ అధికార ప్రతినిధి బొజ్జా సంధ్యారెడ్డి తదితరులతో కలిసి మంగళవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సి.సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

గెలిచే అభ్యర్థులున్నా.. టికెట్లు ఇవ్వరా?

సీఎంను ప్రశ్నించిన ‘వకుళాభరణం’



సాక్షి, హైదరాబాద్: బీసీల్లో గెలిచే అభ్యర్థులున్నా మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో టికెట్లు ఇవ్వకపోవడం ఏమిటని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణ, ఉపాధ్యాయ అభ్యర్థిగా పూల రవీందర్‌లు గెలిచే బీసీ అభ్యర్థులైనప్పటికీ.. సీఎం తన సామాజిక వర్గం వారికే టికెట్లు ఇవ్వడం విడ్డూరమని పేర్కొన్నారు. గెలిచే చోట టికెట్లు ఇవ్వరని, నామినేటెడ్ పదవులలో అవకాశం ఇవ్వని సీఎంను బీసీలు నమ్మేదెలా? అని నిలదీశారు. దీన్ని బట్టి కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీలను గాలికొదిలేసినట్టేనని ఎద్దేవా చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మాత్రం రాజ్యాంగం పట్టుకుని.. దేశమంతా సామాజిక న్యాయమంటూ తిరుగుతున్నారని విమర్శించారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

ముఖ్యమంత్రికి సీపీఎం కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

సాక్షి, హైదరాబాద్: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని సీపీఎం కార్యదర్శి జాన్‌వెస్లీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన సీఎంకు లేఖ రాశారు. రాష్ట్రంలో జరిగిన అనేక ఉద్యమాల్లో పాత్రికేయుల పాత్ర మరువలేనిదని, ఈ విషయాన్ని గుర్తించి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు అంశం దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉందని, ఇటీవల సుప్రీంకోర్టు తీర్పుతో జటిలమైన ఈ సమస్యను పరిష్కరించి, వారి ఇళ్ల స్థలాల కోరిక నెరవేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రెండేళ్లకోసారి ఇవ్వాల్సిన అక్రిడిటేషన్లు గడువుదాటి 5 నెలలు పూర్తయినా ఇవ్వలేదని, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఆసుపత్రుల్లో హెల్త్‌కార్డుల ద్వారా సేవలు అందడం లేదని, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు కూడా ఆరోగ్య పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. మహిళా జర్నలిస్టుల కోసం లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని, వేతనాలకు సంబంధించి మజీఠియా కమిటీ సిఫార్సుల అమలుకు కృషి చేయాలని పేర్కొన్నారు. జర్నలిస్టులకు మేలు చేసేలా మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని సీఎంకు రాసిన లేఖలో కోరారు.

గౌతముడు నడయాడిన నేల!

గౌతమ బుద్ధుడు ధ్యానం చేసిన ధూళికట్ట

- శాతవాహనులు నిర్మించిన బౌద్ధ స్తూపం
- దేశ విదేశాల నుంచి బౌద్ధుల రాక
- ఏటా ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న భిక్షువులు
- పర్యాటకాభివృద్ధిపై ప్రభుత్వ నిర్లక్ష్యం



వడ్కాపూర్ శివారులోని ధూళికట్ట బౌద్ధ స్తూపం

జూలపల్లి (పెద్దపల్లి): చుట్టూ పచ్చని పంట పొలాలు.. సమీపంలోనే గలగల పారే హుస్సేన్‌మియా వాగు.. పక్కనే అతిప్రాచీన కోటలు.. మధ్య ఎత్తయిన కట్టడం.. అదే ధూళికట్టలో శాతవాహనులు నిర్మించిన బౌద్ధ స్తూపం.. ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్న కోటలు, బౌద్ధ స్తూపం అభివృద్ధికి నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దేశ, విదేశాల నుంచి పర్యాటకులు తరలివస్తూ.. ఇక్కడ చారిత్రక ప్రాశస్త్యానికి మంత్రముగ్ధులవుతున్నా.. పాలకులకు పట్టడం లేదు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి – ఎలిగేడు మండలాల మధ్య విస్తరించిన ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దాలనే డిమాండ్ పెరుగుతోంది.

ధూళికోటే.. ధూళికట్ట..

శాతవాహనులు దశాబ్దాల క్రితం ధూళికోట (ధూళికట్ట)ను రాజధానిగా చేసుకుని పాలించారన్నది చరిత్రకారుల కథనం. ఇక్కడే బౌద్ధ స్తూపం నిర్మించగా, గౌతమ బుద్ధుడు ధ్యానం చేసినట్లు చెబుతున్నారు. 1972లో పురావస్తు శాఖ జరిపిన తవ్వకాల్లో అతి ప్రాచీన గ్రామ ఆనవాళ్లు, ఆధారాలు లభించాయి. ధూళికట్ట శివారులోని కోట ప్రాంతంలో తవ్వకాలు చేపట్టిన పురావస్తు శాఖ.. ఇక్కడ లభించిన వస్తువులను హైదరాబాద్‌లోని మ్యూజియానికి తరలించి భద్రపరిచింది. వడ్కాపూర్ శివారులోని 741, 742 సర్వే నంబర్లలో పురావస్తు శాఖ తవ్వకాలు జరపగా.. బౌద్ధ స్తూపం, బుద్ధుడు, నాగేశుడు, కొన్ని విగ్రహాలు లభించాయి. వాటిని కూడా మ్యూజియంలో భద్రపరిచారు. బౌద్ధ స్తూపం 0.19 గుంటల విస్తీర్ణంలో ఉంది. పురావస్తు శాఖ తరపున అభివృద్ధి చేసేందుకు వడ్కాపూర్ రైతులను ఒప్పించి.. మరో ఎనిమిది ఎకరాలను కొనుగోలు చేశారు.

అమలుకు నోచని హామీలు..

బౌద్ధ స్తూపం, పరిసరాలను అభివృద్ధి చేస్తామని అప్పటి పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్ హామీ ఇచ్చారు. ఈమేరకు రూ.50 లక్షలు కేటాయించారు. అధికారులు ప్రణాళికలు రూపొందించడంలో నిర్లక్ష్యం వహించడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.

ఏటా బుద్ధుని జయంతి..

బౌద్ధ స్తూపం వద్ద 2008 నుంచి ఏటా గౌతమ బుద్ధుని జయంతి నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దాతల సాయంతో బౌద్ధ దమ్మ ప్రచార పరిషత్ సభ్యులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన ఇద్దరు బౌద్ధ భిక్షువులతోపాటు పలు ప్రాంతాల నుంచి బౌద్ధులు వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

పర్యాటకాభివృద్ధి చేయాలి



అతి ప్రాచీన బౌద్ధ స్తూపం ఉన్న ధూళికట్ట ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. కనీస సౌకర్యాలు కల్పించాలి. పర్యాటకానికి ఆటంకంగా ఉన్న వడ్కాపూర్ నుంచి బౌద్ధ స్తూపం, ధూళికట్ట రేణుకా ఎల్లమ్మ ఆలయం వరకు రోడ్డు నిర్మించాలి. ఏటా నిర్వహించే ఉత్సవాలు, ప్రార్థనలకు కూడా ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి.

– మొగురం రమేశ్, మాజీ సర్పంచ్, వడ్కాపూర్

కనీస సౌకర్యాలు కరువు..

ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలనే డిమాండ్లు నెరవేరడం లేదు. ధూళికట్ట ఎల్లమ్మ ఆలయం నుంచి స్తూపం వరకు రోడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరైనా.. రైతులు తమ భూములు ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో రోడ్డు, తాగునీటి సౌకర్యం, విద్యుత్, వసతి గదులు అందుబాటులోకి రాకుండా పోయాయి. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నల్ల మనోహర్‌రెడ్డి సొంత నిధులు వెచ్చించి ఈ ప్రాంతంలో ధ్యానముద్ర నిర్మించారు. అందులో గౌతమ బుద్ధుని పాలరాతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

అసోసియేషన్ల ఎన్నికల వివాదం

రేపటికి వాయిదా



సీనియర్ న్యాయవాది అయ్యాడపు రవీందర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. మోడల్ బైలాస్ ను సంఘాలకు అమలు చేసే అధికారం కౌన్సిల్‌కు లేదన్నారు. 2011లోనే దీనిపై ఉత్తర్వులు జారీ చేశామని, ఇప్పుడు తప్పు బట్టడం సరికాదని కౌన్సిల్ తరపు న్యాయ వాది పేర్కొన్నారు. అనంతరం సమయం లేకపోవడంతో తదుపరి విచారణను న్యాయ మూర్తి వాయిదా వేశారు.

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని బార్ అసోసి యేషన్లు, బార్ కౌన్సిల్ మధ్య నెలకొన్న ఎన్నికల వివాదంపై విచారణ ఈనెల 27కి వాయిదా పడింది. బార్ అసోసియేషన్ల ఎన్నికల్లో జోక్యం చేసుకోకుండా.. బార్ కౌన్సిల్‌ను నిరోధించాలని, అసోసియేషన్ల కాలపరిమితిని రెండేళ్ల పెంచలేమంటూ కౌన్సిల్ ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్‌తో పాటు 24 వివిధ కోర్టుల అసోసియేషన్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. రాష్ట్రంలోని బార్ అసోసియేషన్లపై బార్ కౌన్సిల్ నిబంధనలు విధించడం న్యాయవాదుల చట్టం 1961లోని నిబంధనలకు విరుద్ధం.. చట్టప్రకారం బార్ అసోసియేషన్ల రోజువారీ కార్యకలాపాల్లో, ఎన్నికల్లో జోక్యం చేసుకునే అధికారం కౌన్సిల్‌కు లేదు. వివిధ అసోసి యేషన్లకు వాటి సొంత నిబంధనలున్నాయి. సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం కింద అసోసి యేషన్లు సమోదయ్యాయి. ఆ మేరకు విధులు నిర్వహిస్తాయి. సొంత నిబంధనలను సవరించుకునే అధికారం అసోసియేషన్ల జనరల్ బాడీకి ఉంది. బార్ కౌన్సిళ్లు అసోసియేషన్ల కార్యకలాపాల్లో, ఎన్నికల్లో జోక్యం చేసుకో కుండా చర్యలు తీసుకోవాలని 2015లోనే బీసీఐ.. రాష్ట్ర బార్ కౌన్సిళ్ల కార్యదర్శులకు లేఖ రాసింది. అయినా రాష్ట్ర కౌన్సిళ్లు జోక్యం చేసుకుంటున్నాయి. బార్ అసోసియేషన్ల కమిటీ పదవీ కాలాన్ని రెండేళ్లకు పెంచాలని.. రాష్ట్రంలోని అన్ని అసోసియేషన్లు (110) తీర్మానించాయి. ఈ మేరకు బార్ కౌన్సిల్‌కు వినతిపత్రం సమర్పించినా తిరస్కరిస్తూ.. మార్చి 31న ఎన్నికలు నిర్వహిస్తామని తెలి పింది. దీంతో విధిలేని పరిస్థితిలో కోర్టును ఆశ్రయించాం’.. అని పేర్కొన్నాయి. ఈ పిటి షన్‌పై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం మరోసారి విచారణ చేపట్టారు. అసోసియేషన్ల తరపున

చెప్పుకోడానికేమీ లేక మత రాజకీయాలు

‘బండి’పై మంత్రి సీతక్క ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్లుగా యువకులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేదని మంత్రి సీతక్క విమర్శించారు. ఆమె మంగళవారం సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి.. జిల్లాకు 200 ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రజలకు చెప్పడానికి అభివృద్ధి పనులు లేక, నిరుద్యోగులు, యువతకు జవాబు చెప్పుకోలేక.. కేంద్ర మంత్రి బండి సంజయ్ మత రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అందుకే సంజయ్ నోటివెంట హిందూస్తాన్–పాకిస్తాన్, హిందూ–ముస్లిం తప్ప మరో మాట రావడం లేదని మండిపడ్డారు. దమ్ముంటే అభివృద్ధి ప్రాతిపదికన ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. పట్టభద్రులకు అసలేం చేశారో సంజయ్ చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు బీజేపీకి లేదన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు

చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలి

మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలికి ఇందిరా శోభన్ వినతి



సాక్షి, హైదరాబాద్: చట్ట సభల్లో మహిళలకు కేటాయించనున్న 33 శాతం సీట్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ఇందిరా శోభన్ కోరారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని మంగళవారం ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లంబాను గాంధీభవన్‌లో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. 33 శాతం సీట్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించకపోతే, ఆయా వర్గాల్లోని మహిళా నేతలకు అన్యాయం జరుగుతుంద న్నారు. అగ్రవర్ణ మహిళల కు ఉన్న రాజకీయ పలుకుబడి, ఆర్థిక శక్తుల అండ, ఇతర వర్గాల్లోని మహిళలకు లేవని, ఈ నేపథ్యంలోనే మహిళలకు కేటాయించే సీట్లలోనూ రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాల మహిళల సాధికారతకు ప్రాధాన్యతను ఇచ్చే కాంగ్రెస్ పార్టీ, జాతీయ స్థాయిలో ఈ అంశంలో ఓ స్టాండ్ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాలని ఆమె కోరారు.



కుంభ మేళా నుంచి తీసుకొచ్చిన నీరు

ఇంటింటికీ ప్రయాగ జలం

మిత్రులు, బంధువులకు భారీగా సీసాలతో పవిత్రజలం

కుంభమేళాకు వెళ్లలేనివారికి ఊరట..



ఓ ఇంట్లోని పూజగదిలో భద్రపరిచిన ప్రయాగ జలం

కోరుట్ల: ప్రయాగ మహాకుంభ మేళా.. 144 ఏళ్లకోసారి పవిత్ర పుణ్యజల స్నానాలు చేసే మహాద్భాగ్యమిది. బతికి ఉన్నంతకాలం.. మళ్లీ వచ్చే అవకాశం లేదు.. ఇప్పుడు వెళ్లి రావాల్సిందే.. అన్న భావన సామాన్యుల్ని సైతం ప్రయాగరాజ్ మహాకుంభ మేళా వైపు నడిపించింది. ఫలితంగా రోజూ కోట్లాది జనం ఎన్నో వ్యయప్రయాసలు తట్టుకుని మహాకుంభ మేళా పుణ్యస్నానాల కోసం తరలి వెళ్లారు. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు, శారీరక శ్రమ భరించలేక కుంభ మేళాకు వెళ్లలేనివారూ ఉన్నారు. కానీ కుంభమేళాకు వెళ్లిన బంధువులు, సన్నిహితులు, మిత్రులు అక్కడి నుంచి పవిత్రజలాలను తీసుకొచ్చి పంపిణీ చేయడంతో చాలా మందికి ఊరట దక్కింది.

ఇంటింటికీ చేరినట్లే..

సుమారు వెయ్యి కిలోమీటర్లకు పైగా ప్రయాణం.. రూ.10 వేల వరకు వ్యయం.. దీన్నిమించి ప్రయాగ స్నానాల ఘాట్లకు చేరుకోవడానికి ట్రాఫిక్ జామ్ వల్ల కిలోమీటర్ల దూరం నడిచివెళ్లాల్సి రావడం.. ఈ అవస్థల నడుమ అక్కడిదాకా వెళ్లలేని వృద్ధులు, మహిళలు, పిల్లలు.. ఇలా చాలామందికి పవిత్ర స్నానాలు ఆచరించాలన్న కోరిక తీరలేదు. కానీ.. కుంభమేళాకు వెళ్లిన ప్రతీ ఒక్కరు తమ బంధువులు, సన్నిహితులకు పుణ్యఫలం దక్కాలన్న ఉద్దేశంతో.. అక్కడి నుంచి ప్రయాగ జలాలను సీసాల్లో పెద్ద ఎత్తున తీసుకురావడం విశేషం. కుంభ మేళా చివరి అంకానికి చేరుకున్న క్రమంలో.. ప్రస్తుతం ప్రతీ ఇంటికి కుంభ మేళా నీరు చేరింది. కుంభ మేళా త్రివేణి సంగమం (గంగ, యమున, గోదావరి) నుంచి నీటిని తెచ్చుకుని స్నానాలు ఆచరిస్తే పుణ్యఫలం దక్కుతుందని పండితులు చెప్పడం గమనార్హం.

శివరాత్రి సెంటిమెంట్..

కుంభమేళా నుంచి ఇళ్లకు చేరిన ప్రయాగజలంతో శివరాత్రి మహాపర్వదినాన స్నానాలు ఆచరిస్తే చాలా మంచిదన్న సెంటిమెంట్ కొనసాగుతోంది. కుంభమేళా నుంచి పవిత్ర జలాలను తెప్పించుకున్న చాలామంది ఆ నీటిని పూజ గదుల్లో భద్రపరిచారు. ఆ జలంతో శివరాత్రి రోజు స్నానాలు చేసేందుకు ఇష్టపడుతున్నారు. కొంత మంది ఇప్పటికే ప్రయాగ పవిత్ర జలాలను.. ఉపవాసపు రోజుల్లో నీటిలో కలుపుకొని స్నానాలు చేస్తున్నారు. ఎంతో కొంత కుంభ మేళా స్నాన పుణ్యఫలం దక్కిందని సంబరపడుతున్నారు. వృద్ధులు, మహిళలు.. తాము బతికి ఉన్నంత కాలమంతా దక్కని పవిత్ర ప్రయాగపుణ్య జల స్నానం చేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నారు.

స్నేహితుడు పవిత్ర జలాలు తెచ్చాడు



కుంభ మేళాకు వెళ్లిన స్నేహితుడికి అక్కడి నుంచి పవిత్ర జలాలు తెమ్మని చెప్పాను. రెండు రోజుల క్రితం నా స్నేహితుడు రాజు కుంభమేళా నీటి సీసా తెచ్చి ఇచ్చాడు. శివరాత్రి రోజు నాకు సెంటిమెంట్.. అదే రోజు కుంభ మేళా నీటితో స్నానం ఆచరిస్తాను.

– శ్రీనివాసాచారి, కోరుట్ల

బంధువుల కోసం పది సీసాలు



వారం క్రితం కుంభమేళాకు స్నేహితులతో కలిసి కారులో వెళ్లివచ్చాను. నేను కుంభమేళాకు వెళ్లానని తెలిసి.. చాలామంది స్నేహితులు అక్కడి పవిత్ర జలాలు తెమ్మన్నారు. దాదాపు పది సీసాలతో నీటిని ప్రయాగ నుంచి తెచ్చి బంధువులు, స్నేహితులకు ఇచ్చాను. నేను ఒక సీసా ఉంచుకున్నాను.

– శ్రీనివాస్, కోరుట్ల

శివరాత్రి రోజు పవిత్ర స్నానం చేస్తా



కుంభ మేళాకు వెళ్లిరావడం వ్యయ ప్రయాసలతో కూడిన పని.. అందుకే అక్కడికి వెళ్లిన నా స్నేహితుని కుమారునికి ప్రయాగ జలాలు తీసుకురమ్మని చెప్పాను. రెండు రోజుల క్రితం పవిత్ర జలాల సీసా ఇంటికి తెచ్చిచ్చాడు. శివరాత్రి రోజు ఆ నీటితో స్నానం ఆచరిస్తాను.

– రుద్ర సుధాకర్, రిటైర్డ్ టీచర్, కోరుట్ల

ఇదీ విజన్ అంటే!



విజన్ అంటే కళ్లార్పకుండా పదే పదే మాయ మాటలు చెప్పడం కాదని, అబద్ధాలతో ప్రజలను గందరగోళానికి గురిచేసి.. పబ్బం గడుపుకోవడం అంతకంటే కాదని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'విద్యుత్ ఒప్పందం' సాక్షిగా నిరూపించారు. రాష్ట్రానికి అత్యంత చౌక ధరకే సౌర విద్యుత్ లభించేలా చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఈ దిశగా పలు కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా మార్గ నిర్దేశం చేయడమే కాకుండా వాటికి ఊతమిచ్చారు. ప్రధానంగా రైతన్నలకు 9 గంటలు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ ఇవ్వాలన్న దృఢ సంకల్పంతో అడుగులు ముందుకు వేశారు. ఈ క్రమంలో వైఎస్ జగన్ తపన, తాపత్రయం, ముందు చూపును గమనించి యూనిట్ కేవలం రూ.2.49 చొప్పున విద్యుత్ ఇస్తామని సెకీ ముందుకొచ్చి.. ఒప్పందం చేసుకుంది. దీనిపై కొందరు కారుకూతలు కూసినా, ఎల్లో గ్యాంగ్ మసిపూసి బురద చల్లినా ఎట్టకేలకు 'ఆ ఒప్పందం' సక్రమమే అని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) కుండబద్దలుకొట్టి స్పష్టం చేసింది. తద్వారా వైఎస్ జగన్ ముందు చూపు కొంత ఆలస్యంగానైనా ప్రశంసలందుకుంటోంది.

గత ప్రభుత్వంలో విద్యుత్ రంగాన్ని గాడిన పెట్టేందుకు కృషి చేసిన వైఎస్ జగన్

- ఏపీ విధానాలు నచ్చి రూ.4,500 కోట్ల పెట్టుబడితో 1,014 మెగావాట్లు ఉత్పత్తి చేస్తామన్న ఆర్సెలర్ మిట్టల్ గ్రూపు
- 2 వేల మెగావాట్ల ఉత్పత్తికి ఎకోరన్ ఎనర్జీ రూ.11 వేల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు అంగీకారం
- ఎన్‌హెచ్‌పీసీతో కలిసి ఏపీజెన్‌కో రూ.10 వేల కోట్ల పెట్టుబడి.. 1950 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్ట్‌కు ఒప్పందం
- ఆ క్రమంలోనే రైతుల కోసం జగన్ పడుతున్న తపన చూసి యూనిట్ రూ.2.49కి ఇస్తామని ముందుకొచ్చిన సెకీ
- పాతికేళ్ల పాటు 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్‌ను వ్యవసాయానికి ఇచ్చేందుకు ఒప్పందం

5,230 మెగావాట్ల సామర్థ్యంతో ప్రపంచంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుకు శ్రీకారం

- చంద్రబాబు గత పాలనలో అనవసర పీపీఏలతో దొరికినకాడికి దోపిడీ
- విద్యుత్ చార్జీలు పెంచమంటూ ఎన్నికల ముందు ప్రజల్ని నమ్మించి ఇప్పుడు చార్జీల బాదుడు
- పైగా 'సెకీ'తో గత ప్రభుత్వ ఒప్పందంపై అవాకులు, చవాకులు, బురదజల్లుడు
- తుదకు ఆ ఒప్పందం సక్రమమేనని విద్యుత్ నియంత్రణ మండలి స్పష్టీకరణ
- జగన్ చేసిన మంచి వల్లే రాష్ట్రానికి తక్కువ ధరకే లభిస్తున్న సౌర విద్యుత్
- సెకీ నుంచి ఈ ఏడాది 4 వేల మెగావాట్లు, వచ్చే ఏడాది మరో 3 వేల మెగావాట్లు
- ముందు చూపు అంటే ఇదీ అని విద్యుత్ రంగ నిపుణుల్లో చర్చ

సాక్షి, అమరావతి

గాడి తప్పిన విద్యుత్ రంగాన్ని అభివృద్ధి పథం పట్టించేందుకు గత ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టింది. భారీ పవర్ ప్రాజెక్టులకు కేరాఫ్ అడ్రస్‌గా ఆంధ్రప్రదేశ్‌ను నిలపడంలో గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విజయవంతం అయిందని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. ఐదేళ్ల పాలనలో కనీ వినీ ఎరుగని రీతిలో పలు ప్రాజెక్టుల నిర్మాణం ప్రారంభించడంతో పాటు భారీ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకుంది. వ్యవసాయానికి పగటి పూట 9 గంటలు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పాటు సామాన్య ప్రజలు, పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందించాలనే లక్ష్యంతో పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకూ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా విశాఖలో 2023లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్)లో ఏకంగా రూ.8,19,815 కోట్లతో 25 ఇంధన రంగ ఒప్పందాలతో చరిత్ర సృష్టించింది. ఆ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన సోలార్ ఎనర్జీ కార్పొరేషన్(సెకీ)తో 7 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం మేరకే ఇప్పుడు రాష్ట్రానికి తక్కువ ధరకే 4 వేల మెగావాట్ల విద్యుత్ వస్తోంది.

'సెకీ' విద్యుత్‌పై 'ఎల్లో' కుట్రలు

రైతులకు పగటి పూట 9 గంటలపాటు ఇచ్చే ఉచిత విద్యుత్ పథకాన్ని దీర్ఘకాలికంగా అమలు చేయడానికి సెకీ నుంచి 17 వేల మిలియన్ యూనిట్ల (7 వేల మెగావాట్లు) సౌర విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి గత ప్రభుత్వంలో ఒప్పందం జరిగింది. అది కూడా అత్యంత చవక ధరతో.. యూనిట్ రూ.2.49కే ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకుంది. 2022–23లో యూనిట్ రూ.5.13గా ఉన్న సగటు విద్యుత్ సేకరణ ఖర్చుతో పోల్చితే ఇది రూ.2.64 తక్కువ. అదీగాక ఏపీకి సౌర విద్యుత్‌ను తక్కువ ధరకే సరఫరా చేస్తామన్న ప్రతిపాదన సెకీ నుంచే వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా యూనిట్ ధర రూ.2.80కి పెరిగినప్పటికీ మనకు మాత్రం ఒప్పందం మేరకు యూనిట్ రూ.2.49కే ఇచ్చేందుకు సెకీ అంగీకరించింది. ప్రధానంగా ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ (ఐఎస్‌టీఎస్) చార్జీల నుంచి పూర్తి మినహాయింపు లభిస్తుంది. ఈ విషయాన్ని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ, సెకీ లేఖ, ఒప్పందంలోనూ స్పష్టంగా ఉంది. ఇంత మంచి ఒప్పందాన్ని చేసుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌ను అభినందించాల్సిందిపోయి చంద్రబాబు అండ్ గ్యాంగ్, ఎల్లో మీడియా కుట్రలకు పాల్పడ్డాయి. సెకీ ఒప్పందాన్ని ఓ అవినీతి భూతంగా చూపించాలని, వైఎస్ జగన్‌ను అవినీతిపరుడిగా చిత్రీకరించాలని విశ్వ ప్రయత్నాలు చేశాయి. అసత్య కథనాలు, అబద్ధ ప్రచారాలతో రైతులకు సైతం ఉచిత విద్యుత్‌ను దూరం చేయాలని ప్రయత్నించాయి. కానీ ఈ కుట్రలన్నిటినీ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) పటాపంచలు చేసింది. సెకీ ఒప్పందం సక్రమమేనని మండలి తేల్చి చెప్పింది.

బాబు ఒప్పందాలతో 24 శాతం అప్పుల వృద్ధి రేటు

చంద్రబాబు అధిక ధరలకు కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పీపీఏ), నిర్లక్ష్యం కారణంగా 2014–19 మధ్య విద్యుత్ సంస్థలు తీవ్ర అప్పుల్లో కూరుకుపోయాయి. డిస్కంలు నష్టాల్లోకి వెళ్లిపోయాయి. విద్యుత్ సంస్థల అప్పులు, బకాయిల భారం 2014 మార్చి నాటికి రూ.29,551 కోట్లు ఉంటే, చంద్రబాబు దిగిపోయే (2019 మార్చి 31)నాటికి రూ.86,215 కోట్లకు పెరిగింది. అంటే ఏకంగా రూ.56,663 కోట్లకు ఎగబాకింది. దీంతో 2014–19 మధ్య వార్షిక అప్పుల వృద్ధి రేటు(సీఏజీఆర్) 24 శాతం పెరిగింది. జగన్ హయాంలో పెరిగిన అప్పుల వృద్ధి రేటు 7.28 శాతం మాత్రమే. 2020–22 మధ్య కోవిడ్ మహమ్మారి వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రపంచ వ్యాప్తంగా అనేక సంస్థల అప్పులు భారీగా పెరిగినప్పటికీ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సమర్థ నిర్వహణ వల్ల ఇంత తక్కువ శాతం నమోదయ్యింది. డిస్కంల వార్షిక ఖర్చులకు, ఆదాయ అవసరాలకు అనుగుణంగా టీడీపీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదు. విద్యుత్ నియంత్రణ మండలి నిర్దేశించిన సబ్సిడీని భరించలేదు. దీంతో ఐదేళ్ల టీడీపీ హయాంలో డిస్కంల నష్టాలు రూ.6,625.88 కోట్ల నుంచి రూ.28,715 కోట్లకు పెరిగాయి.

గత ప్రభుత్వంలో భారీ ప్రాజెక్టులు, ఒప్పందాలు

గ్రీన్‌కో గ్రూప్ 5,230 మెగావాట్లతో ప్రపంచంలోనే అతి పెద్ద ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్(ఐఆర్‌ఈపీ)కు మన రాష్ట్రాన్ని ఎంచుకుంది. ఈ ప్రాజెక్టుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి శరవేగంగా పనులు సాగుతున్నాయి. త్వరలోనే ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్టు పూర్తయ్యే నాటికి ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 23 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. వాతావరణంలో ఏటా 15 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గుతాయి.

రాయలసీమలోని నంద్యాల జిల్లాలో రూ.25,850 కోట్ల విలువైన మూడు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు జగన్ భూమి పూజ చేశారు. మరో రెండు పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టు (పీఎస్‌పీ)ల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీజెన్‌కో), కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) మధ్య ఒప్పందం జగన్ సమక్షంలో జరిగింది.

గ్రీన్‌కో దాదాపు 2,300 మెగావాట్ల సౌర విద్యుత్తుకు సంబంధించి రూ.10,350 కోట్ల పెట్టుబడితో 2,300 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ప్రాజెక్టును నిర్మించేందుకు ముందుకొచ్చింది. ఆర్సెలర్ మిట్టల్ గ్రీన్ ఎనర్జీ కంపెనీ రూ.4,500 కోట్ల పెట్టుబడితో మరో 1014 మెగావాట్లకు సంబంధించిన ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగింది. దీని ద్వారా 1000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

ఎకోరన్ ఎనర్జీ ప్రాజెక్టుకు సంబంధించి 2 వేల మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించనున్న ప్రాజెక్టుకు కూడా వైఎస్ జగన్ శంకుస్థాపన చేశారు. దాదాపు రూ.11 వేల కోట్ల పెట్టుబడితో రానున్న ఈ ప్రాజెక్టు ద్వారా 2 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

యాగంటిలో 1000 మెగావాట్ల ప్రాజెక్టు, కమలపాడులో మరో 950 మెగావాట్లు మొత్తం దాదాపు 2 వేల మెగావాట్ల ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌పీసీతో కలిసి నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. దాదాపు రూ.10 వేల కోట్ల విలువైన ఈ ప్రాజెక్టుకు ఫీజుబులిటీ అధ్యయనం పూర్తయింది. ఈ ప్రాజెక్టు వల్ల 2 వేల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఎన్‌హెచ్‌పీసీతో మరో 2,750 మెగావాట్లకు సంబంధించిన ప్రాజెక్టులో కూడా కలిసి నడిచేందుకు గత ప్రభుత్వం అడుగులు ముందుకు వేసింది.

దేశంలోనే అత్యధిక పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు

దేశంలోనే అత్యధికంగా 42,270 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ (పీఎస్‌పీ) ప్రాజెక్టులకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉండే నీటి వనరులను ఉపయోగించుకొని పంప్డ్ హైడ్రో స్టోరేజీ, సౌర, పవన విద్యుత్‌ల కలయికగా ఈ అధునాతన ప్రాజెక్టులకు రూపకల్పన చేసింది. ఇందులో 33,240 మెగావాట్లకు సంబంధించి 29 ప్రాంతాల్లో ఉన్న ప్రాజెక్టులకు ఫీజుబులిటీ అధ్యయనం జరిగింది. 20,900 మెగావాట్ల సామర్థ్యానికి సంబంధించిన ప్రాజెక్టులకు సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక(డీపీఆర్)లు కూడా పూర్తి చేసింది. ఇందులో 16,180 మెగావాట్ల సామర్థ్యంతో ఉత్పత్తి చేసేందుకు వివిధ కంపెనీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కాగా, థర్మల్ విద్యుత్ సామర్థ్యం కూడా వైఎస్ జగన్ హయాంలో 1600 మెగావాట్లు అదనంగా పెరిగింది. కృష్ణపట్నంలోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్‌లో 800 మెగావాట్లు, డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్‌లో 800 మెగావాట్ల ఉత్పత్తి మొదలైంది.

బాబు పాలనంటేనే దోపిడీ

ఓట్లేసి గెలిపిస్తే విద్యుత్ చార్జీలు పెంచమంటూ ఎన్నికల ముందు ప్రజలను నమ్మించి అధికారంలోకి రాగానే రూ.15,485 కోట్ల చార్జీల భారాన్ని ప్రజలపై వేసింది చంద్రబాబు కూటమి ప్రభుత్వం. అది చాలదన్నట్లు వచ్చే ఏప్రిల్ 1 నుంచి చిరు వ్యాపారులపై 'టైమ్ ఆఫ్ డే' పేరుతో అదనపు చార్జీల బాదుడుకు సిద్ధమైంది. నిజానికి చంద్రబాబు పాలనలో ఎప్పుడూ అటు ప్రజలను, ఇటు విద్యుత్ సంస్థలను దోపిడీ చేయడం పరిపాటిగా మారింది. చంద్రబాబు గత హయాంలో సౌర విద్యుత్ యూనిట్‌కు ఏకంగా రూ.6.99, పవన విద్యుత్ యూనిట్‌కు రూ.4.84 చెల్లించి కొనుగోలు చేశారు. చంద్రబాబు సీఎం పదవి నుంచి దిగిపోయే నాటికి సోలార్ విద్యుత్ యూనిట్ సరఫరా ధర రూ.5.90, పవన విద్యుత్ యూనిట్ రూ.4.63కు చేరింది. నిజానికి అప్పట్లో సోలార్ యూనిట్ రూ.2.44కు, పవన విద్యుత్ యూనిట్ రూ.2.43తో ఇతర రాష్ట్రాల్లో ఒప్పందాలు జరిగాయి. చంద్రబాబు చేసిన పని వల్ల డిస్కంలు ఏటా రూ.3,500 కోట్లు చొప్పున దశాబ్దాల పాటు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రస్తుత విలువ ఆధారంగా ఈ మొత్తం భారం రూ.35 వేల కోట్లకు పైనే. ఈ విషయాన్ని దాచి అప్పట్లో విద్యుత్ ఉత్పత్తి లోటు ఉందని టీడీపీ పచ్చి అబద్ధాలు ప్రచారం చేసింది.

	చంద్రబాబు హయాంలో	వైఎస్ జగన్ హయాంలో
సబ్సిడీ	రూ.13,255.76 కోట్లు	రూ.47,800.92 కోట్లు
ఉచిత విద్యుత్ సరఫరాకు అనుకూలంగా ఉన్న ఫీడర్లు	3,854	6,605
ఉచిత విద్యుత్ సరఫరా	రెండు విడతల్లో 7 గంటలు	ఒకే విడత 9 గంటలు
సౌర విద్యుత్ ఒప్పందం ధర (యూనిట్)	రూ.6.99	రూ.2.49
ఏపీ జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం	7,213 మెగావాట్లు	8,789 మెగావాట్లు
మొత్తం విద్యుత్ ఉత్పత్తి	27,197 మిలియన్ యూనిట్లు	34,181 మిలియన్ యూనిట్లు
ఏపీ జెన్‌కో లాభాలు	రూ.2,044 కోట్లు	రూ.2,469 కోట్లు
ఏపీపీడీసీఎల్ లాభాలు	రూ.1,565 కోట్లు	రూ.6,240 కోట్లు

స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాల్సిందే

నిబంధనల్లో 'ఏపీఈఆర్‌సీ' సవరణ

సాక్షి, అమరావతి: సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) నిబంధనల మేరకు రాష్ట్రంలోని ప్రతి విద్యుత్ సర్వీసుకు నిర్దీత గడువులోగా స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు అమర్చడం తప్పనిసరని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) స్పష్టం చేసింది. ఈ మేరకు మీటర్ల ఏర్పాటు, నిర్వహణ కోసం సీఈఏ నిబంధనల్లో సవరణలు చేస్తూ మంగళవారం సర్క్యులర్ జారీ చేసింది. అందులో ముందస్తు చెల్లింపు (ప్రీ పెయిడ్) విధానంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలని సీఈఏ నిబంధన పెట్టిందని, కానీ నెల వారీ విద్యుత్ బిల్లులు వసూలు విధానాన్ని కొనసాగించేందుకు అనుమతినివ్వాల్సిందిగా డిస్కంలను ఏపీఈఆర్‌సీని కోరినట్లు తెలిపింది. డిస్కంల అభ్యర్థన మేరకు నిబంధనల్లో సవరణలు ప్రతిపాదిస్తూ గత నెల 29 వరకు అభ్యంతరాలు స్వీకరించింది. సీఈఏ ఇచ్చిన గడువులోగా రాష్ట్రంలోని పారిశ్రామిక, వాణిజ్య, గృహ విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు బిగించాల్సిందేనని ఏపీఈఆర్‌సీ స్పష్టం చేసింది.

కల్తీ నెయ్యి కేసులో కస్టడీపై వాదనలు వాయిదా

తిరుపతి లీగల్: తిరుమలకు కల్తీ నెయ్యి తరలిస్తున్నారన్న అభియోగాల కింద నమోదైన కేసులో ఇద్దరిని తిరిగి పోలీస్ కస్టడీకి ఇవ్వాలన్న పిటిషన్‌పై వాదనలు గురువారానికి వాయిదా పడ్డాయి. కేసులో మూడో నిందితుడు వైష్ణవి డెయిరీ డైరెక్టర్ పామిలి జైన్, ఐదో నిందితుడు వైష్ణవి డెయిరీ సీఈఓ అపూర్వ వినయ్‌కాంత్ చావడాలను ఇంకా విచారించాల్సి ఉందని, ఇద్దరినీ తిరిగి పోలీస్ కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ జయశంకర్ వాదనలు వినిపించారు. నిందితుల తరఫున న్యాయవాదులు గురువారానికి వాయిదా కోరడంతో తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు గురువారానికి వాయిదా వేశారు. అలాగే కేసులో నిందితులుగా అభియోగాలు ఎదుర్కొంటున్న వైష్ణవి డెయిరీ డైరెక్టర్లు, సీఈవో దాఖలు చేసుకున్న బెయిలు పిటిషన్లను వారి తరఫు న్యాయవాదులు వెనక్కి తీసుకున్నారు.

'కర్నూలు జిల్లాకు సంజీవయ్య పేరు పెట్టండి'

సాక్షి, అమరావతి: ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా సేవలందించిన దామోదరం సంజీవయ్య పేరును కర్నూలు జిల్లాకు పెట్టాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు కోరారు. ఆయన మంగళవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను క్యాంప్ కార్యాలయంలో కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. సామాజిక పింఛన్లు రావడంలో, కార్మికులకు పలు ప్రయోజనాలు కల్పించడంలో దామోదరం సంజీవయ్య పాత్ర ఎంతో ఉందని వివరించారు. సంజీవయ్య పేరుతో స్మారక భవనాన్ని నిర్మించాలని కోరారు. ఈ అంశాలను సీఎం దృష్టికి తీసుకువెళ్తానని పవన్ భరోసా ఇచ్చారు.

28న జాతీయ సైన్స్ డే పోటీలు

సాక్షి, అమరావతి: విద్యార్థుల్లో సైన్స్‌పై అవగాహన పెంపొందించేందుకు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించేందుకు సమగ్ర శిక్ష రాష్ట్ర విభాగం ఏర్పాట్లు చేసింది. ఈనెల 28న అన్ని జిల్లా కేంద్రాల్లో వేడుకలు నిర్వహించేందుకు ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 'ఎంపవరింగ్ ఇండియన్ యూత్ ఫర్ గ్లోబల్ లీడర్‌షిప్ ఇన్ సైన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫర్ వికసిత్ భారత్' అంశంపై క్విజ్ పోటీలు, సదస్సులు నిర్వహించనున్నారు.

జల విద్యుత్ కేంద్రాలపై విచారణ వాయిదా

మార్చి 18వ తేదీకి వాయిదా వేసిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా నదిపై జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల కోసం 2021లో తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో–34ను రద్దు చేయాలన్న ఏపీ ప్రభుత్వ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ మరోసారి వాయిదా పడింది. పరిమితులు లేకుండా విద్యుత్ ఉత్పత్తికి నీటిని మళ్లించడం సరికాదంటూ ఏపీ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. జీవో–34ను రద్దు చేయాలంటూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ఆ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ తరఫు సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు వినిపించగా.. ఆ వాదనలపై అభిప్రాయాలు తెలపాలని తెలంగాణ తరఫు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌కు ధర్మాసనం సూచించింది. తెలంగాణ ప్రభుత్వం నుంచి ఆదేశాలు తీసుకుని రెండు వారాల్లోగా వివరాలు సమర్పిస్తానని వైద్యనాథన్ తెలిపారు. దీంతో ఏపీ ప్రభుత్వ పిటిషన్‌పై తదుపరి విచారణను మార్చి 18వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది. కాగా.. ఉమ్మడి ప్రాజెక్టుల నిర్వహణ బోర్డు నియంత్రణలో కొనసాగించాలని ఏపీ దాఖలు చేసిన మరో పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం విచారించింది. ఏపీ పునర్విభజన చట్టం–2014 ప్రకారం ప్రాజెక్టులను నదీ బోర్డులే నియంత్రించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాదించింది. కాగా.. నీటి పంపకాలు లేకుండా ప్రాజెక్టులను బోర్డు నియంత్రణలో పెట్టడం సరికాదని తెలంగాణ ప్రభుత్వం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లింది. ప్రస్తుతం ట్రిబ్యునల్ ఎదుట నీటి పంపకాలకు సంబంధించిన విచారణ కొనసాగుతోందని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు నిరాకరించింది.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 66,764 మంది స్వామివారిని దర్శించుకోగా, 23,504 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.14 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.




తెప్పోత్సవాలకు సన్నద్ధం



తిరుమల: తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు మార్చి 9 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో శ్రీవారి పుష్కరిణి సర్వాంగ సుందరంగా సిద్ధమవుతోంది. ఇప్పటికే ఇంజినీరింగ్ అధికారులు పుష్కరిణిలోని మండపం వద్ద ఉత్సవాలకు కావలసిన ఏర్పాట్లను మొదలుపెట్టారు. త్వరలోనే పుష్కరిణిలో నీటిని తొలగించి మరిన్ని పనులు చేపట్టనున్నారు.

ప్రభవించిన హరనామం!



నాదెండ్ల: హరోం హర... చేదుకో.. కోటయ్య చేదుకో అంటూ భారీ ప్రభలను తీసుకెళ్తున్న భక్తులు నినదించగా.. ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండకు మంగళవారం భారీగా ప్రభలు తరలివెళ్లాయి. అప్పాపురం, అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామ ప్రభలకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామం చివరి వరకూ సాగనంపారు. అప్పాపురం గ్రామ ప్రభ 47వ వార్షికోత్సవం, అమీన్ సాహెబ్‌పాలెం ప్రభ 69వ వార్షికోత్సవాన్ని పూర్తి చేసుకున్నాయి. ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఇనుపగాండ్ల వాహనాలపై ఏర్పాటు చేసిన ప్రభలను గ్రామాల నుంచి 14 కిలోమీటర్ల దూరంలో గల కోటప్పకొండకు తరలించారు. ఒక్కో ప్రభను వెయ్యి మంది కార్యకర్తలు భారీ పంబతాళ్లతో లాక్కెళ్లారు. బుధవారం తెల్లవారుజామున యాటీ సెంటర్ నుంచి త్రికోటేశ్వరుని సన్నిధి వద్ద కేటాయించిన స్థలాలకు చేరుకుంటాయి. అనంతరం విద్యుత్ లైటింగ్‌ను ప్రభలకు అలంకరించనున్నారు. రాత్రి దేదీప్యమానమైన విద్యుత్ కాంతులతో ప్రభలు వెలిగిపోనున్నాయి. సుమారు నెల రోజులుగా ప్రభల నిర్మాణానికి ఆయా గ్రామాల ప్రజలు శ్రమించారు. గత అర్ధశతాబ్దం నుంచి భారీ ప్రభలను సిద్ధం చేసి కోటయ్య సన్నిధికి తరలించటం ఆనవాయితీగా వస్తుంది.

పాఠశాల విద్యలో గత ప్రభుత్వ సంస్కరణలను ముందుకు తీసుకెళ్తారా?

- గవర్నర్ ప్రసంగమంతా గాల్లో మాటలు
- ఎన్నికల హామీల అమలుపై స్పష్టత లేదు
- మండలిలో పీడీఎఫ్ ఐ.వెంకటేశ్వరరావు ధ్వజం

సాక్షి, అమరావతి: సూపర్ సిక్స్‌తో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై గవర్నర్ ప్రసంగంలో స్పష్టత లేదని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు విమర్శించారు. శాసన మండలిలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లు, ఉచిత సిలిండర్ తప్ప ఇతర హామీల ప్రస్తావన ఎక్కడా లేదన్నారు. పాఠశాల విద్యలో గత ప్రభుత్వం చేసిన సంస్కరణలను ముందుకు తీసుకెళ్తుందో లేదో చెప్పలేదని తప్పుబట్టారు. సమాంతర మీడియం, ప్లస్ 2, స్కూల్ స్ట్రక్చరల్ అంశాలకు సంబంధించి మార్పులపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. 'నాడు–నేడు' రెండో దశలో 80–90 శాతం పూర్తయి నిలిచిపోయిన నిర్మాణాలకు నిధులు, మెగా డీఎస్సీ అమలుపై స్పష్టత ఇవ్వాలి. 9 నెలల్లో తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయలేదు. రైతులకు ఇస్తామన్న రూ.20 వేల పెట్టుబడి సాయం మాట మాత్రంగానైనా ప్రస్తావించలేదు. కౌలు రైతు చట్టం గురించి ప్రసంగంలోఎక్కడా లేదు. స్వర్ణాంధ్ర అన్నది పాత మాట. దానికి 2047 తగిలించారు. ఇలాంటి వాటితో ఉపయోగం లేదు' అని విమర్శించారు. ఉద్యోగులకు పీఆర్సీ, ఐఆర్ ప్రస్తావన, డీఏ ఊసే లేదన్నారు. కేంద్ర సాయంతో నడిచే సొసైటీల్లో, స్పాన్సర్డ్ స్కీమ్‌ల్లో ఉన్నవారికి కనీస వేతనం అమలు కాదని జీవో ఇవ్వడం దుర్మార్గంగా ఐ.వెంకటేశ్వరరావు అభివర్ణించారు. ఒక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయాల్సిన బాధ్యత తర్వాత వచ్చిన ప్రభుత్వంపై ఉంటుందని.. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కొనసాగించాలని డిమాండ్ చేశారు.

సవాళ్లను ఎదుర్కొనేలా విద్యార్థులను సిద్ధం చేయాలి

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు

సాక్షి, అమరావతి: ప్రస్తుత విద్యా విధానాలను నవీకరించాల్సిన అవసరం ఉందని విద్యాశాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు అభిప్రాయపడ్డారు. ప్రశ్నాపత్రాలు విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంచేలా ఉండాలని సూచించారు. పాఠశాల విద్యాశాఖ, ప్రభుత్వ పరీక్షల విభాగం సహకారంతో పరఖ్ (పెర్ఫార్మెన్స్ అసెస్‌మెంట్, రివ్యూ అండ్ ఎనాలసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్) ఆధ్వర్యంలో హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు, ప్రామాణిక ప్రశ్నాపత్రాల నమూనాలపై మంగళవారం విజయవాడలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్‌లో సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా సిద్ధం చేయాలని సూచించారు. సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలో కీలకమైన సంస్కరణ హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల అమలని తెలిపారు. ఉపాధ్యాయులే విద్యా మార్పునకు కీలకమైన శక్తి అని, వారి అంకితభావంతో గణనీయమైన అభివృద్ధి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్సెస్సీ పరీక్షల విభాగం డైరెక్టర్ కె.వి.శ్రీనివాసులురెడ్డి, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి, పరఖ్, ఎన్సీఈఆర్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

డీవైఈవో పరీక్ష వాయిదా వేయాలి: టీఎన్‌యూఎస్

సాక్షి, అమరావతి: డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి మార్చి 26, 27 తేదీల్లో నిర్వహించనున్న పరీక్ష షెడ్యూల్‌ను మార్చాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ పరీక్షకు అత్యధికంగా సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులు సిద్ధమవుతున్నారని, ఈ పరీక్ష సమయంలోనే సిబ్బందికి పది, ఇంటర్ పరీక్షల బాధ్యతలున్నందున ఆందోళన చెందుతున్నారని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామిశెట్టి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పైగా ఆయా తేదీల్లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పరీక్షకు కూడా సర్వీస్ కమిషన్ షెడ్యూల్ ప్రకటించిందని గుర్తు చేశారు. రెండు పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు నష్టం జరుగుతుందన్నారు. అలాగే రోస్టర్ సమస్యను సరిచేసి పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు.

సాగుబడి

శతభిష కార్తె మార్చి 4 వరకు

వింగ్డ్ బీన్ (సోఫోకార్పస్ టెట్రాగోనోలోబస్).. ప్రొటీన్లు పుష్కలంగా ఉన్న ఒక రకం చిక్కుడు పంట. మిగతా చిక్కుడు కాయల కన్నా ఇది చాలా విభిన్నంగా ఉంటుంది. ఈ చిక్కుడు కాయకు నాలుగు ముఖాలు ఉంటాయి. అందువల్ల ఈ తీగ జాతి కూరగాయ మొక్కకు 'రెక్కల చిక్కుడు' అని పేరొచ్చింది. ఉష్ణమండల ప్రాంతాల్లో చక్కగా పెరుగుతుంది. ఆసియా దేశాలకు బాగా అనుకూలమైనదైనా, ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల్లో పెద్దగా సాగు చేయని పంట ఇది. ఇది కూరగాయ పంట. ఆకుకూర పంట. దుంప పంట. పప్పు ధాన్యపు పంట కూడా! ప్రతికూల వాతావరణ పరిస్థితులను దీటుగా తట్టుకొని దిగుబడినిచ్చే అద్భుత పంట!!

వింగ్డ్ బీన్

భారత్, బర్మా, శ్రీలంక, ఇండోనేషియా, మలేషియా, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్, చైనా తదితర దేశాల్లో సాగవుతోంది. వింగ్డ్ బీన్స్‌తో కూర చేసుకోవచ్చు. ఎండు చిక్కుడు గింజల కోసం కూడా పెంచవచ్చు.

గాలిలో పుష్కలంగా ఉన్న నత్రజనిని గ్రహించి నేలకు అందించే సామర్థ్యం అన్ని పప్పు ధాన్యపు పంటలకూ ఉంది. దీనికి కొంచెం ఎక్కువగా ఉంది. దీని వేర్లపై ఉండే బుడిపెల ద్వారా నత్రజనిని భూమిలో స్థిరీకరిస్తుంది. దీని ఆకుల్లో కూడా అత్యంత నాణ్యమైన మాంసకృత్తులు ఉంటాయి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు దోహదపడే ఈ చక్కని చిక్కుడు పంటపై మనం పెద్దగా పట్టించుకోవటం లేదు. వింగ్డ్ బీన్‌లో కూడా అనేక రకాల వంగడాలు ఉన్నాయి. అద్భుతమైన ఈ కూరగాయ పంట ప్రతికూల బెట్ట వాతావరణ పరిస్థితులను తట్టుకోగలుగుతుంది. వర్షాధార ప్రాంతాల్లో నివసించే పేద గ్రామీణ కుటుంబాల ఆహారంలో మాంసకృత్తులను తగినంత చేర్చగల శక్తి ఉన్న పంట ఇది. సారం అంతగా లేని భూముల్లో సైతం మంచి దిగుబడినిస్తుంది. పంట పొలాల్లో పంటల జీవవైవిధ్యాన్ని, భూసారాన్ని పెంపొందించడానికి, వాణిజ్యపరంగా ఆదాయం పొందడానికి కూడా వర్షాధార వ్యవసాయంలో వింగ్డ్ బీన్ సాగును ప్రోత్సహించవలసిన అవసరం ఉందని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) పరిశోధన, విస్తరణ సిబ్బందికి సూచించింది. వింగ్డ్ బీన్స్ ప్రజల పళ్లాల్లోకి చేర్చగలిగితే మనుషుల ఆరోగ్యాన్ని మెరుగుపర్చగలమని, పౌష్టికాహార లోపాన్ని పారదోలగలమని ఐసీఏఆర్ ఆశిస్తోంది. కూరగాయ తోటల్లో, ఇంటిపంటల్లో, మిద్దె తోటల్లో సైతం సాగు చేయదగిన మేలుజాతి తీగ జాతి కూరగాయ పంట ఇది.

వన్ స్పీసీస్ సూపర్‌మార్కెట్!

ఐసీఏఆర్ వింగ్డ్ బీన్‌ని 'వన్ స్పీసీస్ సూపర్‌మార్కెట్'గా అభివర్ణించింది. ఆకుపచ్చని కాయలు, ఆకులు, గింజలతో పాటు.. కొంచెం లావుగా పెరిగే దీని వేర్లు కూడా చక్కని పోషకాలతో కూడి ఉండటమే ఇందుకు కారణం. ఆకులను పాలకూర మాదిరిగా పప్పులో వేసుకోవచ్చు. పూలను సలాడ్‌గా తినొచ్చు. దుంప మాదిరిగా ఊరే వేర్లను విడిగా తినొచ్చు లేదా ప్రాసెస్డ్ ఫుడ్స్‌లో కలుపుకోవచ్చు. ఈ తీగ జాతి మొక్క వేగంగా అల్లుకుపోతుంది కాబట్టి సజీవ ఆచ్ఛాదనగా వేసుకోవచ్చు. ప్రధాన పంట మధ్యలో కలుపు పెరగనీయకుండా అంతరపంటగా, పంట మార్పిడి కోసం సాగు చేస్తూ భూసారాన్ని పెంపొందించుకోవచ్చు. ఇది తేలిగ్గా చనిపోదు. ఇతరత్రా ప్రధాన ఆహార పంటలతో పోల్చితే కరువును, వరదను, వేడిని, చీడపీడలను అధికంగా తట్టుకునే శక్తి ఈ పంటకు ఉంది.

ఇది బహు వార్షిక పంట. అయితే, వార్షిక పంటగానే సాగులో ఉంది. ఈ తీగ 3-4 మీటర్ల కన్నా పొడవుగానే పెరుగుతుంది. తీగ సాధారణంగా ఆకుపచ్చగా ఉంటుంది. కొన్ని రకాల వింగ్డ్ బీన్ జాతుల తీగ ఊదా, గులాబీ, గోధుమ రంగుల్లో కూడా ఉంటాయి. పూలు తెలుపు నుంచి ముదురు ఊదా రంగు, నీలం, నీలం తెలుపు కలగలపు రంగుల్లో ఉంటాయి. కాయలు నాలుగు పలకలుగా 15-22 సెం.మీ. పొడవున 2-3 సెం.మీ. వెడల్పున ఉంటాయి. కాయలో 5 నుంచి 20 గుండ్రటి గింజలుంటాయి. ఎండిన తర్వాత ముదురు గోధుమ రంగులో ఉంటాయి.

వింగ్డ్ బీన్ పంటలో ఎక్కువ రకాలు న్యూగినియా, మారిషస్ దేశాల్లో కనిపిస్తాయి. మన దేశంలో అస్సాం, మణిపూర్, మిజోరం, కేరళ, తమిళనాడు, కర్ణాటకల్లో ఎక్కువగా దీన్ని సాగు చేస్తున్నారు. ఉత్తరాది మైదాన ప్రాంతాల్లోనూ మంచి దిగుబడినిస్తున్నట్లు రుజువైంది. తెలుగు రాష్ట్రాల్లో కొంత మందికి తప్ప పెద్దగా ప్రాచుర్యంలోకి రాని పంట ఇది.





పుష్కలంగా పోషక విలువలు

వచ్చే కాలంలో మన ప్రాంతాల్లో కూడా బాగా ప్రాచుర్యంలోకి తేదగిన అద్భుత పోషక విలువలు కలిగిన పంట వింగ్డ్ బీన్. ప్రొటీన్, పీచు, బీకాంప్లెక్స్ విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి. మాంసకృత్తులు, ఖనిజాలు, విటమిన్లు తగుపాళ్లలో వింగ్డ్ బీన్స్‌లో ఉన్నాయి. థయామిన్, పైరిడాక్సయిన్ (విటమిన్ బి-6), నియాసిన్, రిబోఫ్లావిన్ వంటి బికాంప్లెక్స్ విటమిన్లు ఉన్నాయి. ఇనుము, రాగి, మాంగనీసు, కాల్షియం, ఫాస్ఫరస్, మెగ్నీషియం వంటి అవసరమైన ఖనిజాలు ఉన్నాయి. వింగ్డ్ బీన్ ఆకుల్లో పీచు, విటమిన్ ఎ, సి, ఖనిజాలు ఉన్నాయి. వంద గ్రాముల తాజా ఆకుల్లో 45 మిల్లీ గ్రాముల విటమిన్ సి (రోజువారీ అవసరంలో ఇది 75 %), 8090 ఇంటర్నేషనల్ యూనిట్ల (ఐయు) విటమిన్ ఎ (270% ఆర్‌డిఎ) ఉంటాయి.

లేత వింగ్డ్ బీన్ కాయల్లో ఫొలేట్స్ పుష్కలంగా ఉంటాయి. వంద గ్రాముల బీన్స్‌లో 66 మైక్రో గ్రాముల (రోజుకు మనిషికి రోజువారీ అవసరంలో ఇది 16.5%) ఫొలేట్స్ ఉంటాయి. డీఎన్ఏ సంశ్లేషణకు, కణ విభజనకు విటమిన్ బి-12తో పాటు ఫొలేట్స్ అతి ముఖ్యమైనవి. గర్భం దాల్చే సమయం నుంచి ప్రసవం వరకు తల్లికి ఫొలేట్స్ లోపం లేకుండా ఉంటే బిడ్డకు న్యూరల్ ట్యూబ్ డిఫెక్ట్స్ రావు. వంద గ్రాముల తాజా వింగ్డ్ బీన్స్‌లో 18.3 మిల్లీ గ్రాముల (రోజువారీ అవసరంలో 31%) విటమిన్ సి ఉంటుంది. విటమిన్ సి నీటిలో కరిగే యాంటీఆక్సిడెంట్. ఇన్ఫెక్షన్లకు తట్టుకునే రోగనిరోధక శక్తిని కలిగించటంలో తోడ్పడుతుంది. రక్త నాళాలకు సంకోచ వ్యాకోచ గుణాన్ని ఇస్తుంది. ఆహారంలో తగినంతగా తీసుకుంటే కేన్సర్ల నుంచి కూడా రక్షణ కల్పిస్తుంది. వింగ్డ్ బీన్స్ అతి తక్కువ కేలరీలతో కూడిన కూరగాయ. వంద గ్రాముల్లో 49 కేలరీలు మాత్రమే ఉంటాయి.

అతివృష్టినీ తట్టుకుంటుంది!

కరువు కాటకాలను, వరదలను, తీవ్ర ప్రతికూల వాతావరణాన్ని, చీడపీడలను తట్టుకొని దిగుబడినివ్వగలగటం అనే లక్షణం వాతావరణ మార్పుల నేపథ్యంలో మిగతా ప్రధాన పంటలు దెబ్బతిన్న పరిస్థితుల్లో కూడా వింగ్డ్ బీన్స్ నిరాశ పరచదని శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రజలకు ఆహార కొరత, పోష్టికాహార లోపాన్ని సరిదిద్దే క్రమంలో తోడ్పడే పంటగా దీన్ని చాలా ప్రాంతాల్లో విస్తృతంగా సాగు చేయించాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. దీని ఆకులు, కాయలు, గింజలు, దుంపల్లాంటి వేర్లను తినటానికి వీలుంది. మిగిలిన తీగను పశుగ్రాసంగా వాడుకోవచ్చు. నత్రజనిని స్థిరీకరిస్తుంది కాబట్టి పంట మార్పిడికి ముఖ్యమైన పంటగా ఇది గుర్తింపు పొందింది. ఇది ప్రధానంగా స్వీయపరాగ సంపర్క పంట. మహా అయితే 7.6% మేరకు పరపరాగ సంపర్కం జరుగుతున్నట్లు గుర్తించారు. వింగ్డ్ బీన్స్ పంట అనావృష్టిని, అతివృష్టిని కూడా తట్టుకుంటుంది. 700 మిల్లీ మీటర్ల నుంచి 4100 ఎం.ఎం. వార్షిక వర్షపాతాన్ని తట్టుకుంటుంది. ఉష్ణోగ్రత 15.4 - 27.5 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రతను ఇష్టపడుతుంది. మెత్తని దుక్కి చేసి విత్తుకుంటే వేరు వ్యవస్థ విస్తరించడానికి వీలుగా ఉంటుంది. ఇసుక నేలల నుంచి లోతైన రేగడి నేలలు, నీరు నిలబడని ఎర్ర నేలలు, సేంద్రియ పదార్థం బాగా ఉన్న నేలలు అనుకూలం. 4.3-7.5 మధ్య ఉదజని సూచిక ఉన్న నేలలు అనుకూలం. సెప్టెంబర్ మధ్య నుంచి అక్టోబర్ మధ్యలో పూత వస్తుంది. 18 డిగ్రీల కన్నా తక్కువ, 32 డిగ్రీల సెల్షియస్ కన్నా ఎక్కువ ఉష్ణోగ్రత ఉంటే పూత రాదు. సముద్రతలం నుంచి 2,000 మీటర్ల ఎత్తు వరకు గల ప్రాంతాల్లో ఈ పంట బాగా పెరుగుతుంది (హైదరాబాద్ 542 మీ. ఎత్తులో ఉంది). కాబట్టి మన తెలుగు రాష్ట్రాల్లో ఖరీఫ్‌లో విస్తారంగా సాగు చేయటానికి, తోటల్లో అంతర పంటగా సాగు చేయటానికి ఇది అనుకూలమైన పంట.



విత్తుకోవచ్చు. కాండం ముక్క పెట్టినా వస్తుంది. హెక్టారుకు 15-20 కిలోల విత్తనాలు అవసరం. విత్తనం పైన గట్టి పెంకులాంటి పొర ఉంటుంది. 1-2 రోజులు నానబెట్టి, 3-4 సెం.మీ. లోతులో విత్తుకోవాలి. 5-7 రోజుల్లో మొలకెత్తుతుంది. 25 డిగ్రీల సెల్షియస్ పగటి ఉష్ణోగ్రత ఉన్న కాలంలో చక్కగా పెరుగుతుంది. ఉత్తర-దక్షిణ నిలువు పందిళ్లకు తీగలు పాకిస్తే ఎండ బాగా తగిలి బాగా పెరుగుతుంది. కూరగాయ పంటగా సాగు చేసేటప్పుడు 90 సెంటీమీటర్లు (36 అంగుళములు)× 90 సెంటీమీటర్లు దూరంలో విత్తుకోవాలి. విత్తన పంటగా అయితే 45 సెం.మీ.× 45 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి. తీగ 3-4 మీటర్ల కన్నా తక్కువ పెరిగే రకాలైతే 30 సెం.మీ. × 20 సెం.మీ. దూరంలో నాటుకోవచ్చు. రుతుపవనాలు వచ్చిన తర్వాత జూన్-జూలైల్లో నాటుకోవాలి. వింగ్డ్ బీన్ వేరు దుంపలను కూడా ఆహారంగా వాడుతారని చెప్పుకున్నాం కదా. దుంపల కోసం సాగు చేసేటప్పుడు ఆగస్టు-సెప్టెంబర్ మధ్య ఆలస్యంగా విత్తుకుంటే రొట్ట ఎక్కువ పెరగకుండా వేరు ఎక్కువ పెరుగుతుంది.

నత్రజని తక్కువ నేలలైనా..

నత్రజనిని భూమిలో స్థిరీకరిస్తుంది కాబట్టి వింగ్డ్ బీన్స్ పంటను సారం తక్కువగా ఉన్న నేలల్లోనూ విత్తుకోవచ్చు. హెక్టారుకు 20 టన్నుల మాగిన పశువుల ఎరువుతో పాటు 50:80:50 కిలోల ఎన్.పి.కె. ఎరువులు హెక్టారుకు వేసుకోవాలి. నత్రజనిని మాత్రం రెండు భాగాలుగా చేసి, ఒక భాగాన్ని విత్తనానికి ముందు, రెండో భాగాన్ని 40-60 రోజుల మధ్య వేసుకోవాలి.

నెలలోనే కమ్మేస్తుంది!

వింగ్డ్ బీన్స్ తీగ విత్తిన నెల రోజుల్లోనే వేగంగా పెరిగి పొలం అంతా కమ్మేస్తుంది. విత్తిన తర్వాత 15-20 రోజులకు ఒకసారి కలుపు తీస్తే చాలు. వేరు దుంపల కోసం సాగు చేస్తే నేల మీదే పాకించవచ్చు. కూరగాయ పంటగా, విత్తనాల పంటగా సాగు చేసుకుంటే పాదులను ఒక మోస్తరు ఎత్తు గల ఊత కర్రలకు పాకిస్తే కాయలు కోసుకోవటానికి వీలుగా ఉంటుంది. అధిక దిగుబడి వస్తుంది.

తుప్పు తెగులు, ఆకుమచ్చ వంటి శిలీంధ్ర తెగుళ్ల తప్ప మిగతా తీవ్రమైన చీడపీడలేవీ ఈ పంటకు సోకవు. రూట్‌నాట్ నెమటోడ్స్ సమస్య ఉండొచ్చు. అవసరాన్ని బట్టి తగిన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి.

హెక్టారుకు 5-10 టన్నులు

విత్తుకున్న 10 వారాలకు ఆకుపచ్చని వింగ్డ్ బీన్స్ కూరగాయలను కోసుకోవచ్చు. హెక్టారుకు 5-10 టన్నుల వరకు తాజా కాయలతో పాటు అంతే బరువైన వేరు దుంపల దిగుబడి వస్తుంది. విత్తనాలైతే హెక్టారుకు 1 నుంచి 1.5 టన్నుల దిగుబడి వస్తుంది. తాజా వింగ్డ్ బీన్స్ కూరగాయలను ప్లాస్టిక్ బాగ్స్‌లో కట్టి 10 డిగ్రీల సెల్షియస్, 90% తేమ గల చోట నిల్వ చేస్తే 4 వారాల వరకు బాగుంటాయి.


కొత్త పంట

ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకోవటం, పౌష్టిక విలువలతో కూడిన పంట కావటంతో వింగ్డ్ బీన్స్ పంట భవిష్యత్తులో విస్తారంగా సాగులోకి తేవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం సాగవుతున్న రాష్ట్రాల్లో నుంచి అనువైన రకాలను సేకరించి తెలుగు రాష్ట్రాల్లోని ఉద్యాన పరిశోధనా సంస్థలు పరిశోధన చేసి స్థానికంగా రైతులకు విత్తనాలను అందుబాటులోకి తేవాలి. ప్రభుత్వం విధానాల ద్వారా ఈ పంట వ్యాప్తికి దోహదం చేయాలి.

అర్క ఐరన్ ఫార్టిఫైడ్ మష్రూమ్

పుట్టగొడుగులు ఎంతో ఆరోగ్యదాయకమైనవని మనకు తెలుసు. రక్తహీనతకు ఐరన్ లోపం పెద్ద సమస్య. మన దేశంలో ముఖ్యంగా మహిళలు, యుక్తవయసు బాలికలు అధిక శాతంలో రక్త హీనతతో బాధపడుతున్నట్లు సర్వే నివేదికలు చెబుతున్నాయి. ఐరన్ లోపాన్ని అధిగమించేందుకు బెంగళూరులోని (భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి- ఐసీఏఆర్- అనుబంధ సంస్థ) భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐఐహెచ్ఆర్) అధిక పాళ్లలో ఐరన్ కలిగి ఉండే పుట్టగొడుగులను రూపొందించింది. ఐరన్ ఎల్మ్ ఆయిస్టర్ మష్రూమ్‌ను ఉత్పత్తి చేసి, దానితో రసం పొడిని తయారు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవటం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని ఐఐహెచ్ఆర్ చెబుతోంది.

ఎల్మ్ ఆయిస్టర్ పుట్టగొడుగుల్లో సాధారణంగా ఐరన్ 135.60 పిపిఎం స్థాయిలో ఉంటుంది. ఫార్టిఫికేషన్ ప్రక్రియ ద్వారా దీన్ని 338.15 పిపిఎంకు ఐఐహెచ్ఆర్ పెంపొందించింది. అంటే 149.37% పెంచిందన్న మాట. తినే ఆహారంలో ఉన్న పోషకాన్ని కూడా మన దేహం వంటపట్టించుకోగలిగేది తక్కువే ఉంటుంది. సాధారణంగా మొక్కల ఆహారం ద్వారా మనం తీసుకోగలిగే ఐరన్ 5-8% మాత్రమే. అదే ఇన్ఆర్గానిక్ ఐరన్ టాబ్లెట్లు వంటి సప్లిమెంట్ల ద్వారా 10-12% ఐరన్‌ను మాత్రమే మన దేహం తీసుకోగలదు. అయితే, ఐఐహెచ్ఆర్ రూపొందించిన ఆర్క ఐరన్ ఫార్టిఫైడ్ మష్రూమ్ పొడితో రసం తయారు చేసుకొని రోజువారీ భోజనంలో తీసుకుంటే 21.68% ఐరన్‌ను తీసుకోగలుగుతామని ఐఐహెచ్ఆర్ పేర్కొంది. ఐరన్‌తో ఫార్టిఫై చేసిన పుట్టగొడుగుల పొడిని తయారు చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని కుటీర పరిశ్రమగా ఉత్పత్తి చేసి ఉపాధి పొందేందుకు అవకాశం ఉంది.

ఇతర వివరాలకు.. 080-23086100 - ఎక్స్‌టెన్షన్ 348, 349.
mushroomiihr@gmail.com



• ఇన్నొవేషన్

కృషి తంత్ర

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఏర్పాటైన వినూత్న ఇంక్యుబేషన్ కేంద్రం 'అగ్రిహబ్'లో తుది రూపుదిద్దుకున్న వ్యవసాయ సంబంధమైన స్టార్టప్‌లలో 'కృషి తంత్ర' ఒకటి. ఈ స్టార్టప్ పుట్టుపూర్వోత్తరాలు, పనితీరు గురించి క్లుప్తంగా తెలుసుకుందాం...

కర్ణాటకకు చెందిన సందీప్ కొండాజీ కృషి తంత్ర (క్లోనెక్ ఆటోమేషన్ సిస్టమ్స్ ప్రై. లిమిటెడ్) స్టార్టప్‌ను నెలకొల్పారు. సాయిల్ టెక్నాలజీపై ప్రత్యేకంగా పనిచేసే అగ్రి-టెక్ స్టార్టప్ ఇది. సుస్థిర భవిష్యత్తు కోసం అవసరమైన వ్యవసాయ సాంకేతికతను, అందుకు తగిన టూల్స్‌ను అందించాలన్నదే ఈ స్టార్టప్ లక్ష్యం. మట్టి గుణగణాలతో పాటు వ్యవసాయ సమాచారాన్ని ఒకే చోట అందించడం తమ లక్ష్యమని కృషి తంత్ర చెబుతోంది.



మట్టి పరీక్షల ఆధారంగా భూమికి అవసరమైన ఎరువులను తగుమాత్రంగా అందిస్తే 25% ఎరువుల వాడకంతో పాట రైతుకు 25% ఖర్చు తగ్గుతాయని అంచనా. అయితే, మట్టి నమూనాలను పొలంలో సేకరించి లాబ్‌కు తీసుకెళ్లి పరీక్ష ఫలితాలు వచ్చే సరికి పుణ్యకాలం గడచిపోతోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి 'కృషి తంత్ర' 2016-17లో ఏర్పాటైంది. తొలుత ఇంటెల్ వద్ద ఇంక్యుబేట్ అయ్యింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన అగ్రిహబ్‌లోనూ ఇంక్యుబేషన్ సేవలు అందుకుంది. అగ్రి-టెక్ స్టార్టప్ అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి మొబైల్ సాయిల్ టెస్టింగ్ కిట్ 'కృషి రాస్తా' ను రూపొందించింది.



సాంకేతికత: కృషి రాస్తా

పరిష్కారం: పొలంలో మట్టికి సంబంధించిన విశ్లేషణాత్మక సమాచారం సేకరించి సేవలు అందిస్తుంది.

ప్రయోజనాలు: కృషి రాస్తా అనేది మట్టిలోని పోషకాల తీరుతెన్నులను పరీక్షించి విశ్లేషించే పరికరం. మట్టి నమూనాలోని 12 రకాల పోషకాలు ఏ స్థాయిలో ఉన్నాయన్న ఫలితాలను 45-60 నిమిషాల సమయంలో పొందడానికి రూపొందించిన పరికరం ఇది.

కృషి తంత్ర ఆధ్వర్యంలో భూసార పరీక్ష చేయించటం వల్ల ఎంత మోతాదులో ఎరువులు, రసాయనాలు వెయ్యాలో రైతుకు అవగాహన వస్తుంది.

కృషి రాస్తా పరికరం మట్టిని విశ్లేషించి 45 నుంచి 60 నిమిషాల్లో స్థూల, సూక్ష్మపోషకాల నివేదికను, వ్యవసాయ సంబంధిత సమాచారాన్ని అందిస్తుంది.

కేంద్ర ప్రభుత్వం నుంచి కృషితంత్ర డిజిటల్ ఇండియా అవార్డును అందుకుంది. ఐసీఏఆర్- భారతీయ వరి పరిశోధనా సంస్థతో అవగాహన ఒప్పందం చేసుకుంది.

పీసీలకు ఫుల్ డిమాండ్

- 2024లో 3.8 శాతం పెరిగిన షిప్‌మెంట్
- మొత్తం 14.4 మిలియన్ యూనిట్ల రవాణా
- పరిశోధనా సంస్థ ఐడీసీ వెల్లడి



న్యూఢిల్లీ: పర్సనల్ కంప్యూటర్ల (పీసీ)కు 2024లోనూ బలమైన డిమాండ్ కొనసాగింది. వీటి షిప్‌మెంట్ (మార్కెట్‌కు రవాణా) 3.8 శాతం మేర పెరిగింది. మొత్తం 14.4 మిలియన్ యూనిట్ల పీసీల రవాణా జరిగినట్టు మార్కెట్ పరిశోధనా సంస్థ ఐడీసీ ప్రకటించింది. గేమింగ్, ఏఐ ఆధారిత పీసీలకు అధిక డిమాండ్ నెలకొన్నట్టు తెలిపింది. 2025లో పీసీ మార్కెట్ తక్కువ స్థాయి సింగిల్ డిజిట్ వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని ఐడీసీ అంచనా వేసింది. ఈ మేరకు త్రైమాసిక వారీ పీసీ డివైజ్ ట్రాక్ రిపోర్ట్‌ను విడుదల చేసింది. ''రూపాయి బలహీనపడడం పీసీల ధరలు పెరగడానికి దారితీసింది. ఇది చిన్న, మధ్యస్థాయి వ్యాపార సంస్థలతోపాటు, వినియోగ విభాగంపై ప్రభావం చూపించింది''అని ఐడీసీ ఇండియా, దక్షిణాసియా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ (డివైజెస్ రీసెర్చ్) నవకేందర్ సింగ్ ప్రకటించారు.

అగ్రస్థానంలో హెచ్‌పీ

- హెచ్‌పీ గతేడాది 30.1 శాతం పీసీల రవాణాతో (మార్కెట్‌కు) అగ్రస్థానంలో నిలిచింది. గతేడాది డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలంలో ఈ సంస్థ మార్కెట్ వాటా 30 శాతంగా నమోదైంది. వార్షికంగా చూస్తే 1 శాతం, త్రైమాసికం వారీగా చూస్తే 1.8 శాతం చొప్పున రవాణా తగ్గింది.
- లెనోవో సంస్థ 17.2 శాతం పీసీలను రవాణా చేసింది. అంతకుముందు ఏడాదితో పోల్చితే 7.3 శాతం వృద్ధిని నమోదు చేసింది.
- డెల్ 16.1 శాతంతో తర్వాతి స్థానంలో ఉంది. 8.1 శాతం వృద్ధిని చూపించింది. .
- ప్రీమియం నోట్‌బుక్‌ల షిప్‌మెంట్ (1,000 డాలర్లకు పైన ధరలోనివి) గతేడాది 13.8% పెరిగింది.
- అంతర్జాతీయ సంస్థలు, ప్రభుత్వ విభాగాల నుంచి పీసీలకు డిమాండ్ 10.6% మేర పెరిగింది.
- 2024 చివరి మూడు నెలల కాలంలో (అక్టోబర్-డిసెంబర్) మొత్తం పీసీల మార్కెట్ 6.9 శాతం, నోట్‌బుక్ విభాగం 9.6 శాతం మేర వృద్ధి చెందాయి.
- తైవాన్ కంపెనీ ఏసర్ 2024లో 27.7 శాతం మేర షిప్‌మెంట్‌లో వృద్ధిని చూపించింది. 15.1 శాతం మార్కెట్ వాటాను సొంతం చేసుకుంది.
- ఆసుస్ 38.4 శాతం వృద్ధిని డిసెంబర్ త్రైమాసికంలో సాధించింది. అదే కాలంలో లెనోవో 13.5 శాతం అధికంగా షిప్‌మెంట్ చేసి 18.5 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది.
- డెల్ సంస్థ డిసెంబర్ త్రైమాసికంలో 18.1 శాతం మార్కెట్ వాటా కలిగి ఉంది. 5.8 శాతం వృద్ధిని చూపించింది. ఏసర్ కూడా డిసెంబర్ క్వార్టర్‌లో 20% వృద్ధిని నమోదు చేసి, 15.7 శాతం మార్కెట్ వాటాను సొంతం చేసుకుంది.

వర్క్‌స్టేషన్లకు మరింత డిమాండ్.

''సంప్రదాయ పీసీ మార్కెట్ (డెస్క్‌టాప్‌లు, నోట్‌బుక్‌లు, వర్క్‌స్టేషన్లు) 2024లో 14.4 మిలియన్ యూనిట్లను షిప్‌మెంట్ చేసింది. వార్షికంగా 3.8 శాతం వృద్ధి నమోదైంది. విభాగాల వారీగా చూస్తే నోట్‌బుక్‌ల షిప్‌మెంట్ 4.5 శాతం మేర, డెస్క్‌టాప్‌ల షిప్‌మెంట్ 1.8 శాతం మేర అధికంగా జరిగాయి. వర్క్‌స్టేషన్ల షిప్‌మెంట్ రికార్డు స్థాయిలో 10.9 శాతం పెరిగింది. నోట్‌బుక్‌లకు డిమాండ్ బలంగా ఉంది. వాణిజ్య పీసీ మార్కెట్ సైతం తాజా ఆర్డర్లతో పుంజుకుంది''అని ఐడీసీ నివేదిక వెల్లడించింది.

బిజినెస్ రీల్

బవేరియన్ నార్డిక్‌తో బీఈ భాగస్వామ్యం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వ్యాక్సిన్స్ తయారీలో ఉన్న బయొలాజికల్–ఈ (బీఈ) తాజాగా డెన్మార్క్‌కు చెందిన బవేరియన్ నార్డిక్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా తక్కువ, మధ్య ఆదాయ దేశాలలో బవేరియన్ నార్డిక్ తయారీ చికున్‌గున్యా వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెస్తారు. చికున్‌గున్యా వ్యాక్సిన్ తయారీ విధానానికి సంబంధించి సాంకేతికను బీఈకి బదిలీ చేస్తారు. తరువాత దశలో ఔషధానికి వాడే పదార్థాల తయారీ ప్రక్రియను సైతం బదిలీ చేసే అవకాశం ఉంది. హైదరాబాద్ జీనోమ్ వ్యాలీలో ఉన్న బీఈకి చెందిన ప్లాంటులో చికున్‌గున్యా వ్యాక్సిన్‌ను ఉత్పత్తి చేస్తారు. తద్వారా 300 మందికి కొత్తగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని బీఈ ఒక ప్రకటనలో తెలిపింది.

యాక్సిస్ ఫైనాన్స్‌లో వాటాల విక్రయంపై యాక్సిస్ కసరత్తు

బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌పై దృష్టి



న్యూఢిల్లీ: నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కార్యకలాపాలు నిర్వహించే యాక్సిస్ ఫైనాన్స్‌లో మెజారిటీ వాటాలను విక్రయించాలని యాక్సిస్ బ్యాంక్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం అడ్వైజరుతో కూడా బ్యాంకు కలిసి పని చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనిపై ఇంకా సంప్రదింపులు జరుగుతున్నాయని, వాటాల విక్రయంపై నిర్ణయమేదీ తీసుకోలేదని పేర్కొన్నాయి. ఒకవేళ ముందుకెళ్లే పక్షంలో, యాక్సిస్ ఫైనాన్స్‌కి యాక్సిస్ బ్యాంక్ 900 మిలియన్ డాలర్ల నుంచి బిలియన్ డాలర్ల వరకు వేల్యుయేషన్ అడిగే అవకాశం ఉందని వివరించాయి. యాక్సిస్ ఫైనాన్స్ వృద్ధికి బ్యాంకు గణనీయంగా నిధులు సమకూర్చినట్లు ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ జనవరిలో ఒక నివేదికలో తెలిపింది. 2024 ఆర్థిక సంవత్సరంలో ఫైనాన్స్‌కి రూ. 300 కోట్లు అందించినట్లు వివరించింది. యాక్సిస్ ఫైనాన్స్ ప్రధానంగా కార్పొరేట్, రియల్ ఎస్టేట్ రంగాలకు రుణాల సర్వీసులు అందిస్తోంది.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ నిధుల సమీకరణ



న్యూఢిల్లీ: జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ తాజాగా ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ప్రాతిపదికన నాన్–కన్వర్టిబుల్ బాండ్లను జారీ చేయడం ద్వారా రూ.1,100 కోట్లు సమీకరించింది. ఈ బాండ్లకు 5 శాతం కూపన్ రేటుతో 36 నెలల కాలపరిమితి ఉంటుంది.

కేశోరామ్ విడదీత మార్చి1న


- అల్ట్రాటెక్ సిమెంట్ బోర్డ్ నిర్ణయం
- 1:52 నిష్పత్తిలో షేర్ల జారీకి ఓకే



న్యూఢిల్లీ: ఆదిత్య బిర్లా గ్రూప్ సిమెంట్ రంగ దిగ్గజం అల్ట్రాటెక్ బోర్డు కేశోరామ్ ఇండస్ట్రీస్‌కు చెందిన సిమెంట్ బిజినెస్ విడదీతకు నిర్ణయించింది. దీంతో 2025 మార్చి1 నుంచి విడదీత పథకం అమలుకానున్నట్లు అల్ట్రాటెక్ సిమెంట్ పేర్కొంది. దీని ప్రకారం కేశోరామ్ ఇండస్ట్రీస్ నుంచి సిమెంట్ బిజినెస్‌ను విడదీసి అల్ట్రాటెక్ సిమెంట్‌లో విలీనం చేస్తారు. మంగళవారం సమావేశమైన బోర్డు 1:52 నిష్పత్తిలో ఇందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు అల్ట్రాటెక్ వెల్లడించింది. కేశోరామ్ ఇండస్ట్రీస్ వాటాదారులకు తమ వద్ద గల ప్రతీ 52 షేర్లకుగాను 1 అల్ట్రాటెక్ షేరును జారీ చేస్తారు. కేశోరామ్ ప్రిఫరెన్స్ వాటాదారులకు 7.3 శాతంతో 54.86 లక్షల మార్పిడికి వీలుకాని రిడీమబుల్ ప్రిఫరెన్స్ షేర్ల(ఎన్‌సీఆర్‌పీ)ను జారీ చేయనుంది. 90 లక్షల(5 శాతం) క్యుములేటివ్ ఎన్‌సీఆర్‌పీల స్థానే వీటిని కేటాయించనుంది. అంతేకాకుండా 19.19 లక్షల ఆప్షనల్లీ కన్వర్టిబుల్ రిడీమబుల్ ప్రిఫరెన్స్ షేర్ల స్థానే 7.3 శాతంతో 8.64 లక్షల ఎన్‌సీఆర్‌పీలను జారీ చేయనుంది. ఈ పథకానికి 2023 నవంబర్ 30న రెండు కంపెనీల బోర్డులూ ఆమోదముద్ర వేసిన సంగతి తెలిసిందే. ఆపై సీసీఐ, ఎన్‌సీఎల్‌టీ తదితర నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు సైతం లభించాయి. కాగా.. సిమెంట్ బిజినెస్ విడదీత తదుపరి ట్రాన్స్‌పరెంట్ పేపర్, రేయాన్ విభాగాలతో కేశోరామ్ ఇండస్ట్రీస్ కార్యకలాపాలు నిర్వహిస్తుంది. మరోపక్క అల్ట్రాటెక్‌కు వార్షికంగా 7 మిలియన్ టన్నుల సిమెంట్ తయారీ సామర్థ్యం జత కలవనుంది. ప్రస్తుత అల్ట్రాటెక్ సిమెంట్ తయారీ సామర్థ్యం వార్షికంగా 183 మిలియన్ టన్నులుకాగా.. సిమెంట్ తయారీలో చైనా వెలుపల ప్రపంచంలోనే మూడో పెద్ద కంపెనీగా నిలుస్తోంది.

భారత్‌పై టారిఫ్‌ల ప్రభావం తక్కువే

- ఫార్మా, ఫుడ్ రంగాలకు మాత్రమే రిస్క్
- ఆసియా–పసిఫిక్ దేశాలపై మూడీస్ రేటింగ్స్ నివేదిక



న్యూఢిల్లీ: ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని (ఏపీఏసీ) ఇతర దేశాలతో పోలిస్తే ఎగుమతుల కోసం అమెరికాపై భారత్ ఆధారపడటం తక్కువగానే ఉంటోంది కాబట్టి, కొన్ని రంగాలు మినహా చాలా రంగాలపై ప్రతిపాదిత టారిఫ్‌ల ప్రభావం మరీ అంతగా ఉండకపోవచ్చని మూడీస్ రేటింగ్స్ ఒక నివేదికలో పేర్కొంది. ఆహారోత్పత్తులు, జౌళి, ఫార్మా మొదలైన ఉత్పత్తులకు టారిఫ్ రిస్కులు ఉండొచ్చని వివరించింది. తాము రేటింగ్ ఇచ్చే భారతీయ కంపెనీలు చాలా మటుకు దేశీ మార్కెట్‌పైనే ఎక్కువగా ఫోకస్ చేస్తున్నాయని, అవి అమెరికా మార్కెట్‌పై ఆధారపడటం తక్కువేనని పేర్కొంది. టారిఫ్‌ల విషయంలో అమెరికాతో అత్యధిక వ్యత్యాసాలున్న ఏపీఏసీ దేశాల్లో భారత్, వియత్నాం, థాయ్‌లాండ్ మొదలైనవి ఉన్నట్లు వివరించింది. ఎలక్ట్రానిక్స్, మోటర్ సైకిల్స్, ఫుడ్, టెక్స్‌టైల్స్ విభాగాలు ఎక్కువగా అమెరికాపై ఆధారపడి ఉన్నాయని పేర్కొంది. అమెరికాతో వివాదానికి తావివ్వకుండా, ద్వైపాక్షిక చర్చల ద్వారా బేరసారాలాడుకోవడం ద్వారా ప్రభుత్వాలు టారిఫ్‌ల విషయంలో వివేకవంతంగా వ్యవహరించే అవకాశం ఉందని మూడీస్ రేటింగ్స్ తెలిపింది.

కాఫీ డే ఇన్‌సాల్వెన్సీ షురూ

గడువులోగా స్పందించని ఎన్‌సీఎల్‌ఏటీ

న్యూఢిల్లీ: కేఫ్ కాఫీ డే స్టోర్ల సంస్థ కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ దివాలా ప్రక్రియ తిరిగి ప్రారంభంకానుంది. సుప్రీం కోర్టు విధించిన గడువు ఫిబ్రవరి 21లోగా అపిలేట్ ట్రిబ్యునల్ ఎన్‌సీఎల్‌ఏటీ ఎలాంటి ఆదేశాలు జారీ చేయకపోవడంతో ఇన్‌సాల్వెన్సీ ప్రక్రియ తిరిగి మొదలైనట్లు కంపెనీ పేర్కొంది. గత వారం ఎన్‌సీఎల్‌ఏటీ చెన్నై బెంచ్ విచారణ పూర్తిచేసి తీర్పును రిజర్వ్ చేసింది. సస్పెండ్ అయిన కంపెనీ బోర్డు డైరెక్టర్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఎన్‌సీఎల్‌ఏటీ విచారణ చేపట్టింది. అయితే సుప్రీం కోర్టు విధించిన గడువు 2025 ఫిబ్రవరి 21లోగా ఎ లాంటి ఆదేశాలు జారీ చేయకపోవడంతో సీఐఆర్‌పీ నిలుపుదలకు ఎన్‌సీఎల్‌ఏటీ జారీ చేసిన ఉత్తర్వులు రద్దయినట్లు కంపెనీ తెలియజేసింది. ఫలితంగా ఈ నెల 22 నుంచి కార్పొరేట్ రుణ ప్రక్రియకు సంబంధించిన సీఐఆర్‌పీ తిరి గి ప్రారంభమైనట్లు వివరించింది. రిజర్వ్ చేసిన తీర్పును ఎన్‌సీఎల్‌ఏటీ ప్రకటించవలసి ఉంది.

రూ.8.6 లక్షల కోట్ల ఎగుమతులు

- ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్ పరిశ్రమ లక్ష్యంగా పెట్టుకోవాలి
- కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్



న్యూఢిల్లీ: భారత ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ పరిశ్రమ వచ్చే 5–7 ఏళ్లలో ఎగుమతులను 100 బిలియన్ డాలర్లకు (రూ.8.6 లక్షల కోట్లు) పెంచుకునే లక్ష్యంతో పనిచేయాలని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. 2015లో ఎలక్ట్రానిక్స్ గూడ్స్ ఎగుమతులు 167వ ర్యాంక్‌లో ఉంటే, అక్కడి నుంచి రెండో ర్యాంక్‌కు చేరుకున్నట్టు చెప్పారు. జనవరి నెలలో 3 బిలియన్ డాలర్ల ఎలక్ట్రానిక్ వస్తు ఎగుమతులు నమోదు కావడం గమనార్హం. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ తయారీదారుల సంఘం (ఏఈఈఎంఏ) సమావేశంలో భాగంగా మంత్రి గోయల్ మాట్లాడారు. ఎలక్ట్రానిక్స్ గూడ్స్ పరిశ్రమ అధిక నాణ్యత ఉత్పత్తులను, సేవలను ప్రపంచానికి అందించే విధంగా ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. వినియోగదారులకు మెరుగైన ఉత్పత్తి విషయంలో భరోసానిచ్చే విధంగా పరిశ్రమ పనిచేయాలన్నారు. సమిష్టిగా పనిచేస్తే పోటీతత్వాన్ని పెంచుకోవచ్చన్నారు. ఎంఎస్ఎంఈ రంగం, కస్టమర్ల ప్రయోజనాల మధ్య సమతూకాన్ని పాటించాలని పరిశ్రమకు సూచించారు.

మూడేళ్లలో రూ. 2,000 కోట్ల ఆదాయం

ఎనర్జీ సొల్యూషన్స్‌పై గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్ అంచనా

ముంబై: ఎనర్జీ సొల్యూషన్స్ బిజినెస్ ద్వారా రానున్న మూడేళ్లలో రూ. 2,000 కోట్ల టర్నోవర్ సాధించాలని గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్ ఆశిస్తోంది. ఇందుకు డేటా సెంటర్ల వృద్ధి, తదితర అంశాలు దోహదపడతాయని భావిస్తోంది. కంపెనీ సమాచారం ప్రకారం ప్రస్తుతం ఆర్డర్ బుక్ విలువ రూ. 2,400 కోట్లకు చేరింది. ప్రధానంగా 400కేవీ, 765 కేవీ విభాగాలలో శుద్ధ ఇంధన విద్యుత్ ప్రసారంలో కంపెనీ నాయకత్వ స్థాయిని ఇది వెల్లడిస్తున్నట్లు గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్ పేర్కొంది. ఎనర్జీ, డిజిటల్ మౌలిక సదుపాయాలలో భారత్ వేగవంత మార్పులకు లోనవుతున్నట్లు తెలియజేసింది. ప్రధాన నగరాల్లో డేటా సెంటర్ల సామర్థ్యం వార్షికంగా 30 శాతం చొప్పున వృద్ధి చెందనున్నట్లు అంచనా వేసింది. సస్టెయినబుల్ ఎనర్జీ సొల్యూషన్స్‌పై జాతీయస్థాయిలో దృష్టి పెట్టినట్లు పేర్కొంది.

ఎన్‌బీఎఫ్‌సీ, సూక్ష్మ రుణాలకు మరింత మద్దతు!

రిస్క్ వెయిటేజీని తగ్గించిన ఆర్‌బీఐ



ముంబై: బ్యాంకులు మంజూరు చేసే బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు), సూక్ష్మ రుణాలపై రిస్క్ వెయిటేజీని ఆర్‌బీఐ తగ్గించింది. కన్జ్యూమర్ మైక్రోఫైనాన్స్ రుణాలు, ఎన్‌బీఎఫ్‌సీలకు ఇచ్చే రుణాలపై 25 శాతం తగ్గించడంతో రిస్క్ వెయిట్ 100కు దిగొచ్చింది. దీంతో ఆయా రుణాల కోసం బ్యాంకులు పక్కన పెట్టాల్సిన నిధుల పరిమాణం తగ్గుతుంది. తద్వారా బ్యాంకుల లిక్విడిటీ మెరుగవుతుంది. ఆయా విభాగాలకు రుణ వితరణ పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. 2023 నవంబర్‌లో ఎన్‌బీఎఫ్‌సీలు, సూక్ష్మ రుణ సంస్థలకు రిస్క్ వెయిటేజీని ఆర్‌బీఐ పెంచడం గమనార్హం. అప్పటి నుంచి వాటి రుణ వితరణ కుంటుపడింది. ఎన్‌బీఎఫ్‌సీలకు వాణిజ్య బ్యాంకుల రుణాలపై రిస్క్ వెయిట్‌ను 25 శాతం పాయింట్లను పెంచింది. అదే ఏడాది వ్యక్తిగత రుణాలకు సైతం 25 శాతం మేర వెయిట్‌ను పెంచి 125 చేసింది. గృహ రుణాలు, విద్యా రుణాలు, వాహన రుణాలు, బంగారం రుణాలకు మాత్రం మినహాయింపునిచ్చింది. కఠిన నిబంధనలతో ఎన్‌బీఎఫ్‌సీలకు బ్యాంకుల నుంచి రుణాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గణనీయంగా తగ్గిపోయాయి. ఈ పరిస్థితుల్లో ఎన్‌బీఎఫ్‌సీలు, సూక్ష్మ రుణాలకు గతంలో పెంచిన మేర వెయిటేజీని తాజా తగ్గించగా, దీన్ని నిపుణులు స్వాగతిస్తున్నారు.

రష్యా నుంచి రూ.4.45 లక్షల కోట్ల చమురు

- వరుసగా మూడో ఏటా భారత్ కొనుగోలు
- రష్యాకు అండగా నిలిచిన చైనా, భారత్, టర్కీ
- 74 శాతం ఆదాయం ఈ దేశాల నుంచే
- ప్రైవేటు పరిశోధన సంస్థ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం మొదలు పెట్టిన తర్వాత రష్యా నుంచి భారత్ వరుసగా మూడో ఏడాదీ 49 బిలియన్ యూరోల విలువైన (రూ.4.45 లక్షల కోట్లు సుమారు) చమురు కొనుగోలు చేసింది. ఈ వివరాలను ప్రైవేటు పరిశోధనా సంస్థ అయిన సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆర్ఈఏ) నివేదిక రూపంలో వెల్లడించింది. భారత్ సాధారణంగా మిడిల్‌ఈస్ట్ దేశాల నుంచి చమురు సమకూర్చుకుంటుంది. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా దాడి మొదలు పెట్టిన తర్వాత మారిన సమీకరణాలతో.. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ గణనీయంగా పెంచడం గమనార్హం. పాశ్చాత్య దేశాలు ఆర్థిక ఆంక్షలు విధించడం, యూరోపియన్ దేశాలు కొనుగోళ్లను తగ్గించడంతో.. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ కంటే రష్యా చాలా తక్కువ ధరకే చమురును ఆఫర్ చేయడం ఇందుకు కారణం . అంతకుముందు వరకు దేశ చమురు దిగుమతుల్లో రష్యా వాటా ఒక శాతంలోపే ఉండగా.. అక్కడి నుంచి 40 శాతానికి పెరిగాయి. ''రష్యా నుంచి మూడో ఏడాది అత్యధికంగా చైనా 78 బిలియన్ యూరోల చమురు కొనుగోలు చేయగా, భారత్ 49 బిలియన్ యూరోలు, టర్కీ 34 బిలియన్ యూరోల చొప్పున కొనుగోలు చేశాయి. దీంతో రష్యా చమురు ఆదాయాల్లో ఈ మూడు దేశాలు 74 శాతం సమకూర్చాయి''అని సీఆర్ఈఏ తెలిపింది. ఉక్రెయిన్‌పై దాడి ప్రారంభించిన మూడో ఏడాది రష్యాకి శిలాజ ఇంధనాల ద్వారా 242 బిలియన్ యూరోలు, ఉక్రెయిన్‌పై దాడి మొదలు పెట్టిన తర్వాత మొత్తం 847 బిలియన్ యూరోల ఆదాయం లభించినట్టు వెల్లడించింది. ఒకానొక దశలో మార్కెట్ రేటు కంటే బ్యారెల్‌కు 18–20 డాలర్లు తక్కువే చమురును రష్యా ఆఫర్ చేసినట్టు తెలిపింది. దీంతో భార్ తక్కువ రేటుపై చమురును సొంతం చేసుకోగలిగినట్టు పేర్కొంది. అయితే ఇటీవలి కాలంలో రష్యా ఆఫర్ చేసే డిస్కౌంట్ బ్యారెల్‌పై 3 డాలర్లకు తగ్గినట్టు వెల్లడించింది.

యూరప్, జీ7 దేశాలకు ఎగుమతులు

భారత్‌లోని రిఫైనరీలు చౌకగా లభించిన రష్యా ముడి చమురును పెట్రోల్, డీజిల్ ఇంధనాలుగా మార్చి యూరప్, జీ7 దేశాలకు ఎగుమతి చేసినట్టు ఈ నివేదిక తెలిపింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడి ప్రారంభించిన మూడో ఏడాది జీ7 దేశాలు 18 బిలియన్ యూరోల ఆయిల్‌ను భారత్, టర్కీలోని రిఫైనరీల నుంచి కొనుగోలు చేసినట్టు పేర్కొంది. భారత్, టర్కీ రిఫైనరీల నుంచి ఈయూ అతిపెద్ద చమురు దిగుమతిదారుగా నిలిచింది. రిఫైనరీల మొత్తం ఉత్పత్తిలో 13 శాతం ఇలా ఎగుమతి అయినట్టు ఈ నివేదిక తెలిపింది. ఐరోపా యూనియన్‌లో నెదర్లాండ్స్ 3.3 బిలియన్ యూరోలు, ఫ్రాన్స్ 1.4 బిలియన్ యూరోలు, రొమానియా 1.2 బిలియన్ యూరోలు, స్పెయిన్ 1.1 బిలియన్ యూరోల చొప్పున భారత్, టర్కీ రిఫైనరీల నుంచి కొనుగోలు చేసినట్టు పేర్కొంది.

ఇరెడా నిధుల సమీకరణకు ఓకే

క్విప్ ద్వారా రూ. 5,000 కోట్లు



న్యూఢిల్లీ: అర్హతగల సంస్థాగత కొనుగోలుదారులకు ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ. 5,000 కోట్లు సమీకరించేందుకు ప్రభుత్వ రంగ సంస్థ ఇరెడా(ఐఆర్ఈడీఏ) వాటాదారుల నుంచి అ నుమతి పొందింది. సోమవారం నిర్వహించిన 22వ అసాధారణ సర్వసభ్య సమావేశం(ఈజీఎం)లో ప్రతిపాదనకు ఆమోదముద్ర లభించినట్లు ఇరెడా వెల్లడించింది. సంస్థ నిర్వహిస్తున్న ప్రస్తుత కార్యకలాపాలలో వృద్ధిపై దృష్టిపెట్టడంతోపాటు.. ఇతర అవకాశాలను అన్వేషించనున్నట్లు ఈ సందర్భంగా తెలియజేసింది.

మెగా ఫైన్ ఫార్మాలో మోతీలాల్ పెట్టుబడి



ముంబై: మోతీలాల్ ఓస్వాల్ ఆల్టర్నేట్స్ తాజాగా మెగా ఫైన్ ఫార్మాలో మెజారిటీ వాటాకై రూ.460 కోట్ల పెట్టుబడి చేసినట్టు ప్రకటించింది. ఎగుమతులు ప్రధానంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ ఏపీఐ కంపెనీలో వాటాను పెంచుకునేందుకు సంస్థ ప్రమోటర్లు అయిన సంఘ్వీ కుటుంబం సైతం పెట్టుబడి పెట్టింది. ముంబై కేంద్రంగా మెగా ఫైన్ 1995లో ఏర్పాటైంది. సంస్థకు మహారాష్ట్రలోని నాసిక్, గుజరాత్‌లోని వాపి వద్ద యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన తయారీ కేంద్రాలున్నాయి. దీర్ఘకాలిక చికిత్సల కోసం విలువైన యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియెంట్స్‌ను తయారు చేస్తోంది.

ఈక్విటీ డెరివేటివ్స్‌పై సెబీ ఫోకస్

ట్రేడింగ్‌కు ప్రోత్సాహం, రిస్కుల పర్యవేక్షణకు చర్యలు



న్యూఢిల్లీ: ఈక్విటీ డెరివేటివ్స్ మార్కెట్లో సరళతర లావాదేవీల నిర్వహణకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చర్యలు చేపట్టనుంది. అంతేకాకుండా రిస్క్ పర్యవేక్షణను పటిష్టపరచడం ద్వారా సమర్థవంత లావాదేవీలకు తెరతీయనుంది. దీనిలో భాగంగా ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్(ఎఫ్అండ్‌వో) ఓపెన్ ఇంటరెస్ట్(ఓఐ)పై రియల్‌టైమ్ పర్యవేక్షణకు శ్రీకారం చుట్టనుంది. ఇందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వీటిపై మార్చి 17వరకూ ప్రజల నుంచి అభిప్రాయాలను కోరుతోంది. ప్రతిపాదనలను అమలు చేస్తే మరింతగా సమాచార ఆధారిత నిర్ణయాలు తీసుకునేందుకు మార్కెట్ పార్టిసిపెంట్లకు వీలు ఏర్పడుతుంది. తద్వారా రిస్కులను మరింత సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు అవకాశమేర్పడుతుంది.

రియల్‌టైమ్‌లో

సెబీ రూపొందించిన తాజా ప్రతిపాదనల ప్రకారం మార్కెట్ పార్టిసిపెంట్లు ఇంట్రాడే స్నాప్‌చాట్స్ ద్వారా రియల్‌టైమ్ ఎఫ్అండ్‌వో ఓఐ సంబంధిత సమాచారాన్ని అందుకోగలుగుతారు. ఇది రిస్కులను సమర్ధవంతంగా ఎదుర్కోవడంలో సహకరించడంతోపాటు.. ఉత్తమ నిర్ణయాలు తీసుకునేందుకు దారి చూపిస్తుంది. సెబీ సిద్ధం చేసిన కన్సల్టేషన్ పేపర్ ప్రకారం డెరివేటివ్స్‌లో మ్యూచువల్ ఫండ్స్(ఎంఎఫ్), ఆల్టర్నేటివ్ ఫండ్స్(ఏఐఎఫ్) చేపట్టే లావాదేవీల(ఎక్స్‌పోజర్) పరిమితులలో సవరణలకు తెరలేవనుంది. ఫ్యూచర్స్ ఎక్స్‌పోజర్ మదింపులో ఎలాంటి మార్పులు ఉండవు. అయితే ఆప్షన్స్(లాంగ్ అండ్ షార్ట్) ఎక్స్‌పోజర్‌లో సవరణలు చోటు చేసుకోనున్నాయి. వీటి ప్రకారం ఫ్యూచర్ ఈక్వివాలెంట్ లేదా డెల్టా ప్రాతిపదికన వీటిని మదింపు చేస్తారు. తద్వారా ఇవి మార్కెట్ కదలికల(సెన్సిటివిటీ)ను సమర్థవంతంగా ప్రతిఫలిస్తాయి.

సవరణల బాటలో

ప్రస్తుతం విభిన్న పద్ధతుల్లో ఎఫ్అండ్‌వో ఎక్స్‌పోజర్లను మదింపు చేస్తున్నారు. ఫ్యూచర్స్ పొజిషన్ల ఆధారంగా, షార్ట్ ఆప్షన్స్‌ను నోషనల్ విలువ ద్వారా, లాంగ్ ఆప్షన్స్ అయితే ప్రీమియం చెల్లింపు ద్వారా మదింపు చేస్తున్నారు. కాగా.. మార్కెట్ రిస్కులను మరింతగా ప్రతిఫలించేలా ఇండెక్స్ డెరివేటివ్స్‌కు సెబీ కొత్త పొజిషన్ పరిమితులను ప్రతిపాదించింది. ఇండెక్స్ ఆప్షన్స్‌కు రోజువారీ ముగింపులో నికర విలువ రూ. 500 కోట్లు, స్థూలంగా రూ. 1,500 కోట్లవరకూ అనుమతించనుండగా.. ఇంట్రాడేకు నికరంగా రూ. 1,000 కోట్లు, స్థూలంగా రూ. 2,500 కోట్లు చొప్పున పరిమితులు అమలుకానున్నాయి. ఇక ఇండెక్స్ ఫ్యూచర్స్‌కు రోజువారీ ముగింపు పరిమితి రూ. 500 కోట్ల నుంచి రూ. 1,500 కోట్లకు పెరగనుంది. రూ. 2,500 కోట్ల ఇంట్రాడే పరిమితి ఇందుకు అమలుకానుంది. తాజా ప్రతిపాదనలు విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు), ఎంఎఫ్‌లు, ట్రేడర్లు, క్లయింట్లతోపాటు మార్కెట్ పార్టిసిపెంట్లు అందరికీ అమలుకానున్నాయి. అయితే నిజంగా హోల్డింగ్స్ కలిగిన పొజిషన్లకు మినహాయింపులు లభించనున్నాయి. స్టాక్స్ కలిగిన షార్ట్ పొజిషన్లు, నగదు కలిగిన లాంగ్ పొజిషన్లకు మినహాయింపులు వర్తించనున్నాయి.



ఏవోపీలకూ డీమ్యాట్ ఖాతా

అనుమతించిన సెబీ

అసోసియేషన్స్ ఆఫ్ పర్సన్స్ (ఏవోపీ) సైతం తమ పేరిట డీమ్యాట్ ఖాతాలు తెరిచేందుకు సెబీ అనుమతించింది. తద్వారా డీమ్యాట్ ఖాతాల్లో కార్పొరేట్ బాండ్లు, ప్రభుత్వ సెక్యూరిటీలు, మ్యూచువల్ ఫండ్ యూనిట్లను కలిగి ఉండొచ్చని ప్రకటించింది. ఈ డీమ్యాట్ ఖాతాల్లోకి ఈక్విటీ షేర్లను అనుమతించేది లేదని స్పష్టం చేసింది. వచ్చే జూన్ 2 నుంచి కొత్త నిబంధన అమల్లోకి రానుందని సెబీ తెలిపింది. ఏవోపీల పేరిట నేరుగా డీమ్యాట్ ఖాతాలు తెరిచేందుకు అనుమతించాలంటూ అభ్యర్థనలు రావడంతో సెబీ ఈ నిర్ణయం తీసుకుంది. డీమ్యాట్ ఖాతా తెరవాలనుకుంటే ఏవోపీ పాన్ వివరాలు, ప్రిన్సిపల్ ఆఫీసర్ వివరాలు అందించాల్సి ఉంటుంది. వ్యక్తులు, సంస్థల మధ్య జాయింట్ వెంచర్లు, భాగస్వామ్య సంస్థలు, కోపరేటివ్ సొసైటీలు ఇలాంటివన్నీ ఏవోపీ కిందకు వస్తాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-2-2025

విశాఖ	480-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	480-00
విజయవాడ	485-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	445-00
వరంగల్	447-00
రిటైల్ ధర	5.05

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BHARTIARTL	1,638.45	2.32
M&M	2,767.00	2.13
BAJFINANCE	8,472.00	1.4
NESTLEIND	2,250.50	1.36
TITAN	3,200.75	0.87

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
DRREDDY	1,128.50	-3.1
HINDALCO	622.55	-3.01
TRENT	4,944.00	-2.41
HEROMOTOCO	3,817.85	-1.72
SUNPHARMA	1,611.55	-1.7

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,219
ఎన్ఎస్ఈ	75,030
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,23,811
ఎఫ్ఐఐ	- 3.529
డీఐఐ	+ 3.031

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.96 (రాత్రి 11.30కు)	$ 70.07 (క్రితం ముగింపు)
బ్రెంట్	72.51 (రాత్రి 11.30కు)	$ 74.31 (క్రితం ముగింపు)

పోరాడి ఓడిన మానస్, కరణ్



బెంగళూరు: 'వైల్డ్ కార్డు'తో బరిలోకి దిగిన మానస్ ధామ్నె, రామ్‌కుమార్ రామనాథన్... 'క్వాలిఫయర్' హోదాలో అడుగు పెట్టిన కరణ్ సింగ్... బెంగళూరు ఓపెన్ ఏటీపీ–125 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో తొలి రౌండ్‌ను దాటలేకపోయారు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో మానస్ ధామ్నె 3–6, 6–3, 6–7 (3/7)తో పీటర్ బార్ బిర్యుకోవ్ (రష్యా) చేతిలో... కరణ్ సింగ్ 4–6, 6–4, 6–7 (3/7)తో జురిజ్ రొడియోనోవ్ (ఆస్ట్రియా) చేతిలో... రామ్‌కుమార్ రామనాథన్ 6–7 (3/7), 5–7తో షింటారో మొచిజుకి (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయారు. బిర్యుకోవ్‌తో 1 గంట 51 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో 17 ఏళ్ల మానస్ తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. అయితే టైబ్రేక్‌లో మానస్ తడబడి మూల్యం చెల్లించుకున్నాడు. రొడియోనోవ్‌తో 1 గంట 57 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో కరణ్ 11 ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. నిర్ణాయక టైబ్రేక్‌లో కరణ్ ఒత్తిడికి లోనై ఓటమి పాలయ్యాడు. షింటారోతో 1 గంట 48 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో రామ్ 14 ఏస్‌లు సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టుకు ఆరో విజయం


కాస్టనెడా

ఫటోర్డా (గోవా): ఐ–లీగ్ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు ఆరో విజయం నమోదు చేసింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 3–2 గోల్స్ తేడాతో డెంపో స్పోర్ట్స్ క్లబ్ జట్టును ఓడించింది. విరామ సమయానికి 0–2 గోల్స్‌తో వెనుకబడ్డ శ్రీనిధి జట్టు రెండో అర్ధభాగంలో అదరగొట్టింది. 16 నిమిషాల వ్యవధిలో మూడు గోల్స్ సాధించి డెంపో జట్టుకు షాక్ ఇచ్చింది. శ్రీనిధి జట్టు సీనియర్ ప్లేయర్ డేవిడ్ కాస్టనెడా మునోజ్ (53వ, 59వ నిమిషంలో) రెండు గోల్స్ చేయగా... బ్రాండన్ వన్‌లాల్‌రెమ్‌డికా (69వ నిమిషంలో) ఒక గోల్ సాధించాడు. డెంపో జట్టుకు మార్కస్ జోసెఫ్ (8వ నిమిషంలో), యువాన్ మెరా (45+3వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. మార్చి 2న హైదరాబాద్‌లోని డెక్కన్ ఎరీనాలో జరిగే తదుపరి మ్యాచ్‌లో నామ్‌ధారి ఎఫ్‌సీ జట్టుతో శ్రీనిధి జట్టు తలపడుతుంది. 12 జట్లు పోటీపడుతున్న ఐ–లీగ్‌లో శ్రీనిధి జట్టు 16 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. 6 మ్యాచ్‌ల్లో నెగ్గిన శ్రీనిధి జట్టు... 4 మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, మరో 6 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ప్రస్తుతం శ్రీనిధి జట్టు 22 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉంది.



రంజీ రారాజు ఎవరో?

నేటి నుంచి దేశవాళీ క్రికెట్ టోర్నీ ఫైనల్

కేరళతో విదర్భ అమీతుమీ

ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియోహాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం


సచిన్ బేబీ

కేరళ ఫైనల్ చేరిందిలా...

- పంజాబ్‌పై 8 వికెట్ల తేడాతో విజయం
- కర్ణాటకతో మ్యాచ్ 'డ్రా'
- బెంగాల్‌తో మ్యాచ్ 'డ్రా'
- ఉత్తరప్రదేశ్‌పై ఇన్నింగ్స్ 117 పరుగులతో గెలుపు
- హరియాణాపై తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం
- మధ్యప్రదేశ్‌పై తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం
- బిహార్‌పై ఇన్నింగ్స్ 169 పరుగులతో విజయం
- క్వార్టర్స్‌లో జమ్మూకశ్మీర్‌పై తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం
- సెమీస్‌లో గుజరాత్‌పై తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం


అక్షయ్ వాడ్కర్

విదర్భ ఫైనల్ చేరిందిలా...

- ఆంధ్రపై 74 పరుగుల తేడాతో గెలుపు
- పుదుచ్చేరిపై 120 పరుగుల తేడాతో విజయం
- ఉత్తరాఖండ్‌పై 266 పరుగుల తేడాతో గెలుపు
- హిమాచల్ ప్రదేశ్‌పై ఇన్నింగ్స్88 పరుగులతో విజయం
- గుజరాత్‌పై తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం
- రాజస్తాన్‌పై 221 పరుగులతో గెలుపు
- హైదరాబాద్‌పై 58 పరుగులతో విజయం
- క్వార్టర్స్‌లో తమిళనాడుపై 198 పరుగులతో గెలుపు
- సెమీస్‌లో ముంబైపై 80 పరుగులతో విజయం

నాగ్‌పూర్: దేశవాళీ ప్రతిష్టాత్మక క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీ చివరి అంకానికి చేరింది. బుధవారం నుంచి జరగనున్న 2024–25 రంజీ ట్రోఫీ సీజన్ ఫైనల్లో కేరళతో రెండుసార్లు చాంపియన్ విదర్భ అమీతుమీ తేల్చుకోనుంది. గతేడాది ఫైనల్లో ముంబై చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన విదర్భ జట్టు... ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ కప్పు చేజిక్కించుకోవాలని చూస్తుంటే... తొలిసారి రంజీ ఫైనల్‌కు చేరిన కేరళ జట్టు అద్భుతాన్ని ఆశిస్తోంది. తాజా సీజన్‌లో ఇరు జట్లు నిలకడైన ప్రదర్శన కనబర్చగా... అక్షయ్ వాడ్కర్ సారథ్యంలోని విదర్భ పూర్తి ఆధిపత్యం కనబర్చింది. ఫైనల్ చేరే క్రమంలో విదర్భ ఆడిన 9 మ్యాచ్‌ల్లో ఎనిమిదింట విజయం సాధించింది. గ్రూప్ దశలో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో ఆరింట గెలుపొందిన విదర్భ... క్వార్టర్ ఫైనల్లో తమిళనాడును చిత్తు చేసింది. ఇక డిఫెండింగ్ చాంపియన్ ముంబైతో జరిగిన సెమీఫైనల్లో విజృంభించిన విదర్భ... స్టార్‌లతో కూడిన ముంబైకి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా విజృంభించి ఫైనల్‌కు చేరింది. ఈ క్రమంలో నిరుడు ఫైనల్లో ముంబై చేతిలో ఎదురైన పరాజయానికి బదులు తీర్చుకుంది. సుదీర్ఘ చరిత్ర ఉన్న రంజీ ట్రోఫీలో ఇది 90వ సీజన్ కాగా... విదర్భ జట్టుకిది నాలుగో ఫైనల్. గతంలో 2017–18, 2018–19 సీజన్‌లలో వరుసగా రెండుసార్లు చాంపియన్‌గా నిలిచిన ఆ జట్టు... గతేడాది ఫైనల్లో ఓడి రన్నరప్‌గా నిలిచింది. అప్పటి నుంచి సుదీర్ఘ ఫార్మాట్‌లో విదర్భ జట్టు నిలకడగా విజయాలు సాధిస్తోంది. ఈ సీజన్‌లో విజయ్ హజారే ట్రోఫీలో కూడా విదర్భ జట్టు ఫైనల్‌కు చేరింది. మరోవైపు తొలిసారి తుదిపోరుకు అర్హత సాధించిన కేరళ సమష్టి కృషితోనే టైటిల్ చేజిక్కించుకోవాలని చూస్తోంది.

బ్యాటింగే బలంగా...

తాజా సీజన్‌లో ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తు చేసిన విదర్భ జట్టు... బ్యాటింగే ప్రధాన బలంగా ఫైనల్ బరిలోకి దిగనుంది. కెప్టెన్ అక్షయ్ వాడ్కర్, కరుణ్ నాయర్, అథర్వ తైడే, ధ్రువ్ షోరే, యశ్ రాథోడ్, దానిశ్ మాలేవర్‌తో విదర్భ బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా ఉంది. 933 పరుగులు చేసిన యశ్ రాథోడ్ విదర్భ తరఫున అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా కొనసాగుతున్నాడు. 5 సెంచరీలు, 3 అర్ధసెంచరీలతో విజృంభించిన యశ్... 58.13 సగటుతో ఈ పరుగులు రాబట్టడం విశేషం. సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్ల జాబితాలో యశ్ ప్రస్తుతం మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. వికెట్ కీపర్, కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ కూడా మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటి వరకు అతడు 48.14 సగటుతో 674 పరుగులు చేసి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. అందులో 2 సెంచరీలు, 2 అర్ధసెంచరీలు ఉన్నాయి. ఇక ఫార్మాట్‌తో సంబంధం లేకుండా చెలరేగుతున్న సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్ 8 మ్యాచ్‌లాడి 45.85 సగటుతో 642 పరుగులు సాధించాడు. అందులో 3 సెంచరీలు, 1 హాఫ్ సెంచరీ ఉంది. దానిశ్ మాలేవర్ (557 పరుగులు), ధ్రువ్ షోరే (446 పరుగులు) కూడా రాణించారు. బ్యాటింగ్‌లో టాపార్డర్ సమష్టిగా కదంతొక్కుతుంటే... బౌలింగ్‌లో 22 ఏళ్ల హర్ష్ దూబే సంచలన ప్రదర్శన కనబరుస్తున్నాడు. 9 మ్యాచ్‌ల్లో 66 వికెట్లు పడగొట్టిన హర్ష్... ఒక రంజీ సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా చరిత్రకెక్కాడు. గతంలో ఈ రికార్డు అశుతోశ్ అమన్ (2018–19 సీజన్‌లో 68 వికెట్లు; బిహార్) పేరిట ఉంది. హర్ష్‌తో పాటు దర్శన్ నల్కండే, నచికేత్ భూటె, పార్థ్ రెఖడే బౌలింగ్‌లో కీలకం కానున్నారు. ఈ బౌలింగ్ దాడిని కాచుకుంటూ పరుగులు రాబట్టాలంటే కేరళ జట్టు శక్తికి మించి పోరాడక తప్పదు.

సమష్టి కృషితో...

స్టార్ ఆటగాళ్లు లేకపోయినా... సమష్టి ప్రదర్శనతోనే కేరళ జట్టు ఫైనల్లో అడుగుపెట్టింది. లీగ్ దశలో 3 మ్యాచ్‌లు గెలిచి మరో రెండు మ్యాచ్‌ల్లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకున్న సచిన్ బేబీ సారథ్యంలోని కేరళ జట్టు... రెండు మ్యాచ్‌లు రద్దు కావడంతో గ్రూప్ 'సి'లో రెండో స్థానంతో నాకౌట్‌కు చేరింది. అయితే క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్లో మాత్రం కేరళ అసాధారణ పోరాటం కనబర్చింది. జమ్మూకశ్మీర్‌తో జరిగిన క్వార్టర్స్ మ్యాచ్‌లో ఒక్క పరుగు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ముందంజ వేసిన కేరళ... సెమీఫైనల్లో మాజీ చాంపియన్ గుజరాత్‌పై రెండు పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో గట్టెక్కింది. మిడిలార్డర్ బ్యాటర్లు సల్మాన్ నిజార్, మొహమ్మద్ అజహరుద్దీన్ జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించారు. నిజార్ 86.71 సగటుతో 607 పరుగులు చేశాడు. అందులో 2 సెంచరీలు, 3 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అజహరుద్దీన్ 75.12 సగటుతో 601 పరుగులు చేశాడు. అందులో ఒక శతకం, 4 అర్ధశతకాలు ఉన్నాయి. క్వార్టర్స్‌లో, సెమీస్‌లో ఈ జంట అసమాన పోరాటం వల్లే కేరళ జట్టు తుదిపోరుకు అర్హత సాధించింది. గంటలకు గంటలు క్రీజులో పాతుకుపోయి ప్రత్యర్థి బౌలర్లపై మానసికంగా పైచేయి సాధించడంలో అజహరుద్దీన్, నిజార్‌ది అందెవేసిన చేయి. వీరితో పాటు జలజ్ సక్సేనా, సచిన్ బేబీ, రోహన్ కున్నుమ్మల్, అక్షయ్ చంద్రన్ కూడా కలిసికట్టుగా రాణిస్తే కేరళకు తిరుగుండదు. బౌలింగ్‌లో సీనియర్ ఆల్‌రౌండర్ జలజ్ సక్సేనా తాజా సీజన్‌లో 38 వికెట్లు పడగొట్టాడు. ఆదిత్య సర్వతే (30 వికెట్లు) కూడా ఫామ్‌లో ఉన్నాడు. నిధీశ్, బాసిల్ పేస్ బౌలింగ్ భారం మోయనున్నారు.



హారిక గేమ్ డ్రా

మోంటెకార్లో: మొనాకో మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఖాతాలో వరుసగా ఐదో 'డ్రా' చేరింది. బత్కుయాగ్ ముంగుంతుల్ (మంగోలియా)తో మంగళవారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌ను హారిక 34 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. పది మంది మేటి క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. ఏడో రౌండ్ తర్వాత హారిక 2.5 పాయింట్లతో తొమ్మిదో స్థానంలో ఉంది. తొలి రౌండ్‌లో కోనేరు హంపి చేతిలో, రెండో రౌండ్‌లో సరాసదత్ (స్పెయిన్) చేతిలో ఓడిపోయిన హారిక... మూడో రౌండ్ నుంచి ఏడో రౌండ్ వరకు తమ ప్రత్యర్థులతో గేమ్‌లను 'డ్రా' చేసుకుంది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి తొలి ఓటమి చవిచూసింది. అలెగ్జాండ్రా గొర్యాక్‌చినా (రష్యా)తో జరిగిన ఆరో రౌండ్ గేమ్‌లో హంపి 62 ఎత్తుల్లో ఓడిపోయింది.

మెయిన్ 'డ్రా'కు తరుణ్ అర్హత



ముల్హీమ్: జర్మన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నేపల్లి మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 59వ స్థానంలో ఉన్న తరుణ్ క్వాలిఫయింగ్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలుపొందాడు. తొలి రౌండ్‌లో తరుణ్ 21–11, 22–20తో లియావో జు ఫు (చైనీస్ తైపీ)పై నెగ్గగా... రెండో రౌండ్‌లో 21–14, 16–21, 21–11తో మిషా జిల్బెర్‌మన్ (ఇజ్రాయెల్)ను ఓడించాడు. మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో డెన్మార్క్ ప్లేయర్ మాగ్నస్ జొహాన్నెసెన్‌తో తరుణ్ ఆడతాడు. భారత్‌కే చెందిన శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్, రిత్విక్ సతీశ్ కుమార్ మెయిన్ 'డ్రా'కు చేరుకోవడంలో విఫలమయ్యారు. రెండో రౌండ్‌లో శంకర్ 23–21, 14–21, 9–21తో అర్నాడ్ మెర్కెల్ (ఫ్రాన్స్) చేతిలో, తొలి రౌండ్‌లో రిత్విక్ 19–21, 11–21తో దుబోవెంకో (ఇజ్రాయెల్) చేతిలో ఓడిపోయారు. మహిళల సింగిల్స్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఉన్నతి హుడా 21–13, 21–16తో తాత్రనోవా (ఫ్రాన్స్)పై నెగ్గి మెయిన్ 'డ్రా'కు అర్హత పొందింది.

గెలిచిన జట్టే నిలుస్తుంది

నేడు ఇంగ్లండ్, అఫ్గానిస్తాన్ పోరు

- మధ్యాహ్నం గం. 2:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియోహాట్‌స్టార్‌లో


బట్లర్
హష్మతుల్లా

లాహోర్: ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో ముందుకెళ్లేందుకు ఇంగ్లండ్ కీలకమైన పోరుకు సిద్ధమైంది. బుధవారం జరిగే మ్యాచ్‌లో బట్లర్ బృందం అఫ్గానిస్తాన్‌తో తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టే సెమీస్ రేసులో ఉంటుంది. ఓడిన జట్టు ఇంటిదారి పట్టాల్సిందే. తొలి మ్యాచ్‌లో ఆ్రస్టేలియాపై 350 పైచిలుకు స్కోరు చేసినా బౌలింగ్ వైఫల్యంతో ఓడిన ఇంగ్లండ్... లోపాల్ని సవరించుకొని అఫ్గాన్‌తో సమరానికి సిద్ధమైంది. ఓపెనర్ బెన్ డకెట్, జో రూట్, కెప్టెన్ బట్లర్, ఆర్చర్‌లు జోరు మీదున్నారు. రషీద్ ఖాన్, నూర్ అహ్మద్, నబీలతో కూడిన ప్రత్యర్థి స్పిన్ త్రయంపై జాగ్రత్తగా ఆడితే పరుగుల వరద పారించొచ్చు. వుడ్, ఆదిల్ రషీద్, లివింగ్‌స్టోన్‌లతో ఉన్న బౌలింగ్ దళం పరుగుల నిరోధంపై దృష్టి పెట్టాల్సి ఉంది. మరోవైపు అఫ్గానిస్తాన్ తొలి పోరులో దక్షిణాఫ్రికాతో ఘోరంగా ఓడింది. సఫారీకి 300 పైచిలుకు పరుగులు సమర్పించుకున్న అఫ్గాన్ కనీసం 50 ఓవర్ల కోటా కూడా ఆడలేక 208 పరుగులకే కుప్పకూలింది. టాపార్డర్‌లో గుర్బాజ్, జద్రాన్, సిద్ధిఖుల్లా వైఫల్యం జట్టుకు ఇబ్బందిగా మారింది. రహ్మత్ షా ఒక్కడే బాధ్యత కనబరిచాడు. కీలకమైన పోరులో జట్టంతా కలిసి సమష్టిగా సర్వశక్తులు ఒడ్డితేనే గట్టి ప్రత్యర్థి ఇంగ్లండ్‌ను ఎదుర్కోవచ్చు లేదంటే ఏ ఒక్కరిద్దరి ప్రదర్శనను నమ్ముకుంటే మాత్రం గత ఫలితమే మళ్లీ పునరావృతం అవుతుంది.

తుది జట్లు (అంచనా)

ఇంగ్లండ్: బట్లర్ (కెప్టెన్), సాల్ట్, డకెట్, జేమీ స్మిత్, రూట్, హ్యారీ బ్రూక్, లివింగ్‌స్టోన్, కార్స్, ఆర్చర్, ఆదిల్ రషీద్, మార్క్ వుడ్.

అఫ్గానిస్తాన్: హష్మతుల్లా (కెప్టెన్), గుర్బాజ్, జద్రాన్, సిద్ధిఖుల్లా, రహ్మత్ షా, అజ్మతుల్లా, నబీ, గుల్బదిన్, రషీద్ ఖాన్, నూర్ అహ్మద్, ఫజల్‌హక్.

3 ఇప్పటి వరకు వన్డే ఫార్మాట్‌లో ఇంగ్లండ్, అఫ్గానిస్తాన్ జట్లు ముఖాముఖిగా మూడు సార్లు తలపడ్డాయి. వరల్డ్‌కప్ టోర్నీ సందర్భంగానే ఈ మూడు మ్యాచ్‌లు జరిగాయి. ఇంగ్లండ్ (2015, 2019లలో) రెండుసార్లు, అఫ్గానిస్తాన్ (2023లో) ఒకసారి గెలుపొందాయి.

లక్ష్యసేన్‌కు ఊరట

భారత స్టార్ షట్లర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కర్ణాటక పోలీసులకు సుప్రీంకోర్టు ఆదేశం




న్యూఢిల్లీ: నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు సమర్పించారనే ఆరోపణలకు చెందిన అంశంలో... భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్‌తో పాటు అతడి కుటుంబ సభ్యులు, కోచ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. తప్పుడు సమాచారంతో లక్ష్యసేన్ ఏజ్ గ్రూప్ టోర్నీల్లో పాల్గొన్నాడనే ఫిర్యాదుపై కర్ణాటక హైకోర్టు విచారణకు ఆదేశించగా... ఈ అంశంలో ఎలాంటి చర్యలు తీసుకోవద్దని దేశ అత్యున్నత న్యాయస్థానం స్టే విధించింది. జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం... లక్ష్యసేన్ కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేసిన ఎంజీ నాగరాజ్‌తో పాటు కర్ణాటక ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. లక్ష్యసేన్ తరఫున న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్లను కర్ణాటక హైకోర్టు ఈ నెల 19న తిరస్కరించింది. దీన్ని సవాలు చేస్తూ లక్ష్యసేన్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. దేశ అత్యున్నత న్యాయస్థానం విచారిస్తోంది. అంతకుముందు ఈ కేసు దర్యాప్తునకు అవసరమైన ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని కర్ణాటక హైకోర్టు తీర్పునిచ్చింది. లక్ష్యసేన్ తల్లిదండ్రులు నిర్మల, ధీరేంద్రతో పాటు అతడి సోదరుడు చిరాగ్ సేన్, కోచ్ విమల్ కుమార్... కర్ణాటక బ్యాడ్మింటన్ సంఘం ఉద్యోగితో కలిసి జనన ధ్రువీకరణ రికార్డులను తప్పుగా మార్పించారని పిటిషనర్ ఫిర్యాదు చేశారు. ఈ కేసు పూర్వాపరాలు ఇలా ఉన్నాయి...

- ఏజ్ గ్రూప్ టోర్నీల్లో ఆడేందుకు వీలుగా లక్ష్యసేన్‌తో పాటు అతడి సోదరుడు చిరాగ్ సేన్ వయసును రెండున్నరేళ్లు తక్కువగా నమోదు చేసినట్లు నాగరాజ్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు.
- లక్ష్యసేన్ కుటుంబ సభ్యులతో పాటు కోచ్ విమల్ కుమార్‌పై చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదులో పేర్కొన్నారు.
- తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించారంటూ లక్ష్యసేన్ కుటుంబంపై 2022 డిసెంబర్‌లో నాగరాజ్ కర్ణాటక పోలీసులను ఆశ్రయించగా... వారు క్రిమినల్ కేసు నమోదు చేశారు.
- కేసును విచారించిన మెట్రోపాలిటన్ న్యాయస్థానం ఆధారాలు లేవని కొట్టి వేసింది. జస్టిస్ ఉమ పిటిషన్‌ను కొట్టేస్తున్నట్లు వెల్లడించారు.
- దీంతో పిటిషన్ వేసిన నాగరాజ్ సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా వివరాలు సేకరించి వాటిని న్యాయస్థానానికి అందజేశారు. దీంతో పాటు కేంద్ర యువజన సర్వీసుల మంత్రిత్వ శాఖ ఎంక్వైరీ రిపోర్టును కూడా జత చేశారు. అందులో రికార్డుల తారుమారు అంశంలో లక్ష్యసేన తండ్రి ధీరేంద్ర సేన్ తప్పు అంగీకరించిన వివరాలు ఉన్నాయి.
- మరోవైపు ఆరోపణలు నిరాధారమని లక్ష్యసేన్ తరఫు న్యాయవాది వాదిస్తున్నారు. 2018లో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఈ అంశాన్ని విచారించి ఎలాంటి అవకతవకలు లేవని ముగించిందని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న ప్లేయర్‌ను మానసికంగా ఇబ్బంది పెట్టేందుకే నాగారాజ్ ఈ పిటిషన్ వేసినట్లు పేర్కొన్నారు.
- పిటిషన్ వేసిన నాగరాజ్ 2020లో కుమార్తెను ప్రకాశ్ పదుకొనె బ్యాడ్మింటన్ అకాడమీలో చేర్పించాలని ప్రయత్నించగా... ఆ బాలిక ఎంపిక కాలేదు. దీంతో నిరాశలో ఈ పిటిషన్ దాఖలు చేసినట్లు లక్ష్యసేన్ తరఫు న్యాయవాది వాదిస్తున్నారు.
- లక్ష్యసేన్ సోదరుడు చిరాగ్ సేన్... గతంలో తప్పుడు జనన ధ్రువీకరణ పత్రాలు అందించినట్లు నిర్ధారణ అయింది. దీంతో 2016లో భారత బ్యాడ్మింటన్ సంఘం అతడిపై నిషేధం కూడా విధించింది.



పప్పీ పర్వతం



ఈ ఫొటోను కాస్తంత లీలగా చూస్తే ఒక శునకం తాపీగా వంగి నీళ్లు తాగుతున్నట్లు ఉంది కదా. మీరు మాత్రమే కాదు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది నెటిజన్లు ఇలాగే భావించి ఈ 'పప్పీ పర్వతం' ఎక్కడుందా? అని ఆన్‌లైన్‌లో తెగ వెతికేస్తున్నారు. చైనాలోని హుబేయి ప్రావిన్స్‌లోని యిచాంగ్ సిటీలో యాంగ్జీ నది వెంట ఉందీ పర్వతం. షాంఘైలో నివసించే గువా క్సింగ్‌షాన్ అనే డిజైనర్ ఇటీవల తన సొంతూరు యిచాంగ్‌కు వెళ్లినప్పుడు వేలంటైన్‌డే సందర్భంగా ఫొటో దిగుతూ ఈ వింతను గమనించి వెంటనే ఫొటోలు తీశారు. వాటిని సామాజిక మాధ్యమాల్లో షేర్‌చేశారు. అప్పట్నుంచి ఈ పప్పీ పర్వతం విశేషాలపై ఆన్‌లైన్‌లో విస్తృత చర్చ మొదలైంది. పర్వతం రంగు, ఆకారంలో ఉన్న తమ శునకాలను ఇక్కడికి తీసుకొచ్చి సెల్ఫీలు దిగుతున్న వాళ్లు, సందర్శకులతో ఇప్పుడా ప్రాంతం కొత్త పర్యాటక ప్రాంతంగా రూపాంతరం చెందుతోంది. ఈ యాంగ్జీ నది చైనాలోనే అతి పొడవైంది. ప్రపంచంలో మూడో అతి పొడవైన నది కూడా ఇదే. '' ఈ పప్పీ నీళ్లు తాగుతోందా?. లేదంటే నదిలో చేపను ఒడుపుగా నోట కరిచేందుకు వేచి చూస్తోందా?. లేదంటే నదిని పరిరక్షిస్తోందా? అంటూ నెటిజన్లు ఎవరికి తోచిన వ్యాఖ్యలు వాళ్లు ఆన్‌లైన్‌లో పోస్ట్ చేస్తున్నారు.

డీఆర్‌డీవో శాస్త్రవేత్తకు ఐదు కిడ్నీలు

అరుదైన మూడో ట్రాన్స్‌ప్లాంటేషన్ సక్సెస్

ముంబై: రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో)లో పనిచేసే శాస్త్రవేత్త శరీరంలో ఇప్పుడు ఒకటీ రెండూ కాదు..ఏకంగా ఐదు కిడ్నీలున్నాయి. పనిచేసేది మాత్రం ఒకే ఒక్కటి..! జనవరి 8వ తేదీన ఫరీదాబాద్‌లోని అమృత ఆస్పత్రి వైద్య బృందం ఆయనకు అరుదైన ఆపరేషన్ చేపట్టి ఐదో మూత్రపిండాన్ని అమర్చింది. దాదాపు నాలుగు గంటలపాటు సాగిన ఈ సర్జరీ ఎంతో సంక్లిష్టమైందని వైద్యులు తెలిపారు. మూడోసారి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేయడం ఎంతో అరుదైన విషయమన్నారు. దేశంలో అవయవ ట్రాన్స్‌ప్లాంటేషన్ సాంకేతికతలో ఇది కీలక మలుపని చెప్పారు. డీఆర్‌డీవో శాస్త్రవేత్త దేవేంద్ర బర్లేవర్(45) తీవ్రమైన కిడ్నీ వ్యాధితో 15 ఏళ్లపాటు ఇబ్బందిపడ్డారు. హైపర్‌టెన్షన్‌తో 2008లో రెండు మూత్రపిండాలు పనిచేయకుండా పోయాయి. దీంతో, ఆయనకు 2010లో, తిరిగి 2012లో సర్జరీ చేసి కిడ్నీలను మార్చారు. అవి ఫెయిలయ్యాయి. పుట్టుకతో ఉన్న రెండు కిడ్నీలు, ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో అమర్చిన రెండు కలిపి మొత్తం నాలుగు మూత్రపిండాలున్నా ఆయన ఆరోగ్యం కుదుటపడలేదు. ఇదే సమయంలో 2022లో బర్లేవర్ కోవిడ్-19 బారినపడి తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. దీంతో, ఆయనకు డయాలసిస్ తప్పనిసరయ్యింది. ఈయన్ను పరీక్షించిన ఫరీదాబాద్‌లోని అమృత ఆస్పత్రి వైద్యులు మరోసారి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు సంసిద్ధత తెలిపారు. అదే సమయంలో, బ్రెయిన్‌డెడ్ అయిన ఓ రైతు కుటుంబం కిడ్నీ దానం చేసేందుకు ముందుకు వచ్చింది. అనుకోని ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు వైద్య బృందం సిద్ధపడింది. అయితే, పనిచేయని నాలుగు కిడ్నీల వద్దే మరో కిడ్నీని అమర్చడం వారికి సవాల్‌గా మారింది. వ్యాధి నిరోధకతకు సంబంధించిన ప్రత్యేక సంక్లిష్టతలను వారు ముందుగా దాటాల్సి వచ్చింది. ఇందులో భాగంగా, కొత్త కిడ్నీని రోగి శరీరం తిరస్కరించకుండా చేసేందుకు ముందుగా ఇమ్యునో సప్రెషన్ అనే ప్రత్యేక ప్రక్రియ చేపట్టామని బృందంలో ఒకరైన డాక్టర్ అహ్మద్ కమాల్ చెప్పారు. రోగికి ఇప్పటికే హెర్నియా శస్త్రచికిత్స చేసినందున స్థల పరిమితి కారణంగా ఐదో మూత్రపిండాన్ని శరీరంలో అమర్చడమనే ప్రధాన సవాల్‌ను కూడా ఎదుర్కొన్నామని మరో వైద్యుడు అనిల్ శర్మ తెలిపారు. ఎట్టకేలకు నాలుగు గంటల అనంతరం ట్రాన్స్‌ప్లాంటేషన్ ప్రక్రియను విజయవంతంగా ముగించారు. కొత్త కిడ్నీ చక్కటి పనితీరు కనబరచడంతో పది రోజుల అనంతరం బర్లేవర్‌ను ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. రెండు వారాల్లో ఆయన శరీరంలో క్రియాటినిన్ స్థాయిలు సాధారణ స్థాయికి చేరుకున్నాయి. డయాలసిస్ అవసరం కూడా లేకుండా పోయింది. తిరిగి సంపూర్ణ ఆరోగ్యవంతుడైనందుకు దేవేంద్ర బర్లేవర్ సంతోషం వ్యక్తం చేశారు. రోజువారీ దినచర్యను ఎటువంటి ఇబ్బందులు లేకుండా తానే సొంతంగా పూర్తి చేసుకోగలుగుతున్నట్లు చెప్పారు.

8 ఎంపీ సీట్లను కోల్పోతాం

డీలిమిటేషన్‌పై తమిళనాడు సీఎం స్టాలిన్ ఆందోళన

- 5న అఖిల పక్ష సమావేశంలో చర్చించనున్నట్లు వెల్లడి
- కేంద్రంతో మరో భాషా యుద్ధానికి సిద్ధమని స్పష్టీకరణ



చెన్నై: లోక్‌సభ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ చేపట్టే పక్షంలో తమ రాష్ట్రం 8 ఎంపీ స్థానాలను కోల్పోయే ప్రమాదముందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. అప్పుడిక పార్లమెంట్‌లో తమ ప్రాతినిథ్యం 39 నుంచి 31 మంది సభ్యులకు పడిపోతుందని చెప్పారు. కుటుంబ నియంత్రణ పథకాలను సమర్థంగా అమలు చేసినందుకు రాష్ట్రానికి దక్కే ప్రతిఫలమంటూ వ్యాఖ్యానించారు. ఇప్పటికే కేంద్రం నిధుల్లో పెడుతున్న కోత కారణంగా ఇబ్బంది పడుతున్నామని, తగ్గిన ప్రాతినిథ్యంతో ఈ ఇబ్బందులు మరింతగా ఎక్కువవుతాయని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, హిందీని తమిళనాడు ప్రజలపై బలవంతంగా రుద్దేందుకు కేంద్రం తీవ్రంగా ప్రయతిస్తోందన్నారు. దీనిపై కేంద్రంతో మరో దఫా భాషా యుద్ధానికి తాము సిద్ధంగా ఉన్నామని 1965లో డీఎంకే సారథ్యంలో జరిగిన హిందీ వ్యతిరేక ఉద్యమాన్ని ఉద్దేశిస్తూ స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఈ అంశాలన్నిటిపైనా చర్చించి, ఐక్యంగా నిర్ణయం తీసుకునేందుకు గాను మార్చి 5వ తేదీన అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకున్న రాష్ట్రంలోని సుమారు 40 రాజకీయ పార్టీలకు అఖిల పక్ష భేటీకి రావాలంటూ ఆహ్వానాలు పంపామని చెప్పారు. మంగళవారం కేబినెట్ సమావేశం అనంతరం సీఎం స్టాలిన్ సెక్రటేరియట్‌లో మీడియాతో మాట్లాడారు. 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఆహ్వాన లేఖను చూపారు. రాజకీయ విభేదాలను వీడి, అందరం ఐక్యంగా ఉందామంటూ ఆయన పిలుపునిచ్చారు. నూతన విద్యావిధానం(ఎన్‌ఈపీ), కేంద్ర నిధులు, నీట్ వంటి అంశాలపై పార్లమెంట్‌లో వాదనలు వినిపించేందుకు తగినంత మంది ఎంపీల అవసరం ఎంతో ఉందన్నారు. డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలపై కత్తి వేలాడుతోందని వ్యాఖ్యానించారు. అన్ని అభివృద్ధి సూచికల్లో ముందున్న తమ రాష్ట్రం, 2026 జనగణన ఆధారంగా లోక్‌సభ సీట్లను కోల్పోయే ప్రమాదంలో పడిందని స్టాలిన్ చెప్పారు. ఇది తమిళనాడు హక్కులకు సంబంధించిన అంశమని వివరించారు.

సీట్లు తగ్గుతాయని ఎవరు చెప్పారు?

తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలై లోక్‌సభ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో దక్షిణాది సహా అన్ని రాష్ట్రాలకు న్యాయం జరుగుతుందని ప్రధాని మోదీ ఇప్పటికే ప్రకటించారని తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలై చెప్పారు. అయినప్పటికీ సీఎం స్టాలిన్ సీట్లు తగ్గుతాయనే భ్రమల్లో ఉన్నారని విమర్శించారు. ఆయనవన్నీ భ్రమలు, అనవసర వాదనలంటూ కొట్టిపారేశారు. ప్రజల్లో భయాందోళనలను సృష్టిస్తున్నారన్నారు. సీట్లు తగ్గుతాయని కేంద్రం పార్లమెంట్‌లో చెప్పిందా? లేదా ఏదైనా రహస్య పత్రాల ద్వారా తెలిసిందా? ఈ విషయాలను సీఎం స్టాలిన్ వివరణ ఇస్తేనే 5న జరిగే అఖిల పక్ష భేటీకి తాము వెళతామని అన్నామలై స్పష్టం చేశారు. హిందీని మూడో భాషగా కేంద్రం రుద్దుతుందన్న సీఎం స్టాలిన్ వాదనను తమిళ ప్రజలే తిరస్కరించారని ఆయన తెలిపారు. వాస్తవానికి, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలతోపాటు సీఎం కుటుంబం నడిపే స్కూళ్లలోనూ హిందీని బోధిస్తున్నారని చెప్పారు.

అంతు చిక్కని వ్యాధికి 50 మంది బలి

రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో ఘటన

కిన్షాసా: ఆఫ్రికా దేశం డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో గుర్తు తెలియని వ్యాధితో 50 మంది బలయ్యారు. లక్షణాలు బయటపడిన 48 గంటల్లోనే వీరిలో ఎక్కువ మంది ప్రాణాలు వదిలారని కాంగో వాయవ్య ప్రాంతంలోని బికొరొ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ సెర్గె ఎన్‌గలెబటో సోమవారం చెప్పారు. ఇది చాలా ఆందోళన కలిగించే విషయమన్నారు. మొదట జనవరి 21వ తేదీన బొలొకొ పట్టణంలో గబ్బిలాన్ని తిన్న ముగ్గురు చిన్నారులు 48 గంటల్లోనే మెదడులో రక్తస్రావం, తీవ్ర జర్వం లక్షణాలతో చనిపోయారు. ఫిబ్రవరిలో 9వ తేదీన బొమటె పట్టణంలో ఇలాంటి లక్షణాలతోనే 13 కేసులు బయటపడ్డాయి. అయితే, ఇవి ఎబోలా లేదా సాధారణంగా వచ్చే మెదడు వాపు జ్వరం కాదని, కొన్ని కేసులు మలేరియా లక్షణాలతో ఉన్నాయని అధికారులు తెలిపారు. చనిపోయిన 53 మందితో కలిపి ఇప్పటి వరకు గుర్తు తెలియని వ్యాధి లక్షణాలతో మొత్తం 419 కేసులను గుర్తించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఆఫ్రికా కార్యాలయం వెల్లడించింది. ఆఫ్రికాలో అడవి జంతువులను ఆహారంగా తీసుకునే చోట్ల మనుషులకు ఇలాంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత దశాబ్ద కాలంలో ఆఫ్రికాలో ఇటువంటి జబ్బులు 60 శాతానికి పైగా పెరిగాయని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. కాంగోలోనే గతేడాది జలుబు వంటి గుర్తు తెలియని వ్యాధి బారినపడి డజన్ల కొద్దీ ప్రజలు చనిపోయారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీల స్కాలర్‌షిప్పుల్లో కోత

కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే మండిపాటు

న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాల యువతకు స్కాలర్‌షిప్పుల్లో కేంద్రం కోత పెడుతోందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ అంటూ ఒక వైపు నినదిస్తూ బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షల్ని కేంద్రం అణచివేస్తోందని ధ్వజమెత్తారు. దేశంలోని బలహీన వర్గాల యువతకు నైపుణ్యాలను పెంచుకునేందుకు అవకాశమివ్వకుండా ఉద్యోగావకాశాలు వారికి ఎలా దక్కుతాయని ఖర్గే మంగళవారం 'ఎక్స్'లో ప్రశ్నించారు. అన్ని రకాల స్కాలర్‌షిప్పుల లబ్ధిదారుల సంఖ్యను గణనీయంగా తగ్గించడంతోపాటు సరాసరిన ఏడాదిలో వారికోసం వెచ్చించే నిధుల్లో 25 శాతం కోతపెట్టడం సిగ్గు చేటన్నారు. ఇందుకు సంబంధించిన గణాంకాలను కాంగ్రెస్ చీఫ్ ఖర్గే షేర్ చేశారు.

వర్చువల్ పుణ్యస్నానం

మహాకుంభ్‌నగర్: సత్యన్నారాయణ స్వామి వ్రతం చేసేటప్పుడు జీవితభాగస్వామి విదేశంలోనో, అనారోగ్యంతో అందుబాటులో లేని సందర్భాల్లో వాళ్ల ఫొటో ఫ్రేమ్ పక్కనే ఉంచుకుని వ్రతాన్ని ఆచరించిన సందర్భాలను చూసే ఉంటారు. అలా జీవితభాగస్వామి తనతోపాటు త్రివేణి సంగమ స్థలికి రాలేకపోవడంతో అతని భార్య కొత్త తరహాలో భర్త పుణ్యస్నానాన్ని విజయవంతంగా పూర్తిచేసింది. స్మార్ట్‌ఫోన్‌లో వీడియోకాల్ సదుపాయం అందుబాటులో ఉండటంతో ఆయనతో వీడియోకాల్ చేయించి లైన్‌లో ఉండగానే ఫోన్‌ను గంగానదిలో ముంచి భర్తతో 'ఆన్‌లైన్ మునక'వేయించింది. ఈ ఘటన తాజాగా మహాకుంభమేళా త్రివేణి సంగమ ఘాట్‌లో జరిగింది. శిల్పా చౌహాన్ అనే మహిళ ఇలా తన భర్త 'వర్చువల్ పవిత్రస్నానం'వీడియోను ఇన్‌స్టా గ్రామ్‌లో షేర్ చేయడంతో ఇప్పుడా వీడియో వైరల్‌గా మారింది. నెటిజన్లు వీడియోలో ఉన్న భర్తనుద్దేశిస్తూ సరదా పోస్ట్‌లు పెట్టారు. ''ఫోన్ పొరపాటున నీళ్లలో పడిపోతే భర్తకు మోక్షం ప్రాప్తించడం ఖాయం', 'పవిత్ర స్నానం తర్వాత తల తుడుచుకున్నారా? దుస్తులు మార్చుకున్నారా లేదా? లేదంటే మీకు జలుబు చేస్తుంది', 'ఆన్‌లైన్‌లో స్నానం చేసి ఈయన తన పాపాలను పోగొట్టుకున్నారు', 'మీ వల్ల ఇన్‌స్టా గ్రామ్ మొత్తం పుణ్యస్నానాలు చేస్తోంది'అని నెటిజన్లు పలు రకాలుగా వ్యాఖ్యానాలు చేశారు.

ఢిల్లీలో ప్రభుత్వం మారింది.. యమునా నది ప్రక్షాళన జరుగుతుంది

సుప్రీంకోర్టు ఆశాభావం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వం మారడంతో ఇక యమునా నది ప్రక్షాళన జరుగుతుందని భావిస్తున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. నది పరిశుభ్రంగా మారడంతోపాటు దీని చుట్టూ ఉన్న వివాదాలన్నీ పరిష్కారానికి నోచుకుంటాయని ఆశాభావం వ్యక్తంచేసింది. ఢిల్లీలో మారిన పరిస్థితుల నేపథ్యంలో యమునా నది విషయంలో ప్రణాళికలు అమల్లోకి రావొచ్చని ఉద్ఘాటించింది. దేశంలో కాలుష్యమయంగా మారిన నదుల అంశాన్ని సుప్రీంకోర్టు 2021 జనవరి 13న సుమోటోగా విచారణకు స్వీకరించింది. 'కాలుష్య నదులకు చికిత్స'పేరిట విచారణ కొనసాగిస్తోంది. ఇందులో యమునా నది అంశం కూడా ఉంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసీతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ అడ్వొకేట్ మీనాక్షి అరోరా తన వాదన వినిపించారు. యమునా నది ప్రక్షాళన అంశాన్ని జాతీయ హరిత ట్రిబ్యునల్ గతంలో ఒక కమిటీ ద్వారా పర్యవేక్షించిందని అన్నారు. ప్రస్తుత ఆ కమిటీ పని చేయడం లేదని చెప్పారు. యమునా నది పరిశుభ్రత అనేది ఎగువన ఉన్న హరియాణా, ఉత్తరప్రదేశ్‌లతోనూ ముడిపడి ఉందని పేర్కొన్నారు. ఇప్పుడు ఢిల్లీలో ప్రభుత్వం మారింది కాబట్టి నదిని శుభ్రం చేసే విషయంలో అడుగు ముందుకు పడుతుందని ఆశిస్తున్నట్లు ధర్మాసనం వెల్లడించింది.

ఖాళీలు 2.. దరఖాస్తులు 1,200

తీవ్రమవుతోన్న నిరుద్యోగ సంక్షోభం

యువభారత శక్తిసామర్థ్యాలు ఆధునిక పారిశ్రామిక, సేవారంగాల వాస్తవిక అవసరాలను అనుగుణంగా లేవన్న చేదు నిజం మరోసారి నిరూపితమైన ఘటన ఇది. సరైన విద్యార్హతలున్నాసరే ఖాళీలకు మించి నిరుద్యోగులు భారత్‌లో పోగుబడుతున్నారని టెక్నాలజీ సంస్థ అయిన ఆన్‌మ్యానడ్ డైనమిక్స్ సంస్థ ప్రధాన శాస్త్రవేత్త, సీఈఓ శ్రీనాథ్ మల్లికార్జునన్ వ్యాఖ్యానించారు. అందుకు తన సంస్థకు వెల్లువెత్తిన ఉద్యోగ దరఖాస్తులను ఆయన సాక్ష్యంగా చూపారు. ''భారత్‌లోని మా కార్యాలయంలో ఇంటర్న్‌షిప్‌ల కోసం కేవలం రెండు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీచేసేందుకు తగు అర్హతలున్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరాం. ఊహించనంతగా ఏకంగా 1,200 దరఖాస్తులు వచ్చాయి. రెండు ఉద్యోగాలకు 1,200 అప్లికేషన్లు అందుకోవడమంటే దేశంలో నిరుద్యోగం ఏ స్థాయిలో తిష్టవేసిందో ఇట్టే అర్థంచేసుకోవచ్చు. ఈ 1,200 దరఖాస్తులను పూర్తిగా వడబోసి మేం చివరకు అత్యంత నైపుణ్యవంతులైన అభ్యర్థులకు చెందిన కేవలం 20 దరఖాస్తులను మాత్రమే ఉద్యోగాల కోసం పరిశీలిస్తాం''అని తన లింక్డ్‌ఇన్ ఖాతాలో శ్రీనాథ్ రాసుకొచ్చారు. ఉద్యోగ విపణిలో ఎన్నో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా వాటిలో చేరేంత సత్తాను సాధించడంతో నేటి యువత వెనకబడుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ఉద్యోగ వేటలో యువభారతం ఎందుకు విఫలమవుతోందో ఆయన కొన్ని కారణాలను విశ్లేషించారు.

- జేఈఈ పరీక్ష రాసి ఐఐటీల్లో చదువులు పూర్తిచేసుకున్న చాలా మంది తర్వాతి ఉన్నత విద్య చదివేందుకు ఆసక్తి చూపట్లేదు. ఐఐటీల్లో చదివినా వీరిలోనూ నేటి పరిశ్రమలు, సేవారంగాల అవసరాలకు తగ్గ నైపుణ్యాలు కొరవడుతున్నాయి
- ప్రైవేట్ కాలేజీలు, యూనివర్సిటీల్లో సమర్థవంతమైన విద్య లభించట్లేదు
- నాలుగేళ్ల డిగ్రీలు పూర్తిచేస్తున్నా వారిలో అభ్యసన సామర్థ్యం వంటి ప్రాక్టికల్ నాలెడ్జ్ పాళ్లు తగ్గుతున్నాయి
- కాలం చెల్లిన సిలబస్, కఠిన స్థాయి తగ్గిన పరీక్షలు, పూర్తి సమర్థతలేని ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనా సిబ్బంది మరో కారణం
- ఎక్కువ మంది విద్యార్థుల విద్యాప్రమాణాల స్థాయి కేవలం కాల్ సెంటర్లు, క్లర్క్ వంటి బ్యాక్ ఆఫీస్ క్లరికల్ ఉద్యోగాలకే పరిమితం అవుతోంది. కృత్రిమ మేధ (ఏఐ) విజృంభిస్తుండటంతో ఇలాంటి ఉద్యోగాలు కూడా భవిష్యత్తులో కనుమరుగు అవుతాయి

శ్రీనాథ్ ఇస్తున్న సూచనలు

- కాలేజీ విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాలతోపాటు ఆయా సబ్జెక్టులకు సంబంధించిన అంతర్జాతీయ సిలబస్‌ను క్షుణ్ణంగా చదవండి.
- మీ సబ్జెక్టులపై పట్టు సాధించేందుకు నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్(ఎన్‌పీటీఈఎల్) కోర్సులనూ చదవండి
- సొంతంగా చిన్నపాటి ప్రాజెక్టులను మీరే ప్రయత్నించండి. ఇందుకోసం ల్యాబ్‌లో అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకోండి. సమయం వృథా చేయకండి.

స్పందించిన నిపుణులు

శ్రీనాథ్ పోస్ట్‌పై పలు రంగాల నిపుణులు స్పందించారు. సర్టిఫికెట్లను సాధించడం కంటే నైపుణ్యాలను సాధించడంపై యువత దృష్టిపెట్టాలని వాళ్లు వ్యాఖ్యానించారు. వృత్తివిద్యా కోర్సులను విస్తృతస్థాయిలో తీసుకురావాల్సిన అవసరం ఉందని వాళ్లు అభిప్రాయపడ్డారు. విదేశీ పెట్టుబడుల వరద మొదలవుతున్న ప్రస్తుత తరుణంలో యువత ఎప్పటికప్పుడు ఆధునిక కోర్సులను నేర్చుకుంటూ సన్నద్ధం కావాలని మరో నిపుణుడు అన్నారు. అంకుర సంస్థల వంటివి తాత్కాలికంగా ఉపాధి కల్పించినా అది శాశ్వత పరిష్కారం చూపలేవని ఇంకొందరు అభిప్రాయపడ్డారు.

- న్యూఢిల్లీ

'జమిలి' జేపీసీ ఎదుట భిన్న స్వరాలు

- ఏకకాల ఎన్నికలను సమర్థించిన మాజీ సీజేఐ లలిత్, తదితరులు
- ఒకేసారి ఎన్నికల విధానాన్ని తప్పుబట్టిన ప్రియాంకా గాంధీ

న్యూఢిల్లీ: రాష్ట్రాల శాసనసభలు, లోక్‌సభ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు ఉద్దేశించిన రెండు బిల్లులను పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఎదుట పలు రంగాల వ్యక్తులు భిన్న స్వరాలు వినిపించారు. 'జమిలి'పద్ధతికి మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యూయూ లలిత్ మద్దతు పలికారు. 'ఒకే దేశం ఒకేసారి ఎన్నికలు'సంబంధ బిల్లులకు పరిశీలిస్తున్న పార్లమెంటరీ కమిటీల ఎదుట పలు రంగాల నిపుణులు మంగళవారం హాజరై తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. ఇందులోభాగంగా మాజీ సీజేఐ జస్టిస్ లలిత్ తన అభిప్రాయం వెలిబుచ్చారు. ''లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఏకకాలంలో నిర్వహించడం మంచిదే. అయితే దీనిని సవ్యంగా అమలుచేయడంలో ఎదురయ్యే సవాళ్లను ముందుగా పరిష్కరించాలి. ఏకకాలంలో నిర్వహణ అనేది ఒకేసారి పూర్తిస్థాయిలో అమలు చేయకుండా దశలవారీగా దీనిని అమలు చేస్తే మంచిది''అని ఆయన సూచించారు. ప్రస్తుత లోక్‌పాల్ సభ్యుడు, లా కమిషన్ మాజీ చైర్మన్ అయిన కర్ణాటక హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ రితూ రాజ్ అవస్థీ సైతం బిల్లులకు మద్దతు పలికారు. ''ఈ బిల్లులు సమాఖ్య వ్యవస్థ ప్రాథమిక సూత్రాలను ఏవిధంగానూ ఉల్లంఘించట్లేవు. రాజ్యాంగంలోని ప్రజాస్వామ్య సూత్రాలకు ఈ బిల్లులు వ్యతిరేకం కావు. పైగా ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ఖర్చు తగ్గుతుంది. వేర్వేరు రాష్ట్రాల్లో తరచూ ఎన్నికల కోడ్ విధింపు అవరోధాలు ఉండనందున దేశాభివృద్ధి హెచ్చుతుంది'' అని ఆయన అన్నారు. జమిలి ఎన్నికలు అప్రజాస్వామికం కాదని కేంద్ర న్యాయ శాఖలోని శాసనవిభాగం తన అభిప్రాయాన్ని విడిగా లిఖితపూర్వకంగా కమిటీకి అందజేసింది. కమిటీ ఎదుట అత్యున్నత స్థాయి కోవింద్ కమిటీ కార్యదర్శి, ఐఏఎస్ అధికారి నితెన్ చంద్ర, సీనియర్ లాయర్, మాజీ కాంగ్రెస్ ఎంపీ ఈఎం సుదర్శన నచియప్ప సైతం హాజరయ్యారు. అయితే జమిలి ఎన్నికలను కాంగ్రెస్ మహిళా ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్రంగా వ్యతిరేకించారు. ''ప్రజల ద్వారా ఎన్నుకున్న, ప్రజామోదంతో కొలువుతీరిన శాసనసభల కాలపరిమితిని ఏకపక్షంగా తగ్గించడం ప్రజల హక్కులను కూలదోయడమే''అని ప్రియాంకా గాంధీ అన్నారు.



దక్షిణ కొరియాలో కూలిన ఎలివేటెడ్ హైవే

నలుగురు కార్మికులు మృతి

సియోల్: దక్షిణ కొరియా రాజధాని సియోల్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఎలివేటెడ్ హైవేలో కొంతభాగం కుప్పకూలింది. చియోనన్ ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో నలుగురు కార్మికులు చనిపోగా మరో ఆరుగురు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రమాద సమయంలో ఆ నిర్మాణంపై 10 మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. అది కూలడంతో వీరంతా శిథిలాల్లో చిక్కుకున్నట్లు వివరించారు. ఇద్దరు అక్కడికక్కడే చనిపోగా మరో ఇద్దరు ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారని చెప్పారు. ఘటనకు కారణాలు తెలియాల్సి ఉంది. శిథిలాలను తొలగించి, సహాయ కార్యక్రమాలను చేపట్టేందుకు 50 అగ్ని మాపక శకటాలు, మూడు హెలికాప్టర్లు, 150 మంది సిబ్బందిని అక్కడికి తరలించారు.

సీనియర్ టెక్ అధికారుల రాజీనామా

ఎలాన్ మస్క్ 'డోజ్'కు షాక్

వాషింగ్టన్: రోజుకో నిర్ణయంతో ఫెడరల్ యంత్రాంగాన్ని అయోమయంలోకి నెడుతున్న అధ్యక్షుడు ట్రంప్ సలహాదారు ఎలాన్ మస్క్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సివిల్ సర్వీస్ విభాగంలోని 20 మందికి పైగా సీనియర్ ఉద్యోగులు రాజీనామా చేశారు. అత్యంత ముఖ్యమైన ప్రజా సేవల విభాగాన్ని ధ్వంసం చేసేందుకు తమ నైపుణ్యాన్ని వినియోగించాలంటూ అందిన ఉత్తర్వులను తిరస్కరిస్తూ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు వీరు ప్రకటించారు. అమెరికా ప్రజలకు సేవ చేస్తామంటూ విధుల్లో చేరేటప్పుడు చేసిన వాగ్దానాన్ని ప్రస్తుత పరిస్థితుల్లో నెరవేర్చలేమని స్పష్టమైందంటూ వారు సమర్పించిన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని తగ్గించే బాధ్యతలను చేపట్టిన డోజ్ యంత్రాంగంలోని వారంతా రాజకీయ నేపథ్యం కలిగిన వారనీ, వీరికి అందుకు అవసరమైన నైపుణ్యాలు గానీ, అనుభవం గానీ లేవని అందులో తెలిపారు. బాధ్యతల నుంచి వైదొలగిన వారిలో ఇంజనీర్లు, డేటా సైంటిస్టులు, ప్రొడక్ట్ మేనేజర్లు ఉన్నారు. వీరు గతంలో అమెజాన్, గూగుల్ వంటి సంస్థల్లో కీలక బాధ్యతలను నిర్వహించిన అనుభవజ్ఞులు. ఒబామా హయాంలో హెల్త్‌కేర్ విధానాలను అమలు చేసేందుకు యూఎస్ డిజిట్ సర్వీస్ పేరుతో ఈ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇదే విభాగానికి చెందిన 40 మంది సిబ్బందిని ఈ నెల మొదట్లో ఇంటికి పంపించిన సంగతి తెలిసిందే.


కేంద్రంపై శశిథరూర్ ప్రశంసలు

మంత్రి పీయూష్ గోయల్‌తో సెల్ఫీ



న్యూఢిల్లీ: కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్.. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని మరోసారి ప్రశంసించారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో సెల్ఫీ తీసుకున్న ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ''బ్రిటన్ బిజినెస్ అండ్ ట్రేడ్ సెక్రటరీ జొనాథన్ రేనాల్డ్స్‌తో భారత వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో చర్చలు జరపడం సంతోషంగా ఉంది. దీర్ఘకాలంగా నిలిచిపోయిన ఎఫ్‌టీఏ చర్చలను పునరుద్ధరించడం స్వాగతించదగ్గ విషయం''అని ఆయన పోస్ట్‌లో పేర్కొన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీతో విభేదాలు, ఆయన భవిష్యత్‌పై చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. ఐక్యరాజ్యసమితి మాజీ దౌత్యవేత్త అయిన శశి థరూర్... పార్టీ రాజకీయ ప్రత్యర్థులపై ప్రశంసలు కురిపించడం కాంగ్రెస్ నాయకత్వానికి రుచించలేదు. కేరళలోని పినరయి విజయన్ నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, రెడ్ టేప్ కోత విధానాలను శశిథరూర్ ఇటీవల ప్రశంసించారు. ప్రధాని మోదీ అమెరికా పర్యటన, ట్రంప్‌తో భేటీ ఫలితాలను శశిథరూర్ కొనియాడారు. పార్టీని వీడుతున్నట్లు వస్తున్న పుకార్లను ఆయన ఖండించినప్పటికీ, తన సేవలు పార్టీకి అవసరం లేకపోతే వేరే ఆప్షన్లు ఉన్నాయని కాంగ్రెస్‌ను హెచ్చరిస్తూనే ఉన్నారు. దీనిపై సీపీఎం వెంటనే స్పందించింది. శశిథరూర్ కాంగ్రెస్ పార్టీని వీడితే కేరళ రాజకీయాల్లో ఆయన అనాథ అయిపోరని సీపీఎం సీనియర్ నేత థామస్ ఐజాక్ వ్యాఖ్యానించారు.

గుప్తుల కాలం నాటి ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త ఎవరు?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

గుప్తులు

1. కింది వాటిలో గుప్తుల రాజధానిగా వర్ధిల్లిన నగరం ఏది?
ఎ) పాటలీపుత్రం బి) ఉజ్జయిని
సి) ఎ, బి డి) పైవేవీకాదు

2. గుప్తవంశ మూల పురుషుడు ఎవరు?
ఎ) శ్రీగుప్తుడు బి) చంద్రగుప్తుడు
సి) సముద్రగుప్తుడు డి) కుమారగుప్తుడు

3. కింది వాటిని జతపరచండి.
గ్రూపు – ఎ
1. గుప్తశకం ప్రారంభకులు
2. గుప్తుల్లో అగ్రగణ్యుడు
3. నలందా విశ్వవిద్యాలయ స్థాపకుడు
4. 'నవరత్నాలు' అనే కవులను పోషించినవారు
5. గుప్తవంశ చివరి పాలకుడు
గ్రూపు – బి
a. మొదటి చంద్రగుప్తుడు
b. సముద్రగుప్తుడు
c. కుమారగుప్తుడు
d. రెండో చంద్రగుప్తుడు
e. విష్ణుగుప్తుడు
ఎ) 1-a, 2-b, 3-c, 4-d, 5-e
బి) 1-e, 2-d, 3-c, 4-b, 5-a
సి) 1-c, 2-a, 3-d, 4-e, 5-b
డి) 1-b, 2-e, 3-d, 4-c, 5-a

4. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) గుప్తుల రాజభాష 'సంస్కృతం'
బి) గుప్తుల రాజముద్రిక 'గరుడ'
సి) గుప్తుల అధికారిక న్యాయపుస్తకం 'యజ్ఞవల్కస్మృతి'
డి) పైవన్నీ

5. గుప్తుల కాలం నాటి ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త ఎవరు?
ఎ) ఆర్యభట్ట బి) బ్రహ్మగుప్త
సి) ఎ, బి డి) ఎవరూ కాదు

6. రెండో చంద్రగుప్తుడి కాలంలో గుప్త సామ్రాజ్యాన్ని సందర్శించిన విదేశీ యాత్రికుడు ఎవరు?
ఎ) పాహియాన్ బి) హుయాన్‌త్సాంగ్
సి) స్ట్రాబో డి) మార్కొపోలో

7. కింది వాటిలో సముద్రగుప్తుడి బిరుదు ఏది?
ఎ) కవిరాజు బి) పరాక్రమాంక
సి) ఇండియన్ నెపోలియన్
డి) పైవన్నీ

8. సముద్రగుప్తుడి విజయాలు తెలిపే అలహాబాద్ స్తంభ శాసనం రచయిత ఎవరు?
ఎ) రవికీర్తి బి) హరిసేన
సి) బుధకీర్తి డి) శర్వవర్మ

9. మౌర్యులకు అర్థశాస్త్రం ఎలాంటిదో గుప్తులకు కింద పేర్కొన్న ఏ గ్రంథం అలాంటిది?
ఎ) మృచ్ఛకటికం బి) కథాసరిత్సాగరం
సి) నీతిసారం డి) రఘువంశం

10. గుప్తుల వంశక్రమాన్ని వివరిస్తున్న పురాణం ఏది?
ఎ) విష్ణుపురాణం బి) మత్స్యపురాణం
సి) వాయు పురాణం డి) పైవన్నీ

11. శకుల దండయాత్ర, ధ్రువాదేవితో రెండో చంద్రగుప్తుడి వివాహం గురించి వివరిస్తున్న గ్రంథం ఏది?
ఎ) దేవీ చంద్రగుప్తం
బి) ముద్రారాక్షసం
సి) స్వప్నవాసవదత్త
డి) కౌముదీ మహోత్సవం

12. గుప్తుల కాలానికి చెందిన ప్రముఖ రచయితలు, వారి గ్రంథాలను జతపరచండి.

గ్రూపు – ఎ	గ్రూపు – బి
1. కౌముదీ మహోత్సవం	a. వజ్జిక
2. దేవీ చంద్రగుప్తం	b. విశాఖదత్తుడు
3. నీతిసారం	c. కామాంధకుడు
4. కథాసరిత్సాగరం	d. సోమదేవసూరి
5. మృచ్ఛకటికం	e. శూద్రకుడు

ఎ) 1-a, 2-b, 3-c, 4-d, 5-e
బి) 1-e, 2-d, 3-c, 4-b, 5-a
సి) 1-b, 2-a, 3-e, 4-d, 5-c
డి) 1-b, 2-e, 3-b, 4-c, 5-a

13. ఎక్కువ మంది చరిత్రకారుల ప్రకారం గుప్తులు ఏ వర్గానికి చెందినవారు?
ఎ) క్షత్రియ బి) శూద్ర
సి) వైశ్య డి) బ్రాహ్మణ

14. సముద్రగుప్తుడి గురించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) దక్షిణ భారత దండయాత్రలో 12మంది రాజులను ఓడించాడు
బి) రెండో ఆర్యావర్త దండయాత్రలో 9 మంది రాజుల కూటమిని కౌశాంబి యుద్ధంలో ఓడించాడు
సి) వీణ వాయిస్తున్నట్లు నాణేలు విడుదల చేశాడు
డి) పైవన్నీ

15. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) గుప్తుల కాలంలో వైదిక మతం హిందూ మతంగా మారింది
బి) విష్ణువును దశావతారాల్లో పూజించడం ప్రారంభమైంది
సి) గుప్తుల కాలం నుంచే బుద్ధుడిని విష్ణువు దశావతారాల్లో ఒకరిగా భావించారు
డి) పైవన్నీ

16. 'షానామా' గ్రంథం ప్రకారం అర్థాషీర్ అనే పారశీక రాజు గుప్తవంశానికి చెందిన ఏ పాలకుడితో స్నేహాన్ని కాంక్షించాడు?
ఎ) శ్రీగుప్తుడు
బి) చంద్రగుప్త విక్రమాదిత్య
సి) బాణుగుప్తుడు
డి) బుధగుప్తుడు

17. నవరత్నాల్లో అగ్రగణ్యుడైన కాళిదాసుకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) కాళిదాసు రచించిన నాటకాలు – మాళవికాగ్నిమిత్రం, అభిజ్ఞాన శాకుంతలం, విక్రమోర్వశీయం
బి) కాళిదాసు రచించిన కావ్యాలు– రఘువంశం, మేఘదూతం, కుమార సంభవం
సి) కాళిదాసు రచించిన పద్యకావ్యం – రుతుసంహారం
డి) పైవన్నీ

18. ఆర్యభట్ట తెలియజేసిన ఖగోళ అంశాలకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) గ్రహణాలు ఏర్పడే విధానాన్ని శాస్త్రీయంగా వివరించారు
బి) భూభ్రమణం గురించి వివరించారు
సి) స్థానం మారితే 0 విలువ మారడం గురించి తెలిపారు
డి) పైవన్నీ

19. న్యూటన్ కంటే ముందే భూమ్యాకర్షణ శక్తి గురించి వివరించిన భారతదేశ ఖగోళ శాస్త్రజ్ఞుడు ఎవరు?
ఎ) బ్రహ్మగుప్త బి) ఆర్యభట్ట
సి) వరాహమిహిరుడు డి) ఘటకర్ణ

20. పరంపరంగా కొనసాగుతున్న వైదిక సాహిత్యాన్ని ఏ పాలకుల కాలంలో రచించారు?
ఎ) కుషాణులు బి) రాజపుత్రులు
సి) గుప్తులు డి) చోళులు

21. భారతదేశంలో మొట్టమొదటి శస్త్రచికిత్స వైద్యుడు ఎవరు?
ఎ) సుశ్రుతుడు బి) ధన్వంతరి
సి) వాగ్భటుడు డి) పాలకాశ్యపుడు

22. గుప్తుల కాలం నాటి వైద్యశాస్త్ర గ్రంథాలు, వాటి రచయితలను జతపరచండి.

గ్రూపు – ఎ	గ్రూపు – బి
1. ధన్వంతరి	a. వైద్యశాస్త్రం
2. పాలకాశ్యపుడు	b. హస్త్యాయుర్వేదం
3. సుశ్రుతుడు	c. సుశ్రుత సంహిత
4. వాగ్భటుడు	d. అష్టాంగసంగ్రహం

ఎ) 1-a, 2-b, 3-c, 4-d
బి) 1-d, 2-c, 3-b, 4-a
సి) 1-b, 2-d, 3-a, 4-c
డి) 1-c, 2-a, 3-d, 4-b

23. ఏ పాలకుడి కాలం నుంచి గుప్త సామ్రాజ్యంపై హూణులనే విదేశీ తెగల దండయాత్ర ప్రారంభమైంది?
ఎ) బుధగుప్త బి) కుమారగుప్త
సి) స్కందగుప్త
డి) నరసింహ బలాదిత్య

24. రెండో చంద్రగుప్తుడి (చంద్రగుప్త విక్రమాదిత్య) విజయాలను వివరించే ప్రముఖ శాసనం ఏది?
ఎ) మెహ్రౌలి ఇనుపస్తంభ శాసనం
బి) ఎరాన్ శాసనం
సి) భింతారీ శాసనం
డి) జునాఘడ్ శాసనం

25. చరిత్రకారులు భారతదేశంలో ఎవరి పాలనా కాలాన్ని స్వర్ణయుగంగా కీర్తించారు?
ఎ) గుప్తులు బి) మౌర్యులు
సి) కుషాణులు డి) రాజపుత్రులు

26. హూణుల ప్రముఖ నాయకుడైన తోరమానుడిని ఓడించిన గుప్త పాలకుడు ఎవరు?
ఎ) స్కందగుప్త
బి) నరసింహ బలాదిత్య
సి) విష్ణుగుప్త డి) కుమారగుప్త

27. గుప్తుల కాలంలో బాణుగుప్త వేయించిన ఏ శాసనం సతీసహగమనం గురించి మొదటి శాసనాధారంగా ఉంది?
ఎ) ఎరాన్ శాసనం
బి) నలంద శాసనం
సి) మాండసోర్ శాసనం
డి) సాంచి శాసనం

28. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) గుప్తులు రాజ్యాన్ని 'భుక్తి' అనే రాష్ట్రాలుగా విభజించారు.
బి) భుక్తికి పాలకుడు 'ఉపారికుడు'
సి) గ్రామ పాలనలో 'పంచమండల సభ' తోడ్పడేది
డి) పైవన్నీ

29. గుప్తుల వాస్తు నిర్మాణ శైలిని ఏమంటారు?
ఎ) నగర శైలి బి) ద్రవిడ శైలి
సి) దేశీయ శైలి డి) మధుర శైలి

30. కింది వాటిలో గుప్తుల కాలం నాటి ప్రముఖ రేవు పట్టణం ఏది?
ఎ) తూర్పున 'తామ్రలిప్తి'
బి) పశ్చిమాన 'బ్రోచ్'
సి) ఎ, బి డి) పైవేవీకాదు

31. గుప్తుల కాలంలో నిర్మించిన గుహాలయాలు ఏవి?
ఎ) అజంతా బి) భాగ్
సి) ఉదయగిరి డి) పైవన్నీ

32. కింది వాటిలో గుప్తుల కాలంలో నిర్మించిన ప్రముఖ ఆలయం ఏది?
ఎ) దేవఘర్ – దశావతార దేవాలయం
బి) భూమన – శివాలయం
సి) నాచనకుథారా – పార్వతీ ఆలయం
డి) పైవన్నీ

33. గుప్తుల కాలంలో పంటలో ఎంతభాగం భూమిశిస్తుగా ఉండేది?
ఎ) 1/6 బి) 2/5
సి) 1/2 డి) 3/5

సమాధానాలు

1) సి; 2) ఎ; 3) ఎ; 4) డి; 5) సి;
6) ఎ; 7) డి; 8) బి; 9) సి; 10) డి;
11) ఎ; 12) ఎ; 13) సి; 14) డి; 15) డి;
16) బి; 17) డి; 18) డి; 19) ఎ; 20) సి;
21) ఎ; 22) ఎ; 23) బి; 24) ఎ; 25) ఎ;
26) బి; 27) ఎ; 28) డి; 29) ఎ; 30) సి;
31) డి; 32) డి; 33) ఎ.

మౌర్య యుగం

1. కింది వాటిలో మౌర్యుల కాలంలో ముఖ్య రేవు పట్టణం ఏది?
ఎ) తామ్రలిప్తి బి) బ్రోచ్
సి) సోపార డి) పైవన్నీ

2. మౌర్యుల కాలంలో పంటలో ఎంతభాగాన్ని భూమిశిస్తుగా వసూలు చేసేవారు?
ఎ) 1/2 బి) 1/4
సి) 1/3 డి) 2/5

3. మౌర్యుల కాలంలో శ్రేణులు సేకరించిన నిధులపై ఎంతశాతం వడ్డీ చెల్లించేవి?
ఎ) 15 బి) 12 సి) 20 డి) 10

4. మౌర్యుల రాజప్రసాదం బయటపడిన ప్రాంతం ఏది?
ఎ) తాసలి బి) కుమ్రహర్
సి) సారనాథ్ డి) సువర్ణగిరి

5. అశోకుడు 8400 స్తూపాలను నిర్మించినట్లు తెలుపుతున్న గ్రంథం ఏది?
ఎ) దివ్యవదన బి) దీపవంశ
సి) అశోకవదన డి) ఛుళువంశ

6. జాతీయపతాకంలోని ధర్మచక్రం, నాలుగు సింహాల తలలను అశోకుడు నిర్మించిన ఏ స్తూపం నుంచి స్వీకరించారు?
ఎ) రాంపూర్వ బి) సారనాథ్
సి) రుమ్మిందై
డి) లౌరియా నందన్ ఘర్

7. చంద్రగుప్త మౌర్యుడు సామాన్య కుటుంబీకుడని తెలిపిన గ్రీకు రచయిత ఎవరు?
ఎ) జస్టిన్ బి) ఎరియన్
సి) మెగస్తనీస్ డి) స్ట్రాబో

8. అశోకుడు నిర్మించిన ఏకశిలా స్తంభాలు, వాటి ఫలకాలపై ఉన్న జంతువుల చిత్రాలకు సంబంధించి కిందివాటిని జతపరచండి.

గ్రూపు – ఎ	గ్రూపు – బి
1. రాంపూర్వ	a) వృషభం
2. రుమ్మిందై	b) గుర్రం
3. లౌరియా నందన్ ఘర్	c) సింహం
4. సారనాథ్	d) నాలుగు సింహాలు

ఎ) 1-a, 2-b, 3-c, 4-d
బి) 1-d, 2-c, 3-b, 4-a
సి) 1-b, 2-a, 3-c, 4-d
డి) 1-c, 2-d, 3-a, 4-b

9. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) మౌర్యుల పతనానికి కారణం ఆర్థిక భారం – డి.డి. కోశాంబి
బి) మౌర్యుల పతనానికి కారణం అత్యధిక కేంద్రీకృత పాలన – రొమిలా థాపర్
సి) ఎ, బి డి) పైవేవీకాదు

10. శాసనాల్లో పేర్కొన్న అశోకుడి కుమారుడు ఎవరు?
ఎ) తివర బి) జలుక
సి) సంప్రతి డి) కునాల

11. అశోకుడి అలహాబాద్ స్తంభ శాసనంపై శాసనాలు చెక్కించిన పాలకుడు ఎవరు?
ఎ) సముద్రగుప్తుడు బి) జహంగీర్
సి) ఎ, బి డి) పైవేవీ కావు

12. దక్కన్ ప్రాంతాన్ని జయించిన మౌర్య పాలకుడు ఎవరు?
ఎ) చంద్రగుప్త బి) బిందుసార
సి) అశోకుడు డి) దశరథ

13. సింధు, గంగా, యమున.. ఈ మూడు నదుల పరీవాహక ప్రాంతాలపై ఆధిపత్యం సాధించిన మొదటి పాలకుడు ఎవరు?
ఎ) అశోకుడు బి) కనిష్కుడు
సి) చంద్రగుప్త మౌర్యుడు
డి) పుష్యమిత్రశుంగుడు

14. అశోకుడి శిలా శాసనాల్లో దక్షిణ భారతదేశానికి చెందిన ఏ పాలకుల గురించి పేర్కొన్నారు?
ఎ) చోళులు బి) పాండ్యులు
సి) ఎ, బి డి) పైవేవీ కాదు

15. కౌటిల్యుడి అర్థశాస్త్రంలో ఎన్ని అధికరణలు ఉన్నాయి?
ఎ) 15 బి) 20 సి) 16 డి) 18

16. కౌటిల్యుడి మరో పేరు?
ఎ) విష్ణుగుప్త బి) చాణక్య
సి) ఎ, బి డి) పైవేవీ కాదు

సమాధానాలు

1) డి; 2) బి; 3) ఎ; 4) బి; 5) ఎ;
6) బి; 7) ఎ; 8) ఎ; 9) సి; 10) ఎ;
11) సి; 12) బి; 13) సి; 14) సి; 15) ఎ;
16) సి.

జడ వాతావరణం కోసం వాడే వాయువులు ఏవి?



మాదిరి ప్రశ్నలు

1. వాతావరణ అధ్యయనానికి ఉపయోగించే బెలూన్‌లలో వాడే జడవాయువు ఏది?
1) హీలియం 2) నియాన్
3) ఆక్సిజన్ 4) నైట్రోజన్

2. రేడియోధార్మిక జడవాయువు రేడాన్ రసాయనిక సంకేతం ఏది?
1) Ra 2) Rn 3) Re 4) Rd

3. క్యాన్సర్ చికిత్సకోసం ఉపయోగించే మలాము(ఆయింట్‌మెంట్)లో వాడేది?
1) అయోడిన్ 2) బ్రోమిన్
3) రేడాన్ 4) రేడియం

4. 'సూపర్ ఫ్లూయిడ్' అని దేనికి పేరు?
1) గాజు 2) ద్రవ అమ్మోనియా
3) ద్రవీకృత నైట్రోజన్
4) ద్రవీకృత హీలియం

5. కిందివాటిలో ఉత్కృష్ట వాయువులని దేనికి పేరు?
1) హీలియం 2) నియాన్
3) ఆర్గాన్ 4) అన్నీ

6. ఏక పరమాణుక వాయువు ఏది?
1) హైడ్రోజన్ 2) ఆక్సిజన్
3) నైట్రోజన్ 4) హీలియం

7. కిందివాటిలో సులభంగా సమ్మేళనాలను ఏర్పరచలేని మూలకం ఏది?
1) సల్ఫర్ 2) ఆక్సిజన్
3) నైట్రోజన్ 4) హీలియం

8. హీలియం మూలకం పేరు గ్రహించిన 'హీలియోస్' అనే పదానికి అర్థం?
1) జడత్వం 2) సూర్యుడు
3) ఉత్కృష్టమైన 4) చంద్రుడు

9. గాల్లోని జడవాయువుల్లో గరిష్ఠంగా ఉండేది?
1) హీలియం 2) నియాన్
3) ఆర్గాన్ 4) క్రిప్టాన్

10. ఉత్కృష్ట వాయు మిశ్రమం నుంచి జడ వాయువులను వేరుచేసే పద్ధతి?
1) దీవార్ 2) సోనార్
3) ఫిషర్ 4) రామ్సే

11. కింది వాటిలో వాసన ఉండే వాయువు?
1) ఆర్గాన్ 2) నైట్రోజన్
3) హైడ్రోజన్ 4) క్లోరిన్

12. విద్యుత్ బల్బుల్లో ఉండే వాయువు ఏది?
1) ఆక్సిజన్ 2) కార్బన్ డై ఆక్సైడ్
3) ఆర్గాన్ 4) నైట్రోజన్

13. ద్రవరూపంలో ఉన్నపుడు పాత్ర గోడలపైకి ఎగబాకే వాయువు ఏది?
1) హీలియం 2) నియాన్
3) నైట్రోజన్ 4) హైడ్రోజన్

14. సముద్రపు లోతుల్లోకి వెళ్లే ఈతగాళ్ల శ్వాసక్రియకు సహాయపడేందుకు ఆక్వాలంగ్ పరికరాలను వాడతారు. వీటిలో ఉండే వాయు మిశ్రమం ఏది?
1) 10% ఆక్సిజన్, 90% నైట్రోజన్
2) 20% ఆక్సిజన్, 80% నైట్రోజన్
3) 20% హీలియం, 80% ఆక్సిజన్
4) 20% ఆక్సిజన్, 80% హీలియం

15. సాధారణంగా బెలూన్‌లు, ఎయిర్‌షిప్ లలో వాడే వాయువు ఏది?
1) కార్బన్ డై ఆక్సైడ్ 2) హీలియం
3) హైడ్రోజన్ 4) నైట్రోజన్

16. సూర్యుడు, ఇతర నక్షత్రాల్లో శక్తి ఉత్పన్నమయ్యేందుకు కారణమయ్యే ప్రక్రియ?
1) హైడ్రోజన్ సంలీనం
2) రేడియం సంలీనం
3) హీలియం సంలీనం
4) నైట్రోజన్ సంలీనం

17. సూర్యుడిలో కేంద్రక సంలీనం చర్య జరిగి చివరగా ఏర్పడే మూలకం?
1) హైడ్రోజన్ 2) హీలియం
3) ఆక్సిజన్ 4) నైట్రోజన్

18. ఫొటోగ్రాఫిక్ ఫ్లాష్ బల్బుల్లో వాడే జడ వాయువు?
1) హీలియం 2) నియాన్
3) ఆర్గాన్ 4) క్జినాన్

19. బొగ్గుగని కార్మికుల టోపీలైట్లలో వాడే వాయువు?
1) క్రిప్టాన్ 2) హీలియం
3) నియాన్ 4) ఆక్సిజన్

20. మండే వాయువు(దహనశీలి) ఏది?
1) ఆక్సిజన్ 2) హైడ్రోజన్
3) 1, 2 4) నైట్రోజన్

21. కింది వాటిలో ఏ వాయువు దహన శీలి కాదు, కానీ దహన దోహదకారి?
1) ఆక్సిజన్ 2) హైడ్రోజన్
3) కార్బన్ మోనాక్సైడ్ 4) అన్నీ

22. దహనశీలి కాని వాయువు ఏది?
1) మీథేన్ 2) కార్బన్ మోనాక్సైడ్
3) కార్బన్ డైఆక్సైడ్ 4) హైడ్రోజన్

23. ఎలక్ట్రిక్ ట్రాన్స్‌ఫార్మర్లలో వాడే వాయువు?
1) మీథేన్ 2) ఆక్సిజన్
3) హీలియం 4) నైట్రోజన్

24. వాహనాల టైర్లలో నింపేందుకు ఎక్కువగా వాడుతున్న వాయువు ఏది?
1) ఆక్సిజన్ 2) నైట్రోజన్
3) హీలియం 4) నియాన్

25. జడ వాతావరణం కోసం వాడే వాయువు/లు ఏవి?
1) హీలియం 2) ఆక్సిజన్
3) నైట్రోజన్ 4) 1, 3

26. ఆక్సిజన్ ట్యూబ్‌ల్లో నైట్రోజన్ బదులుగా ఏ వాయువును కలపడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు?
1) హైడ్రోజన్ 2) ఆర్గాన్
3) క్రిప్టాన్ 4) హీలియం

27. వాణిజ్య ప్రకటనలకు వాడే నియాన్ ట్యూబ్‌లో నియాన్‌తోపాటు ఆర్గాన్, మెర్క్యురీ బాష్పాలను వినియోగిస్తే కనిపించే రంగు?
1) లేత నీలిరంగు 2) నారింజ
3) ముదురు ఎరుపు 4) బంగారు ఛాయ

28. బ్రౌన్ రంగు ట్యూబ్‌లో నియాన్, హీలియం వాయువుల మిశ్రమం తీసుకుంటే కనిపించే రంగు ఏది?
1) నీలిరంగు 2) బంగారు ఛాయ
3) తెలుపు 4) ఎరుపు

29. రంగులేని ఎలక్ట్రిక్ బల్బులో నియాన్ వాయువును నింపితే కనిపించే రంగు?
1) నారింజ ఎరుపు 2) నీలం
3) పసుపు 4) ఆకుపచ్చ

30. వాతావరణంలో ఏ వాయువు ఎక్కువ పరిమాణంలో ఉంటే గ్రీన్‌హౌస్ ప్రభావం కనిపిస్తుంది?
1) హీలియం 2) నైట్రోజన్
3) కార్బన్ డైఆక్సైడ్ 4) ఆక్సిజన్

31. ఉత్కృష్ట వాయువుల సంయోజకత?
1) సున్నా 2) ఒకటి
3) రెండు 4) మూడు

32. అతి తక్కువ చర్యాశీలత ఉన్న వాయువు?
1) ఆక్సిజన్ 2) హైడ్రోజన్
3) ఫ్లోరిన్ 4) హీలియం

33. ఫ్లోరైడ్ ఏ భాగాన్ని నష్టపరుస్తుంది?
1) దంతాలు 2) కళ్లు
3) నాలుక 4) చెవులు

34. ద్విపరమాణుక అణువు కానిది ఏది?
1) ఫ్లోరిన్ 2) క్లోరిన్
3) ఆక్సిజన్ 4) హీలియం

35. 'క్రయోజనిక్ ద్రవం' ఏది?
1) ద్రవ ఆక్సిజన్ 2) ద్రవ హైడ్రోజన్
3) నీరు 4) ద్రవ హీలియం

36. వాయు థర్మామీటర్‌లలో ఏ వాయువును ఉపయోగిస్తారు?
1) నియాన్ 2) హైడ్రోజన్
3) హీలియం 4) ఆక్సిజన్

37. హాలోజన్ విద్యుద్దీపాల్లో అయోడిన్ లేదా బ్రోమిన్ సమ్మేళనాలతో కలిపే జడవాయువు ఏది?
1) హీలియం 2) క్రిప్టాన్
3) క్జినాన్ 4) రేడాన్

38. బలమైన ఆమ్లం ఏది?
1) HF 2) HCl 3) HBr 4) HI

39. థైరాయిడ్ సమస్యతో సంబంధం ఉన్నది?
1) ఫ్లోరిన్ 2) అయోడిన్
3) క్లోరిన్ 4) బ్రోమిన్

40. సాధారణంగా మున్సిపాలిటీ సరఫరా చేసే నీరు, స్విమ్మింగ్‌పూల్ నీటిని క్రిమిరహితం చేయడానికి వాడే వాయువు?
1) ఫ్లోరిన్ 2) క్లోరిన్
3) బ్రోమిన్ 4) అయోడిన్

41. కృత్రిమ వర్షాలకోసం 'మేఘబీజనం'(క్లౌడ్ సీడింగ్)లో వాడే సమ్మేళనం?
1) సిల్వర్ క్లోరైడ్ 2) సిల్వర్ అయోడైడ్
3) సిల్వర్ ఫ్లోరైడ్ 4) సిల్వర్ బ్రోమైడ్

42. దంతక్షయాన్ని నివారించడానికి టూత్ పేస్టులలో కలిపే పదార్థం?
1) ఫ్లోరైడ్ 2) క్లోరైడ్
3) సోడియం 4) 2, 3

43. రిఫ్రిజిరేటర్లలో ఉపయోగించే సాధారణ రిఫ్రిజిరెంట్ ఏది? (S.I.2010)
1) నియాన్
2) ఫ్రియాన్ /అమ్మోనియా
3) స్పిరిట్ 4) ఏదీకాదు

44. అణు ఇంధనాన్ని శుద్ధి చేసేందుకు ఉపయోగించే సమ్మేళనం?
1) యురేనియం హెక్సాఫ్లోరైడ్
2) సోడియం ఫ్లోరైడ్
3) సోడియం క్లోరైడ్ 4) కాల్షియం ఫ్లోరైడ్

45. ఫొటోగ్రఫీలో వాడేది?
1) సోడియం బ్రోమైడ్ 2) సిల్వర్ బ్రోమైడ్
3) సోడియం క్లోరైడ్ 4) సిల్వర్ క్లోరైడ్

46. ఏ హాలోజన్ లోపిస్తే గాయిటర్ వ్యాధి వస్తుంది?
1) ఫ్లోరిన్ 2) అయోడిన్
3) బ్రోమిన్ 4) క్లోరిన్

47. జడవాయువుల్లో జతకూడని ఎలక్ట్రాన్ల సంఖ్య?
1) 0 2) 1 3) 2 4) 3

48. హాలోజన్లలో జతకూడని ఎలక్ట్రాన్ల సంఖ్య?
1) 1 2) 0 3) 2 4) 4

49. కిందివాటిలో ఏది నిజం కాదు?
1) రేడియం క్షయం అయ్యే ప్రక్రియలో రేడాన్ లభిస్తుంది
2) జడవాయువుల్లో క్జినాన్ చర్యాశీలత ఎక్కువ
3) వాతావరణంలో పుష్కలంగా లభించే వాయువు హీలియం
4) అత్యంత తేలికైన జడవాయువు హీలియం

50. ఆస్తమా వ్యాధిగ్రస్తుల ప్రాణం నిలపడానికి అందించే వాయు మిశ్రమం?
1) 4 :1 నిష్పత్తిలో ఆక్సిజన్, హీలియం
2) 4 :1 నిష్పత్తిలో హీలియం, ఆక్సిజన్
3) 4 :1 నిష్పత్తిలో నియాన్, ఆక్సిజన్
4) 4 :1 నిష్పత్తిలో ఆక్సిజన్, నియాన్

51. జడవాయువును మొట్టమొదటగా కనుగొన్న శాస్త్రవేత్త ?
1) కావెండిష్ 2) విలియం రామ్‌సే
3) రేలీ 4) ఫ్రాంక్‌లాండ్

52. కింది వాటిలో మంద వాయువు? (S.I.2010)
1) హీలియం 2) హైడ్రోజన్
3) క్లోరిన్ 4) నైట్రోజన్ ఆవర్తన

53. వాతావరణంలో ఉండని జడవాయువు?
1) హీలియం 2) నియాన్
3) ఆర్గాన్ 4) రేడాన్

54. బాహ్యకక్ష్యలో అష్టక ఎలక్ట్రాన్‌లు లేని జడ వాయువు?
1) నియాన్ 2) రేడాన్
3) హీలియం 4) ఆర్గాన్

55. సముద్ర మొక్కల్లో ఉండేది?
1) అయోడిన్ 2) క్లోరిన్
3) క్లోరిన్ 4) సల్ఫర్

56. హైడ్రోఫ్లోరికామ్లం(HF)ను దేనిలో నిల్వ చేయలేం?
1) ఇనుప సీసా 2) ప్లాస్టిక్ సీసా
3) గాజు సీసా 4) తగరపు సీసా

57. యాంటిసెప్టిక్ ధర్మం ఉన్న వాయువు?
1) ఫ్లోరిన్ 2) అయోడిన్
3) క్లోరిన్ 4) బ్రోమిన్

సమాధానాలు

1) 1 2) 2 3) 3 4) 4 5) 4
6) 1 7) 4 8) 2 9) 3 10) 1
11) 4 12) 3 13) 1 14) 4 15) 2
16) 1 17) 2 18) 4 19) 1 20) 2
21) 1 22) 3 23) 3 24) 2 25) 4
26) 4 27) 1 28) 2 29) 1 30) 3
31) 1 32) 4 33) 1 34) 4 35) 4
36) 3 37) 2 38) 4 39) 2 40) 2
41) 2 42) 1 43) 2 44) 1 45) 2
46) 2 47) 1 48) 1 49) 3 50) 2
51) 2 52) 1 53) 4 54) 3 55) 1
56) 3 57) 2

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

'నిజాం కాలేజీ'ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర



అసఫ్‌జాహీలు

1. హైదరాబాద్‌లో మొదటి విద్యా సదస్సు నిర్వహించడానికి కారకుడు ఎవరు?
   1) మొహిబ్ హుస్సేన్
   2) రావిచెట్టు రంగారావు
   3) అఘోరనాథ్ చటోపాధ్యాయ
   4) మహమ్మద్ ముర్తజా
2. హైదరాబాద్‌లో ఏ సంవత్సరంలో మొదటిసారిగా విద్యా సదస్సు నిర్వహించారు?
   1) 1915 2) 1916
   3) 1917 4) 1913
3. సికింద్రాబాద్‌లో గాంధీ ఆసుపత్రి (కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ హాస్పిటల్)ని ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   1) 1882 2) 1880
   3) 1851 4) 1886
4. హైదరాబాద్‌లో మొట్టమొదటి నూలు మిల్లును ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   1) 1870 2) 1874
   3) 1871 4) 1872
5. 'ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్'ను ఎప్పుడు స్థాపించారు?
   1) 1929 2) 1918
   3) 1938 4) 1925
6. నిజాం ప్రభుత్వం షాబాద్‌లో ఆధునిక సిమెంట్ ఫ్యాక్టరీని ఎప్పుడు స్థాపించింది?
   1) 1935 2) 1938
   3) 1928 4) 1925
7. పారిశ్రామికాభివృద్ధి కోసం నిజాం ప్రభుత్వం కోటి రూపాయలతో 'ఇండస్ట్రియల్ ట్రస్ట్ ఫండ్' ఏర్పాటు చేసిన సంవత్సరం?
   1) 1931 2) 1927
   3) 1929 4) 1932
8. కాగజ్‌నగర్‌లో కాగితాల పరిశ్రమ, బోధన్‌లో నిజాం షుగర్ ఫ్యాక్టరీలను ఏ సంవత్సరంలో స్థాపించారు?
   1) 1930 2) 1933
   3) 1935 4) 1937
9. వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతుల ప్రచారం కోసం ప్రభుత్వం 'శేద్య చంద్రిక' పత్రికను ప్రారంభించిన సంవత్సరం?
   1) 1886 2) 1882
   3) 1884 4) 1888
10. నిజాం ప్రభుత్వం 'భూముల నవీన సేద్యాల చట్టం'ను ఏ సంవత్సరంలో చేసింది?
    1) 1905 2) 1909
    3) 1907 4) 1910
11. హైదరాబాద్ రాష్ట్రంలో వ్యవసాయ రంగ ఆధునికీకరణకు కో-ఆపరేటివ్ శాఖను ఏర్పాటు చేసిన సంవత్సరం?
    1) 1915 2) 1916
    3) 1917 4) 1914
12. హైదరాబాద్‌లో మొదటిసారిగా 'బ్యాంక్ ఆఫ్ బెంగాల్' శాఖను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
    1) 1868 2) 1864
    3) 1865 4) 1866
13. కింది వాటిలో సరైంది ఏది?
    1) హైదరాబాద్‌లో దేశంలోనే మొదటిసారిగా ఆర్టీసీ వ్యవస్థను ఏర్పాటు చేశారు
    2) 1932లో హైదరాబాద్‌లో బస్సు సౌకర్యాన్ని కల్పించారు
    3) 1936 నాటికి తెలంగాణ ప్రాంతంలోని అన్ని జిల్లాలకు బస్సులు నడిపించడం ప్రారంభించారు
    4) పైవన్నీ
14. భారతదేశంతో హైదరాబాద్‌కు వైమానిక సంబంధం ఏర్పడిన సంవత్సరం?
    1) 1932 2) 1935
    3) 1937 4) 1933
15. హైదరాబాద్ విద్యుత్ రంగాభివృద్ధికి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    1) 1913లో డీజిల్ పవర్ స్టేషన్‌ను నిర్మించి వీధి దీపాలు ప్రారంభించారు
    2) 1921లో హుస్సేన్ సాగర్ థర్మల్ విద్యుత్ కేంద్రం స్థాపించి జంట నగరాలకు విద్యుత్ అందించారు
    3) 1930లో నిజాంసాగర్‌లో హైడ్రో ఎలక్ట్రిసిటీని ఉత్పత్తి చేశారు
    4) పైవన్నీ
16. హుస్సేన్ సాగర్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏ సంవత్సరంలో స్థాపించారు?
    1) 1919 2) 1921
    3) 1923 4) 1925
17. మూసీ నదిపై ఉస్మాన్ సాగర్‌ను ఏ సంవత్సరంలో నిర్మించారు?
    1) 1921 2) 1920
    3) 1915 4) 1917
18. హైదరాబాద్‌లో మురుగు నీటి(డ్రైనేజీ) వ్యవస్థను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
    1) 1922 2) 1918
    3) 1920 4) 1924
19. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు తొలిసారిగా ఎప్పుడు ఎన్నికలు నిర్వహించారు?
    1) 1932 2) 1936
    3) 1934 4) 1938
20. 1931లో 'భక్తప్రహ్లాద' సినిమాకు పాటలు రాసిన తెలంగాణ కవి ఎవరు?
    1) ధర్మవరం రామకృష్ణమాచార్య
    2) హెచ్.ఎం. రెడ్డి
    3) చందాల కేశవదాసు
    4) మల్లాది అచ్యుతరామశాస్త్రి
21. చందాల కేశవదాసు ఎక్కువ కాలం ఏ జిల్లాలో ఉన్నారు?
    1) మెదక్ 2) నల్లగొండ
    3) కరీంనగర్ 4) మహబూబ్‌నగర్
22. కింది వారిలో ప్రముఖ ఫొటోగ్రాఫర్ ఎవరు?
    1) దీన్‌దయాళ్ 2) రామచంద్ర పిళ్లై
    3) సోమసుందర్ మొదలియార్
    4) రావిచెట్టు రంగారావు
23. హైదరాబాద్‌లో మొదటిసారిగా పరీక్షలు నిర్వహించిన సంస్థ ఏది?
    1) శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం
    2) విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి
    3) రాజరాజనరేంద్ర ఆంధ్ర భాషా నిలయం
    4) ప్రతాపరుద్ర ఆంధ్ర భాషా నిలయం
24. 1872లో సికింద్రాబాద్‌లో మొదటిసారిగా గ్రంథాలయాన్ని స్థాపించింది ఎవరు?
    1) ముదిగొండ శంకరాంధ్రులు
    2) రావిచెట్టు రంగారావు
    3) సోమసుందర్ మొదలియార్
    4) సురవరం ప్రతాపరెడ్డి
25. 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' పుస్తక రచయిత?
    1) నాయని వెంకట రంగారావు
    2) ఆదిరాజు వీరభద్రరావు
    3) సురవరం ప్రతాపరెడ్డి
    4) భాగ్యరెడ్డి వర్మ
26. 'కాకతీయ సంచిక' ఏ సంవత్సరంలో వెలువడింది?
    1) 1932 2) 1931
    3) 1929 4) 1935
27. 'నిజాం కాలేజీ'ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1880 2) 1885
    3) 1884 4) 1887
28. 'గోలకొండ పత్రిక' మొదటి సంచిక ఏ సంవత్సరంలో వెలువడింది?
    1) 1924 2) 1925
    3) 1926 4) 1927
29. 'దేశబంధు పత్రిక'ను ఏర్పాటు చేసిన సంవత్సరం?
    1) 1929 2) 1926
    3) 1927 4) 1928
30. 'సుజాత పత్రిక'ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1929 2) 1928
    3) 1927 4) 1926
31. నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ మొదటి సమావేశానికి ఎవరు అధ్యక్షత వహించారు?
    1) మందుముల నర్సింగరావు
    2) సురవరం ప్రతాపరెడ్డి
    3) మాడపాటి హనుమంతరావు
    4) కె.వి. రంగారెడ్డి
32. నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ మొదటి సమావేశాన్ని ఎక్కడ నిర్వహించారు?
    1) జోగిపేట 2) దేవరకొండ
    3) ఖమ్మం 4) సిరిసిల్ల
33. నిజామాంధ్ర మహాసభ రెండో సమావేశానికి ఎవరు అధ్యక్షత వహించారు?
    1) సురవరం ప్రతాపరెడ్డి
    2) బూర్గుల రామకృష్ణారావు
    3) కొండా వెంకట రంగారెడ్డి
    4) మాడపాటి హనుమంతరావు
34. నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ మహిళా సమావేశాలకు అధ్యక్షత వహించిన తొలి మహిళ ఎవరు?
    1) టి. వరలక్ష్మమ్మ
    2) నడింపల్లి సుందరమ్మ
    3) యల్లాప్రగడ సీతాకుమారి
    4) మాడపాటి మాణిక్యాంబ
35. నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ మహిళా సమావేశాలకు అధ్యక్షత వహించిన రెండో మహిళ ఎవరు?
    1) టి. వరలక్ష్మమ్మ
    2) నడింపల్లి సుందరమ్మ
    3) యల్లాప్రగడ సీతాకుమారి
    4) మాడపాటి మాణిక్యాంబ
36. ఎక్కడ నిర్వహించిన నిజామాంధ్ర మహాసభలో 'బాధ్యతాయుత ప్రభుత్వ నిర్మాణమే నిజామాంధ్ర రాష్ట్ర ప్రజల ఆశయం' అనే తీర్మానాన్ని ఆమోదించారు?
    1) ఖమ్మం 2) నిజామాబాద్
    3) షాద్‌నగర్ 4) సిరిసిల్ల
37. ఎక్కడ నిర్వహించిన సమావేశంలో నిజామాంధ్ర మహాసభ అతివాద, మితవాద వర్గాలుగా చీలిపోయింది?
    1) భువనగిరి 2) జోగిపేట
    3) చిలుకూరు 4) ఖమ్మం
38. నిజామాంధ్ర మహాసభ అతివాద వర్గానికి నాయకత్వం వహించింది ఎవరు?
    1) కొండా వెంకట రంగారెడ్డి
    2) రావి నారాయణ రెడ్డి
    3) మాడపాటి హనుమంతరావు
    4) సురవరం ప్రతాపరెడ్డి
39. నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ నాలుగో సమావేశం, దీంతో పాటు నిర్వహించిన మహిళా సమావేశాలకు అధ్యక్షత వహించిన ప్రముఖులు వరసగా ..?
    1) రావి నారాయణ రెడ్డి, మాడపాటి మాణిక్యమ్మ
    2) మాడపాటి హనుమంతరావు, భాగ్యశీలాదేవి
    3) మందముల నర్సింగరావు, నందగిరి ఇందిరాదేవి
    4) మాడపాటి హనుమంతరావు, మాడపాటి మాణిక్యాంబ
40. నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ ఎన్నో సమావేశంలో తెలుగు భాషా ప్రచారానికి ఒక సాహిత్య సంస్థ ఉండాలని తీర్మానించారు?
    1) 3 2) 8 3) 7 4) 6
41. ఆంధ్ర మహాసభ నిర్వహించిన మొత్తం సభలెన్ని?
    1) 12 2) 15 3) 13 4) 14
42. కింది వాటిలో సరైంది ఏది?
    1) 1936లో మహారాష్ట్ర పరిషత్‌ను ఏర్పాటు చేశారు
    2) 1937లో కర్ణాటక పరిషత్‌ను ఏర్పాటు చేశారు
    3) 1937లో అయ్యంగార్ కమిటీని ఏర్పాటు చేశారు
    4) పైవన్నీ
43. ఆంధ్ర మహాసభకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    1) 1944లో ఆంధ్ర మహాసభ రెండు వర్గాలుగా చీలిపోయింది
    2) అతివాద వర్గం చివరకు కమ్యూనిస్టు పార్టీలో విలీనమైంది
    3) మితవాద వర్గం హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీలో విలీనమైంది
    4) పైవన్నీ
44. కింది వాటిలో రాజ్యాంగ సంస్కరణల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ?
    1) అయ్యంగార్ కమిటీ
    2) రావి నారాయణ రెడ్డి కమిటీ
    3) వామన్ నాయక్ కమిటీ
    4) కొరాట్కర్ కమిటీ
45. హైదరాబాద్ నవాబుకు పాశ్చాత్యులతో మొదటిసారిగా వ్యాపార సంబంధాలు ఏ సంవత్సరంలో ఏర్పడ్డాయి?
    1) 1651 2) 1653
    3) 1655 4) 1677
46. బ్రిటిషర్లతో నిజాం ఏ సంవత్సరంలో చేసుకున్న ఒప్పందాన్ని హైదరాబాద్ రాజ్యంలో బ్రిటిషర్ల ఆధిపత్యానికి తొలిమెట్టుగా పేర్కొంటారు?
    1) 1751 2) 1755
    3) 1756 4) 1759
47. 'సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్'ను ఏ సంవత్సరంలో స్థాపించారు?
    1) 1832 2) 1833
    3) 1834 4) 1836
48. పాశ్చాత్య విజ్ఞానాన్ని అనువదించడానికి 'ట్రాన్స్‌లేషన్ బ్యూరో' అనే ప్రెస్‌ను స్థాపించింది ఎవరు?
    1) రెండో సాలార్‌జంగ్
    2) షమ్ ఉల్ ఉమ్రా 3) సయ్యద్ అలీ
    4) జమాలుద్దీన్ అఫ్గానీ
49. 'దారుల్ ఉలూమ్' కాలేజీని ఏ సంవత్సరంలో స్థాపించారు?
    1) 1851 2) 1852
    3) 1855 4) 1857
50. హైదరాబాద్‌లో 'రోమన్ క్యాథలిక్ మిషన్' ఏ సంవత్సరంలో పాఠశాలలను ప్రారంభించింది?
    1) 1855 2) 1857
    3) 1850 4) 1858
51. విద్య కోసం ఒక ప్రత్యేక శాఖను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
    1) 1865 2) 1870
    3) 1875 4) 1860
52. విద్య కోసం ఒక 'డైరెక్టరేట్'ను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
    1) 1880 2) 1884
    3) 1885 4) 1882
53. 1884లో దేశంలోనే తొలిసారిగా 'ఇస్లామియా బాలికల పాఠశాల'ను ఎవరు స్థాపించారు?
    1) జమాలుద్దీన్ అఫ్గానీ
    2) షమ్ ఉల్ ఉమ్రా
    3) ముల్లా అబ్దుల్ ఖయ్యూం
    4) సయ్యద్ అలీ బిల్‌గ్రామీ
54. విద్యా రంగంలో నిర్బంధ విద్య స్కాలర్‌షిప్ సంస్కరణలు ప్రతిపాదించింది ఎవరు?
    1) జమాలుద్దీన్ అఫ్గానీ
    2) షమ్ ఉల్ ఉమ్రా
    3) ముల్లా అబ్దుల్ ఖయ్యూం
    4) సయ్యద్ అలీ బిల్‌గ్రామీ
55. హైదరాబాద్ విద్యారంగ అభివృద్ధిలో మైలురాయిగా పేర్కొనే 'ఏ ఫ్రీ ఫర్ కంపల్సరీ ఎడ్యుకేషన్' పుస్తక రచయిత ఎవరు?
    1) ముల్లా అబ్దుల్ ఖయ్యూం
    2) జమాలుద్దీన్ అఫ్గానీ
    3) సయ్యద్ అలీ బిల్‌గ్రామీ
    4) షమ్ ఉల్ ఉమ్రా
56. 'హైదరాబాద్ అసఫియా స్టేట్ సెంట్రల్ లైబ్రరీ'ని ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
    1) 1875 2) 1892
    3) 1894 4) 1890

సమాధానాలు

1) 4	2) 1	3) 3	4) 2	5) 1
6) 4	7) 3	8) 2	9) 1	10) 3
11) 4	12) 1	13) 4	14) 2	15) 4
16) 2	17) 2	18) 1	19) 3	20) 3
21) 2	22) 1	23) 2	24) 3	25) 3
26) 4	27) 4	28) 1	29) 2	30) 3
31) 2	32) 1	33) 2	34) 2	35) 1
36) 2	37) 1	38) 2	39) 4	40) 4
41) 4	42) 4	43) 4	44) 1	45) 2
46) 4	47) 3	48) 2	49) 3	50) 1
51) 2	52) 4	53) 4	54) 3	55) 1
56) 2				

Who is sitting third to the right of O?

BANK EXAMS

REASONING

Directions (Q. No.1-5): Read the following information carefully and answer the questions given below:

10 friends (5 boys P, Q, R, S and T and 5 girls A, E, I, O and U) are playing a game and they are sitting in a circle. The distance between every two friends is equal. Two boys and two girls are facing opposite to the centre of the circle and other 6 friends are facing towards the centre of the circle.

A is fourth to the left of O, who is third to the right of P. R is second to the right of T, who is not near to E. There are three friends between I and R, S is second to the left of U and facing the centre of the circle. P and E are sitting opposite and facing each other. I is second to the left of Q. A is facing opposite to the centre of the circle. More than three boys or girls are not sitting together. Not more than two friends who are facing opposite to the centre of the circle are sitting together.

1. Which two girls are sitting facing opposite to the centre of the circle?
   1) I and U 2) O and A
   3) E and I 4) O and E
   5) O and I
2. Which of the following boys is not sitting between two girls?
   1) P 2) Q 3) R 4) S
   5) Both P and S
3. What is the position of I vis-a-vis A?
   1) Immediate left
   2) Immediate right
   3) Opposite 4) 1 and 3
   5) None of these
4. Which two boys are facing opposite to the centre of the circle?
   I) R and Q 2) Q and P



   3) R and T
   4) Can't be determined
   5) All of the above are possible
5. How many persons are sitting between S and Q?
   I) Four 2) Three
   3) Two 4) One
   5) Either 1 or 3

Directions (Q. No. 6-10): Read the following information carefully and answer the questions given below.

A, B, C, D and E are five men sitting in a line facing to south - while M, N, O, P and Q are five ladies sitting in a second line parallel to the first line and are facing to North.

- B who is just next to the left of D, is opposite to Q.
- C and N are diagonally opposite to each other.
- E is opposite to O who is just next right of M.
- P who is just to the left of Q, is opposite to D.
- M is at one end of the line.

6. Who is sitting third to the right of O?
   1) Q 2) N 3) M
   4) P 5) Data inadequate
7. If B shifts to the place of E, E shifts to the place of Q, and Q shifts to the place of B, then who will be the second to the left of the person opposite to O ?
   1) Q 2) P 3) E 4) D 5) N
8. Which of the following pair is diagonally opposite to each other?
   1) EQ 2) BO 3) AN
   4) AM 5) BP
9. If O and P, A and E and B and Q interchange their positions, then who will be the second person to the right of the person who is opposite to the person second of the right of P?
   1) D 2) A 3) E 4) O 5) M
10. In the original arrangement who is sitting just opposite to N?
    1) B 2) A 3) C 4) D 5) E
11. Which of the following expressions will be true if the expression 'H £ G = K > F' is definitely true?
    1) K ³ H 2) G = F
    3) H ³ F 4) F ³ G
    5) None is true
12. Which of the following expressions will not be true if the expression 'P £ Q < R = S' is definitely true?
    1) S ³ P 2) P < R 3) S > Q
    4) P < S 5) None of these
13. In which of the following expressions does the expression 'W < Z' hold true?
    1) W > Y < X £ Z
    2) Z > X £ Y £ W
    3) Z ³ Y > X ³ W
    4) Z > Y = X < W
    5) Z ³ X > Y £ W
14. In which of the following expressions will the expression 'L < R' be definitely true?
    1) L ³ M > N = R
    2) L = M < N > R
    3) L < M £ N £ R
    4) R ³ M = N < L
    5) None of these
15. In which of the following expressions does the expression 'D > A' does not hold true?
    1) A < B £ C = D
    2) D ³ B > C ³ A
    3) A £ B = C < D
    4) D ³ C ³ B > A
    5) A > B £ C = D

Directions (Q. No. 16-20): A question followed by two statements numbered I and II is given below. The question may or may not be answered with the help of these statements. You have to decide if these statements are sufficient to answer the question.

Give answer:

1) if only statement I is sufficient to answer the questions but statement II is not

2) if only statement II is sufficient to answer the questions but statement I is not

3) if either statements I or II is sufficient to answer the question


4) if the two statements are not sufficient but still more data is needed to answer the question

5) if both statements I and II are together sufficient to answer the question

16. In which year was Rahul born?
    Statements:
    I. Rahul at present is 25 years younger to his mother.
    II. Rahul's brother, who was born in 1964, is 35 years younger to his mother.
17. How many children does M have?
    Statements:
    I. H is the only daughter of X who is wife of M.
    II. K and J are brothers of M.
18. The last Sunday of March, 2006 fell on which date?
    Statements:
    I. The first Sunday of that month fell on 5th.
    II. The last day of that month was Friday.
19. **Question:** What is the code for 'sky' in the code language?
    Statements:
    I. In the code language, 'sky is clear' is written as 'de ra fa'.
    II. In the same code language, 'make it clear' is written as 'de ga jo'.
20. **Question:** How many children are there between P and Q in a row of children?
    Statements:
    I. P is fifteenth from the left in the row.
    II. Q is exactly in the middle and there are ten children towards his right.


ANSWERS WITH EXPLANATION

Q. No. (1-5):



Ans: 1) 2; 2) 5; 3) 1; 4) 1; 5) 3

Q. No. (6-10):



Ans: 6) 2; 7) 1; 8) 4; 9) 2; 10) 2

Q. No. (11-15):

11. K ³ H, Will definitely hold true. **Ans: 1**
12. P £ Q < R = S
    S ³ P, Will not be true **Ans: 1**
13. W < Z
    Z ³ Y > X ³ W **Ans: 3**
14. L < R, Will be true
    L < M £ N £ R **Ans: 3**
15. D > A, Does not hold true in expression (5):
    A > B £ C = D **Ans: 5**

Q. No. (16-20):

16. From both I and II, we find that Rahul is (35-25) = 10 years older than his brother, who was born in 1964. So, Rahul was born in 1954. **Ans: 5**
17. From I, we conclude that H is the only daughter of M. But this does not indicate that M has no son. The information given in II is immaterial. **Ans: 4**
18. From I, we conclude that 5th, 12th, 19th and 26th of March, 2006 were Sundays. So, the last Sunday fell on 26th. From II, we conclude that 31st March, 2006 was Friday. Thus, 26th March, 2006 was the last Sunday of the month. **Ans: 3**
19. The only word common to I and II is 'clear' and as such, only the code for 'clear' can be ascertained from the given information. **Ans: 4**
20. From II, Q being in the middle, there are 10 children to his right as well as to his left. So, Q is 11th from the left. From I, P is 15th from the left. Thus, from both I and II, we conclude that there are 3 children between P and Q. **Ans: 5**